RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 21 Issue No. 3 Monthly March 2024 ISSN No. : 2456-4702 Rs. : 15/-



## పుట్టపర్తి నారాయణచార్యులు

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)



# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

Mail : bhavaveena2024@gmail.com

Cell : 9949929674, 7989088274

# BHAVAVEENA

(MONTHLY MAGAZINE)

Journal - Arts, Literature, Cultureand Language Study

ISSN No. : 2456-4702

RNI No. APTEL/2003/12253


| | | |
|---|---|---|
| ముద్రణ | : | **మార్చి - 2024** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/-** |
| కాపీలకు | : | **డి.నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి.నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్, గుంటూరు జిల్లా.** సెల్ : 9494 660 509. |




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

***Founder :***
Kolla Sri Krishnarao (Late)

***E-mail :***
bhavaveena2024@gmail.com

7989781963
9949929674
7989088274

# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**Vol. 21 - Issue : 3 - March 2024 - ISSN No.: 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs.: 15/-**



**EDITORIAL BOARD**

*Honourable Editor*
**Dr. PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,***

*Chief Editor*
**Dr. PAYARDA NAGAIAH**
***M.A.(Tel), M.A.(Pol-Sci.)., M.Ed., Ph.D.,***
# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**ADVISORY COMMITTEE**

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Vice Chancellor,
Dravidian University, Kuppam, A.P
2. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
HOD, Dept. of Telugu,
Hyderabad Central University, Hyderabad, Telangana.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) Ph.D
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
Associate Professor, Dept. of Telugu &
Chairman, BOS Philothrophy& Religion Studies,
Andhra University, Visakhapatnam.
7. **Prof. T. Ramaprasad Reddy**
Dean, Faculty of Arts & Education,
Yogi Vemana University Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swaruparani,** M.Sc., M.Ed., M.Phil., Ph.D.
Principal,
St Joseph's College of Education for Women,
Sambasivapet, Guntur, Andhra Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Prof. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.

3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Prof. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Professor, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Prof. N. Eswar Reddy,** M.A., PhD.
Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P. R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46.
Hyderabad. Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narsapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur- 2 . 9494 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. P. Nagaiah, # 135-14-716, Dwaraka Nagar, 12th Lane,
Nagaralu, Guntur - 522034. Cell : 9949929674, 7989088274.
E-mail : bhavaveena2024@gmail.com, Printed at : GLS Graphics, Guntur - 2. Ph. 9494 660 509.

# పుట్టపర్తి నారాయణాచార్యులు

(జననం : మార్చి 28, 1914 – మరణం : సెప్టెంబర్ 1, 1990)

పుట్టపర్తి నారాయణాచార్యులు పండితులు, కవి, సంగీత విద్వాంసులు, వ్యక్తి, విమర్శకుడు, బహుభాషా ప్రవీణులు ఈ లక్షణాలన్నీ ఒకే వ్యక్తిలో ఉండడం అరుదు. ఆ అరుదైన వ్యక్తి పుట్టపర్తి నారాయణాచార్యులు. వీరు దాదాపు పద్నాలుగు భాషల్లో పాండిత్యం గల నేర్పరి అందుకే ఆయన "సరస్వతీ పుత్ర"గా ప్రసిద్ధికెక్కారు. అంతకుమించి గొప్ప వాగ్గేయకారులు.

పుట్టపర్తి నారాయణాచార్యులు 1914 మార్చి 28, అనంతపురం జిల్లా అనంతపురం మండలంలోని చియ్యేడు గ్రామంలో జన్మించారు. వీరి తండ్రి శ్రీనివాసాచార్యులు, తల్లి లక్ష్మీదేవి (కొండమ్మ). పుట్టపర్తి వారి అసలు ఇంటి పేరు 'తిరుమల'వారు. శ్రీకృష్ణదేవరాయల రాజగురువు తిరుమల తాతాచార్యులు వారి వంశం. పుట్టపర్తి వారి పూర్వీకులు చిత్రావతీరంలో పుట్టపర్తిలో స్థిరపడడం వల్ల వారి ఇంటి పేరు పుట్టపర్తి అయింది. పుట్టపర్తి నారాయణాచార్యులు అనంతపురం జిల్లా పెనుకొండలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. తరువాత తిరుపతి సంస్కృత కళాశాలలో సంస్కృతం నేర్చుకున్నారు. కపిలస్థానం కృష్ణమాచార్యులు, డి.టి. తాతాచార్యులు లాంటి గొప్ప సంస్కృత పండితుల వద్ద వ్యాకరణం, చందస్సు నేర్చుకున్నారు. పెనుకొండలో రంజికం మహాలక్ష్మమ్మ దగ్గర భరతనాట్యం నేర్చుకున్నారు. సంగీతం, సాహిత్యం, నాట్యం అతనిలో త్రివేణీ సంగమంలా మిళితమయ్యాయి.

పుట్టపర్తి నారాయణాచార్యులు అత్తగారి ఊరు ప్రొద్దుటూరు వీరి అర్ధాంగి పేరు పుట్టపర్తి కనకవల్లి పుట్టపర్తి వారు మొదటిసారిగా అనంతపురం కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్‌కి పుట్టపర్తి వారికి మనస్పర్థలు రావడం ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారు. తరువాత తిరువాన్కూర్‌లోనూ, కొన్ని రోజులు ఢిల్లీలోనూ, ప్రొద్దుటూరులోనూ పనిచేసి చివరకు కడపలో స్థిరపడ్డారు. అక్కడే శ్రీరామకృష్ణా ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేశారు. వారు వారి సాహితీ ప్రస్తానం అంతా కడపలోనే జరిగింది.

పుట్టపర్తి వారు అగ్నివీణ, పెనుకొండ లక్ష్మి, శివతాండవ, మేఘదూతం, షాజి, సాక్షాత్కారం, జనప్రియ రామాయణం, కావ్యమాల, పండరీ భాగవతం, గాంధీజీ మహాప్రస్థానం, సిపాయి పితూరి, అక్షాక్షర కృతులు, కబీరు వచనావళి, బుద్ధ భగవానుడు, రామకృష్ణుని రచనా వైఖరి, మహాభారత విమర్శ, ఆంధ్రుల చరిత్ర, శ్రీనివాస ప్రబంధం, సమర్థ రామదాసు, విప్లవ యోగీశ్వరుడు, శ్రీసాయి లీలామృతము, సరోజినీదేవి, నవ్యాంధ్ర వైతాళికులు, ప్రతీకారం, అభయ ప్రధానం, హరిదాసి వంటి నవలలు చేశారు. అంతేకాకుండా పుట్టపర్తి వారు ఆంగ్లంలో **Leaves in Wind, Vain Glorians, The Hero** మొదలగు రచనలు చేశారు. వీరి రచనలు ఎంతో మధురానుభూతిని కలిగిస్థాయి. కవి హృదయం ఒక వీణ సన్నివేశాలకు ఒక శృతిని కల్పించి అనుభూతిని

పాఠకులకు కలిగించారు. పుట్టపర్తి వారు బహుభాషా కోవిదులు. వీరు స్వయంకృషితో 14 భాషలు నేర్చుకుని "సరస్వతీ పుత్ర"గా ప్రసిద్ధికెక్కారు. పుట్టపర్తి వారు బహుబాషా కోవిదులు వీరికి బౌద్ధ, జైన సాహిత్యానికి సంబంధించి పాలీ భాషలో మంచి ప్రావీణ్యం ఉంది అంతేకాకుండా వారు అనేక భాషల్లో ఉన్న అత్యంత ముఖ్యమైన గ్రంథాలను ఎన్నో భాషల్లోకి తర్జుమా చేశారు. అవధీ భాష నుండి తులసీదాస్ రామాయణం, బ్రజ్ భాష నుండి సూరదాస్, రసఖాన్ మొదలైన వారి రచనలను పాత అవధీ, రుజ్‌భోజ్‌పురి భాషల మిశ్రమ నుండి కబీర్ దోహాల హిందీ, పుట్టపర్తి వారు అనేక ప్రసిద్ధ తమిళ, కన్నడ, మళయాళ, మరాఠీ, సంస్కృత కావ్యాలను తెలుగులో అనువదించారు. హృషీకేశ్‌లో అతని పాండిత్యాన్ని పరీక్షించిన శివానంద సరస్వతి పుట్టపర్తి వారికి 'సరస్వతీ పుత్ర' బిరుదునిచ్చారు. తెలుగు సాహిత్యంపైనే కాకుండా పుట్టపర్తి వారు చరిత్రపై కూడా ఆయనకు మక్కువ ఎక్కువే. చరిత్రను చాలా లోతుగా అధ్యయనం చేశారు. ఒకసారి పుట్టపర్తి వారికి కమ్యూనిస్టులు సన్మానం చేసినప్పుడు ఆ సభలో ఉన్న చరిత్రకారుడైన మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు పుట్టపర్తి వారి చరిత్రపై ఆయన పరిజానం చూసి పుట్టపర్తి వారిని కవి కంటే చరిత్రకారునిగా గౌరవిస్తారని సంబోధించారు.

పుట్టపర్తి వారు దేశంలో దాదాపు అన్ని ప్రాంతాలలో గోప్ప సత్కార్యాలు పొందారు. అంతేకాకుండా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలు అతనికి డి.లిట్ఃఎ ప్రదానం చేశాయి. భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ఇచ్చి గౌరవించింది. అయితే నిజానికి పుట్టపర్తి జానపీఠ అవార్డు పొందడానికి అన్ని విధాల అర్హు లనీ పలువులు పండితుల అభిప్రాయం.

కడపలో శ్రీరామకృష్ణ హైస్కూల్ తెలుగు పండితుడిగా పనిచేసి పదవీవిరమణ పొందారు. కడప మోచంపేటలో నిర్వాణషట్కము విని స్వగృహంలో శిష్యునికి చివరి సందేశంగా భాగవతం, భక్తుడు, భగవంతుడు ఒక్కటేరా అని అన్నారట శ్రీనివాసా అంటూ 1990 సెప్టెంబర్ 1న ఆ మహాకవి శివైక్యం చెందారు.

- చీఫ్ ఎడిటర్

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | తెలుగు గేయ కవిత్వపు సౌందర్యం | - ఆచార్య ఎం.రామనాథం నాయుడు | 8 |
| 2. | ఆధునిక తెలుగు సాహిత్యంలో పర్యావరణం | - డా॥. భూక్య తిరుపతి | 15 |
| 3. | స్వాతంత్ర్యోద్యమంలో స్త్రీలు | - డా॥. పి. శ్రీనివాసరావు | 18 |
| 4. | గిరిజన సాహిత్యం సంస్కృతి | - డా॥. బి. చక్రవర్తి | 21 |
| 5. | మధ్యమవ్యాయోగము నైతికమూల్యాలు | - డా॥. పి శ్రీవల్లి | 26 |
| 6. | జాతీయోద్యమ నవలల్లో స్త్రీ పాత్ర చిత్రణ | - డా॥. కడివెండి మమత | 29 |
| 7. | ఆచార్య కొలకలూరి ఇనాక్ 'సాక్షి' నాటకం - ఒక పరిశీలన | - డా॥. కె. చిదానంద | 35 |
| 8. | శ్రీ త్యాగరాజస్వామి వారి అపూర్వరాగాలు | - డా॥. టి. గిరిజా శేషమాంబ | 40 |
| 9. | లంబాడాల సంస్కృతి "తీజ్" పండుగ పుట్టు పూర్వోత్తరాలు | - డా॥. లక్ష్మణ్ నాయక్ బాణోత్ | 44 |
| 10. | రామాయణ కావ్యాల విశిష్టత-హనుమంతుని పాత్ర చిత్రణ | - డా॥. ఆర్. రమాదేవి | 48 |
| 11. | తెలుగు సాహిత్యంలో వచన ప్రక్రియ వికాసం | - రెబ్బ మల్లికార్జున్ | 52 |
| 12. | తెలంగాణ నవలా సాహిత్యంలో స్త్రీ సామాజిక జీవన చిత్రణ | - అంబటి సరిత | 57 |
| 13. | తెలంగాణ సమాజాన్ని ప్రభావితం చేసిన ఆధునిక కవులు | - కూరాకుల రాజశేఖర్ | 62 |
| 14. | జాతశ్రీ కథలు -తెలంగాణాలో వృత్తి జీవన చిత్రణ | - కె. నాగేశ్వరి | 68 |
| 15. | తెలంగాణ ధూంధాం ప్రదర్శనలో కవులు, గాయకుల పాత్ర | - అంతడుపుల నాగరాజు | 74 |
| 16. | లంబాడీల సంస్కృతి సాంప్రదాయాలు జీవన విధానం | - డా॥ భూక్య వీరన్న | 80 |
| 17. | షేక్ హుస్సేన్ (సత్యాగ్ని) కథలలో - స్త్రీ వివక్షత | - నగరి ఢిల్లీబాబు | 84 |
| 18. | "శైవ కవిత్రయం"లో 'మన పాల్కురికి' | - మోరె రాజు | 86 |
| 19. | భాష - వారసత్వం తెలుగు భాష పుట్టుక - దాని పరిణితి - అధికార భాషగా తెలుగు | - తుమ్మనపల్లి కేదారి | 90 |
| 20. | మాస్టార్జీ కథలు - సామాజికత | - బుర్క ప్రియాంక | 94 |
| 21. | Sreelu - Kalalu (Women - Arts) | - Dr. M. Koteswar Rao | 97 |
| 22. | The Chandanotasavam festival of the temple of Simahachalam: Socio-cultural impact on the people of Andhra and Odisha. | - P.M. Sarath Kumar | 101 |

# తెలుగు గేయ కవిత్వపు సౌందర్యం

- ఆచార్య ఎం.రామనాథం నాయుడు, కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూరు.

గేయాన్ని గీతం, పాట, పదం అని కూడా వ్యవహ రిస్తారు. ఈ మూడు శబ్దాలు కూడా గేయ ప్రధాన లక్షణం పాడబడేదే అని తెలియజేస్తున్నాయి. సంగీత, సాహిత్య సమ్మేళనమైన గేయ కవిత్వం

ఆపాత మధురమే కాదు ఆలోచనామృతం కూడా. కవిత్వానికి ఆపాత మాధుర్యం గానం వల్ల ప్రతి భాషలోను గేయం, పద్యం, గద్యం అనే మూడు విభాగాలు కన్పిస్తాయి. మొదట కణము, తరువాత పద్యము ఆపైన గద్యము రూపుదిద్దుకున్నాయని విజ్ఞుల విశ్వాసం.

ఆటవిక దశకు చెందిన ప్రాచీన మానవుడు ప్రకృతి వల్ల బాధ కలిగినప్పుడు ఇతరులవల్ల ఇబ్బంది ఎదురై నప్పుడు తీవ్రంగా స్పందించేవాడు. ఆనందం కలిగి నప్పుడు కూడా తీవ్రానుభూతి పొందేవాడు.

అతని తీవ్రానుభూతి నోటి ద్వారా బహిర్గతమయ్యేది. ఆ అనుభూతి తీవ్రతే మాటల పొందికతో గేయంగా రూపుదిద్దుకుని వుండవచ్చు అని అభిజ్ఞుల అభిప్రాయం. ఆ విధంగా మొదట రూపుదిద్దుకున్న గేయం జానపదు లకు ఎంతో ఆదరణీయమయ్యింది. తరువాత వాగ్గేయ కారులకు ఆలంబనీయ ముయ్యింది. ఆధునిక కాలం లోను గేయం అనేక రకాలుగా ప్రజలను అలరిస్తూ వుంది. ఎప్పుడో ఒకప్పుడు పాట పాడుకోని వాడుండడంటే అతిశయోక్తి కాదు. ఏదో ఒక కూనిరాగమైనా తియ్యడం అందరికీ పరిపాటే.

మాత్రా ఛందస్సులను ఆధారంగా చేసుకొని గేయాలు రూపొందుతాయి. మాత్రలను బట్టే వీటి గతి కూడా అమరుతుంది. ద్విప్రగతి, త్రిస్రగతి, చతురస్రగతి, ఖండగతి అనేవి గేయంలో కన్పించే ప్రధానాంశాలు. పాడుకోవడానికి అనువుగా ఉంటూ రాగతాళ లయాత్మకంగా గేయం సాగుతుంది.

ఏ ప్రక్రియయైనా హఠాత్తుగా సమగ్రరూపం దాల్చే అవకాశం లేదు. క్రమపరిణామం వల్లనే ఇది సాధ్యం. తెలుగు గేయకవిత్వ వికాసంలో కూడా క్రమపరిణామం కనిపిస్తుంది. గేయం ఎప్పుడు పుట్టిందో, ఎలా పుట్టిందో మొదట ఎవ్వరి నోటినుండి వెలువడిందో తెలుసు కునేందుకు ఇప్పటికీ ఆధారాలు లేవు.

ఆంధ్రసాహిత్య చరిత్రకు అందని కాలంలోనే తెలుగు పదం తేజరిల్లినా పండితాదరణకు నోచుకోక పోవడం వల్ల దాని అస్థిత్వం ప్రశ్నార్థకంగానే మిగిలింది. ప్రాచీన పదాల లక్ష్యాలు అక్షరబద్ధాలుకాక, పరంపరాగతాలుగాక కాలగర్భంలో కలిసిపోయాయి.

తెలుగు సాహిత్య ఆవిర్భావానికి ముందు వెలసిన శాసనాల్లో కూడా గేయరూపాలు దర్శనమిచ్చినట్టు పండిత విమర్శకులు భావించారు. వీటినే అందుబాటులో వున్న గేయ ప్రాచీన రూపాలని చెప్పు కోవచ్చు.

ప్రాచీనకాలంలోనే ఎన్నో గేయాలు వెలసినా వాటి లక్షణాలు అక్షరబద్ధం కాలేదు. పరంపరానుగతంగా ఆ గేయాలను పాడుకోవడం కూడా జరగలేదు. అందువల్ల అవి కాలగర్భంలో కలసిపోయాయి. అయితే ప్రాచీన కవులు కొందరు వాటిని తమ కావ్యాల్లో ప్రస్తావించారు. నన్నయ తన భారతంలో "నాగీ గీతాల"ను పేర్కొన్నాడు. నన్నెచోడుడు కుమార సంభవంలో అంకమాలికలు, ఊయల పాటలు, ఆలతులు, గౌడు గీతాలు, దంపుడు పాటలు మొదలైన గేయాలను ప్రస్తావించాడు.

తన కాలంలో వ్యాప్తిలో వున్న కథగేయాలను ఆధారం చేసుకుని బసవపురాణం రచించినట్టు పాల్కురికి సోమన తెలియజేశాడు. తన కాలంలో బాగా వ్యాప్తిలో వున్న మరికొన్ని రకాల గేయాలను కూడా అతడు పేర్కొన్నాడు.

అవి వైరాగ్య పదాలు, పర్వత పదాలు, ఆనంద పదాలు, నివాళి పదాలు, వాలేశు పదాలు, గొబ్బి పదాలు, వెన్నెల పదాలు, సెజ్జవర్ణన పదాలు, మణిగణ వర్ణన పదాలు. నాచన సోమనాథుడు తన 'వసంత విలాసం'లో జాజర పాటను ప్రస్తావించాడు. శ్రీనాథుడు భీమఖండంలో 'చర్చరీ' గీతాలను ప్రస్తావించాడు. పోతన శాంతనామాలు, గోవింద నామాలు అనే గేయ రూపాలను పేర్కొన్నాడు.

కృష్ణమాచార్యులు రచించిన 'సింహగిరి నరహరి వచనాలు' మనకు లభించే తొలి పద రచనగా చెప్పు కోవచ్చు. అయితే అవి కూడా తాళబంధ ఛందో విరహిత గేయ గంధులుగా మాత్రమే కనిపిస్తున్నాయి.

కృష్ణమాచార్యుని వచనాల తర్వాత పేర్కోదగినవి యాగంటివారి పదాలు, తాళ్ళపాకవారి కీర్తనలు, క్షేత్రయ్య పదాలు, బ్రహ్మంగారి కాలజ్ఞాన తత్వాలు, రామదాసు కీర్తనలు, సారంగపాణి పదాలు, త్యాగరాజ కృతులు ఈవిధంగా తెలుగు గేయం అనేక రూపాంతరాలు పొంది ఆధునిక యుగంలో అడుగు పెట్టింది. భక్తికీ, శృంగారానికి బానటగా నిలిచిన తెలుగు గేయం సమాజాన్ని పట్టించుకొని సందడి చేసింది.

## నిర్వచనం :

గేయాన్ని, గేయ కవిత్వాన్ని పలువురు సంగీతజ్ఞులు, సాహిత్యవేత్తలు నిర్వచించారు. వాటిలో కొన్ని. "కవిత్వానికి గానగుణం స్వాభావికమైనది. పాట ఆవేశానుభూతుల సమాహారాన్ని వ్యక్తీకరించగల సామర్థ్యం కలది. అది ఒకే శృతిలో పాడేది" అని క్రిస్టొఫర్ కాడ్వెల్ భావించాడు.

రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు "లయమయమైన గణములను పంక్తికిన్నియని లెక్కించి నడుపునది తాళము. దీనిని ఈ గేయ కవితలో నిర్వహించుట సాధ్యము కాదు... సరిపెణవలె అఖండముగా సాగిన ఈ నడకలో భావము ముగిసినప్పుడు కూడ విశ్రాంతికి చోటు లేదు. విశ్రాంతి తీసుకొంటిమా తాళము పటాపంచలగును. దానికై ఆ విశ్రాంతి కాలమును చక్కగా నలువది మాత్రల కాలమునకు పెంచితిమా, పూర్వోత్తర భావములు పరస్పరము అసంబద్ధములుగా సాగును. కనుక ఈ రచనలో ప్రధానమైన మూలద్రవ్యము లయ మాత్రమే. అది చదువరులను తనవెంట నీడ్చుకొని పోవుచు అలౌకికముగా కావ్యరసమున నుభవించుటకెంతో సహాయపడును. మఱి అందందు రస భావానుగుణముగా ఆ లయను గూడ సడలించుకొనవలసి యుండును. కావ్యకళకు పరమార్థమదే కనుక" అని అభిప్రాయపడ్డారు.

"లయబద్ధమైన ఒక భావం పూర్తి అయి, వేరొక భావం మొదలైనప్పటికీ విరుపులు సరిపెణలాగా నడుస్తూవుండే ఛందం గేయమనబడుతుంది" అని రాజగోపాలు నాయుడు గారు గేయాన్ని నిర్వచించారు.

## లక్షణాలు :

గేయ నిర్వచనాలను, గేయ స్వరూపాన్ని దృష్టిలో వుంచుకొని ఆలోచిస్తే గేయ లక్షణాలుగా ఈ క్రింది వాటిని పేర్కోవచ్చు.

1. గేయం శ్రవ్య ధర్మం కలది.
2. గానయోగ్యమైంది.
3. లయ ప్రధానమైంది.
4. గేయానికి తాళం ఉంటుంది.
5. గేయానికి ఛందస్సు ఉంటుంది. ప్రధానంగా ఇది మాత్రా ఛందస్సులతోనే సాగుతుంది.
6. గేయానికి ప్రబోధించే గుణం వుంది.
7. శృంగార భావాలను ఆవిష్కరించేందుకు కూడా గేయం చక్కగా ఉపయోగపడుతుంది.
8. సమకాలీనాంశాలు కూడా గేయంలో చోటుచేసుకునే అవకాశం వుంది.
9. గేయానికి వాద్య సహకారం కూడా కనిపిస్తుంది.

## వైవిధ్యం :

ఆధునిక యుగంలో గేయం బహుముఖంగా విస్త రిల్లింది. వైవిధ్యభరితంగా సాగింది. ఆచార్య జి. చెన్న కేశవరెడ్డి గారు తమ 'ఆధునికాంధ్ర గేయకవిత్వం' అనే

గ్రంథంలో భావ కవిత్వయుగంలో వచ్చిన గేయరచనలను కొంతవరకు వస్తువును బట్టి, మరికొంతవరకు ప్రక్రియను బట్టి ఈక్రింది విధంగా విభజించారు.

1. గేయ కావ్యాలు లేదా కథాత్మక గేయాలు.
2. ప్రణయగేయాలు
3. ప్రకృతి గేయాలు లేదా గోపగేయాలు
4. దేశభక్తి గేయాలు
5. సాంఘిక గేయాలు
6. భక్తి గేయాలు లేదా మార్మిక గేయాలు
7. స్మృతి గేయాలు
8. గేయ నాటికలు
9. బాల గేయాలు

అభ్యుదయ కవిత్వ యుగానికి సంబంధించిన గేయ రచనలు కూడా ఆయా అభ్యుదయ కవిత్వ శాఖల క్రింద విభజించి పరిశీలించారు. దళిత కవిత్వ గేయాలు కూడా వ్యాప్తిలో ఉండడం మనకు తెలుసు, తెలంగాణా పోరాట గేయాలు, విప్లవ గేయాలు తెలుగు ప్రజల నాలుకల మీద నర్తించడం గమనార్హం. ఆధునిక యుగంలో వెలువడిన గేయరచనలను వస్తురీత్యా ఈ క్రింది విధంగా స్థూలంగా విభజించుకోవచ్చు.

1. దైవభక్తి గేయాలు
2. దేశభక్తి గేయాలు
3. శృంగార గేయాలు
4. ప్రకృతి గేయాలు
5. ప్రబోధ గేయాలు.

**1. దైవభక్తి గేయాలు :**

తెలుగు గేయం అన్నమాచార్యుని భక్తి కవిత్వం నుండే సాహిత్య గౌరవానికి నోచుకుంది. సంకటహరుడైన వేంకట రమణుణ్ణి గానలోలుడుగా అన్నమయ్య పరిగణించాడు. తన పదకుసుమాలతో తిరుమలేశుని కుసుమపదార్చన గావించి పునీతుడయ్యాడు. ఆవిధంగా గేయం భక్తుని ఆత్మానుభూతిని భగవంతునికి చేర్చే ప్రధాన వాహిక అయ్యింది. అన్నమయ్య పదకవిత, క్షేత్రయ్య మువ్వ గోపాలుని పదాలు, పోతన భాగవతంలోని ముఖ్యంగా గోపికాగీతలు, గీత గోవిందం, కృష్ణలీలా తరంగిణి, రవీంద్రుని 'గీతాంజలి' ప్రభావం భావకవిత్వయుగంలోని భక్తి కవిత్వం మీద ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

భావకవిత్వంలో వేంకటపార్వతీశ్వరులు 'ఏకాంత సేవ' మధురభక్తికి ప్రాతినిధ్యం వహించే కావ్యం. ఏకాంతసేవ కావ్యం ప్రవిమల భక్తియుక్తుడైన భక్తుడు పరమేశ్వరుని గురించి పాడే ప్రణయ గీతం. వంగభాషలోని గీతాంజలి లాగే ఆంధ్రభాషలో ఏకాంతసేవ కూడా అభినుతించ దగ్గదని దేవులపల్లి

కృష్ణశాస్త్రి గారి అభిప్రాయం. శతక కవుల భక్తి కవిత్వం, కృష్ణకర్ణామృతం, కృష్ణలీలా తరంగిణి మొదలైన వాటిలోని రాధామాధవుల శృంగారం వైష్ణవగీతాల లోని ప్రేమ మాధుర్యం కలిసి 'ఏకాంతసేవ'గా రూపొందింది. మంజరీ ద్విపద ఛందస్సులో వెలసిన మధురమైన కావ్యం 'ఏకాంత 'సేవ'. చాలా వరకు ఏకాంతసేవ కావ్యంలోని పాదాలు 5 + 5 + 5 + 3 మాత్రలుగా ఉంటాయి. చివర రెండు మాత్రల కాలం ఊపిరి తీసుకుంటే ఇది ద్విరదగతి రగడ అయి చక్కగా ఖండగతిలో నడిచే గేయమవుతుంది.

"విరిదండ మెడలోన వేయుటే కాని కన్నార నీ మూర్తి గాంచనే లేదు ప్రణమిల్లి యడుగుల బడుటయే కాని చేతులార సేవ జేయనే లేదు. = 5 + 5 + 5 +3 = 5 + 5 + 5 +3 = 5 + 5 + 5 + 3 = 5 + 5 + 5 + 3 కృష్ణపక్షములోని పాపీ ఖండికలో కృష్ణశాస్త్రి తనను పాపీ అని సంబోధించు కున్నాడు. ఆత్మ ప్రక్షాళనానికి కన్నీరే ఉపాయమన్నాడు.

"కురియుమురా కన్నీరును మరి మరి విలపించు
మురా సరము గూర్చి పరమేశుడు తాల్చునురా పాపీ"

ఈవిధంగానే చాలామంది తెలుగు కవులు దైవభక్తి గేయాలు రచించారు. మధురభక్తికి సంబంధించిన గేయాలు తాత్త్విక గేయాలు కూడా దైవభక్తి గేయాల్లో అంతర్భాగంగా పరిగణింప బడుతున్నాయి.

**2. దేశభక్తి గేయాలు :**

జాతీయోద్యమంలో గేయాలు అసంఖ్యాకంగా వెలువడ్డాయి. ప్రతి సభలోను గేయం గద్దెనెక్కి ప్రబోధ పూరితంగా గానం చేసింది. ఆనాటి జాతీయ గీతాలు యువ హృదయాలనేకాక నిరక్షరాస్యులను, నిరుపేదలను కూడా ఉత్తేజితం చేశాయి. బెంగాల్ విభజన తరువాత జాతిజనుల సమరనాదంగా మారిన బంకించంద్ర ఛటర్జీ 'వందేమాతరం' ప్రేరణతో ఒక అజ్ఞాతకవి 1905 డిసెంబర్ 15 నాటి కృష్ణాపత్రికలో 'ది క్రై ఆఫ్ మదర్ ఇండియా' శీర్షికన ఒక గొప్ప ప్రబోధ గీతాన్ని ప్రకటించారు.

"హిందువులారా! ఎన్నాళ్ళీ గతి మందమతులరై మాటికి జెడెదరా నందసులగు మీరందరు స్రుక్కగ యెందుకు నా బ్రతుకితరుల కోసము..."

జాతీయోద్యమ సంబంధమైన సాహిత్యంలో ఇదే తొలి గీతంగా భావించ వచ్చు. 1908లోనే 'దేశీయ కీర్తనలు' అనే పుస్తకం వెలువడింది. స్వదేశ భక్తి మొదలైన సుగుణాలను బోధించిన పుస్తకం ఇది. బంకించంద్రుని 'వందేమాతరం' గీతంతో ప్రారంభమయ్యే ఈ సంపుటిలో 20 దేశభక్తి కీర్తనలున్నాయి. 1909 సం॥లో 'ఆంధ్ర భారతి'లో 'మేలుకొలుపు' శీర్షికతో ఒక ప్రబోధగీతం ప్రచురితమైంది.

"మేలుకొనుమీ భరతపుత్రుడ
మేలు కొనుమీ సుజన మిత్రుడ మేలుకొనుమీ
సచ్చరిత్రుడ మేలుకొనవయ్యా! వత్సా! మేలుకో"
అనే పల్లవితో ఈ గీతం ప్రారంభమవుతుంది.

1921 సం.లో మంగిపూడి వేంకట శర్మ

"మేలుకో సుచరిత్ర మేలుకో భరతపుత్ర మేలుకో
చిరమిత్ర మేలుకో" అనే గీతం రాశారు.

1910 సం.లో గురజాడ అప్పారావు 'దేశభక్తి' గీతం వెలువడింది.

"దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది పెంచుమన్నా వట్టి మాటలు
కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్"

అని ఈ గేయం సాగుతుంది.

1914 సం.లో జాతీయభావాలతో, దేశాభిమాన స్ఫూర్తిని కలిగించిన 'జన్మభూమి' గీతాన్ని రాయప్రోలు సుబ్బారావు రచించారు.

"ఏ దేశమేగినా ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా పొగడరా నీ తల్లి భూమి
భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము"

అని ఈ గేయం సాగింది. జాతీయోద్యమ సంఘటనలను పురస్కరించుకొని అనేక గేయాలు వెలువడ్డాయి. వాటిలో 'మాకొద్దీ తెల్లదొరతనం'. అనే గరిమెళ్ల సత్య నారాయణగారి గేయం తలమానికంగా పరిగణింప బడుతూ ఉంది. 1942 ఆగష్టు 8 నుండి ఐదేళ్లపాటు వెలువడిన గేయాలు స్వాతంత్ర్యోద్యమ గేయాలుగా పరిగణింపబడ్డాయి. వాటిలో ముఖ్యమైనవి గరికపాటి మల్లావధానిగారి 'వద్దురా మనకొద్దురా - పరపాలనంబిక వద్దురా.

వానమామలై వరదాచార్యులుగారి -

"పరదేశీయులు తొలగండి - యీ భారతదేశం
మాదేశం వినండి వినండి విశ్వ ప్రజలు - వీర భారత
సందేశం....."

శ్రీశ్రీ గారి

"స్వతంత్ర సమరం - స్వతంత్ర సమరం స్వతంత్ర
సమరం సాగిందోయ్ పదండి వేగమె - పదండి
ముందుకు జాతీయ జెండా ఛ్ఛాయల్లోనే....."

తెన్నేటి సూరి గారి -

'తెల్లదొరా! కల్లుదొరా!
మాయదారి మల్లుదొరా!
ఇల్లు విడిచి దారి బట్టవోయ్ - తెల తెల్లవారె
కొల్లగొట్టు వేళ దాటెనోయ్'

కరుణశ్రీ గారి

"ఊదరా! ఊదరా! ఊదరా సోదరా!

ఉడుకు రక్తపు పొంగులుప్పొంగ జయశంఖ మూదరా!"

ఇలాగే దేశభక్తి గేయాలు అసంఖ్యాకంగా వెలువడ్డాయి. వాటిలో జెండా గేయాలు, రాట్నం గేయాలు కూడా చోటు చేసుకోవడం కూడా గమనార్హం.

**3. ప్రణయ (లేదా) శృంగార గేయాలు :**

శృంగార గేయాలనే ప్రణయ గేయాలని కూడా వ్యవహరించవచ్చు. భావకవిత్వంలో ప్రణయ కవిత్వం కూడా ఒక భాగం కాబట్టి భావకవితోద్యమ కాలంలోనే శృంగార గేయాలు విరివిగా వ్యాప్తిలోకి వచ్చాయి. దేవులపల్లి కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు మొదలైన మహాకవులు శృంగార గేయాలను అధికంగా రచించారు. సంభోగ శృంగారంకంటే విప్రలంబ శృంగారానికే వీరు అధిక ప్రాధాన్యమిచ్చారు. భావకవులు ఊహాసుందరిని, ఊహాప్రేయసిని దృష్టిలో పెట్టుకొని అమలిన శృంగారానికి పెద్ద పీట వేశారు.

స్వచ్ఛంద ప్రియత్వము, భగ్నప్రేమ, నిర్వేదము, తాత్త్వికదృష్టి మొదలైనవి కృష్ణశాస్త్రి గేయాల్లో కన్పిస్తాయి. కావ్యాల ద్వారానేగాక రేడియో ద్వారా, సినిమాల ద్వారా అసంఖ్యాకంగా వీరి గేయాలు ప్రచారమయ్యాయి. కృష్ణశాస్త్రి శృంగార భావగీతాలు ఇలా సాగుతాయి.

"ఆమె కన్నులలో ననంతాంబరంపు నీలి నీడలు కలవు, వినిర్మలాంబు పూర గంభీర శాంత కాసార చిత్ర హృదయములలోని గాటంపునిదురఛాయ లందు నెడ నెడ గ్రమ్ము, సంధ్యావసాన సమయమున నీపపాద పశాఖకాగ్ర పత్రకుటిల మార్గముల లోపల వసించు

నిరుల గుసగుసల్ వానిలో నిపుడు నపుడు వినబడు చునుండుబీ మఱికొన్ని వేళలందు వానకారు మబ్బుల మెయి వెన్నె వెనుక దాగు బాష్పమ్ములామె నేత్రములలోన బొందుచుండును."

బసవరాజు అప్పారావుగారి గేయాలు కూడా ఎంతో ప్రాచుర్యం వహించాయి. వాటిలో చెప్పుకోదగ్గవి 'మామిడి చెట్టును అల్లుకొన్నదీ మాధవీలతొకటీ', 'ఒంటిగా నుయ్యాలలూగితివానా ముద్దు కృష్ణా', 'నల్లవాడే గొల్ల పిల్లవాడే', 'ఈ మామిపై నుండి ఈవు కూకూమంచు', 'ఏలా పాడేనింక యమునా కల్యాణి', 'గుత్తివంకాయ కూరోయి బావా' మొదలైన గేయాలు బాగా ప్రచారంలో ఉన్నాయి.

ఆంధ్రదేశంలో నండూరి వేంకట సుబ్బారావు గేయాలు ఎంతో ప్రసిద్ధం. అతడి ఎంకి పాటలు విననివాడు కాని, నోటితో అననివాడు కానీ ఉండడంటే అతిశయోక్తి కాదు. 'గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ కూకుడనీదురా కూసింతసేపు' ఇదే వెంకి పాటలకు నాంది. ఎంకి పాటలు మొదటి ముద్రణ 1925లో జరిగింది. దీనిలో 35 పాటలున్నాయి. మలి ముద్రణ 1953లో జరిగింది. దీనిలో అదనంగా 43 పాటలు చేరాయి. ఎంకి పాటల్లో కనిపించే ఎంకినాయుడు బావల ప్రణయం నాటి తెలుగు యువతను ఉర్రూతలూగించింది. ఎంకి పాటల్లో ప్రతి ఒకటి ఆణిముత్యమే. మచ్చుకు ఈ గేయాన్ని పరిశీలించవచ్చు.

"యెక జన్మములోన ఎవరమోనంటి సిగ్గొచ్చి నవ్వింది సిలక నా యెంకి ముందు మనకే జన్మముందోలెయంటి తెల తెల్లపోయింది పిల్ల నా యెంకి యెన్నాళ్లు మనకోలె యీ ముసుగులంటి కంటతడి పెట్టింది జంట నా యెంకి".

ఇలాగే తెలుగులో వచ్చిన జావళీలను కూడా శృంగార గేయాలుగానే చెప్పుకోవచ్చు. ఇవేగాక నాటకాలలోను, చలన చిత్రాలలోనూ చోటుచేసుకొన్న గేయాల్లో అధిక సంఖ్యాకం శృంగార గేయాలే. సినిమాలలో యుగళ గేయాలు, నిరహగేయాలు కనిపిస్తాయి. ఇక్కడ శృంగార గేయాల గురించి రేఖామాత్రంగా మాత్రమే ప్రస్తావించబడింది. ఆయా గేయాలను స్వయంగా చదివి అనుభూతి పొందడం సముచితం.

**4. ప్రకృతి గేయాలు (లేదా) గోప గేయాలు :**

ప్రకృతిలో కలిసి జీవించేవారిని వర్ణించే గేయాలను ప్రకృతి గేయాలుగా పేర్కొనవచ్చు. ప్రకృతి గేయ కవిత్వంలో 'గోపగేయాలు' పేర్కోదగ్గవి.

పల్లీయుల జీవనాన్ని చిత్రించే కవిత్వాన్ని ముఖ్యంగా గోపకుల జీవిత విధానాలను చిత్రించే కవిత్వాన్ని ఆంగ్లంలో "Pastoral Poetry" అంటారు. Pastoral Poetry నే తెలుగులో 'గోపకావ్యాలు', 'గోగీతికలు' అని వ్యవహరిస్తున్నారు. కేవలం గొల్లవారి జీవితాన్నే కాక, వివిధ వృత్తులవారిని కూడా వర్ణించే గేయకవిత్వాన్ని కూడా 'గోపగేయాలు' లేదా 'గోగీతికలు' అని వ్యవహరించవచ్చు.

భావ కవితా యుగారంభకుడయిన రాయప్రోలు సుబ్బారావుగారి "తెల్లకుచ్చుల పాగ అల్లల నసియాడ చిన్న గొట్టెల మేపు చిన్నారి గొల్లాడ" అనే గేయంతోనే 'గోపగేయకవిత్వం' ఆరంభమైనదని చెప్పవచ్చు. ప్రకృతి కవిగా, గేయకవిగా తరువాత పేర్కొనదగినవారు కవి కొండల వెంకటరావు. వీరి గేయాలలో తెలుగుదేశంలోని పల్లెలు, పట్టణాలు ప్రతిబింబించాయి. వీరు 'జన పదములు', ప్రకృతి చందనము, 'భావమురళి', నెలబాలుడు, 'విశాల విశ్వము' ప్రకృతి పాంచజన్యము, కలరుతము, కొండ కొలను, వికసితోత్పలాలు' మొదలైన గోపగేయాల సంపుటులు వెలువరించినారు. వీటిలో కొన్ని పద్య ఖండికలు కూడా లేకపోలేదు. అయితే వీరిది ప్రధానంగా గేయ కవిత్వమే.

కవి కొండల తర్వాత గోపగేయాలు అధికంగా రచించిన కవి అడవిబాపిరాజు. వీరి 'తొలకరి', 'గోధూళి' గోప గేయాల సంపుటులు. బాపిరాజు గేయాలలో 'గోధూళి'తో గొల్ల సెల్కాయి కూతురు, పాపికొండల అడవుల నీడలలో పరుగులెత్తే కోయపడుచూ, దేముడిచ్చిన పాపతో బయలుదేరిన ముష్టిదీ వీరు గీసిన కవితా చిత్రాలలో చెప్పుకోదగినవి. నన్ను సూసి నవ్వింది దేసోళ్ళ చిన్నది. నన్ను చూసి నవ్వింది. ఆ ఎల్లావుకు గడ్డిలేదు, నల్లావు చిక్కినాది, మన్నేనికి పోయివస్తున్నా, మొదలైన గేయాలెన్నో రచించారు. 'ఉప్పొంగి పోయింది గోదావరి' అనే గేయంలో 'అడవి చెట్లన్నీని జడలలో తురిమింది. ఊళ్ళు దండలు గుచ్చి మెళ్లోన తాల్చింది' అనే కవితా పంక్తులు చెప్పు కోదగ్గవి. బసవరాజు అప్పారావు గేయాలలో తెలుగుదేశం ఆచారాలు, సంస్కృతి ప్రతిఫలిస్తాయి. 'నాగుల చవితి' గేయంలో -

"నీ పుట్టదరికి నా పాపలొచ్చేరు పాపపుణ్యముల వాసనే లేని బ్రహ్మస్వరూపులౌ పసికూనలోయి కోపించి బుస్సలు కొట్టబోకోయి"

వంటి పంక్తులు పడగలెత్తకు పాము, పగవారము కాము, అనే జానపద గేయాల పరిమళాన్ని పట్టించుకొన్నవే. ఎల్లా గెక్కువా, ఇంకెల్లా గెక్కువా? నదువుకున్నా బ్యామ్మర్లంతా సాకలవోళ్ళ రాముడికంటె ఎల్లాగెక్కువా', 'ఎల్దొద్దో మా పుల్లీ ఎల్దొద్దామా కల్లుదుకానానికెల్దొద్దామా' వంటి గేయాలు ప్రసిద్ధాలు. ఇవేగాక గోపగేయాలలో చావలి బంగారమ్మ 'కప్పతల్లి పెళ్ళి కూడా చాలా ప్రసిద్ధి పొందిన గోపగేయం.

ప్రకృతిని అభివర్ణించే గేయాల్లో గురజాడ అప్పారావు గారి నీలగిరి పాటలు చెప్పుకోదగ్గవి. రావుగారు నీలగిరిని నందనవనంగా అభివర్ణించారు. అక్కడి పచ్చికను, పక్షులను, చెట్లను, కాసారాల తీరాలను, శిఖరాలను, తోటలను, మబ్బులను సుందరంగా వర్ణించారు. వీరేగాక చాలామంది కవులు ప్రకృతిని అభివర్ణిస్తూ గేయాలు రాశారు. సినిమాలలో కూడా ప్రకృతిని వర్ణించే గేయాలు చోటు చేసుకోవడం గమనార్హం.

**4. ప్రబోధ గేయాలు :**

ఏదైనా ఒక విషయాన్ని ప్రబోధిస్తూ పాఠకులను ఉత్తేజపరిచే గేయాలను ప్రబోధ గేయాలని వ్యవహరించ వచ్చు. గురజాడ అప్పారావుకు ముందు వచ్చిన గేయాల్లో "మేలుకొలుపు గేయం" ప్రసిద్ధం. ఇది ఒక దేశభక్తి గేయం. జాతీయోద్యమాన్ని ప్రస్తావిస్తూ మేలుకోవలసిందిగా ఈ గేయం భారతీయులకు విజ్ఞప్తి చేస్తుంది. ఈ గేయాన్ని రచించిన కవి ఎవరో తెలియదు.

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

"మేలుకొనుమీ భరత పుత్రుడ, మేలుకొనుమీ సుజన పుత్రుడ
మేలుకొనుమీ సచ్చరిత్రుడ, మేలుకొనవయ్యా! వత్సా! మేలుకో..."

గురజాడ అప్పారావు రచనల్లో అనేక ప్రబోధగేయాలు కన్పిస్తాయి. వాటిలో ప్రధానంగా పేర్కోదగ్గది ఆయన దేశభక్తి గేయం. దేశాన్ని నిస్వార్థంగా ప్రేమించవలసిన ఆవశ్యకతను రావుగారీ గేయంలో తెలియజేశారు.

"దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టి పెట్టోయ్ గట్టిమేల్ తలపెట్టవోయ్"
"స్వంత లాభం కొంత మానుకు, పొరుగువారికి తోడు పడవోయ్, దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్"

దేశభక్తిని ప్రబోధించిన రాయప్రోలు వారి ప్రబోధగీతం కూడా ఇక్కడ తప్పక పేర్కోదగింది. ఆనాటి యువకుల్లో ఇది దేశభక్తిని బాగా పెంపొందించింది.

"ఏ దేశమేగినా ఎందు కాలిడిన, ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన
పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవము"
"లేదురా యిటువంటి భూదేవి యెందు లేరురా మనవంటి ధీరులింకెందు అవమానమేలరా అను మానమేల భరత పుత్రుడనంచు భక్తితో బలుక....."

ప్రజలలో జాతీయోద్యమం శీఘ్రగతిని వ్యాపించాలనే ఉద్దేశంతో జానపద గేయ రీతులను పునరుద్ధరిస్తూ, అనుకరిస్తూ దేశభక్తి గేయాలు, కీర్తనలు అసంఖ్యాకంగా వెలువడినాయి. చాలా గేయాలకు, కీర్తనలకు కర్తలెవరో కూడా తెలియకపోయినా అవి జనబాహుళ్యంలోకి చొచ్చుకొని పోయినాయి. వాటిలో మచ్చుకు ఒకటి.

"స్వరాజ్య సౌఖ్యం మనకెన్నటికో సురాజ్య సామ్రాజ్య సుభోజ్యమెన్నటికో"

ఆనాటి రాజకీయోద్యమాన్ని పురస్కరించుకొని పాటలు కుప్పలుతెప్పలుగా బయలుదేరినాయి. 'మరువకుడార్యులారా పంజాబు వధలు', నిరాకరణమను మితాయి', 'జైలు - అది వున్నాదీ మనకొక్క మైలు' మొదలైన పాటలు అసంఖ్యాకంగా వెలువడినాయి. గరిమెళ్ళ సత్యనారాయణ రచించిన మద్యపాన వ్యతిరేక గేయం కూడా చెప్పుకోదగ్గది.

"కల్లు త్రాగి నీ యిల్లు నెల్ల - గుల్ల చేయకు నీ వళ్ళు రోగాలకెల్ల - వడ్డీకీయకు"

ప్రబోధ గీతాల్లో కొన్ని మాత్రమే ఇప్పుడు ఇక్కడ ఇవ్వబడ్డాయి. ఇవేగాక అభ్యుదయ కవిత్వోద్యమానికి సంబంధించి, విప్లవ ఉద్యమానికి సంబంధించి ఇతర ప్రజా ఉద్యమాల్లోను, భక్తి ఉద్యమానికి సంబంధించి కూడా అనేక ప్రబోధగేయాలు రచింపబడ్డాయి. లలిత గేయాల్లోను, సినిమా గేయాల్లోను కూడా ప్రబోధగీతాలు విరివిగా రచింపబడి ప్రాచుర్యం వహించి బాగా ప్రచారం పొందాయి.

**చదవదగిన పుస్తకాలు :**

1. ఆధునికాంధ్ర గేయ కవిత్వం - డా. జి. చెన్నకేశవరెడ్డి.
2. తెలుగులో ఉద్యమ గీతాలు - డా. ఎస్వీ సత్యనారాయణ.
3. తెలుగు సాహిత్య సమీక్ష - రెండవ సంపుటం - డా. జి. నాగయ్య.
4. ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు ప్రయోగములు . - డా. సి. నారాయణరెడ్డి.

❖❖❖

# ఆధునిక తెలుగు సాహిత్యంలో పర్యావరణం

– డా॥. భూక్యా తిరుపతి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఆధునిక సాహిత్యయుగం ప్రారంభం నుండి ఇప్పటి వరకు సాహిత్యంలో అనేక సాహిత్య ఉద్యమాలు, ధోరణులు, వాదాలు, చర్చలుగా తెలుగు సాహిత్యం శాఖోపశాఖలుగా విస్తరించింది. భారతీయ ప్రాచీన సాహిత్యంపై సంస్కృత ప్రభావం కనిపిస్తే, ఆధునిక తెలుగు సాహిత్యంపై పాశ్చాత్య సాహిత్య ప్రభావం కనిపిస్తుంది. ఆధునికతను రెండు విధాలుగా నిర్వచించ వచ్చు. మొదటిది సమకాలీనకతే ఆధునికత, రెండోది మారిన ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు పునాదిగా ఏర్పడిన కొత్త దృక్పథాలను స్వరూపాన్ని సంతరించు కోవటమే ఆధునికత. ముఖ్యంగా ఆధునికతలో సామాజిక ప్రయోజనం, హేతుబద్ధమైన శాస్త్రీయ దృష్టి, వాస్త వికతలపైన ఆధారపడిన సాహిత్య దృక్పథాలు తాత్త్విక భూమికగా కనిపిస్తాయి. ఆధునికత అనేది సామాజిక అనుభవాలకు సంబంధించిన ఒక జీవన విధానం. చారిత్రక అనుభవం, ఆలోచనా సరళి, అభివ్యక్తి విధానం, సమాజ స్వభావాలు, అనుభవాలు, ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ఏర్పరచుకున్న తాత్త్విక భావనలు. దాని కనుగుణంగా రూపం తీసుకునే భాషాభివ్యక్తి ఆధునికతలో కనిపిస్తుంది.

పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల తెలుగులో నవ్య కవిత్వం రావడానికి మార్గదర్శకులు గురజాడ అప్పారావు గారు మరియు రాయప్రోలు సుబ్బారావు గార్లు. నవ్య కవిత్వం ప్రారంభం నుండి సాహిత్యంలో భావ, అభ్యుదయ, దిగంబర, పైగంబర, విప్లవ, అనుభూతివాద కవిత్వోద్యమాలు వచ్చాయి. ఈ సాహిత్య ఉద్యమాలలో సమాజమే కేంద్రంగా సామాన్య మానవుని సమస్యలపై స్పందించింది. వాటికి పరిష్కార మార్గాలు కూడా చూపింది ఆధునికత. ఆధునికత బలహీన పడుతున్న సమయంలో ఆధునికోత్తర వాదం 1970-80 కాలంలో సాహిత్యంలోకి ప్రవేశించి, ఆధునికోత్తర వాదంలో అస్తిత్వ ఉద్యమాల చైతన్యం బలంగా కనిపిస్తుంది. ఈ అస్తిత్వ ఉద్యమాలుగా స్త్రీవాదం, దళితవాదం, బహుజనవాదం, ముస్లిం మైనారిటీ, ప్రాంతీయ వాదాలు వచ్చాయి. తమ సమస్యల గురించి తామే చెప్పుకునే విషయాలు ఆధునికోత్తర వాదంలో బలంగా కనిపిస్తుంది. ఆధునికోత్తర వాద అనంతర ధోరణులలో పర్యావరణ స్పృహ లేదా పర్యా వరణ చైతన్యం లేదా పర్యావరణవాదం సాహిత్యంలో బలమైన ప్రభావాన్ని చూపిస్తున్నది.

పర్యావరణ సాహిత్యాన్నే హరిత సాహిత్యమని కూడా అంటారు. దీనిని ఆంగ్లంలో ఎకోక్రిటిసిజమ్ (Eco-criticism) అని పిలుస్తారు. ఈ ఎకోక్రిటిసిజంను సమానార్థకంగా తెలుగులో పర్యావరణమని పిలుస్తున్నాం. పర్యావరణ సాహిత్యం భౌతిక, పర్యావరణల మధ్యగల సంబంధాలను తెలియజేస్తుంది.

ప్రకృతి అంటేనే చెట్లు, గుట్టలు, నదులు, సముద్రాలు, పూలు, పశుపక్ష్యాదులు అందమైన ప్రకృతి అద్భుతమైన ఆలోచనల ఆకృతి. ప్రకృతి అనేది ఒక స్థలంకాదని, అది ఒక ఇల్లని గ్యారీస్నైడర్ గారి అభిప్రాయం. ప్రకృతి ఎల్లప్పుడు మనిషి మనస్సులో శాంతి, అద్భుత భావాలు కనిసేటట్లు చేస్తుంది. ప్రకృతి అనేది వైవిధ్యం, సంక్లిష్టతల దారాల నుండి అల్లిన సున్నిత వస్త్రం లాంటిది. ప్రకృతిలో ఒకరకమైన ఓదార్పు, ప్రేరణ కూడా కనిపిస్తుంది. ప్రకృతి గురించి విలియం షేక్స్పియర్ ఇలా అంటాడు. "ప్రకృతి యొక్క ఒక్క స్పర్శ ప్రపంచం మొత్తాన్ని బంధువుగా చేస్తుంది."

పర్యావరణ సాహిత్యం గురించి ఆంగ్ల నిర్వచనం ఇలా ఉంది. "Eco-criticism is critical study in literature that investigate humanity's relationship to th environment. This can be found in many forms. Including literature film, or the arts Eco-criticism aims to evaluate how humans interact with the

natural world with the goal of improving how we treat the environment" పర్యావరణం అంటేనే సృష్టిలోని అన్ని రకాల చెట్లు, మొక్కలు, జంతువుల పరస్పర సంబంధాలను అధ్యయనం చేస్తుంది. పర్యావరణంకాని, ప్రకృతి గాని తెలుగు సాహిత్యంలోకి ఆకస్మాత్తుగా ప్రవేశించింది కాదని ఆ అభిప్రాయం. ప్రకృతికి, పర్యావరణానికి సంబంధించిన మూలాలు ప్రాచీన సాహిత్యంలోను, ఆధునిక సాహిత్యంలోని ఏ కవిని లేదా ఏ యుగాన్ని స్పృశించినా కనపడుతుంది. ప్రాచీన సాహిత్యంలోనూ, ఆధునిక సాహిత్యంలోనూ ప్రకృతిని, పర్యావరణాన్ని మనిషి ప్రేమించాడు, ఆదరించాడు. ప్రకృతిలో లీనమైపోయాడు. అందుకే మనిషికి ప్రకృతియే సమస్తంగా కనిపిస్తుంది. భూగోళంలో ప్రతి ప్రాణికి కావల్సిన అవసరాలు తీర్చేది ప్రకృతియే. ప్రకృతియే సృష్టికి మూలం. అందుకే కవిత్వమంటేనే ప్రకృతికనుకరణ అని అంటారు అరిస్టాటిల్. ప్రాచీన సాహిత్యాలైన రామాయణంలోను, భాగవతంలోను ప్రకృతి వర్ణనలు కనిపిస్తాయి. రామాయణ కావ్యంలో అరణ్యానికి సంబంధించిన విషయం. పర్ణశాల, అశోకవనం గురించి వర్ణించిన విషయాలు. అలాగే కవిత్రయ భారతంలోనూ అనేక విషయాలు ప్రకృతికి సంబంధించి ఆదిపర్వం మొదలుకొని స్వర్గారోహణ పర్వం వరకు ప్రతి పర్వంలోనూ ప్రకృతికి సంబంధించిన ప్రస్తావన కనిపిస్తుంది. శివకవుల రచనలు, భాగవత-ప్రబంధ సాహిత్యం, వచన కవులలోనూ, నవ్యకవిత్వం, భావ కవిత్వంలోనూ ప్రకృతికి సంబంధించిన వర్ణనలు ఉన్నాయి.

20వ శతాబ్ది పూర్వార్థంలో పాశ్చాత్య దేశాలలో పర్యావరణం మీద పరిశోధనలు ప్రారంభమైనట్లు కనిపిస్తుంది. ఆంగ్లంలో Eco-criticism అనే పదాన్ని మొదటిసారిగా విలియం రూచర్ట్ (William Ruechert) 1926 - 2006 అనే వ్యక్తి తాను రాసిన వ్యాసానికి "Literature and Ecology : An Experiment in Eco-criticism (1978) పేరు పెట్టినట్లు కనిపిస్తుంది. ఆంగ్ల సాహిత్యం, సాహిత్య విమర్శ మరియు సిద్ధాంతం ద్వారా తెలుస్తుంది. ఆంగ్ల సాహిత్యంలో Eco-criticism చరిత్రను పరిశీలిస్తే పంటలమీద వాడుతున్న పురుగు మందులు ప్రజలకు ఎటువంటి ప్రభావం చూపుతున్నాయి అనే విషయాన్ని 1930లో మొదటిసారిగా పరిశోధనలు చేయడం ప్రారంభించారని తెలుస్తుంది.

పర్యావరణ వాదంలో ప్రధానంగా కనిపించేది పర్యావరణంలో సమతుల్యత లోపించడం. దాని కారణంగా పురోగతిలో అనేక సమస్యలు మొదలవుతున్నాయి. అందువల్ల వన్యప్రాణులు అంతరించిపోతాయి. జల కాలుష్యం మూలంగా జలజీవులపై ప్రభావం పడుతుంది. ప్రకృతిలో అతివృష్టి, అనావృష్టి మొదలవుతుంది. అడవుల నరికివేత వలన గాలి నాణ్యత లోపిస్తుంది. భారీ పరిశ్రమల స్థాపన మూలంగా ధ్వని కాలుష్యాలు పెరిగిపోతుంది. భూమి మీద ఉన్న అనేక క్రిమికీటకాలు అంతరించిపోతాయి. తద్వారా ప్రజలు అనారోగ్య సమస్యలు, ఆహార సమస్యలు ఎదుర్కొంటారు. పర్యావరణం గురించి సీతారం గారు ఇలా అంటారు. ఆధునిక పారిశ్రామిక సమాజం ప్రకృతి మంచిగా ఉంటే జీవితంలోనూ మంచితనమే ఉంటుందనే ప్రాపంచిక దృక్పథానికి దూరంగా జరిగింది. సైన్సు, సాంకేతిక రంగాలు, వృద్ధిచెంది సహజన్యాయ సూత్రాలను, సంప్రదాయ నైతిక భావనలను విచ్ఛిన్నం చేసినాయి. పారిశ్రామికీకరణ సంబంధంగలం సమాజాల నైతికత మంచి మనిషిని విడదీస్తాయి. ప్రకృతిపై ఆధునిక శాస్త్రానికి భిన్నమైన దృక్పథాలు కలిగాయి. ప్రకృతిని ఒక యంత్రంగా దర్శించి, భౌతిక, యాంత్రిక నియమాలతో నడిచేదిగా భావించడం మొదలుపెట్టాడు. అందువల్ల మానవ నైతికతలు పునాదిలేని కట్టడాలుగా మారాయని" అంటారు. (దక్కన్‌లాండ్, ఏప్రిల్, 2020).

తెలుగులో ప్రాచీన సాహిత్యంతోపాటు ఆధునిక సాహిత్యంలో ప్రకృతికి సంబంధించిన రచనలు ఎన్నో వచ్చాయి. అలాగే ప్రింట్ ఎలక్ట్రానిక్, వార్తాపత్రికలలోనూ పర్యావరణానికి సంబంధించిన విషయాలు ప్రచురితమవుతున్నాయి. ప్రకృతిని చూసి పులకించే కవులు

ఎంతోమంది ఉన్నారు. భావరూపంలో పర్యావరణాన్ని స్పృశిస్తూ ఇంత సాహిత్యం వచ్చిందని పరిపూర్ణంగా చెప్పలేము. అది నవల కావచ్చు. కథ కావచ్చు. కవిత్వం కావచ్చు. పర్యావరణాన్ని స్పృశిస్తూ ఆధునికంగా కవిత్వం రాసిన వాళ్లలో కొందరు గుంటూరు శేషేంద్ర శర్మ గారి ఆధునిక మహాభారతం, సినారె గారి విశ్వంభర, మట్టి మనిషి, ఆకాశం, గోపిగారి జలగీతం, ధనుంజయ్ నాయక్ గారి నీటి నానీలు.

తెలుగు కథాసాహిత్యంలో పర్యావరణాన్ని స్పృశిస్తూ వచ్చిన కథలు ఇన్ని అని చెప్పలేం. ఇదే విషయాన్ని కాలువ మల్లయ్య గారు ఇలా అంటారు. "ఖచ్చితంగా ఫలానా కథలు పర్యావరణానికి సంబంధించినవని చెపటం కష్టమైన పర్యావరణ ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని ప్రకృతిని ఉంచవలసిన అవసరాన్ని గుర్తుచేస్తూ కొన్ని కథలు వచ్చాయని పేర్కొన్నారు. రావిశాస్త్రి మామిడి చెట్టు కథ, కాలువ మల్లయ్య సృష్టి సృష్టికర్త, ఆవేదన కథ, అల్లం రాజయ్య భూమి కథలు, వసంతరావు దేశ్‌పాండే బ్లేడు గురించి రాసిన కథ, ముప్పాళ్ల నర్సింహరావు బస్సులో పొగచుట్ట కంపు గురించి రాసిన కథ, సింగమనేని నారాయణ వాకింగ్ చేయడం గురించి రాసిన కథలో పర్యావరణ స్పృహ కనిపిస్తున్నాయని" విశ్లేషించారు. అలాగే గుజ్జారి రామచంద్రరావు గారి "టైంక్యాప్సూల్స్ కథ, బెలగం భీమేశ్వరరావు గారి హెచ్చరిక కథ, శేఖరం గారి భూమి పుత్రుడు కథ, పాపినేని శివశంకర రావు గారి చివరి పిచ్చుక లాంటి కొన్ని కథలను విశ్లేషించ వచ్చు.

పర్యావరణాన్ని స్పృశిస్తూ ప్రజాకవులు అనేక గేయాలు రాశారు. గోరటి వెంకన్న గారి నల్లతుమ్మ గేయం శ్రీనివాస రావు గారి విత్తు విలాపం, విద్వాన్ విశ్వం, ఇస్మాయిల్ మొదలైన కవులు రచనలు చేశారు.

పర్యావరణ అంశాలను ఆధారం చేసుకొని వచ్చిన కవితా సంపుటిలో అమ్మంగి వేణుగోపాల్ గారి పచ్చబొట్టు పటం చెరువు, మాలకొండారెడ్డి చెట్టు కవిత, వడ్డేపల్లి కృష్ణ చెట్టే ప్రగతికి మెట్టు, జయంపు కృష్ణ చెట్టకు నమస్కారం, పాపినేని శివశకంర్ గారి ఆకుపచ్చని లోకం, కె.వి. రామానాయుడు 'జలరపస్థానం' కవితలు, కవితా సంపుటాలు వచ్చాయి. పర్యావరణ నేపథ్యంలో కనిపించే నవలలు విశ్వనాథ్ వారి వేయి పడగలు, చంద్రలత గారి దృశ్యాదృశ్యం, కన్నడ అనువాద నవల తండా మొదలైనవి పేర్కొనవచ్చు.

పర్యావరణ వాదంను పరిశీలిస్తే పర్యావరణం సమాజంపై తన ప్రభావాన్ని వెంటనే చూపించదు. కాల క్రమేణ మొదలవుతుంది. పర్యావరణ సమతుల్యత లోపించడం వల్ల భూమండలం మొత్తం కలుషితం అవుతుంది. జల, వాయు, భూ కాలుష్యం మొత్తం విషపూరితం అవుతున్నాయి. రసాయనాల వాడకం, పంటలు పండే భూమి భారీ నిర్మాణాలు, వీటన్నింటి మూలంగా పర్యావరణం మొత్తం మారిపోయింది. ఇదే విషయాన్ని విల్సన్ సుధాకర్ గారు "ఇప్పుడు కలుషితం కానిదేది లేదు. విలువలపై హిపోక్రసీలూ భారతీయతపై అబద్ధాలు, నీరూ, నిప్పు, ఆహారం, పీల్చేగాలీ, మానవచెత్తలోంచి ఊపిరి పీల్చుకునే ఒక ఈగచాలు, వంద పులుల కంటే ప్రమాదం కావడానికి..." అంటూ అన్నారని డా॥. తన్వీర్ కళ్యాణ్ కుమార్ గారు పేర్కొన్నారు. పర్యావరణం మరింత కలుషితం కాకుండా ఉండటం కోసం ప్రతి వ్యక్తి తన వంతుగా నిర్వర్తించాలి. సమాజ శ్రేయస్సుకు అందరూ పాటుపడతారని ఆశిద్దాం.

**ఆధార గ్రంథాలు :**

1) నారాయణరెడ్డి సి, ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు : ప్రయోగములు.
2) డక్కన్ ల్యాండ్ మాసపత్రిక, ఏప్రిల్ 2020.
3) మల్లయ్య కాలువ, తెలుగు కథల్లో పర్యావరణం, 2002.
4) పతంజలి శాస్త్రి, సాహిత్యం పర్యావరణమే జీవితం, ఆంధ్రజ్యోతి, 2010.
5) మధురవాణి అంతర్జాల పత్రిక.
6) Eco-criticism Garrard - 2004.

# స్వాతంత్ర్యోద్యమంలో స్త్రీలు

- డా॥ పి. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి, ఏలూరు జిల్లా.

ప్రతి యుగంలోనూ స్త్రీలు, పురుషులు తమ ప్రత్యేకతలను కనపరుస్తూనే ఉంటారు. ప్రస్తుతం ఉన్న సమస్యలకు పరిష్కార మార్గాలను కనుగొనటంలోనూ, భవిష్యత్తుకు రూపకల్పన చేయటంలోనూ, కొందరు ఎంతో కృషి, త్యాగం చేస్తారు. స్వాతంత్ర్యోద్యమం నుండి సంక్రమించినటువంటి భావజాలపరమైన, రాజకీయ పరమైన అంశాలు స్వాతంత్ర్యానంతరం అభివృద్ధి పై చెరగని ముద్ర వేసింది. స్వాతంత్ర్యోద్యమంలో తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన పుణ్యమూర్తుల కారణంగా భారతదేశానికి అఖండమైన కీర్తి ప్రతిష్టలు లభించినవి.

ఆనాడు స్వాతంత్ర్యోద్యమంలో పురుషులతో పాటు ఎంతో మంది స్త్రీలు కూడా పాల్గొన్నారు. గాంధీజీ స్వాతంత్ర్యోద్యమం విజయవంతం కావాలంటే పురుషులతో పాటు స్త్రీలు కూడా ఇళ్ళలో నుండి బయటకు వచ్చి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గోవాలన్నారు. దీనితో అనేక మంది స్త్రీలు పరిస్థితులు అనుకూలించినా, అనుకూలించకపోయినా ధైర్యంతో ఉద్యమంలో పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న విశిష్ట మహిళలు:

### కవికోకిల సరోజిని నాయుడు :

స్వాతంత్ర్యోద్యమంలో శ్రీమతి సరోజిని నాయుడు చాలా విశిష్టమైన పాత్ర నిర్వహించారు. కవయిత్రిగా జాతీయ, అంతర్జాతీయ కీర్తి గడించారు. సరోజిని 1879వ సంవత్సరం ఫిబ్రవరి 13న హైదరాబాదులో జన్మించారు. ఆమె తండ్రి అఘోరనాథ ఛటోపాధ్యాయ, తల్లి వరద సుందరీదేవి. ఆమె భర్త సుప్రసిద్ధ వైద్యుడు, మేజర్ జనరల్ ముత్యాల గోవిందరాజుల నాయుడు. ఆ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కొడుకు డా॥ జయసూర్య హెూమియోవైద్యంలో మంచి పేరు గడించారు.

1915 సం॥లో మహాత్మాగాంధీతో ఆమెకు పరిచయం ఏర్పడింది. గాంధీజీ దక్షిణాఫ్రికాలో లాయర్‌గా పని చేస్తున్న సమయంలో ఒక సారి రైలు ప్రయాణంలో శ్వేత జాతీయులకు కేటాయించిన సీటులో కూర్చున్నందుకు ఆయన్ని అధికారులు బలవంతంగా గెంటేశారు. 7 జూన్ 1893 సంవత్సరంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీని ప్రభావంతో ప్రజలను సంఘటిత పరచటానికి గాంధీజీ సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1930 సంవత్సరంలో గాంధీజీ పిలుపునందుకుని ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో అప్పుడప్పుడూ జైలు శిక్షను కూడా అనుభవించినది. 1942వ సంవత్సరంలో ఆగాఖాన్ భవనంలో సరోజిని నాయుడు గాంధీజీ, కస్తూరిబాలతో నిర్బంధావాసం గడిపింది.

### కవయిత్రిగా శ్రీమతి సరోజిని :

శ్రీమతి సరోజినినాయుడు 12వ ఏటనే మద్రాసు విశ్వవిద్యాలయం వారి మెట్రిక్యులేషన్ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనారు. 13వ సంవత్సరంలో ఇంగ్లీషులో సరోవరపు సారసాక్షి (Lady of the Lake) కావ్యం రాశారు. బంగారు వాకిలి (The golden threshold), కాల విహంగము (The bird of time), భగ్నపక్షము (The broken wing) అనే కావ్యాలు ప్రసిద్ధి చెందాయి. ఆమె సహజ కవయిత్రి. అందువల్లనే ఆమెకు కవికోకిల (నైటింగేల్ ఆఫ్ ఇండియా) అనే బిరుదు లభించినది.

### వక్తగా :

1932లో ఇంగ్లాండ్‌లో జరిగిన 'రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్'లో పాల్గొన్నారు. భారతదేశ స్వాతంత్ర్యాన్ని గురించి ఇంగ్లాండులో ఎన్నో చోట్ల ప్రసంగించటమే కాక భారతదేశ స్వాతంత్ర్య సముపార్జన గురించి ఉత్తేజకరమైన ఉపన్యాసాలెన్నింటినో ఆమె చేశారు. సరోజిని నాయుడు

గొప్ప కవయిత్రిగానే కాక గొప్ప వక్తగా కూడా పేరు గాంచినది. 1947 సంవత్సరంలో ఏషియన్ రిలేషన్స్ సభ ఢిల్లీలో జరిగింది. ఆ సభకు ఆమె అధ్యక్షత వహించారు. ఆనాడు చేసిన ప్రసంగానికి ముగ్ధులై ఆసియా ప్రజలందరికీ నాయకురాలిగా ఆమెను ఎన్నుకున్నారు. 1944 సంవత్సరంలో ఆనాటి బ్రిటీషు ప్రభుత్వం ఆమె ప్రసంగాల పై రచనల పై ఆంక్షలు విధించినది.

**పరిపాలనావేత్తగా నారీలోకానికి వన్నె:**

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొట్ట మొదటి మహిళా గవర్నర్‌గా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి నియమించబడ్డారు. ఆమె గవర్నర్ పదవిలో ఉన్న కాలంలో మహిళాభ్యున్నతికి, శరణార్థుల పునరావాసానికి ఎనలేని కృషి చేశారు.

"ఆమెను గవర్నరుగా నియమించటం వలన గవర్నర్ పదవికి ముందెన్నడూ లేని గౌరవం లభించినది" అని మొట్టమొదటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ గారు అన్నారు.

**నిరాడంబర జీవి - ఆదర్శ మహిళ :**

గవర్నర్ పదవిలో ఉన్నప్పటికీ తన నివాసాన్ని తానే శుభ్రం చేసుకునేది. ఆమె ఇల్లు ఒక అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా ఉండేది. అతి నిరాడంబరంగా జీవితాన్ని గడిపి ఆదర్శ మహిళగా పేరు తెచ్చుకున్నది. మాటలలో చమత్కారి. మనసులోని విషయాలను నిర్భయంగా నిర్మొహమాటంగా చెప్పేది.

ఏ రంగంలోనైనా స్త్రీలు కూడా సమర్థులేనని, పురుషులకు ఏ మాత్రం తీసిపోరని ఋజువు చేసింది శ్రీమతి సరోజిని నాయుడు.

**స్వాతంత్ర్యోద్యమంలో త్యాగోజ్జ్వల - దుర్గాబాయి :**

దుర్గాబాయి 1909 జూలై 15వ తేదీన రాజమండ్రిలో జన్మించింది. తండ్రి ఆర్. వి. యన్. రామారావు గారు, తల్లి కృష్ణవేణమ్మ. దుర్గాబాయి ప్రతిభాశీలి. బాల్యంలోనే హిందీలో ప్రావీణ్యురాలై గాంధీ ప్రసంగానికి కాకినాడలో తెలుగులో అనువాదం చేసి ఆయన మెప్పు పొందింది. వీణావాదనలో దిట్ట. రంగవల్లులు వేయటంలో ఆమెకు ఆమె సాటి. పాటలు, పద్యాలు, నాటికలు, కోలాటాలు, దేశభక్తి గేయాలు హిందీ పాఠశాలలోని బాలికలకు నేర్పించేది.

మద్రాసులో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో సత్యాగ్రహ దళానికి సర్వాధికారిగా ఉండి రెండేళ్ళ జైలు శిక్ష అనుభవించారు. ఇరవై ఏళ్ళ వయస్సులోనే ఆమె జైలుకు వెళ్ళింది. మధురై జైలులో ఏకాంత కఠిన కారాగారవాస శిక్షను ఆమె ఏడాది పాటు అనుభవించినది. స్వాతంత్ర్యోద్యమంలో మొత్తం మూడు సంవత్సరములు ఆమె కారాగారవాసం అనుభవించినది. ఆమె నిర్బందితురాలైన గది ప్రక్కనే క్రూరమైన నేరస్తులు, మరణశిక్ష కొరకు ఎదురుచూస్తున్న వాళ్ళు ఉండేవాళ్ళు. వాళ్ళు సృష్టించే అలజడి వల్ల ఆమె విపరీతమైన మానసిక వేదనకు, అస్వస్థతకు గురి అయ్యేది.

లాయర్‌గా మద్రాసులో ప్రాక్టీసు చేస్తూ ఆంధ్ర మహిళా సభ భవన నిర్మాణానికి పూనుకున్నారు. కస్తూరిబా నిధికి డబ్బులు వసూలు చేసి గాంధీజీకి ఇచ్చారు.

ఆమె తన ప్రతిభా సామర్థ్యాలతో రాజ్యాంగ సభ సభ్యురాలుగా ఎన్నిక కాబడ్డారు. స్త్రీలకు ఆస్తిహక్కు, ప్రాథమిక హక్కులు మొదలగు అంశాలను రాజ్యాంగంలో చేర్పించారు. రాయలసీమలో క్షామ నివారణ పథకాల పర్యవేక్షణకు ఇరవై ఐదు వేల రూపాయల చెక్కును ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గారికి పంపారు. ఈ విధంగా ఆమె 1950 తర్వాత సాంఘిక, సేవా రంగాలలో విశేష సేవలందించారు.

ప్లానింగ్ కమీషన్ మెంబరుగా ప్రభుత్వంచే 1952లో నియమించబడ్డారు. సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్‌గా పదేళ్ళు పని చేశారు. కేంద్ర సంక్షేమ సంఘం అధ్యక్షురాలుగా ఆమె విశేష కృషి చేశారు.

ఆంధ్ర మహిళా సభా కార్యక్రమాలు అనేకచోట్లకు విస్తరించబడినాయి. ఇరవై మూడు సంస్థలకు ఆమె

మూలకారకురాలు. దేశ్‌ముఖ్ తమ ఆస్తిపాస్తులన్నింటినీ సేవాసంస్థల స్థాపనకు విరాళంగా ఇచ్చారు.

భారత ప్రభుత్వం ఆమెకు వయోజన విద్యావ్యాప్తికి చేసిన కృషికిగానూ, 1971వ సంవత్సరంలో 'నెహ్రూ లిటరసీ' అవార్డు ఇచ్చి గౌరవించినది. 1975 జనవరి 26 పద్మవిభూషణ్‌తో సత్కరించబడ్డారు.

"దుర్గాబాయి విసుగు విరామం లేని మనిషి, తన సహచరులను కూడా తనలాగే విరామమెరుగని సేవా తత్పరులుగా ఆవేశ పూరితులుగా చేయగల నాయకురాలామె. జీవితంలో ఓటమి వుంటుందేమో అన్న భయం ఆమెకు లేదు. సహారా ఎడారిలో కూడా ఆమెకు చేయటానికి ఏదో సేవాకార్యక్రమం కనిపిస్తుంది" అని స్వతంత్ర్య పత్రికలో ఖాసా సుబ్బారావు గారు ఆమె గురించి పేర్కొన్నారు.

దుర్గాబాయి భారతదేశం మొత్తం గర్వించదగిన ఒక మహోన్నత వ్యక్తి. దేశ ప్రజలకు ఆమె అందించిన సేవకై ఆమె నిత్యస్మరణీయురాలు. ఆమె జీవితం ధన్యం.

**జనాభ్యుదయ చైతన్యశీలి - శ్రీమతి ఉన్నవ లక్ష్మీ బాయమ్మ :**

స్వాతంత్ర్యోద్యమాన్ని వీరోచితంగా నడపటంలో సిద్ధహస్తురాలు. రచయిత, జాతీయవాది, సంఘసంస్కర్త అయినటువంటి ఉన్నవ లక్ష్మీ నారాయణ పంతులు గారితో ఆమెకు పదవ ఏటనే వివాహం జరిగింది. సంఘసంస్కరణ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వితంతు శరణాలయాన్ని స్థాపించారు. ఖద్దరు ప్రచారం, అస్పృశ్యతా నిర్మూలనా కార్యక్రమాలలో అవిశ్రాంతంగా పాల్గొన్నారు.

ఆ తర్వాత స్వాతంత్ర్యోద్యమంలో పూర్తిగా నిమగ్నమైనారు. పల్నాడులో పుల్లరి సత్యాగ్రహంలో లక్ష్మీనారాయణరావు గారిని నిర్భంధించగా లక్ష్మీబాయమ్మ గారు ఆయన స్థానాన్ని తాను స్వీకరించినది.

1940లోనూ అంతకుముందు మూడుసార్లు ఈమె జైలుకు వెళ్ళారు. మహిళల విద్యావ్యాప్తికై 1927వ సంవత్సరంలో గుంటూరులో శారదానికేతన్ స్థాపించారు.

స్త్రీ జనాభ్యుదయ చైతన్యశీలి, ఆదర్శ మహిళ శ్రీమతి ఉన్నవ లక్ష్మీబాయమ్మ.

ఈ విధంగా పెద్దాడ కామేశ్వరమ్మ, నడింపల్లి సుందరమ్మ, దువ్వూరి సుబ్బమ్మ, సంగెం లక్ష్మీబాయి, యల్లాప్రెగడ సీతాకుమారి, కనుపర్తి వరలక్ష్మమ్మ, వేదాంత కమలాదేవి, పొణకా కనకమ్మ మొదలగు స్త్రీలు ఎందరో లాఠీ చార్జీలు, జైలు శిక్షలు అనుభవించి స్వాతంత్ర్యోద్యమంలో మణి దీపాలుగా వెలుగొందారు. జాతి పునర్నిర్మాణానికి విశేష కృషి చేశారు.

## పరామర్శ గ్రంథాలు :

1. భారత స్వతంత్ర్యం పోరాటం - బిపన్ చంద్ర
2. ప్రాచీనాంధ్ర కవయిత్రుల స్త్రీ స్వభావ చిత్రణం - డా॥ గుమ్మా సాంబశివరావు
3. సుప్రసిద్ధుల జీవిత విశేషాలు - జానమద్ది హనుమచ్ఛాస్త్రి
4. ఆంధ్ర విదుషీమణులు - ఆండ్ర శేషగిరిరావు

❖❖❖

# గిరిజన సాహిత్యం సంస్కృతి

- డా॥. బి. చక్రవర్తి , కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, ముక్త గంగోత్రి, మైసూరు.

అనాదిగా గిరిజనులు కొండల్లో, కోనల్లో నివసిస్తూ ప్రత్యేక సంస్కృతి కలిగివున్నారు. బ్రిటీషు పాలనాకాలంలో రైలు, రోడ్డు రవాణా వ్యవస్థ వృద్ధి చెందింది. అప్పటి నుండి గిరిజనుల ఏకాంత జీవితం అంతమౌతుంది. 19, 20 శతాబ్దాల నుండి మైదాన ప్రాంత ప్రజలతో సంబంధాలు ఏర్పడినాయి. వడ్డీ వ్యాపారుల రాకతో ఋణభారం పెరగడం, సాగుచేసుకున్న భూమి అన్యాక్రాంతం కావడం, గిరిజన స్త్రీలు అమాయకంగా మోస పోవడం వంటి సమస్యలు ఎదురౌతున్నాయి.

గిరిజనులు చాల వరకు పోడు వ్యవసాయాన్ని అనుసరించేవారు. జంతువుల్ని వేటాడి మాంసం తినేవారు. వేటాడడం నిషేధం అయింది. మద్యం సేవించడం అలవాటు. ఇప్పపువ్వుతోను, బెల్లంతోను సారాయిని తయారు చేసుకొనేవాళ్ళు. రానురాను అవికరువైనాయి. కంపెనీల బ్రాందీ, సారాలకి అలవాటు పడ్డారు. మత ప్రచారం గిరిజనుల మీద పడింది. క్రైస్తవ మతాచారాలు గిరిజనులలో అనైక్యతను సృష్టించాయి.

గిరిజనాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టే పథకాల పట్ల గిరిజనులకు అవగాహన లేకపోతోంది. వారి భాషలో వివరించడం లేదు. బయటి ప్రపంచంతో సంబంధాలు కలిగి వుండటం వల్ల అంటువ్యాధులు, హెచ్.ఐ.వి. ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయి. న్యాయాధికారులు గిరిజనులకు సరైన న్యాయం అందజేయడం లేదు. వడ్డీ వ్యాపారులు ఖండగుత్త, బెడ్డ శిస్తు, ఖండన పేరున గిరిజన సంపదని కొల్లగొట్టి షావుకార్లుగా తయారవుతున్నారు.

ప్రకృతి వైపరీత్యాల వల్ల, అడవి మృగాల వల్ల గిరిజన జీవితాలు అతలాకుతలమవుతున్నాయి. వీరి సమస్యలకు ప్రధాన కారణాలు అమాయకత్వం, అజ్ఞానం, నిరక్షరాస్యత మారుతున్న నాగరిక పరిస్థితులు గిరిజనుల్ని సమస్యల ఊబిలోకి నెట్టివేస్తున్నాయి.

ప్రభుత్వం గిరిజన నివాస ప్రాంతాల్లో ప్రాజెక్టులు నిర్మించడం వల్ల నిరాశ్రయులవుతున్నారు. ప్రాజెక్టుల నిర్మాణం గిరిజనులకు ప్రయోజనకరంగా మారకపోగా, వారిని నిరాశ్రయులను చేస్తూ, తండా వ్యవస్థ కకావికలమై, సంస్కృతి వినాశనం జరుగుతోంది. వలస పక్షులవుతున్నారు. స్థిర నివాసం లేకపోవడం వల్ల, భూమి హక్కును కోల్పోతున్నారు.

రచయిత క్రాంతదర్శి. 'రవికాంచని చోట కవి గాంచున్' అన్నది నానుడి. గిరిజనుల సమస్యలు సాహిత్య వస్తువులైనాయి. గిరిజనుల జీవితాన్ని వివిధ కోణాల్లో దర్శించారు. సాహిత్యాన్ని వెలువరించారు. భూషణం, అప్పలనాయుడు, మల్లిపురం జగదీశ్, జీవన్, శిరంశెట్టి కాంతారావు, ఉదయమిత్ర మొదలైన రచయితలు గిరిజన జీవితాలను, వారి సంస్కృతిని అక్షరబద్ధం చేసారు. నాగరిక సమాజం దృష్టికి తెచ్చారు.

గిరిజన జీవిత ఇతివృత్తాలతో వెలువడిన సాహిత్యాన్ని అధ్యయనం చేస్తే గిరిజనుల జీవితంలోని పలుకోణాలు వెలుగులోకివస్తాయి. గిరిజనుల జీవితాన్ని, వారి సమస్యలు ఇతివృత్తంగా కలిగిన కథలను వింగడించి విశ్లేషించడం ఈ అధ్యాయాంశం. రచయితలు గిరిజనులు సాగిస్తున్న జీవన సమరం భిన్నకోణాల్లో చిత్రించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఆదివాసులందరూ ఆహారాన్ని సేకరించుకునే చెంచులు తప్ప మిగతావారంతా వ్యవసాయం చేస్తున్నారు. ఈ తెగల నివాస ప్రాంతాలైన అడవులు, కొండల్లోకి గిరిజనేతరుల వలసలకు పూర్వం గిరిజనులంతా తమకు అవసరమైన ఆహారాన్ని పండించుకున్నారు. జంతువులను పెంచుకున్నారు. వీరికి బయటి మైదాన ప్రాంతాలతో సంబంధాలు అంతంత

మాత్రమే. అవసరమైన అన్నిటిని తయారుచేసుకో గలిగారు. ఉప్పు, జనుము దూరంగా ఉన్న సంతలకు వెళ్ళి, వస్తుమార్పిడి ద్వారా ఇచ్చి పుచ్చుకొనేవాళ్ళు.

పోడు వ్యవసాయంతో కొండరెడ్లు, కోలాములు తెగలు పోడు వ్యవసాయంతో, అటవీ ఫలసాయంతో అవసరాలు తీర్చుకోగలిగారు. అభివృద్ధి చెందిన గోండులు, కోయలు చాలావరకు స్వయం సమృద్ధి సాధించారు. 20వ శతాబ్ది తొలి రోజుల నుంచే గిరిజనేతరుల వల్ల స్వయం సమృద్ధి నాశనమై ఆధారపడటం మొదలైంది. వస్తు వినిమయం నుంచి డబ్బు వినిమయం ప్రారంభమైంది. 1940 వరకు డబ్బు నాణేలు నోట్లు తెలియవు. ఆ విధంగా గిరిజనేతరులవల్ల దోపిడీకీ గురవయ్యారు.

అప్పు తీసుకోవడమన్నది గిరిజనులకు తెలియదు. గిరిజనేతరులే నేర్పారు. అదే గిరిజనులకు శాపమైంది. మారుమూలల్లోని కొండరెడ్లు ఒక ఏడాది పంట నష్టం జరిగితే ఏ రకమైన అప్పు నేటివరకు చేయరనే చెప్పాలి. అవసరాలకు సరిపడా ఆహారాన్ని సేకరించుకుంటారు. గడ్డలు, దుంపలు, కందమూలాలు చింతపిక్క అంబలి, టెంకఅంబలి మొదలైన వాటిపై ఆధారపడి జీవిస్తారు. అప్పు ఆదివాసీ తెగల స్వయం సమృద్ధిని పూర్తిగా దెబ్బతీసింది.

ఆదివాసీ సముదాయంకు రిజర్వ్ అటవీ విధానం కోలుకోలేని దెబ్బ తీసింది. కాంట్రాక్టర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసి వచ్చింది. అటవీ ఫలసాయాలను ప్రభుత్వమే వేలం వేయటం ప్రారంభించింది. పోడు చేసుకోవటం వల్ల అటవీ అధికారులు పోలీస్ కేసులు పెట్టేవారు. పరిశ్రమలకు కలప పుల్ల తరలించడంతో దొంగకలపంతా మైదానాలకు చేరడం ప్రారంభమైంది. అడవి అంతా సర్వనాశనమైంది. ఈ విధంగా అడవులు దోపిడీకి ఆటపట్టుగా మారాయి. ఎన్నో సంప్రదాయ పద్ధతుల్లో గిరిజనులు అడవులను అభివృద్ధి చేసుకునే పద్ధతులు అంతరించాయి. బి.డి.వర్మగారు ఈ విషయం గమనించి ప్రభుత్వానికి విన్నవించారు. అయినా అది అంతంత మాత్రమే అనాలి. ఖనిజాలను కొల్లగొట్టడం వల్ల అటవీ స్వరూపమే అంతరిస్తున్నది.

ఇక భూ పోరాట సమస్యవల్ల గిరిజనుల, గిరిజనే తరుల మధ్య పోరాటం రాసుకుంది. ఇది మరే కుంపటిని రాజేస్తుందో చూడాలి. విద్యవల్ల అక్షర జ్ఞానం అంతంత మాత్రమైనా అవగాహన పెంచుకోలేనితనం కొన్ని సమస్య లకు కారణమైంది.

కోయలలో పితృస్వామిక సామాజిక వ్యవస్థ ఉంది. తండ్రే కుటుంబ యజమాని. గ్రామ స్థాయిలో జరిగే కార్యక్రమాలలో గ్రామంలోని ప్రజలు సమిష్టిగా ఉంటారు. వీరిలో ఐకమత్యం ఎక్కువగా వుంటుంది. మనం అనే భావన ఎక్కువ.

**వివాహం :**

కోయలలో సామాన్యంగా మేనత్త, మేనమామ పిల్లల మధ్య వివాహాలు జరుగుతాయి. కాని ఎక్కువగా పెద్దలు కుదిర్చిన పెళ్ళిళ్ళు జరుగుతాయి. వీరిలో పెద్దలు కుదిర్చిన పెళ్ళిళ్ళు, లేచిపోయి వివాహం చేసుకోవడం, సేవచేసి వివాహం చేసుకోవడం, ప్రేమించి పెళ్ళి చేసు కోవడం, ఒకరినొకరు ఇష్టపడి పారిపోయి వివాహం చేసుకున్న వారికి పంచాయితీ తప్పుపట్టి విందు చేసుకున్న తరువాత గ్రామపెద్దలు ఆ వివాహాన్ని అంగీకరిస్తారు. పెద్దలు కుదిర్చిన వివాహాలతో పెండ్లి కుమారుడి తండ్రి 'ఓలి' (కట్నం) కట్టాలి. ఎంత ఓలి అనేది ఇరు కుటుం బాల వారు నిర్ణయించుకుంటారు. భార్యభర్తలకు సరిపడకపోతే విడాకులు తీసుకునే పద్ధతి కూడా ఉంది. విడాకులను కుల పంచాయితి మంజూరు చేస్తుంది. విడాకుల తరువాత పిల్లలు తండ్రివద్ద లేదా తాత, నానమ్మల వద్ద ఉంటారు.

**జనాభా :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లంబాడీల తరువాత అత్యధిక జనాభా కలిగిన గిరిజన తెగకోయతెగ. 2011 జనాభా లెక్కల ప్రకారం వీరి జనాభా 3,81,354 మందిగా ఉంది.

కోయల జన్మస్థలం చత్తీష్‌ఘడ్ రాష్ట్రంలోని బస్తర్, సుక్మా, కుంట ప్రాంతాలని చెప్పవచ్చు. వారు ఈ ప్రాంతాల నుండి వివిధ ప్రాంతాలకు వలస వెళ్ళి కొండలు, నదీపరివాహక ప్రాంతాలలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్యంగా వీరు శబరి, గోదావరి, సీతరు వంటి నదుల పరివాహక ప్రాంతాలలో విస్తరించి ఉన్నారు.

**భాష :**

కోయలకు ప్రత్యేక భాష ఉంది. వీరి భాషను కోయభాష లేదా గోండు కోయభాష అంటారు. వీరి భాషకు, గోండూల భాషకు దగ్గరి పోలికలున్నాయి. ఈ కోయభాషపై స్థానిక భాషల ప్రభావం ఉంది. మైదాన ప్రాంత కోయలు వారి భాషను వదిలి తెలుగు భాషను వాడుతున్నారు.

''కొన్ని కుటుంబాలు లేదా కొన్ని కుటుంబ సముదాయాల మధ్య సమైక్యత వుండి, ఒకే పేరుతో వ్యవహరింపబడుతున్న వారందరూ ఒక ప్రత్యేకత ప్రదేశంలో నివశిస్తూ, ఒకే భాష మాట్లాడుతూ ఒకే రకమైన వైవాహిక నియమాల్ని పాటిస్తూ, ఒకే రకమైన ఆహార విధానాన్ని అవలంభిస్తూ పరస్పర సహకార భావం కలిగి వుండి వారిమధ్య పరస్పర అనుబంధముండే సమూహాన్ని తెగ అంటారు''- ముజుందార్.

''ఒక తెగవారు ఒక ఖచ్చితమైన ప్రదేశం కలిగి, ఒక మాండలికాన్ని మాట్లాడుతూ, సజాతీయంగా, సాంస్కృతికంగా ఐక్యపరిచే సాంఘిక వ్యవస్థను కలిగి అట్లే ఉప తెగలతో పూరీకుల ఆరాధనలతో ప్రత్యేక మత సంస్కృతి కలిగి వుంటారు.''- కమలాదేవి చటోపాధ్యాయ.

కొన్ని క్లాన్‌లలో కూడిన ఒక తెగ ప్రతిక్లాన్‌లోని సభ్యుల మధ్య బంధుత్వపు సంబంధాలు వుంటాయి. ఈ సభ్యులు సాధారణంగా ఒకే టోటెమ్‌కు సంబంధించి వుంటారు. ఒకే నిర్ణిత ప్రాంతంలో నివసిస్తూ వుంటారు. ప్రతి తెగకు పరిమితమైన రాజకీయ వ్యవస్థ వుంటుంది. ఈ వ్యవస్థకు సంబంధించి అనువంశికంగా వచ్చే ముఖ్యుడు ఒకడు వుంటాడు. ఈ సమూహపు సామాజిక నియంత్రణ అతని చేతులలో వుంటుంది.

**ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన సముదాయాలు :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 35 అనుచిత గిరిజన సముదాయాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో నివసించే గిరిజన సముదాయాలను ఎక్కువగా తూర్పుకనుమలు, నల్లమలకొండ లోయలు, అటవీ ప్రాంతాలు నివాస స్థాయిగా వున్నాయి. ఈ సముదాయాలు ఉమ్మడి అదిలాబాద్, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, వరంగల్ ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో చెప్పదగిన సంఖ్యలో ఉన్నారు. ఈ జిల్లాలలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, చతీష్‌ఘడ్, తెలంగాణ రాష్ట్ర సరిహద్దులలో ఉన్న ప్రాంతాలలో గిరిజనుల జనాభా ఎక్కువగా వుంది. ఈ జిల్లాల్లోనే కాకుండా రాష్ట్రం మధ్యలో వున్న ఉమ్మడి మహబూబ్ నగర్, కర్నూలు జిల్లాలలో కూడా గిరిజనుల నివాస స్థానాలు ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్న గిరిజనుల సంస్కృతి జీవన విధానం ప్రత్యేకమైనవి. ముఖ్యంగా ద్రావిడ, ఇండో ఆర్యన్, ముండారి, తెలుగు భాషా కుటుంబాలకు చెందిన గిరిజనులు ఇక్కడ నివసిస్తున్నారు.

**1. అంధ్ :**

అంధ్‌లు మరాఠి, తెలుగు భాషలు మాట్లాడతారు. వీరు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నివసిస్తున్నారు. ప్రధాన వృత్తి వ్యవసాయం. వీరు మహారాష్ట్ర నుండి వలస వచ్చినట్లుగా రస్సెల్ మరియు హీరాలాల్ వంటి పరిశోధకులు నిరూపించారు. విడాకులు తీసుకోవడం, వితంతు వివాహాలను, పునర్వివాహాలను అనుమతిస్తారు. స్త్రీలు కూడా వ్యవసాయంలో పాలుపంచుకుంటారు. మహాదేవుడు, ఖండోబా వంటి దేవతలను పూజిస్తారు. అకాడి పండుగ, గుడి పండుగ, నాగపంచమి వంటి పండుగలు జరుపుకుంటారు.

**2. చెంచు :**

వీరు కర్నూలు, మహబూబ్‌నగర్, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో విస్తరించి ఉన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్నారు. వెన్నెలకంటి రాఘవయ్య వంటి పరి శోధకులు చెంచులను గురించి వ్యాఖ్యానిస్తూ కొండల నుండి, అడవుల నుండి కిందికి దిగిన చెంచులే యానాదు లుగా మారారని తెలియజేశారు. వీరు తెలుగు భాషను ప్రత్యేక యాసలో పాల్కురికి సోమనాథుని రచనలలో వీరి ప్రస్తావన కనిపిస్తుంది. వీరి ప్రధాన దేవుడు చెంచు మల్లన్నే కాకుండా గారెల మైసమ్మ, భగవంతులు లింగమయ్య, పోశమ్మ, పోతురాజు, ఎల్లమ్మ వంటి దేవతలను పూజిస్తారు. అడవి నుండి బంక, ఇప్పపూలు, గింజలు మొదలైనవి సేకరించి అమ్ముకొని జీవిస్తారు.

**3. గదబ :**

గదబలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో కనిపిస్తారు. తెలుగు, గదబ భాషలు మాట్లాడు తారు. వీరిలో బోడో, గుటోబో, కతేరి, కొల్లోయి మొదలైన ఉపతెగలు ఉన్నాయి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ తక్కువ. వ్యవసాయం, పోడు వ్యవసాయం చేసి రాగి, సజ్జలు, ఎర్రజొన్నలు మొదలైన పంటలు పండిస్తారు. సంకుదేవుడు, పెద్దదేవుడు మోద కొండమ్మ, జకిరి దేవత, ఇప్పపోలమ్మ మొదలైన దేవతలను పూజిస్తూ జాతరలు ఘనంగా చేస్తారు. ఈటెల పండుగ, ఆషాడ పండుగ, కొత్త అమాస, మరిడమ్మ మొదలైన పండుగలను జరుపుకుంటారు.

**4. గౌడు :**

వీరు సంచార జీవితాన్ని గడుపుతారు. శ్రీకాకుళం, విజయనగం, విశాఖపట్నం జిల్లాల్లో నివసిస్తున్నారు. వీరు తెలుగు, ఒరియా భాషలు మాట్లాడతారు. గౌడులలో గోపిగౌడు, అపోర్టుగౌడు, చిట్టిగౌడు, సెల్లకొండియాగౌడు తదితర ఉపతెగలు ఉన్నాయి. పోడు వ్యవసాయం ప్రధానవృత్తిగా వుంది.

వీరు పులిని 'బారాడిని' దేవతగా పూజిస్తారు. వీరు సంకుదేవత, నిశానిదేవత, సోరుమంగళ, జకర దేవత, నంది దేవత, టకురాణి దేవత మొదలైన దేవతలను పూజిస్తారు.

**5. కొండరెడ్డి :**

వీరు గోదావరి, ఖమ్మం జిల్లాలలో ఎక్కువగా ఉన్నారు. పోడు వ్యవసాయం చేసి జొన్నలు, రాగి, ఎర్ర జొన్నలు, చిక్కుళ్ళు, వరి పంటలు పండిస్తారు. వీరు ఏటవాలుగా కొండలు ఉన్న ప్రదేశంలో ఇళ్ళు కట్టు కుంటారు. ఇండ్లు ఒకే వరుసలో పది, పదిహేను కంటే ఎక్కువ ఉండవు. వీరు ముత్యాలమ్మ దేవత, భూమి దేవత, గంగమ్మదేవతలను పూజిస్తారు. మామిడి కొత్త పండుగ, భూదేవి పండుగ, గంగమ్మ దేవత పండుగ, వానదేవుడి పండుగలను జరుపుకుంటారు. వీరికి ప్రతీ గ్రామంలో కుల పంచాయితీలు ఉంటాయి. పెద్దకాపు అని పిలవబడే సాంప్రదాయక కుల పెద్దఉంటాడు. కులపెద్ద పూజారిగా కూడా వ్యవహరిస్తాడు. వ్యభిచారం, దొంగతనం, విడాకులు, నిషిద్ధభోజనాలు మొదలైన విషయాల్లో వ్యక్తులు అతిక్రమణ చేసినపుడు జోక్యం చేసుకొని వెంటనే శిక్షిస్తారు. కుల పంచాయితీ తీర్పును అందరూ అంగీకరిస్తారు.

**కళలు - నృత్యాలు :**

కోయలలో ఆట పాటలు, నృత్యాలు ఎక్కువగా ఉంటాయి. గ్రామాలలో జరిగే ప్రతి శుభకార్యంలో కోయలు ఆట పాటలతో పాటుగా నృత్యాలు చేస్తారు. కోయలు అనగానే గుర్తుకు వచ్చే అతి ముఖ్యమైన నృత్యం 'కొమ్ము కోయ నృత్యం' మరియే 'రేలనృత్యం', 'కుర్రె నృత్యాలను' కూడా ప్రత్యేక సందర్భాలలో ప్రదర్శిస్తుం టాయి.

**గోత్రాలు :**

కోయల గోత్రాలను గట్లు అంటారు. వీరిలో మూడవ, ఐదవ, ఆరవ, ఏడవ గట్టు అనేకగట్టు గోత్రాలు ఉన్నాయి. వీరి గోత్రాల వారిగా వివాహసంబంధాలను, బంధుత్వా లకు, వేల్పులను పూజించే విధానంలోను, ఈ గోత్రాలు ముఖ్యపాత్ర వహిస్తాయి.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. కోయతెగ - సంస్కృతి, గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణా సంస్థ (సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ), భద్రాచలం.
2. తెలుగు కథా సాహిత్యం - గిరిజన జీవితం, ద్రావిడ విశ్వవిద్యాలయం, డాక్టర్ జి.శైలమ్మ
3. సంచార స్రవంతి - డాక్టర్ వి.ఎన్.వి.కె.శాస్త్రి
4. పగటి వేష కళాకారులు సాంస్కృతక జీవనం, 2010, రమేష్‌భట్టు, తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్లు.
5. కొండరెడ్డి గిరిజనుల జీవన విధానం, 2010, రమేష్‌భట్టు, తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్లు.

❖❖❖

# మధ్యమవ్యాయోగము నైతికమూల్యాలు

– డా. పి. శ్రీవల్లి, సంస్కృతోపన్యాసకురాలు, శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, రాజమండ్రి.

## సంక్షిప్త పరిచయం :

సంస్కృతకవులలో అత్యంత ప్రాచీనుడు భాస మహాకవి. ఈయన మొత్తం 13 రూపకాలు రచించెను. రకరకాల ఇది వృత్తాలతో రూపక భేదాలతో ఈయన రచనలు సంస్కృత సరస్వతిని అలంకరించెను. భాసోహాసః అని ప్రసిద్ధి  భాసుడు సరస్వతీదేవి యొక్క హాసము వంటి వాడు అని అర్థం. భాసుడు మహాభారతాన్ని ఆధారంగా చేసుకుని ఆరు రూపకాలు రచించెను. అందులో మధ్యమవ్యాయోగము ప్రసిద్ధ నాటకం. హిడింబ కథను ఆధారంగా చేసుకుని రచించిన రూపకం ఇది. ఇందు భాసుడు రచించిన కథ హృద్యముగా నుండుటయే గాక రచనా సంవిధానము, పాత్రల సంభాషణలు, నైతిక మూల్యాలు అందరికీ అనుసరణీయములు.

**ముఖ్యాంశాలు :**

1. పరిపుష్టం
2. ఇతివృత్తం
3. ధీరోదాత్తుడు
4. ఆర్తత్రాణపరాయణత్వం
5. మహాపాతకం

సంస్కృత సాహిత్యం ఎంతో ప్రాచీనమైనది మరియు విస్తృతమైనది. ఎందరో కవి పండితులు ఈ భాషా సాహిత్యాలను తమ కవిత్వం ద్వారా పరిపుష్టం చేశారు, సాహిత్యంలో కావ్యాలది ప్రత్యేక స్థానం. ఈ కావ్యాలు శ్రవ్యకావ్యాలు, దృశ్య కావ్యాలు అని రెండు రకాలు. దృశ్య కావ్యాలనే రూపకాలు అంటారు. నటుడు రంగస్థలంపై అభినయించగా సహృదయులు చూసి ఆనందించేది కాబట్టి వీటికి దృశ్య కావ్యాలు అని పేరు ఆరోపాత్ రూపకం. ఆయా పాత్రల రూపురేఖలు గుణగణాలు తమ యందు ఆరోపించుకుని నటులు ప్రదర్శిస్తారు కాబట్టి రూపకం అని కూడా అంటారు దృశ్య కావ్యాన్ని.

## కవి పరిచయం :

సంస్కృత రూపక కర్తలలో అత్యంత ప్రాచీనుడు భాసుడు. ఈయన కాలం క్రీస్తుశకం ఒకటవ శతాబ్ది అని చరిత్రకారులు నిర్ణయించారు. సంస్కృత రూపక కర్తలలో ఎక్కువ రూపకాలు రచించిన వాడు భాసుడే. ఈయన మొత్తం 13 రూపకాలు రచించాడు. ఇతివృత్త భేదాన్ని బట్టి వాటిని ఐదు రకాలుగా విభజింపవచ్చును. అందులో మహాభారత కథాశ్రితాలు 6 రూపకాలు ఉన్నాయి అవి మధ్యమ వ్యాయోగం పంచరాత్రం, దూత వాక్యం , ఊరుభంగం,దూతఘటోత్కచం కర్ణభారం. ఈ మహాకవి రూపకాలు వైవిధ్య భరితములై రంగస్థలంపై ప్రదర్శించడానికి యోగ్యముగా సహృదయ హృదయాహ్లాదములై వెలుగుందుచున్నవి. భాసునిరూపకాలలో పాత్రల సంభాషణలు దీర్ఘముగా ఉండవు. అనవసర వర్ణనలు ఉండవు. అల్ప పదములలో అనల్పార్థాన్ని ప్రతిపాదిస్తాయి.

## నాటక లక్షణాలు :

మధ్యమవ్యాయోగము  అను రూపకము దశవిధ రూపకములలో నాటకము అను విభాగమునకు చెందినది. నాటకములో నాయకుడు ఆదర్శ గుణములతో కూడినవాడు ధీరోదాత్తుడు, శౌర్యవంతుడు, కీర్తి కాముడు,మహోత్సాహి, వేదత్రయ రక్షకుడైన రాజు సుప్రసిద్ధ వంశస్థుడు లేదా దివ్యలోకమునకు చెందినవాడు అయి ఉండవలెను. ఇందు ఇతివృత్తము ప్రఖ్యాతము ఆధికారికము అయి ఉండవలెను. వీర శృంగారరసములలో ఒకటి ప్రధాన రసంగా మిగిలినవి దానికి అంగరసములుగా ఉండవలెను. నాటకము 5 అంకముల [13/02, 11:58] prabhalasv : కంటే తక్కువ ఉండకూడదు 10 అంకములకంటే పెద్దదిగా ఉండకూడదు.

## పాత్రలు :

భాసమహాకవి రచించిన మధ్యమ వ్యాయోగము అను నాటకం మహాభారతంలో ఆదిపర్వమందున్న హిడంబ కథను ఆధారంగా చేసుకుని రచించబడినది. ఈ నాటకంలో వృద్ధ కేశవదాసు అను పేరుగల బ్రాహ్మణుడు అతని వృద్ధభార్య,ముగ్గురు కుమారులు ,భీముడు, భీముని భార్య హిడింబ అను రాక్షసి, వారి కుమారుడు ఘటోత్కచుడు అను పాత్రలు ఉన్నాయి ఇది వీర రస ప్రధానమైన నాటకం. భయానక రౌద్ర బీభత్స కరుణ అద్భుత రసాల సమావేశం వ్యాయోగ గుణమును అనుసరించి వర్ణించాడు బాసుడు. కుంతీసుత మధ్యముడైన భీముడు బ్రాహ్మణ కుమారుని రక్షించుట వలన దీనికి మధ్యమ వ్యాయోగమని సార్థక నామము.

## నాటక కథాసారం :

కేశవ దాసు అను పేరు గలిగిన బ్రాహ్మణుడు తన ముగ్గురు కుమారులు భార్యతో కలిసి తన బంధువు అయినా యజ్ఞ బంధువు అనువాని పుత్రుని ఉపనయన కార్యానికి అరణ్యమార్గంలో ప్రయాణ మయ్యేను. ఘటోత్కచుడు తన తల్లి హిడింబకు ఉపవాసం అనంతరం బలికి మానవుని తీసుకొని వచ్చుటకు పంపబడును. మానవుని కోసం ఎదురుచూస్తున్న ఘటోత్కచుడు కేశవ దాసును అనుసరించెను. కేశవ దాసు కుటుంబంలోని మధ్యమ పుత్రుడు హిడుంబకు ఆహారంగా తనను అర్పించుకొనుటకు సిద్ధమై చివరిగా జలాశయం నందు జలంతాగి వచ్చుటకు అనుమతి పొంది వెళ్లి తిరిగి వచ్చుటకు కొంత ఆలస్యం చేయును. ఇంతలో ఘటోత్కచుడు తన తల్లి ఆహార సమయానికి ఆలస్యం అవుతున్నందువలన కేశవదాసు మధ్యమ పుత్రుని ఉద్దేశించి మధ్యమా తొందరగా రమ్ము అని పిలచెను అదే వనములో వ్యాయామ కార్యమగ్నుడైన కుంతీపుత్రులైన పాండవులలో మధ్యముడైన భీముడు తనను ఎవరో పిలుచుచున్నారని ఆశబ్దమును అనుసరించి ఘటోత్కచుని సమీపించి విషయమును తెలుసుకొని కేశవదాసుకు అభయం ఇచ్చెను ఘటోత్కచునితో నేనే నీ తల్లికి ఆహారమవుదునని ఘటోత్కచుని అనుసరించి అరణ్యంలో ఉన్న హిడింబగృహానికి వెళ్లెను.

అప్పుడు భీముని భార్య అయిన హిడింబ భర్త అయిన భీముని చూసి ఘటోత్కచుని ఉద్దేశించి ఈయన భీమసేనుడు, నీ తండ్రి అని తల్లిదండ్రులు దైవంతో సమానమని చెప్పెను. ఘటోత్కచుడు ఈ పుత్రుని అపరాధమును మన్నించమని తండ్రికి నమస్కరించును. భీముడు కేశవదాసు కుటుంబమును రక్షించి సాగనంపెను. ఇలా భీమ హిడింబ ఘటోత్కచుల సమాగమం అయినది .ఇలా భీమునికి భార్యాపుత్రుల సమావేశం వలన ఈ రూపకం సుఖాంతమైనది

## రూపక సందేశం :

ఈ రూపకంలో కేశవదాసు అతని భార్య అయిన వృద్ధ దంపతుల యొక్క వారి పుత్రుల యొక్క ప్రేమానురాగాలు, కేశవ దాసు పుత్రుల పితృభక్తి, భీముని ఆర్తత్రాణ పరాయణత్వం, భీముని పుత్ర ప్రేమ, హిడింబ యొక్క పతిభక్తి ముఖ్యంగా ఘటోత్కచుని మాతృభక్తి మొదలైన గుణములు అందరికీ ఆదర్శవంతములు అనుసరణీయములు .

## నైతిక విలువలు విశ్లేషణ :

ద్విజోత్తమాః పూజ్యతమాః పృథివ్యాం ఈ వాక్యం కేశవదాసుని అనుసరించి వెళ్తున్న ఘటోత్కచుడు అనుకుంటున్నప్పటివి.భూమియందు బ్రాహ్మణోత్తములు పూజింపదగిన వారు అని తెలుసు ,కానీ తల్లి ఆజ్ఞ వలన ఇప్పుడు వీరిలో ఒకరిని ఆహారంగా తీసుకు వెళ్ళవలయునని ఘటోత్కచుని భావన.ఇక్కడ ఘటోత్కచుని మాతృభక్తి వ్యక్తం అవుతున్నది మాతురాజ్ఞాం

పురస్కృత్య వయమేతాం దశాం గతః అని తన తల్లి ఆజ్ఞను అనుసరించి అకార్యమైనను చేయవలసి వచ్చింది అని అనుకుంటాడు. మాతాకిలమనుష్యాణాం దైవతానాం చ దైవతం ఘటోత్కచుడు తన తల్లి మాటను పాలిస్తున్నాడని తెలిసిన భీముడు మనుషులకు దేవతలకు కూడా

తల్లి దైవమని ఈ ఘటోత్కచుని మాతృభక్తిని ప్రశంసిస్తాడు. మాతృదేవోభవ అనే వేదవాక్యం ఘటోత్కచునకు పరమ ప్రమాణం.

కేశవ దాసు ప్రాణత్యాగానికి సిద్ధపడగా అతని భార్య భర్తను వదులుకోలేనని తన ప్రాణాలను ఇస్తానని చెప్తూ ప్రతిమాత్ర ధర్మిణీ పతివ్రతేతి నామ అంటుంది పతివ్రత అనగా పతిని సేవించుటే ధర్మముగా కలది కావున నేను ప్రాణ త్యాగానికి సిద్ధం అంటుంది. ఇక్కడ కేశవదాసు భార్య యొక్క పతివ్రతా ధర్మం కీర్తించదగ్గది. ఆ సమయంలో ఘటోత్కచుడు నా తల్లి స్త్రీని బలికి తీసుకురావలదని చెప్పినదంటాడు. స్త్రీ హత్య మహా పాతకమని ధర్మ సిద్ధాంతము. రాక్షస స్త్రీ అయినా హిడింబ ఈ ధర్మాన్ని పాటించింది. కేశవదాసు ముగ్గురు కుమారులలో ప్రథముడు ప్రాణత్యాగానికి సిద్ధమవగా మధ్యముడైన ద్వితీయుడు అడ్డుకొని జేష్ఠః శ్రేష్ఠః కులేలోకే పితౄణాం చ సుసంప్రియః అని అంటాడు. లోకంలోనూ కులం లోనూ జేష్ఠపుత్రుడు శ్రేష్ఠుడు తండ్రికి మిక్కిలి ఇష్టుడు కావున అన్నగారి బదులు మధ్యముడు ప్రాణత్యాగం చేయడానికి సిద్ధపడతాడు. నాటకాంతమందు ఘటోత్కచుడు భీమునికి నమస్కరించి తన అపరాధమును క్షమించమని వేడుకుంటాడు, పుత్రచాపలం క్షంతుమర్హసి అని. దానికి భీముడు పుత్రాపేక్షిణి ఖలు పితృ హృదయాని తండ్రుల హృదయాలు పుత్రుల యందు మక్కువ కలిగినవి అని అంటాడు. ఈసంఘటన ద్వారా ఘటోత్కచుని పితృభక్తి, భీముని పుత్రవాత్సల్యం వ్యక్తమగుచున్నాయి.

## ముగింపు :

ఈ విధంగా ఈ రూపకంలో కేశవదాసు భార్య యొక్క పతిభక్తి, కేశవ దాసు పుత్రుల యొక్క పితృభక్తి, ఘటోత్కచుని మాతృభక్తి పితృభక్తి ,భీముని క్షత్రియధర్మ పరిపాలన, ఘటోత్కచుని ఉదార స్వభావం హిడింబ పతిభక్తి, సముదాచారం మొదలైన నైతిక గుణాలు అందరికీ ఆదర్శవంతములు అనుసరణ యోగ్యములు.

## ఆధారగ్రంథాలు -గ్రంథకర్తలు :

1. మధ్యమవ్యాయోగం - భాసుడు
2. మహాభారతం - వేదవ్యాసుడు
3. కావ్యప్రకాశ - మమ్మటుడు

❖❖❖

# జాతీయోద్యమ నవలల్లో స్త్రీ పాత్ర చిత్రణ

– డా॥. కడివెండి మమత, సహాయ ఆచార్యులు, బద్రుకా వాణిజ్య మరియు కళల కళాశాల, హైదరాబాద్.

‘‘నవల ఒక నూతన కళారూపం. పునర్జాగృతితో ప్రారంభమైన ఆధునిక నాగరికతకు పూర్వమే నవల ఏదో ఒక బీజరూపంలో ఉండేది. ప్రతి కళారూపం లాగానే ఇది కూడా మానవ చైతన్యాన్ని విస్తరించడం, ప్రగాఢం చేయడం అనే ఉద్దేశాన్ని నెరవేర్చింది’’ అని రాల్ఫ్ పాక్స్ (దేవకీదేవి, తిరునగరి. పుట.93) నవల గురించి అన్నారు. సామాన్య మానవుల వాస్తవ జీవితాన్ని, సమాజ జీవితాన్ని చిత్రించడం వల్ల నవల పుట్టిందని చెప్పవచ్చు. పాశ్చాత్య సాహిత్యం ప్రభావం వల్ల నవల ప్రక్రియ తెలుగులో ప్రవేశించింది. ఈ నవల ప్రక్రియ సమాజ పరిస్థితులను, పరిణామాలను, మానవుని ఔనత్యాన్ని చిత్రిస్తుందని తెలుస్తుంది. నవల ప్రక్రియ విస్తృతమైంది. జీవితాన్ని కొంత విపులంగా, విశ్వసనీయంగా తెలియజేయడానికి ఈ నవల ప్రక్రియ దోహదపడుతుంది.

భారతదేశంలో బ్రిటీష్ ప్రభుత్వం స్థిరపడడం వల్ల కుటీర పరిశ్రమలు మూతపడటమే కాకుండా వాణిజ్య పంటలన్నీ ప్రాధాన్యం కోల్పోయి సన్నకారు రైతులు అప్పులపాలై పట్టణాలకు వలసవెళ్లారు. ఆంగ్ల విద్య భారతీయులలో భావచైతన్యాన్ని కలిగించడమే కాకుండా, అప్పటి పత్రికలు, గ్రంథాలు మొదలైనవన్నీ భారతీయుల ఆలోచనలకు పదును పెట్టాయి. దేశంలోవున్న ఈ పరిస్థితులు సంస్కరణోద్యమానికి, జాతీయైద్యమానికి దారితీశాయి. జాతీయోద్యమంలో కేవలం పురుషులు మాత్రమేగాక స్త్రీలు కూడా పాలుపంచుకున్నారు. స్త్రీలు తమవంతు బాధ్యతను నెరవేర్చారని చెప్పవచ్చు. జాతీయోద్యమ సమయంలో వచ్చిన నవలల్లో స్త్రీ పాత్రలు, వారి చైతన్యం చిత్రించబడ్డాయి. జాతీయోద్యమ కాలంలో వచ్చిన రథచక్రాలు, కొల్లాయి గట్టితేనేమి, అతడు-ఆమె నవలల్లో చిత్రించబడిన స్త్రీ పాత్రలను, స్త్రీ చైతన్యాన్ని పరిశీలించడం ఈ పత్ర ఉద్దేశం.

జాతీయోద్యమ నవలల్లో వేలూరి శివరామశాస్త్రి రాసిన ‘ఓబయ్య’ మొదటి నవల. ఈ నవల గాంధీ నాయకత్వంలో సాగిన ఉద్యమాన్ని తెలియజేస్తుంది. తర్వాత ఉన్నవ లక్ష్మీనారాయణ రాసిన ‘మాలపల్లి’ నవల జాతీయోద్యమంతో పాటు రైతుకూలీ ఉద్యమాన్ని చిత్రిస్తుంది. విశ్వనాథ సత్యనారాయణ రాసిన ‘వేయి పడగలు’ నవల అడుగంటిపోతున్న సనాతన విలువలను పునరుద్ధరించి జాతిని పరిరక్షించాలనే తపనతోపాటు, తాత్త్విక చింతనతో జాతీయోద్యమ నేపథ్యం చిత్రిస్తుంది. బుచ్చిబాబు రాసిన ‘చివరకు మిగిలేది’ నవల మామగారి ప్రోత్సాహానికి క్షణిక ఆవేశం తోడుకాగా కథానాయకుడు జాతీయోద్యమంలో పాల్గొన్నతీరు, దాని పర్యవసానం, ఆంధ్రదేశంలోని విభిన్న ప్రాంతాలమధ్య అభిప్రాయ భేదాలు మొదలైన అంశాలను తెలియజేస్తుంది. మహీధర రామమోహనరావు రాసిన ‘రథచక్రాలు’ నవల కమ్యూనిస్టు ఉద్యమంతోపాటు జాతీయాద్యమాన్ని చిత్రించగా, ఈయనే రాసిన ‘కొల్లాయి గట్టితేనేమి’ నవల జాతీయోద్యమంలో అంతర్భాగమైన సహాయ నిరాకర ణోద్యమాన్ని తెలియజేస్తుంది. నవలకు ఉత్తర ప్రత్యుత్తర రూపాన్ని ఇస్తూ స్త్రీ చైతన్యాన్ని కేంద్రంగా ఉప్పల లక్ష్మణ రావు రాసిన నవల ‘అతడు-ఆమె’. అంతేగాక చారిత్రక నేపథ్యాని తెలియజేస్తూ, వర్తమాన బాధ్యతలను తెలియ జేసే క్రమంలో అడవిబాపిరాజు, నోరి, చిలకమర్తి మొదలైనవారు ఎందరో చారిత్రక నవలలు రాశారు. బెంగాల్లో జాతీయోద్యమ నేపథ్యంలో ‘ప్రపుల్లముఖి, ఆనందమఠం, కపాలకుండలి’ అనే నవలలు వచ్చాయి. ఇలా అనేక జాతీయోద్యమ నవలలు వచ్చినప్పటికీ ఉద్యమకాలంలో రాయబడిన రథచక్రాలు, కొల్లాయి గట్టితేనేమి, అతడు-ఆమె నవలల్లోని స్త్రీ పాత్రలనూ, స్త్రీ చైతన్యాన్ని ఇలా తెలియజేస్తున్నాను.

**రథచక్రాలు - మహీధర రామమోహనరావు :**

ముంగండ అగ్రహారంలో ఉన్న ఒక మాలపల్లెను దివానాఖాన్ ఖాళీ చేయించాలనుకుంటాడు. కానీ ఆ పల్లెవాసుల ప్రతిఘటన వల్ల ఆ మాలపల్లె తగలబడి పోతుంది. ఆ పల్లెవాసులకు ఆశ్రయం కల్పిస్తున్నప్పుడు కమ్యూనిస్టు భావాలుగల మరియమ్మతో సత్యానందంకు చర్చ జరుగుతుంది. ఆ చర్చ కారణంగా కమ్యూనిస్టు పార్టీపై సత్యానందంకు ఉన్న దురభిప్రాయం తొలగి పోతుంది. దివాన్ కొడుకు విశ్వపతి రాజకీయాలలో పాల్గొని జైలుకు వెళ్లిన కారణంగా అతను ప్రేమించిన బద్రి వివాహం సత్యానందంతో జరిగిపోతుంది. విశ్వపతి మాలపల్లె ప్రజల తరపున పనిచేస్తున్నందుకు కక్ష గట్టి పద్మనాభం అతనిపై హత్యాయత్నం చేయిస్తాడు. సంప్ర దాయపు కట్టుబాట్లు నరనరాల్లో జీర్ణించుకుపోయిన వితంతు స్త్రీ జానకి. ఊళ్ళో జరిగిన ఉద్యమాల ప్రభావంతో అభ్యుదయ భావాలను సంతరించుకున్న జానకి విశ్వపతితో వివాహానికి అంగీకరిస్తుంది. ఈ అంశాలను ప్రధానంగా తీసుకొని మహీధర రామమోహన రావు ఈ నవలను రాశారు.

## స్త్రీ చైతన్యం :

రథచక్రాలు నవలలో మనకు ప్రధానంగా కనిపిస్తున్న స్త్రీలు మరియమ్మ, జానకి, బద్రిలు. విభిన్నమైన వ్యక్తిత్వం కలిగిన ఈ ముగ్గురు స్త్రీల చైతన్యం కూడా విభిన్నంగానే కనిపిస్తుంది.

**మరియమ్మ :**

ఈ నవలలోని అన్ని స్త్రీ పాత్రలకంటే ప్రధానమైన స్త్రీపాత్ర మరియమ్మ. ఈమె పాత్ర ద్వారా రచయిత కాంగ్రెస్వాదైన సత్యానందంతో చర్చకు పెట్టి, దానిద్వారా కమ్యూనిస్టు పార్టీ ఆశయాలను, సిద్ధాంతాలను తెలియ జేస్తూ ప్రజలలో రావాల్సిన చైతన్యాన్నీ, ప్రజలకు ఎలాంటి సమాజం అవసరమో, దానికై ఎలా ఉద్యమించాలో తెలియజేశారు. మరియమ్మ సమాజంలో ధనిక, పేద అనే రెండేవర్గాలనీ, ఆ వర్గాలు అన్ని కులాల్లోను ఉంటాయని విశ్లేషించి చెప్తుంది. 'ఒకే మనిషి రెండు వేర్వేరు తరగతుల వాళ్ళకు న్యాయం చేయలేడని, జమీందారుకు లాభమయ్యేది రైతుకు నష్టం. అలాగే రైతుకు లాభిస్తే జమీందారు నష్టపడతాడు. కాబట్టి ఇద్దరికి న్యాయం చెయ్యడం సాధ్యంకాదు' అని వర్గస్వభావాన్ని అర్థం చేసుకున్న స్త్రీగా మరియమ్మ మాట్లాడుతుంది. కేవలం సామాజిక ఆర్థిక అవగాహన వున్న స్త్రీగానేకాక మరియమ్మ స్త్రీల వ్యక్తిత్వం, ప్రేమ-పెళ్ళిళ్ళు, ఆర్థిక స్వేచ్ఛ మొదలైన అంశాలను సంపూర్ణంగా అవగాహన కలిగిన, పార్టీ చైతన్యం కలిగిన స్త్రీగా ఈ నవలలో రచయిత చిత్రించారు.

**జానకి :**

సంప్రదాయ కుటుంబంలో పుట్టి ఆచారాలకు, కట్టుబాట్లకు అలవాటుపడినా ఆనాటి పరిస్థితులు జానకిలో గొప్ప మార్పును తీసుకొచ్చాయి. అందువల్లే ఆమె బ్రహ్మణ స్త్రీ అనే భావమే లేకుండా మాలపల్లె ప్రజలకు తిండిపెట్టడంలో, బట్టలు సమకూర్చడంలో తోడ్పడు తుంది. 'బ్రాహ్మణేతరుల కుటుంబాల్లో భోజనం చేసే అలవాటు లేకపోయినా ఆ భోజనం తనకు సరిపడక పోయినా సమయానికి భోజనం పెట్టే వారిని గౌరవించాలి' అనే మార్పును ఆమెకు పరిస్థితులే కల్గించాయి. ఈ విధంగా జానకి ఒక సామాజిక సేవా దృక్పథంతో, సంస్క రణ దృష్టితో, ఉద్యమ స్ఫూర్తితో ఈ నవలలో కనబడు తుంది.

**బద్రి :**

బద్రి సామాజిక అవగాహవ కల్గిన స్త్రీ. అందుకే వింతంతువైన జానకిని పునర్వివాహం చేసుకోమని ప్రోత్సహిస్తుంది. ఖాళీ సమయంలో చదువురాని వారికి చదువు చెప్పిస్తుంది. గతంలో ప్రేమ విఫలమైనా జీవిత భాగస్వామిగా వచ్చిన సత్యానందంను గౌరవిస్తుంది. తన భర్త చేస్తున్న కార్యక్రమాలకు సహకరిస్తుంది.

**కాపు స్త్రీ :**

ఈ నవలలో చైతన్యవంతమైన మరో ముఖ్యపాత్ర కాపుస్త్రీ, ఈమె అగ్రహారానికి చెందిన స్త్రీ. అంతేగాక

కమ్యూనిస్టు పార్టీపట్ల అభిమానం గల స్త్రీ. కార్యకర్తలకు వారి వివరాలు తెలుసుకోకుండానే ఆకలెరిగి అన్నం పెట్టే అన్నపూర్ణ కాపుస్త్రీ. పోలీసుల బారినుండి తప్పించు కున్నప్పుడు కూడా ఆశ్రయం ఇచ్చి కాపాడుతుంది.

**స్వర్ణ :**

ఈ నవలలో మరో స్త్రీ పాత్ర ఆఫీసులోని టైపిస్టు స్వర్ణ. ఆమె చాలా నిక్కచ్చి మనిషి, పార్టీ పనులకూ, పార్టీ కార్యకర్తలకు చాలా ప్రాధాన్యం ఇస్తుంది. పార్టీ అవగాహన కలిగిన సభ్యురాలిగా ప్రవర్తించడం తన బాధ్యతగా భావిస్తుంది.

ఎంతో చైతన్యంతో మరియమ్మ, బద్రి, కాపుస్త్రీ, స్వర్ణలు ప్రవర్తించినా పోరాటంలో భాగంగా తీవ్రపరిణామా లను ఏ స్త్రీ ఎదుర్కోలేదు. మరియమ్మ గ్రామ ప్రజలను చైతన్య పరచిన స్త్రీగా కనిపిస్తుంది. ఈ నవలలో స్త్రీ పాత్రలన్నీ చక్కటి అవగాహన, ఆలోచనలు కలిగినవి.

**కొల్లాయి గట్టితేనేమి-మహీధర రామమోహనరావు:**

మహీధర రామమోహనరావు హరిజనోద్యమం, స్త్రీ విద్య, వ్యక్తి సత్యాగ్రహం, అభ్యుదయ వివాహాలు మొదలైన అంశాలను ప్రాతిపదికగా తీసుకొని కొల్లాయి గట్టితేనేమి నవల రాశారు. ఒక అగ్రహార బ్రాహ్మణ కుటుంబీకుడు జాతీయోద్యమం పట్ల ఆకర్షితుడై అభ్యుదయ భావాలతో ముందుకు సాగడం ఈ నవలలో మరో విశేషం.

ముంగండ అగ్రహారం భూమికగా, రామనాథం కథానాయకుడుగా ఈ నవల సాగుతుంది. రామనాథం కాలేజి చదువుకు స్వస్తి చెప్పి, ఉద్యమాల్లో పాల్గొంటాడు. కన్నతల్లిదండ్రులు లేకపోవడం వల్ల పిన్నతల్లిదండ్రులు రాజమ్మ, శంకర శాస్త్రి పెంచి పెద్ద చేస్తారు. వీరిద్దరూ రామనాథంను ఉద్యమ ప్రభావం నుండి తప్పించాలని రామనాథంను భార్య సుందరి వద్దకు వెళ్ళమని అత్త గారింటికి పంపిస్తారు. ఇతని మామ పోలీసు అధికారి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రామనాథం తన భార్యతో ఉద్యమ ఆలోచనలను పంచుకుంటాడు. అల్లున్ని పరాయివాడిగా భావించి మామ తీవ్రంగా కొడతాడు. తర్వాత అల్లుడని తెలుసుకుని, తప్పు కప్పి పుచ్చడానికి తప్పుడు కేసుపెట్టి రామనాథంను అరెస్టు చేయిస్తాడు. సహాయనిరాకణ ఉద్యమంలో ఉండడంవల్ల న్యాయవాదిని పెట్టుకోడానికి నిరాకరించి రామనాథం జైలుకు వెళ్తాడు.

జైలు నుండి వచ్చిన రామనాథం తండ్రితో ఆస్తి పంపకం చేసుకుని తోటలోకి వెళ్లిపోతాడు. హరిజనులకు చెరువులోని నీళ్ళు తోడిపోసి సాయం చేస్తాడు. కేవలం సాయపడడం వల్ల తన బాధ్యత తీరదని గమనిస్తాడు. తన తోటబావిలోని నీళ్ళను తోడుకునే అవకాశం వారికి కలిగించాలనుకుంటాడు. రాట్నం వడకటం, ఖద్దరు ప్రచారం, అస్పృశ్యత నివారణ వంటి కార్యక్రమాలను రామనాథం చేపడతాడు. తన భార్య సుందరి కాపురానికి రాలేనని తేల్చిచెప్తుంది. చిరతంపూడి అప్పలనాయుడు కూతురు స్వరాజ్యంతో అతని పరిచయం స్నేహంగా మారుతుంది. స్వరాజ్యం కూడా తన చదువుకు అభ్యం తరం చెప్తున్న భర్తతో తెగతెంపులు చేసుకుంటుంది. క్రమంగా వీరి స్నేహం ప్రేమగామారి దంపతులుగా జీవించాలని నిర్ణయించుకుంటారు. రామనాథం బెజవాడలో 1921లో ఏప్రిల్ 1న ఎ.ఐ.సి.సి కి వచ్చిన గాంధీని ముంగండకు ఆహ్వానిస్తాడు. గాంధీరాక సందర్భంగా కర్కోటక చాందసుడైన రామనాథం తండ్రి (పెంచిన తండ్రి) గాంధీగారికి భగవద్గీత శ్లోకాన్ని అందంగా రాసి ఇవ్వడంతో ఈ నవల ముగుస్తుంది.

## స్త్రీ చైతన్యం :

**స్వరాజ్యం :**

ఈ నవలలో స్వరాజ్యం చిరతంపూడి అప్పల నాయుడు కూతురు అతను స్త్రీ విద్యను ప్రోత్సహించిన సంస్కరణవాది. కానీ ఆమె చదువు భర్త, మామలకు అభ్యంతరం కావడంవల్ల కాపురానికి దూరమవుతుంది. అలా అయినందుకు కుంగిపోదు. రామనాథం పరిచయం స్నేహంగా మారగానే, రామనాథంను అతని భార్య

సుందరిని కలిపే ప్రయత్నం చేసి విఫలం అవుతుంది. తర్వాత రామనాథంకు తమ ప్రేమ భావాన్ని వ్యక్తం చేసి, సంస్కరణ వాడైన తండ్రిని ఒప్పించి వివాహం చేసు కుంటుంది. కేవలం ఇంటికి, కుటుంబానికి పరిమితయ్యే భర్త కంటే దేశానికి, సమాజానికి పాటుపడే భర్తను పొందటంలో ఆమె ఎంతో సంతృప్తి పొందింది. ఈ నిర్ణయంలో స్వరాజ్యం నిస్వార్థత, దేశభక్తి, దేశంపట్ల, సమాజంపట్ల ఆమెకు గల ప్రేమ, బాధ్యతలు వ్యక్త మౌతాయి. స్వరాజ్యం పాత్రను సంస్కరణపట్ల, దేశంపట్ల, సమాజంపట్ల, తోటి స్త్రీలపట్ల ప్రేమ, మానవతా దృక్పథం కలిగిన చైతన్యవంతమైన పాత్రగా రచయిత తీర్చిదిద్దారు.

**విశాలాక్షి :**

తన కొడుకు ఉద్యమంలో పాలుపంచుకోవడం చూసి గర్వించడం, సంతోషపడడం కనిపిస్తుంది. తన కొడుకు ఉద్యమంలోచేరి కుటుంబానికి పరిమితం కాకుండా పోతాడనే భయం ఆమె మాటల్లో కనిపించదు. మేనమామ పోలికలే వచ్చాయని గర్వపడుతుంది. దేశభక్తి భావాలు కలిగిన స్త్రీగా మనకు విశాలాక్షి కనిపిస్తుంది.

**లచ్చుమ్మ :**

ఈమె తన కొడుకు రామనాథానికి వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వడాన్ని సహించలేకపోయింది. దానికి కారణం అతని ఆశయాలపట్ల లచ్చుమ్మకున్న విశ్వాసం. దేశంపట్లగల మమకారం. ఆ విశ్వాసమే ఆమెను అలా ప్రవర్తించేలా చేశాయి.

లచ్చుమ్మ ఉద్యమం పట్ల సానుభూతి కల్గిన పాత్రగా, సహకరించిన పాత్రగా రచయిత చిత్రీకరించారు. ఉద్యమం పట్ల సానుభూతిగల పాత్రగా రామనాథం గురువు చంద్రశేఖరం భార్య సునంద కనిపిస్తుంది. ప్రముఖ జాతీయోద్యమ నాయకురాలు దువ్వూరి సుబ్బమ్మను ఒకటిరెండుచోట్ల ప్రవేశపెట్టి జాతీయో ద్యమంలో స్త్రీలు కూడా నాయకత్వస్థానంలో ఉన్నారని తెలియజేశారు.

ఈ నవలలో జాతీయోద్యమ నాయకురాలనూ, ఉద్యమ బాటనే ఎంచుకున్న స్వరాజ్యం వంటి స్త్రీలను, ఉద్యమంలో పాల్గొన్నా కన్నమమకారం కన్నా దేశభక్తి మిన్న అన్ని చాటిన విశాలక్షి వంటి వీరమాతలను, ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్న వారిని పరిచయం చేసి విభిన్న స్థాయిల్లో ఉన్నవారి చైతన్యాన్ని పరిచయం చేశారు రచయిత. అంతేగాక ఉద్యమంలోకి దూసుకుపోయిన పాత్రలుగాని, ఉద్యమంలో భాగంగా జీవితంలో నష్టపోవడంగాని, ఇబ్బందులను ఎదుర్కొన్న పాత్రలుగాని ఈ నవలలో లేవు.

## అతడు-ఆమె : ఉప్పల లక్ష్మణరావు

ఉప్పల లక్ష్మణరావు రాసిన ప్రయోగాత్మక నవల అతడు - ఆమె ఒకే విషయాన్ని శాస్త్రి, శాంత ఆలోచించు కోవడంలో, అభిప్రాయపడటంలో, అంచనాలు వేసు కోవడంలో ఎలా ముందుకు వెళ్ళారో, వారి మనోభావా లను ఉత్తరప్రత్యుత్తరాల ద్వారా తెలియజేసి, శాంత చైతన్యస్థాయిని వికసింపజేసిన నవల అతడు-ఆమె.

శాంత, శాస్త్రిలది ప్రేమ వివాహం. వృత్తిపరంగా శాంత ప్రొఫెసర్, శాస్త్రి న్యాయవాది, వారి దాంపత్య జీవితం హాయిగా కొనసాగుతుంది. శాస్త్రిని అతని స్నేహితులు మోసం చేయడంవల్ల శాంత వాళ్ళు ఆర్థికంగా చితికి పోతారు. శాంత అన్ని హంగులూ వదిలేసి అతనికి ధైర్యం చెప్తుంది. శాంత గాంధీ 'యంగ్ ఇండియా' చూసి ఖద్దరు ధరించి సత్యాగ్రహంలో పాల్గొంటుంది. రాజకీయంగా ఎదిగిన శాంతను శాస్త్రి ఎలక్షన్లలో టిక్కెట్టు సంపాదించి పెట్టమనగా, అన్ని విషయాల్లో సర్దుకుపోయిన శాంత ఈ విషయాన్ని జీర్ణించుకోలేక పెంపుడు కూతురు సుభను, కన్నకూతురు లక్ష్మిని తీసుకొని ఉత్తరయాత్రకు వెళ్తుంది. ఆ యాత్రలో దేశ ఆర్థిక రాజకీయ సాంఘిక వర్గ వైషమ్యాలను తెలుసుకుంటుంది. శాస్త్రితోనే సర్దుకోలేక పోయిన శాంత ఈ పరిస్థితులను ఎలా జీర్ణించుకోవాలని ఆలోచనల్లో పడుతుంది. దేశంలో చైతన్యం తీసుకు రావడానికి ముందుగా శాస్త్రిని అర్థం చేసుకొని అతనిలో మార్పు తేవాలని భావించి తిరిగి శాస్త్రిని చేరుకోడానికి

ఇష్టపడుతుంది. ఇంతలో శాస్త్రి కూడా శాంతలేని లోటు వల్ల ఆమెను కలవడానికి బయలుదేరతాడు. వీరిరువురు బొంబాయిలో కలుసుకొని కుటుంబమంతా ఇంగ్లాండు వెళ్ళడంతో ఈ నవల ముగుస్తుంది.

## స్త్రీ చైతన్యం :

ఈ నవలలో ముఖ్యమైన స్త్రీ పాత్ర శాంత. శాంత చైతన్యమే ఈ నవలకు ప్రాణమని చెప్పవచ్చు. ఆలోచనల్లో, అంతరంగంలో, నడవడిలో అన్ని విషయాల్లోను పాఠకునికి కూడా చైతన్యాన్ని రచయిత ఈ శాంత పాత్ర ద్వారా కలిగిస్తున్నారు.

శాంత సామాజికంగానే గాక రాజకీయంగా కూడా తనవంతు కర్తవ్యాన్ని ఆలోచించేది. మౌంటురోడ్డు వద్ద కుష్టువాళ్ళు స్వరాజ్యనిధి కోసం విరాళం అడగగానే ఇస్తుంది. శాస్త్రి మాత్రం ఎంత యాగీ చేసినా వారికి ఒక్క రూపాయి కూడా ఇవ్వడు. గాంధీగారి యండ్ ఇండియా చదవడంతో ఆమెలో పరివర్తన వచ్చి ఖరీదుగల తన వస్త్రాలను తగలబెట్టి ఖద్దరు వస్త్రాలను స్వీకరిస్తుంది. గాంధీగారి స్వదేశీ సిద్ధాంతాన్ని పాటిస్తుంది. బ్రిటీషువారి పారిశ్రామికీకరణను నిరసిస్తూ దేశ కుటీర పరిశ్రమను ప్రోత్సహిస్తుంది. లలితకళలన్నీ డబ్బున్న వారి కళా పోషణలో ఉన్నాయని ఆ కళలు సామాన్య ప్రజలను కూడా పోషించగలిగే స్థాయికి ఎదగాలనీ, ఆ పరిస్థితులు రావాలంటే సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగు పడాలనీ, దానికై స్వరాజ్యం రావాలని శాంత కోరు కుంటుంది.

శాంత కేవలం జాతీయ దృక్పథంతోనే కాకుండా ప్రత్యేకించి స్త్రీ హృదయంతో స్త్రీల గురించి ఎన్నో విషయాలు ఆలోచించేది. స్త్రీలను న్యూతనతాభావంతో చూడడం ఆమెకు ఇష్టం ఉంటుంది. తాను తల్లిని కాబోతున్నానని తెలిసి కొడుకుని కనాలని భావించదు. కొడుకైనా, కూతురైనా ఒకటే అనుకుంటుంది శాంత. తన సంతానాన్ని దేశానికి, సమాజానికి పనికి వచ్చేలా, పిరికితనం లేనివారిగా పెంచాలని భావిస్తుంది. కర్మాగారాల్లో స్త్రీలు విధివిరామం లేకుండా పనిచేయడం చూసి బాధపడుతుంది. విద్యావంతురాలైన శాంత పరిపక్వత కలిగిన స్త్రీ. కుటుంబంలో తనకంటూ స్వేచ్ఛా వాతా వరణాన్ని కల్పించుకుంది.

మొత్తంమీద ఈ నవలలో శాంత సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొనడం, స్వరాజ్యనిధికి చందాలివ్వడం, ఖద్దరు ధరించడం, ఉద్యమంలో వాలంటీరుగా, కార్యదర్శిగా పనిచేయడం, హరిజనోద్ధరణ వంటి ఉద్యమ కార్యక్రమాలు చేపట్టిన వనితగానేకాక సామాజికంగా వర్గవైషమ్యంతో బాధపడుతున్న వారి గురించీ, స్త్రీల సమస్యలు, వాటి పరిష్కారాలను, పిల్లలను తీర్చిదిద్దే విధానాలు మొదలైన విషయాలు గురించి ఆలోచించిన స్త్రీగా శాంత కనబడుతుంది. ఈ నవలలో శాంత పాత్ర చైతన్యంతో ప్రత్యక్షంగా ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా ఎంతో ఉన్నతమైన మానసిక చైతన్యం కలిగిన పాత్రగానేకాక, దేశభవిష్యత్తుకోసం వ్యక్తి సంస్కారం ప్రధానంగా శాంత పాత్రను చిత్రీకరించినట్టు కనిపిస్తుంది.

## ముగింపు :

ఈ మూడు నవలల్లో స్త్రీలు చైతన్యంతో తమకు నచ్చిన వీలైన బాటలోనే ఉద్యమంలో పనిచేసినప్పటికీ దేశంకోసం త్యాగం చేసిన పాత్రలుగా మనకు కనపడువు. శాంత దేశభక్తిలో భాగంగా ఎంతోమందికి సహకరించిందీ, ఎంతోమందిని చేరదీసింది. ఆర్థికంగా జీవితంలో ఏ ఒడిదుడుకులు లేకుండా తన పరిధిలో తాను సాగి పోయిన పాత్ర శాంత. తన వ్యక్తిగత సుఖాలకు తిలోద కాలిచ్చి దేశం కోసం, సమాజం కోసం తనకు వీలైన పద్ధతుల్లో నడిచింది. జాతీయోద్యమ నవలల్లో స్త్రీలు ఒక నాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని గాంధీ మొదలైన వారు చేపట్టిన కార్యక్రమాలను వారివారి కార్యదర్శుల పిలుపు మేరకు ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ ఉద్యమంలో ఖద్దరు వడకటం, ధరించడం, హరిజనోద్ధరణ, సత్యా గ్రహం వంటివేకాక ఇతరత్రా కార్యక్రమాలు చాలా వరకు నగరాలకు, పట్టణాలకు పరిమితమయ్యాయి.

జాతీయోద్యమానికి శత్రువు బ్రిటీషు పాలకులు. వారినుండి స్వాతంత్ర్యం పొందడమే. అది వారికి జాతీయోద్యమ నవలల్లోని స్త్రీల లక్ష్యం బ్రిటీషు లభించింది.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. కాత్యాయని విద్మహే. స్త్రీల జీవిత నమూనాలు, వరంగల్ : జనసాహితీ ప్రచురణ,1995.
2. కొమురయ్య, ఎ. మహీధర నవలలు - సామాజిక పరివర్తనం. హనుమకొండ : శ్రీచక్ర పబ్లికేషన్స్, 1989.
3. దేవకీదేవి, తిరునగరి. తెలంగాణ విమోచనోద్య నవలల్లో స్త్రీ చైతన్యం. వికారాబాద్ : తిరునగరి ప్రచురణలు, 2008.
4. మంగమ్మ, లింగాల. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కార నవలలు-పరిశీలన. అముద్రిక సిద్ధాంత గ్రంథం. హైదరాబాదు : హైదరాబాదు విశ్వవిద్యాలయం, 2014.
5. యోహాన్బాబు, గజ్జా. బలివాడ కాంతారావు నవలలు పరిశీలన. విశాఖపట్టణం: దీప్తేజ పబ్లికేషన్స్, 1995.
6. రామమోహనరావు, మహీధర. రథచక్రాలు. విజయవాడ : అవంతి ప్రచురణ, 1962.
7. రామమోహనరావు, మహీధర. కొల్లాయిగట్టితేనేమి. విజయవాడ : విశాలాంధ్ర పబ్లిషింగ్, 1978.
8. లక్ష్మణరావు, ఉప్పల. అతడు -ఆమె. హైదరాబాదు : విశాలాంధ్ర బుక్‌హౌస్, 2001.
9. సుజాతరెడ్డి, ముదిగంటి, మలుపు తిరిగిన రథచక్రాలు. హైదరాబాదు : రోహిణం ప్రచురణలు, 1998.
10. సంజీవమ్మ, సి. తెలుగు నవలలో సామాజిక చైతన్యం. కడప : అభ్యుదయ రచయితల సంఘం, 1985,
11. హనుమంతరావు, మాడపాటి. తెలంగాణ ఆంధ్రోద్యమం. హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం, 1995.

❖❖❖

# ఆచార్య కొలకలూరి ఇనాక్ 'సాక్షి' నాటకం - ఒక పరిశీలన

– డా॥. కె. చిదానంద, అతిథి ఉపన్యాసకులు, తెలుగు అధ్యయన శాఖ, బెంగళూరు విశ్వవిద్యాలయం, జ్ఞానభారతి, బెంగళూరు.

## ప్రస్తావన :

"నాటకాంతం హిః సాహిత్యమ్
కావ్యేషు నాటకం రమ్యం"

నాటకం అందరినీ ఆకర్షించే ఉత్తమ కళా ప్రక్రియ. అందుకే "నాటకాంతం హిః సాహిత్యమ్, కావ్యేషు నాటకం రమ్యం" అన్నాడు పెద్దలు. అనేక కళలను తనలో యిముద్చుకున్న నాటకాన్ని సమాహార కళ (Complete Art) అంటారు. మానవ సమాజంలో తొలినాటి మానవుడు జరిపిన ప్రకృతి దేవతల ప్రార్థనల నుండి కళారూపాలు పుట్టాయని మానవశాస్త్రం చెపుతుంది. సమాజంకోసం సమాజంలో పుట్టిన కళ కాబట్టి నాటకాన్ని సామాజిక కళ (Complete Art) అని అంటారు.

ప్రదర్శన యోగ్యత నాటకం యొక్క ప్రముఖాంశం. ప్రదర్శన యోగ్యత లేని నాటకం పఠనానికి ఎంత సౌలభ్యంగా ఉన్న దర్శన లక్షణం లేకపోతే రాణించదు. దర్శనయోగ్యం, సాహిత్య, సామాజిక విలువలు కలిగిన నాటకమే ఏ కాలంలోనైనా మనగలుగుతుంది. స్థల కాలాదుల ప్రాముఖ్యం కలిగిన నాటకం ప్రదర్శనా యోగ్యమై ప్రేక్షకాదరణ పొందటం అనివార్యం.

ఈ నేపథ్యంలో ఆచార్య కొలకలూరి ఇనాక్ రాసిన నాటకం సాక్షిని పరిశీలించవలసిన ఆవశ్యకత ఉంది. సాక్షి నాటకం రచించడానికి ఆచార్య కొలకలూరి ఇనాక్ గారిని మూడు అంశాలు ప్రేరేపించినట్లు తోస్తుంది.

తెలుగులో క్రైస్తవ వాఙ్మయం విరివిగా ఉన్నప్పటికీ సామాన్యులందరికి అది ఉండాల్సిన అందుబాటులో లేదు. తమ సాహితీ విజ్ఞత సహాయంతో క్రైస్తవ గాథలను తెలుగువారికి పరిచయం చేయాలన్నా ఆసక్తి కూడా సాక్ష నాటక రచనకు దోహదం చేసి ఉండవచ్చు. ఇనాక్ గారు వైష్ణవ భక్తుడైన తిరుప్పాణాళ్వార్ నాటకాన్ని రచించినట్లే క్రైస్తవ భక్తుడైన పాల్ చరిత్రను ఇతివృత్తంగా తీసుకుని నాటకీకరించాలనుకవడం.

వైష్ణవ భక్తుని ఇతివృత్తాన్ని నాటకీకరించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ క్రైస్తవ భక్తుని ఇతివృత్తాన్ని కూడా నాటకంగా మలచి భక్తులపట్ల తమకున్న భక్తిభావాన్ని బహిర్గతం చేసుకొన్నారు. యేసుకు పూర్వమే ఏర్పడ్డ క్రైస్తవ మతానికి ఏసుతోపాటు ఎందరో ప్రవక్తలు ప్రాణం ధార పోశారు. అటువంటి వారిలో పాల్ కూడా ఒకరు ఆదర్శ వంతమైన జీవితాన్ని మతోద్ధరణకు అంకితం చేసిన మహానుభావులు - ఎన్నో అద్భుతాలు చూపి దైవ మహిమను దైవభక్తి మహిమను పూజలు గుర్తించేట్లు చేసిన మహిమాన్వితుడు కష్టాలకోర్చి నిర్భయంగా పురోగ మించి లక్ష్యాన్ని సాధించిన దీక్షాపరుడు. ఇతని జీవితం క్రైస్తవులకే గాక అఖిల ప్రజలకు ఆదర్శవంతమే. పాల్ జీవిత చరిత్ర పవిత్ర బైబిల్ గ్రంథం కొత్త నిబంధనలో కన్పిస్తుంది.

### 1.1 సాక్షి నాటక ఇతివృత్తం :

స్టీఫెన్ ఏసు భక్తుడు. అతడు రక్షకుని గురించి భవిష్యత్తులో జరిగే మార్పులను గురించి ప్రచారం చేయ సాగాడు. అయితే ఆనాటి ప్రజలకు స్టీఫెన్ మాటల మీద విశ్వాసం లేదు. వారికి సనాతనమైన యూదుల మతంపై మొండి విశ్వాసముంది. అందుచేత రాళ్లతో స్టీఫెన్‌ను కొట్టారు. అతడు మరణించాడు. ఈతని మరణం పట్ల సంతోషం వ్యక్తం చేసినవారిలో పాల్, సైమన్‌లు కూడా ఉన్నారు.

జెరూషలేంలో ఒక భక్తుడు 'పాల్'ని దైవప్రతినిధి అని చెప్పాడు. కానీ పాల్ నమ్మలేదు. పైగా తాను అనూచానంగా వస్తున్న ఆచార సంప్రదాయాలకు బద్ధుడనని చెప్పాడు. ప్రతిఘటన తన కర్తవ్యమన్నాడు.

సైమన్ కూడా క్రైస్తవ్యం స్వీకరించాడని చెప్పాడు. కాని సైమన్ ఇదంతా కట్టుకథగా తోసిపుచ్చాడు. ఇద్దరు ఆ భక్తుని అసహ్యించుకుంటారు. పాల్ కొత్తమతం వల్ల మోజు పెంచుకున్న వారిని హతమార్చాడు. ఇతని అనురక్తిని మతాధికారి కూడా సంతోషించాడు.

ఆకాశంలో ఒక కాంతిపుంజం వెలిగింది. కాంతి పుంజంలో నుండి ఒక 'సవ్వడి' ప్రతిధ్వనించింది. ఆ ధ్వని క్రీస్తుది. తన్ను హింసించడం న్యాయం కాదని హెచ్చ రించింది. పాల్‌కు ఏం చేయాలో తోచలేదు. కర్తవ్యం ప్రబోధించాల్సిందిగా కోరాడు. మిక్కిలి కాంతిపుంజంతో వెలుగుతున్న క్రీస్తును చూడలేక పాల్ కళ్లు పోయాయి. తనకేమీ కనిపించడం లేదని వాపోయాడు. డెమస్కస్ పట్టణానికి వెళ్లాల్సిందిగా క్రీస్తు ఆదేశించాడు. పాల్ తచ్చాడుతూ మతాధికారి సహాయం కోరాడు. వీరిద్దరూ 'జుడూస్' మందిరం చేరుకున్నారు. అక్కడ అన్నపానాలు మాని మూడు రోజులు ఆననీయా కోసం నిరీక్షించారు. పాల్ వైనం మతాధికారికి నచ్చలేదు. ఈలోగా అనానియాస్ వచ్చాడు. పాల్ సంతోషించాడు. ప్రభువు ప్రతినిధి పాల్ అని అనానియాస్ మతాధికారితో చెప్పాడు. ఏసు పునరుత్థానం గురించి గుర్తు చేశాడు. ప్రభువు ఆజ్ఞ మేరకు తాను వచ్చానని కూడా సెలవిచ్చాడు. పాల్‌పై తన అమృతహస్తం ఉంచాడు. పాల్‌కు చూపు వచ్చింది. అతని ఆనందానికి హద్దులు లేవు. తనకు 'బాప్తిస్కం' అను గ్రహించమని ప్రార్థించాడు.

పాల్ తనకు చూపురాగానే డెమస్కస్ మందిరం నుండి వెళ్లడానికి అనుమతి కోరాడు. తాను జెరూషలేం వెళితే ప్రమాదమంటాడు. చివరకు రాత్రివేళ ఆలయానికి ఆనుకొని ఉన్న కోటగోడపై నుండి బుట్టలో పాలను ఉంచి మెల్లగా దించి తప్పిస్తారు. పాల్ జెరూషలేం చేరు కుంటారు. అయినా అతని భయం అతనిది. మతాధి కారులు తన్ను హతమారుస్తారని చెప్పాడు. పారిపోవడం మంచిదన్నారు. కాని మొదట పాల్ ఒప్పుకోలేదు. ఎప్పుడూ పలాయనం మంచిది కాదన్నాడు. చివరకు ఎదుర్కోవడం కంటే తప్పించుకుని జీవించి ప్రభువాజ్ఞను పాటించడం మంచిదని 'బర్నబాస్ మరోసారి హెచ్చరించాడు. ముందు సిసిరియాకు వెళ్లి అక్కడ నుంచి తార్సాస్‌కు వెళ్లడం మంచిదని చెప్పాడు. గత్యంతరం లేక పాల్ అంగీక రించాడు.

పాల్ బర్నబాస్, పాపస్ చేరుకున్నారు. పాపస్ నాయకుడు పాలస్. అతడు పాల్‌ను బర్నబాస్‌ను సాదరంగా ఆహ్వానించాడు. పైగా తన మిత్రుడైన 'ఎలిమాస్'ను పరిచయం చేశాడు. అయితే ఎలియాస్‌కు వారిద్దరంటే గౌరవం లేదు. అభిమానం లేదు. వారిద్దరి మధ్య వాగ్వివాదం చెలరేగింది. అతని దృష్టిలో ఏసు సైతాన్. అతణ్ణి ఆదరించేవారు సైతాన్ బిడ్డలు. వారిని చూడడం మహాపాపం. ఎలియాస్ మాటలకు పాల్ ఎంతగానో నొచ్చుకున్నాడు. అంధుడవు కమ్మని శపిం చాడు. ఈలోగా పాల్, బర్నబాస్‌లకు స్వాగతమిచ్చిన పాపస్, ఎలియాస్ బహుభాషా కోవిదుడని శంపిచవద్దని బ్రతిమాలాడు. కానీ లాభం లేకపోయింది. ఎలియాస్ అంధుడయ్యాడు. ఎప్పుడైతే ఎలియాస్‌లో పరివర్తన వస్తుందో అప్పుడు చూపు వస్తుందని పాల్ చెప్పాడు.

పాల్ ఆంటియాక్ చేరుకున్నాడు. ప్రార్థనా మందిరం చేసి నడిచాడు. అక్కడ మత ప్రవక్త ప్రజల శ్రేయస్సుకు సంబంధించిన వార్తలను చెప్పమన్నాడు. పాల్ తమవారి మనుగడకు దేవుడు కారకుడన్నాడు. ఈజిప్టులోని బానిసలు విముక్తులు కావడానికి దేవుడే కారకుడన్నాడు. దేవుడు మనందరిని రక్షించడానికి డేవిడ్ వంశంలో జన్మించాడని అతడే చివరకు ఆంటియోక్ ప్రజల సందేహ నివృత్తికోసం జెరుషలేం ప్రతినిధి మండలి ఉత్తరం రాసేటట్లు తీర్మానించింది. విగ్రహాలకు నివేదించిన ఆహారం తినకూడదని, గొంతకుచ్చుపోసి చంపిన జంతుమాసం తినకూడదని, పందిమాంసం తినకూడదని, నెత్తురు రుచి చూడకూడదని, సంసారేతరమైన లైంగిక పాపం నిషిద్ధమని ఆ ఉత్తరంలో ఉండాలని భావించారు. జూడాస్, సైలస్, పౌలు, బర్నబాస్‌లతో ఆంటియోక్‌కు

వెళ్లాలని నిర్ణయమైంది. కారాగారంలో పాల్ సైలస్ మాట్లాడుకున్నారు. బర్నబాస్ సైలస్ పట్టుబడ్డట్టు తెలిసింది. బర్నబాస్ తోడ్పాటు లేనందుకు పాల్ విచారించాడు. భూకంపం వచ్చింది. కారాగారపు తాళాల సంకెళ్లు ఊడిపడ్డాయి. పాల్, సైలస్‌లు తప్పించుకోవ డానికి అవకాశముంది. కానీ వారు వెళ్ళలేదు. జైలు అధికారి ఎంతో సంతోషించాడు. అతనిలో పరివర్తన వచ్చింది. తనకు జలపావిత్ర్యం అనుగ్రహించుమని కోరాడు. సకుంటుంబంతో రావాలని ఆంక్ష పెట్టాడు. పైలు అధికారి సమ్మతించాడు. చివరకు పాల్‌ను సైలస్‌లను జైలు నుండి వెళ్లిపోవాల్సిందిగా కోరాడు. పాల్ నిరాకరించాడు. చివరకు పాల్ సైలస్‌లను బంధించామని తెలియజేసిన వార్తను చెప్పాడు. నాయకులు క్షమాపణ చెబితేగాని వెళ్లమని పాల్ చెప్పగా జైలు అధికారి వెళ్లిపోయాడు.

పాల్ ఏథెన్స్ ఏర్యోపాగస్ సంఘ సమావేశంలో పాల్గొనగడానికి వెళ్లాడు. సంఘాధికారి రక్షకుణ్ణి గురించి ప్రశ్నించాడు. అపుడు పాల్ దేవుడున నామరూప రహితుడు. సర్వసృష్టి కర్త, సర్వసృష్టి పాలకుడు. ధనకనక వస్తువాహనాదులు అవసరం లేదు. హృదయపరివర్తనాను కూలం చాలు. దేవుడు మరణాన్ని జయించాడు. రక్షకునికి మరణం లేదు అని అంటుంటే అసహనంతో మతాధికారి మండిపడ్డాడు.

పాల్ కొరింథి పట్టణం చేరుకున్నాడు. అప్పటికే పాల్ మీద లెక్కలేనన్ని నేరాలు మోపబడ్డాయి. యూదులు మొండివారని పాల్ చెప్పాడు. ఈలోగా రాష్ట్రాధికారి 'గలిర్లయో' వచ్చాడు. యూదా నాయకుడు పాల్‌పై విమర్శనాస్త్రాలు కురిపించాడు. కాని గల్లియో ఇది మత సంబంధమైన ఆరోపణ కావడం వల్ల మతాధికారులే పరిష్కరించుకోవాలని చెప్పాడు. ఈ అభియోగానికి తాను తీర్పరిగా ఉండనని అసక్తతను కూడా ప్రకటించాడు.

అది ఇఫేనస్ పట్టణం అక్కడి దేవత ఆర్బెమిస్ విగ్రహారాధన తగ్గిపోతే ప్రమాదమని డెమిట్రియన్ స్నేహితులతో చెప్పాడు. దానివల్ల ఆ దేవత వెండి నమూనాలు విక్రయం కుంటుబడుతుందని కూడా హెచ్చరించాడు. నాయకుడు డెమిట్రియతో ఏకీభవించాడు. దీనికంతా కారణం పాల్ హితబోధనలే అని తర్కించుకున్నారు వెంటనే గయస్‌ను బంధించారు. పాల్ ఉనికిని ప్రశ్నించారు. పాల్ నగరంలోకి అడుగు పెట్టకూడదని అనుశాసించారు. చివరకు పాల్‌కు కబురంపవలసిందిగా ఆదేశించారు. ఈలోగా నగరాధికారి 'ఆర్బెమిస్‌కు' ఎవరూ ద్రోహం చేయలేరని సమావేశం అవసరం లేదని చెప్పి వెళ్ళిపోయారు.

యూదు నాయకుడు పాల్‌ను బంధించమని పౌరుల్ని కోరాడు. పాలు యూద మతవిరోధి అని ఆరోపించారు. ఆలయంలోకి అన్యులను వెంటబెట్టుకు వచ్చి మలిన పరచాడని ఆరోపించాడు. అతడు ఇఫేనస్‌కు చెందిన యూదుడు కాడని తెలియజేశాడు. పాల్‌ను శిక్షించాల్సిందిగా ప్రజలు బిగ్గరగా అరిచారు. పాల్‌ను కొట్టడం మొదలుపెట్టారు. ఈలోగా సైనికాధికారి! అక్కడికి వచ్చారు. పాల్‌ను కొట్టడం ఆపారు యూదు నాయకుడు పాల్‌ను దోషిగా నిందించాడు. సైనికుడు పాల్‌ను గొలుసులో బంధించాడు. తాను వెళుతున్న హంతకుడు పాల్ కాదని సైనికాధికారి గుర్తించాడు. పాల్ తాను రోమ్ పౌరుడైన ఒక యూదుడని తెలియజేశాడు. పాల్‌కు తమ ప్రాచీన మతనిష్ఠ ఇష్టమని తాను ఏసు విశ్వాసులను బంధించి హింసించి వధించానని చెప్పాడు. యూదు నాయకుడు కూడా అది వాస్తవమేనని అంగీకరించాడు. అన్యుల్ని ఆలయంలోకి తీసుకొని వచ్చినందుకు పాల్‌ను చంపమని ప్రజలు కేకలు పెట్టారు. సైనికుడు పాల్‌ను కొట్టబోయాడు. "దోషం ఋజువుకాని రోమ్ పౌరుని కొట్టే హక్కు మీకున్నదా?" అని పాల్ ప్రశ్నించాడు. సైనికుడూ సైనికాధికారీ వెనుకంజవేశారు. పాల్ తాను జన్మతః రోమ్ పౌరుడని చెప్పాడు. రోమ్ పౌరుని బంధించడం ప్రమాదకరమని సైనికుడూ సైనికాధికారీ భావించారు.

జెరూషలేం ప్రార్థనా మందిరంలో పౌలు, మతాధికారి కొంతసేపు వాదించుకున్నారు. ఉన్నత మతాధికారితో ఆ

విధంగా మాట్లాడకూడదని ప్రజలు పాల్‌ను హెచ్చరించారు. పాల్ తాను యూదులలో ఫరీసీల తెగకు చెందిన వాడనని, దైవ విశ్వాసం తమ తెగ వారికి సహజసిద్ధమని చెప్పాడు. మానవులు మరణాన్ని జయిస్తారని తమ విశ్వాసమన్నాడు. సదూకీలకు ఈ విశ్వాసం లేదన్నాడు. ప్రజలలో ఫరీసీలు, సద్దూకీలు నిందా ప్రతినిందలతో కలహానికి దిగారు. సైనికాధికారి పాల్‌ను బంధించి కోటలోకి తీసుకొని పొమ్మనడంతో సైనికుడు అలాగే చేశాడు.

పాల్‌ను ప్రశ్నించేందుకు యూదు నాయకుడు, మతాధికారిని కోరాడు. ఒక యువకుడు సైనికాధికారిని కలుసుకుని పాల్‌ను చంపడానికి యూదు సంఘం కుట్ర పన్నుతున్నదని, పాల్‌ను రక్షించుమని చెప్పాడు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తానని ఈ విషయాన్ని ఎక్కడా చెప్పకుండా వెళ్లమని యువకుణ్ణి పంపివేశాడు.

ఫిలెక్స్ న్యాయస్థానంలో టెర్‌టుల్లస్ యూదుల తరపున వాదించడానికి పాల్ మీద ఆరోపణ చేయడానికి వచ్చాడు. టెర్‌టుల్లస్ పాల్ విప్లవకారుడనీ, యూదులలో సమస్యలు సృష్టించాడనీ, దేవాలయాన్ని మైలపరచాడనీ అభియోగాన్నీ మోపాడు పాల్ అతని అభియోగాల్ని తిరస్కరించాడు. ఏసు మరణాన్ని జయించినట్టు యూదులు విశ్వసించారనీ తాను విశ్వసిస్తానని చెప్పాడు. తన విశ్వాసానికి ఈ పరీక్ష ఏర్పడిందని చెప్పాడు. విశ్వాసం దోషం కాదని సైనికాధికారి విచారించిన తర్వాత తీర్పు ఇస్తానని ఫిలెక్స్ చెప్పాడు.

ఫెస్టన్ న్యాయస్థానంలో విచారణ కొనసాగింది. ఫెస్టన్ పాల్ మీద నేరాలను ఆరోపించమని యూదుల్ని కోరాడు. యూదు నాయకుడు పాల్ విప్లవకారుడనీ, మతద్రోహి అనీ, ఎన్నో అపరాధాలు చేశాడనీ ఆరోపించాడు. యూదుల ధర్మశాస్త్రానికి దైవానికి, సీజరుకు వ్యతిరేకంగా తాను ఏ తప్పు చేయలేదని పాల్ చెప్పాడు. జెరూషలేంకు వెళ్లడానికి పాల్ అంగీకరించలేదు. తాను సీజరు తీర్పు కోసం వెళతానన్నాడు. ఫెస్టన్ అంగీకరించాడు.

పాల్ మరికొందరు రోమ్‌వైపు నౌకలో ప్రయాణం సాగించారు. నౌక ఎక్కిన పాల్ ఇతరులతో ఈ నౌకకు ప్రమాదం జరుగుతుందని, ప్రమాదం జరిగినా ఎవరికీ ఎలాంటి హాని లేదని చెప్పాడు. ప్రయాణం సాగుతూ వుంది. కొంతదూరం నడిచాక నౌక ప్రమాదానికి గురైంది. నౌకలోని వారంతా ఒడ్డుకు చేరుకున్నారు. వారు చేరిన ద్వీపం "మాల్టా". పడవ ప్రమాదం పైగా నిస్సహాయస్థితి. వాతావరణం బాగా లేకపోవడం వల్ల ప్రయాణికులు చాలా బాధపడ్డారు. అక్కడివారు మంటలకోసం కట్టెల్ని పోగుచేశారు. పాల్ ఆ కట్టెల్ని మంటలో వేశాడు. పాల్‌ను పాము కాటు వేసింది. చివరకు పాల్ పామును కూడా మంటలో వేశాడు. పాము కాటువల్ల పాల్ మరణిస్తాడని అందరూ భావించారు. కానీ పాల్ సురక్షితుడుగా నిలబడ్డాడు. ఈలోగా మాల్టా ద్వీపనాయకుడు 'పబ్లియస్' వచ్చాడు. తన తండ్రి అనారోగ్యం గురించి ప్రస్తావించాడు. పాల్ మీ తండ్రి పూర్తి ఆరోగ్యవంతుడని చెప్పాడు. ఈలోగా సేవకుడు వచ్చి పాల్ చెప్పింది నిజమని చెప్పాడు. అందరూ అతని వాక్శుద్ధికి సంతోషించారు.

పాల్ రోమ్ చేరుకున్నాడు. సమావేశం మొదలైంది. యూదు నాయకుడు వచ్చాడు. యూదులు తన పట్ల వ్యవహరించిన తీరు గురించి పాల్ చెప్పాడు. యూదు నాయకుడు చాలా బాధపడ్డాడు. ఈలోగా సైనికుడు వచ్చి పాల్ నిర్దోషి 'సీజర్' చెప్పినట్లు చెప్పాడు. పాల్ విముక్తుడయ్యాడు. చివరకు పాల్ యూదులు మొండితనాన్ని విమర్శించాడు. అందరికీ శుభం కలుగుతుందని పాల్ ఆశీర్వదించాడు. ఇంతటితో నాటకం ముగుస్తుంది.

**ముగింపు :**

ఈ సాక్షి నాటకంలో పాల్ చేసిన ప్రసంగాలు, హితబోధలు ప్రత్యక్ష సందేశాలైతే, కథవల్ల, సన్నివేశాల వల్ల పాత్రల వ్ల వ్యక్తమయ్యేవి పరోక్ష సందేశాలవుతాయి. దైవనింద, దైవభక్తుల దూషణ, తిరస్కారాలు పాపమని దేవుణ్ణి దైవభక్తుల్ని ఆశ్రయించడం మంచిదనే సందేశం ఈ నాటకంలో ప్రస్ఫుటమవుతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. ఆచార్య కొలకలూరి ఇనాక్ - సాక్షి నాటకం.
2. ఎ. రవీంద్రబాబు - కొలకలూరి ఇనాక్ గారి - పరిశీలన. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసం - 2006.
3. డి.యస్. బషీర్ - మునివాహనుడు - ఒక పరిశీలన షా & షా పబ్లికేషన్స్, కర్నూలు, 1995.
4. శ్రీమతి పల్లిసాము విజయలక్ష్మి - ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి భవాని కథల్లో వాస్తవ జీవన చిత్రణ.
5. ఆచార్య జి. చెన్నకేశరెడ్డి - ఆచార్య కొలకలూరి ఇనాక్ షష్టిపూర్తి సన్మాన సంచిక (సాహిత్య వ్యాస సంకలనం).
6. ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి - ఇడుగో ఏసుక్రీస్తు.

❖❖❖

# శ్రీ త్యాగరాజస్వామి వారి అపూర్వరాగాలు

– డా॥. టి. గిరిజా శేషమాంబ, అధ్యాపకులు, అకడమిక్ కన్సల్‌టెంట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్,
ఎస్.వి. విశ్వవిద్యాలయం, తిరుపతి.

## పరిచయం :

దక్షిణ భారతదేశ చరిత్రలో ముగ్గురు వాగ్గేయకారులు. శ్రీ త్యాగరాజస్వామి వారు, శ్రీ శ్యామశాస్త్రివారు, శ్రీ ముత్తుస్వామి దీక్షితులు. వీరు మువ్వురూ కర్ణాటక "సంగీత రత్నత్రయం"గా వెలుగొందడమే గాక వీరి రచనల ద్వారా కర్ణాటక సంగీతము ఒక మహోత్కృష్టమైన, మహోన్నతమైన స్థానాన్ని అధిరోహించింది. అందుచేతనే '18' వ శతాబ్దం కర్ణాటక సంగీత "స్వర్ణయుగంగా" చెప్పబడుచున్నది.

**Key Words (ముఖ్యాంశాలు) :** Performing Arts, Music, Contribution life sketch.

## వివరణ :

త్రిమూర్తులలో ముఖ్యంగా శ్రీ త్యాగరాజస్వామి వారు ప్రథమ స్థానాన్ని అధిరోహించడానికి వీరి రచనలు అని చెప్పవచ్చు వీరి రచనలు అన్నీ కూడా "పండిత పామర" రంజకంగా ఉండటమేగాక వీరి రచనాశైలి 'ద్రాక్షపాకంగా' ఉండటం ఒక విశేషము.

త్యాగరాజ స్వామి వారు అనేక రకాలైనటువంటి రచనలను మనకు అందించారు. వీటిలో దివ్యనామ సంకీర్తనలు, ఉత్సవ సాంప్రదాయ కీర్తలను, జోలపాటలు, లాలి పాటలు, గేయనాటకాలు, మేలుకొలుపు పాటలు, పంచరత్నాలు ఇలా అనేకం.

ఇక రాగాల పరంగా చూచినట్లయితే స్వామి వారు "200" రాగాలు వరకు ఉపయోగించి రచనలు చేసినట్లు తెలుస్తున్నది. ప్రసిద్ధి చెందిన రాగాలు.

**ఉదాహరణకు :**

శంకరాభరణం, కళ్యాణి, కాంభోజి వంటి రక్తిరాగాలలోనేకాక, జన్యరాగాలైన మోహన, సావేరి, హంసధ్వని రాగాలలోను, అలాగే 'నాట' లాంటి వివాది రాగాలలోను అనేక రచనలు చేసారు.

## అపూర్వ రాగాల గురించి వివరణ:

కర్ణాటక సంగీతంలో మొట్ట మొదటి సారిగా ఈ "అపూర్వరాగాలు" అందించినటువంటి ఘనత త్యాగరాజ స్వామి వారిదే. ఈ అపూర్వరాగాలు వీరి ద్వారానే ప్రచారంలోకి రావటం జరిగింది.

ముఖ్యంగా వీరు చేసిన అపూర్వ రాగ కృతులు ఎంతో అపురూపమైనటువంటి రచనలుగా చెప్పవచ్చు. '80' అపూర్వ రాగాలలో రాగనామాన్ని, సాహిత్యాన్ని అందించటమే కాక కృతి పల్లవిలోనే ఆ రాగ ఆరోహణ, అవరోహణని, రాగ పరిచయాన్ని ఒక్క సాహిత్య పాదంలోనే పొందుపరచటం స్వామి వారి ఘనతని చెప్పవచ్చు. ఈ 80 అపూర్వ రాగాలలో ఒక రాగంలో ఒక కృతి ఉన్నటువంటి రచనలు '60' రాగాల వరకు ఉ ండటం విశేషం.

## సంగీత సేవ :

**ఏక రాగ కృతి - కొన్ని అపూర్వ రాగాలు :**

| | రాగము | కృతి | తాళము |
|---|---|---|---|
| 1. | అమృతవాహిని | శ్రీరామ పాదము | ఆది |
| 2. | ఆందోళిక | రాగసుధారస | ఆది |
| 3. | బిందుమాలిని | ఎంతముద్ద | ఆది |

| | | |
|---|---|---|
| 4. చాయానాట | ఇదిసమయమురా | ఆది |
| 5. గంభీర వాణి | సదామదిన్ | ఆది |
| 6. జయంత సేన | వినతాసుత | ఆది |
| 7. జింగ్ల | అనాధుడను గాను | ఆది |
| 8. సింహవాహిని | నెనరుంచరా | ఆది |
| 9. సింధుకన్నడ | ననుగన్న తల్లి | ఆది |
| 10. విజయశ్రీ | వరనారద | ఆది |

**రెండు కృతులు ఉన్న కొన్ని అపూర్వరాగాలు :**

| రాగము | కృతి | తాళము |
|---|---|---|
| 1. చంద్రజ్యోతి | అ) బాగాయనయ్య | ఆది |
| | ఆ) శశివదనా | ఆది |
| 2. జయమనోహరి | అ) నీ భక్తి భాగ్య సుధా | రూపకం |
| | ఆ) శ్రీరమ్య చిత్తాలంకార | రూపకం |
| 3. కళ్యాణ వసంతం | అ) నాదలోలుడై | రూపకం |
| | ఆ) కనులుతాకని | రూపకం |

**మూడు కృతులు ఉన్న కొన్ని అపూర్వరాగాలు :**

| రాగము | కృతి | తాళము |
|---|---|---|
| 1. బంగాళ | అ) గిరిరాజసుతా | ఆది |
| | ఆ) మునుపే తెలియక | ఆది |
| | ఇ) సాక్షిలేదనుచు | ఆది |
| 2. జనరంజని | అ) విడజాలదురా | ఆది |
| | ఆ) స్మరణే సుఖము | ఆది |
| | ఇ) నాడాడినమాట | ఆది |
| 3. శుద్ధబంగాళ | అ) రామభక్తి | ఆది |
| | ఆ) తొలినేజేసిన | ఆది |
| | ఇ) తప్పకనే వచ్చునా | ఆది |

**రచనా శైలి :**

కర్ణాటక సంగీతములో 'సంగతులు' అనే అంశాన్ని ప్రవేశపెట్టినవారు త్యాగరాజస్వామివారు ఈ సంగతుల ద్వారా పూర్తి రాగ పరిచయాన్ని అందించటమేకాక కృతి పల్లవి సాహిత్యంలోనే ఈ సంగతులను చొప్పించటం స్వామివారి రచనా పాటవాన్ని తెలుపుతున్నాయి.

**ఈ అపూర్వ రాగ కృతులలో చేసిన విశేష అంశాలు:**

1. **స్వరాక్షరాలు** : కృతి 'అలంకారికాలు' అయిన ఈ

స్వరాక్షరం అనే అంశాన్ని త్యాగరాజస్వామివారు శ్రీరామ పాదమా" అనే కృతిలో

పాదమా / శ్రీరామ పాదమా } పాదమా అంటు ఇటు సాహిత్యం, అటు స్వరం రెండూ కూడ పాదమా అంటూ రచన చేసారు శుద్ధ స్వరాక్షరముతో ఇది ఒక విశేషము.

2. **చిట్ట స్వరము :** వరరాగల యజ్ఞులు - చెంచు కాంభోజి రాగ కృతిలో- సపామాగామదనిసా" అనే చిట్ట స్వరాన్ని రచించారు.

3. **నిషాదాంత్య రాగము :** ఈ అపూర్వ రాగాలలో నిషాదాంత్య రాగము

"చిత్తరంజని రాగంలో నాదాతనుమనిశం శంకరం అనే కృతి ఆరోహణ నిసరిగమపదని - నిదపమగరిసని మంద్ర స్థాయి నిషాదం నుండి - నిషాదం వరకు మాత్రమే ఈ రాగ నిడివి ఉన్నటువంటి రాగం. తార స్థాయి షడ్జమ సంచారం రాదు.

## 4. అపూర్వ రాగాలలో కొన్ని వివాదిరాగాలు :

| | రాగము | కృతి | తాళము |
|---|---|---|---|
| అ) | గంభీర వాణి | సదామదిన్ దలతు గదరా | (షట్శృతి దైవతం) |
| ఆ) | శ్రీమణి | ఏమందునే | (శుద్ధ గాంధారము) |
| ఇ) | శృతిరంజని | ఏదారి సంచరింతు | (శుద్ధ నిషాదం) |
| ఈ) | ఛాయానాట | ఇదిసమయమురా | (షట్శృతిరుషభం) |

## 5. ప్రతి మధ్యమ అపూర్వ రాగాలు :

| రాగము | కృతి | తాళము |
|---|---|---|
| మందారి | పరలోక భయము | ఆది |
| సరస్వతి | అనురాగములేని | రూపకం |

## 6. మేళకర్త అపూర్వ రాగాలు :

| రాగము | కృతి | తాళము |
|---|---|---|
| గానమూర్తి | గానమూర్తే | ఆది |
| వాగధీశ్వరి | పరమాత్ముడు | ఆది |

## 7. అమ్మవారి రచన :

ననుగన్న తల్లి నాభాగ్యమా- సింధు కన్నడ రాగం ఆదితాళంలో చేసిన ఈ అపూర్వ రాగ కృతి సాహిత్యం పరిశీలించిన నారాయణి, ధర్మాంచికే అంటూ అమ్మవారిని స్తుతిస్తూ చేసిన రచనగా చెప్పవచ్చు.

## 8. గణపతిని కీరిస్తున్నటువంటి రచన :

గిరిరాజసుతా తనయ సదయ- బంగాళ రాగ కృతిలో - గిరిరాజసుతుడు - తనయుడు అంటూ గణపతిని కీరిస్తు, అలాగే తన వంశం గురించి కూడ వివరించారు స్వామి వారు వారి తాతగారు 'గిరిరాజకవి' వారి తనయుడు రామబ్రమ్మం గారు అని వారి తనయుడు త్యాగరాజు అని రెండు విశేషణాలతో ఈ రచన సాగటం గమనార్హం.

## 9. శివకీర్తనలు :

రామాంకితంగా రచనలు చేసిన త్యాగరాజు కొన్ని శివకీర్తనలు కూడ రచించారు. ఈ అపూర్వ రాగాలలో

అ) గంభీర వాణి సదామదిన్ దలతు గదరా

ఆ) చిత్తరంజని నాదాతను మనిశం

**10. సప్తస్వర వివరణ :**

నాదాతనుమనిశం అనే కృతిలో సద్యోద్యాతాది పంచవక్త్రజ "సరిగమపదని" వరసప్తస్వర అంటూ సప్తస్వరాలు 7 అని వాటి ప్రాధాన్యత గురించి కూడ ఈ అపూర్వ రాగా కృతిలో వివరించారు స్వామివారు.

**11. సాంఘికపరమైన అంశాలు :**

వినవే ఓ మనసా వివరంబుగనే తెలిపెద - అంటూ 'వివర్ధని' రాగ కృతిలో మనిషి మానసిక స్థితిని తెలుపుతూ చివరిగా రామ సాన్నిధ్యాన్ని ఎలా చేరాలో వివరించారు స్వామివారు. అలాగే 'ప్రతాపవరాళి' రాగ కృతిలో - సీతారమణితో 'ఓమనగుంట' లాడి గెల్చుట - చేత నొకరి కొకరు చూచి ఆ భావమెరిగి అంటూ ఒక ప్రక్క 'ఓమన గుంటలు' అనే ఒక వినోద క్రీడ గురించి చెప్పూ, మరోక ప్రక్క ఒక చిన్న శృంగార భావాన్ని కూడ చెప్పటం ఒక విశేషంగా చెప్పవచ్చు వీరి రచనలలో.

**ముగింపు :**

ఇలా అనేక అపూర్వ అంశాలను - ఈ అపూర్వ రాగకృతులలో పొందుపరచారు త్యాగరాజస్వామివారు. కర్ణాటక సంగీతానికి ఎనలేని సేవచేసిన త్యాగరాజ స్వామి ధన్యులు, వారి సేవ అనిర్వచనీయం.

**Reference Books (ఆధార గ్రంథాలు) :**

1) సంగీత మహర్షులు, వాగ్గేయ కారులు - నారుమంచి సుబ్బారావు

2) త్యాగరాజు రామకథాసుధ - ఇలపావులూరి కామేశ్వరరావు

3) Apurva Ragas of Saint Thyagaraja's compositions - Ph.D. thesis of Dr. Girija Seshamamba.

❖❖❖

# లంబాడాల సంస్కృతి "తీజ్" పండుగ పుట్టు పూర్వోత్తరాలు

- డా॥. లక్ష్మణ్ నాయక్ బాణోత్, ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ, కళాశాల, ఆలేర్, యాదాద్రి భువనగిరి జిల్లా.

**ఉపోద్ఘాతం :**

సంస్కృతి అనగా మానవ జీవితంలో మమేకమైన గొప్ప అంశం. మతం నుంచి, మంచితనం నుంచి, మానవత్వం నుంచి విడిపడి మనిషి వనుగడ సాగించవచ్చు కానీ సంస్కృతి రహితంగా ఏ మనిషి మనుగడ సాగించలేడు. అసలు సంస్కృతిలేని సమాజ మనుగడ సమస్త భూ మండలంపై లేదంటే అతిశయోక్తికాదు. సంస్కృతిక భిన్నంగా ఏ మనిషి జీవించలేడు. ఒక సార్వజనిక, సామూహిక అనుసరణ సంస్కృతి. ఆ మాటకొస్తే ఏ సమాజానికైనా ఆత్మ లాంటిది సంస్కృతి. వివాహ వ్యవస్థ, కుటుంబ జీవనం, తల్లిదండ్రుల సేవ, పెద్దల పట్ల గౌరవం, అతిథుల పట్ల మర్యాద, సామాజిక స్పృహ ఇవన్నీ సంస్కృతిలో భాగాలు.

**పండుగ అంటే :**

సంస్కృతిలో భాగమైన పండుగలకు సమాజానికి మధ్య అనుబంధం ఎంతో పవిత్రమైనది. మనిషి ఈ ప్రపంచంలో సాంఘిక జీవితం గడపటం ప్రారంభించినప్పటి నుంచి ఈ పండుగల పరంపర ప్రారంభమైందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రతీ జాతి కాలమార్పుని అనుసరించి ఆయా శుభ దినాలను ఏర్పాటుగావించుకొని ఆనందంగా, ఆహ్లాదంగా, ఉత్సాహంగా, ఉల్లాసంగా, గడుపుకుంటూ ఆచరించే పండుగలు ప్రత్యేకతను సంతరించుకుంటాయి. పండుగ సమాజానికి ఊపిరి వంటిది. ప్రజలందరూ పండుగ రోజులలో ఒకచోట సమావేశమవుతారు. ఒకేవిధమైన భావోద్వేగాలు ప్రదర్శిస్తారు. ఆనందముతో గంతులేస్తారు. పాటలు పాడుతారు. ఇవన్నీ మనుషుల హృదయాలు కలవడానికి పటిష్ట సమాజం రూపొందటానికి దోహదపడుతాయి. పర్వదినాల కారణంగా సమాజంలో ప్రజల మధ్య ప్రేమానురాగాలు, సమైక్యతా సామరస్యాలు పెంపొందుతాయి.

సమైక్య జీవన సౌందర్యానికి ప్రతిబింబాలు పండుగలు, పర్వదినాలు, ఉత్సవాలు, జాతరలు, వేడుకలు పేరేదైనా సరే సామూహిక భక్తి చైతన్యం, సమిష్టితత్వం, సామాజిక ఐక్యత ఈ సంబరాల్లో ప్రకటిత మవుతాయి. సమస్త ప్రకృతినీ దైవ స్వరూపంగా, దివ్యశక్తిగా ఆరాధన చేసే సనాతన సంప్రదాయం మనది. ప్రకృతి శక్తి అయిన జగన్మాతను మంత్రతంత్రాలతో, యజ్ఞ యాగాదులతో అర్పించే విధానమే కాక, నిష్కల్మష భక్తితో, తమకు తెలిసిన పద్ధతిలో, తమకు అనుకూలమైన రీతిలో అమ్మను ఆరాధించే సంస్కృతి మనది. జీవ వైవిధ్యానికి ప్రతిఫలంగానే ప్రకృతి మాతను కొలుచుకొని, అనుగ్రహాన్ని పొందడానికి తెలంగాణ ప్రాంతంలో నిర్వహించుకొనే బోనాలు, బతుకమ్మ, బంజారాల తీజ్ పండుగలు చక్కటి ఉదాహరణలు.

దైవశక్తి ఏ కొందరిదో కాదు, అందరిదీ అనే భావన తెలంగాణ జానపదుల వేడుకల్లో కనబడుతుంది. తమ జీవనశైలిని సమ్మిళితం చేసి దేవతల్ని ఆరాధించే ఉదాత్త వైఖరి బోనాలు, బతుకమ్మ, లంబాడాల 'తీజ్' సంబరాల్లో వెల్లివిరుస్తుంది. ప్రకృతి శక్తి విభిన్న కళలే గ్రామదేవతలని దేవీ భాగవతం చెబుతోంది. దేవతల శుభదీవెన వల్లే గ్రామాల్లో ఎలాంటి ఉపద్రవాలు అరిష్టాలు కలగకుండా సకల సౌభాగ్యాలు చేకూరుతాయని ప్రతీతి. వర్షాలకు నెలవైన ఆషాడమాసం ప్రకృతిపరంగా ఎన్నో మార్పులకు నేపథ్యం వహిస్తుంద. ఎన్నో రోగకారక పరిస్థితులున్న ఈ తరుణంలో అన్ని అవరోధాల్నీ, అనారోగ్యకర వాతా వరణాన్ని అధిగమించాలంటే గ్రామ దేవతల ఆరాధనే మార్గమని జానపదుల నమ్మకం. తెలుగుదేశంలో ఉన్న

లంబాడాలు తెలుగువాళ్ల పండుగలతోపాటు తమ సంప్రదాయపరమైన పండుగలను, పూజలను ఆచరిస్తూ వాళ్ల సంస్కృతిని పరిరక్షించుకుంటున్నారు.

లంబాడాలు ఉత్తరాది నుంచి తమ వెంట తెచ్చుకున్న పండుగల్లో అసలు సిసలైన పండుగ 'తీజ్' భక్తిని, అనురక్తిని, ఆహ్లాదాన్ని సమపాళ్లలో పంచే పండుగ ఇది. తెలంగాణలోని 'బతుకమ్మ' పండుగను ఇది పోలి ఉంటుంది. పేర్లు వేరైనా జగన్మాత గౌరీదేవిని కన్యలు భక్తితో ఆరాధించడమే ఇందులో అంతర్ధానంగా కన్పిస్తుంఇ. ఈ పండుగ పుట్టుపూర్వోత్తరాలను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

## తీజ్ పండుగ చారిత్రక నేపథ్యం :

లంబాడాల వంశ చరిత్రను గానం చేసే భాట్ రంజోల్ బృందం తీజ్ పండుగ పుట్టుక గురించి ఒక కథను చెపుతారు. "పూర్వం నూర్ సేటు కమలాపతి రాణి పుణ్య దంపతులకు బద్దురాం అనే కొడుకు జన్మించాడు. వీరు సత్యవంతులై జీవిస్తుంటారు. వీరి సత్యవాక్య పరిపాలనను పరిరక్షించడానికి శంకరుడు, జాంబవంతుడు, కబీరుదాసు నూర్సేటు ఇంటికి వస్తారు. వీరు ముగ్గురు నూర్సేటుతో మూడు రోజుల నుండి ఉపవాసమున్నాం. మేము కోరిన భోజనం సిద్ధం చేస్తే ఈ పూట మీ ఇంట్లో భోజనం చేస్తాం లేకుంటే వెళ్లిపోతాం అని అంటారు. నూర్సేటు మీరు కోరిన భోజనాన్ని పెడతానని వాగ్దానం చేస్తాడు. ముగ్గురూ కలిసి నీ కొడుకు బద్దురాంను చంపి అతని మాంసాన్ని వంటి పెట్టాలి అని అంటారు. మాట తప్పకుండా శాకం వండుతారు. తల మాత్రం ఉట్టిపైన పెడతారు. అతిథులు "బద్దూరాం" అని పిలవగానే ఉట్టిపై ఉన్న తల 'ఓ' అని మారు పలుకుతుంది. మాకు తల మాంసాన్ని కూడా వండి పెట్టమని చెప్పి ఐదు విస్తర్లలో వడ్డన చేయమంటారు. కాని నూర్సేటు వినయంగా నా కొడుకును చంపి కూరలు వండినామని అంటాడు. అతిథులు నీ కుమారుణ్ణి పిలవమని బలవంతం చేయగా "బద్దురాం" అని పిలవగానే తన కొడుకు పునర్జీవితుడై వస్తాడు. అతిథులు నూర్సేటు దంపతుల సత్ప్రవర్తనకు, భక్తిశ్రద్ధలకు, వినయ విధేయతలకు సంతోషించి తమ నిజరూపాలను ప్రదర్శించి దంపతులను ఆశీర్వదిస్తారు. వండిన పదార్ధాలను గంగలో నిమజ్జనం చేసి పండుగను జరపమని ఆదేశిస్తారు. అప్పటి నుండి 'తీజ్' పండుగ ఆవిర్భవించిందని కథకుల విశ్వాసం. ఈ కథ శైవభక్తుడైన సిరాయళుని కథను పోలి ఉంది.

అంతేగాక పూర్వకాలంలో బంజారా దంపతులు బిడారి వ్యాపార నిమిత్తం అడవి మార్గాన వెళుతుండగా దొంగలు వచ్చి వారిని దోచుకొని బంజారాను చంపేస్తారు. అది చూసిన అతని భార్య ఆ అడిలో ఘోరంగా రోదిస్తుంది. అదే సమయంలో శివపార్వతులు ఆకాశమార్గాన వెళుతూ ఆమె చేసే శోకంను వింటారు. అప్పుడు పార్వతి శివునితో ఆమెపై దయ చూపమని కోరగా శివుడు అది మృత్యులోకమని అక్కడ చస్తూ, పుడుతూ ఉండడం సహజమని అంటాడు. అప్పుడు పార్వతి అసంతృప్తితో ఉన్నట్టుండి శివుని దగ్గర నుండి కావాలనే మాయమవుతుంది అది గమనించిన పరమేశ్వరుడు పార్వతి ఎడబాటును భరించలేక దేవీ పార్వతీ అని కేక వేస్తాడు అంతేకాదు నీవు చెపితే అది చేయడానికి సిద్ధంగా ఉన్నాను అని అంటాడు. అది విన్న పార్వతి సంతోషంతో ప్రత్యక్షమవుతుంది. పార్వతి కోరిక మేరకు ఆది దంపతులిద్దరు మృత్యువాత పడ్డ బంజారాకు అమృతం చల్లి ప్రాణం పోస్తారు. అప్పుడు బంజారా దంపులు కృతజ్ఞతతో పార్వతీ పరమేశ్వరులను కొలువగా శివపార్వతులు వారిని ఆశీర్వదిస్తూ భార్యభర్తలిద్దరూ క్షేమంగా ఉండండి మీ పేరు చిరస్థాయిగా ఎల్లప్పుడు ఉండుటకు రామగౌరీ వ్రతం చేయండి అని చెప్పగా అప్పటి నుండి బంజారాలు గౌరీ వ్రతాన్ని చేస్తూ నేటికి ఆచరిస్తూనే ఉన్నారు. హిమవంతుని కూతురు పార్వతిదేవి కఠినమైన తపస్సు చేసి శివుణ్ణి భర్తగా పొందిన సమయమే తీజ్ పండుగ పుట్టిందని డా॥. ప్రతాప్ గారన్నారు.

పార్వతీదేవి పరమేశ్వరుని పొందగోరి వనంలో కఠోర తపస్సు చేస్తూ తీజ్ ఉత్సవమును ఏర్పాటు చేసింది. జగన్మాత సాక్షాత్తు ఆదిశక్తి కావటం వల్ల భారతదేశంలోని కన్యలతో పాటు స్త్రీలు కూడా ఈ వ్రతాన్ని పాటిస్తూ తీజ్లో భాగంగా 'గణోగోర్' పూజ నిర్వహించి శివపార్వతుల విగ్రహాలను మట్టితో తయారు చేసి పూజలు చేసి నైవేద్యం పెడతారు.

ఉత్తరాదిన గణ్‌గౌరి పూజను కన్యలతోపాటు సౌభాగ్యవతులైన స్త్రీలు కూడా వైభవంగా జరుపు కుంటారు. అమ్మాయిలు మంచి భర్తలను పొందగోరి స్త్రీలు తమ సౌభాగ్యాన్ని కాపాడటానికి ఈ గౌరిపూజను ఆచరిస్తున్నారు.

**తీజ్ అంటే :**

తీజ్ అనే పదానికి సమానార్థకంగా తియాన్ అనే పదం గ్రీకు భాషలో ఉంది. ఈ గ్రీకు భాష తియాన్ అనే పదానికి దేవుడని అర్థం. కోరిన వరాలను ప్రసాదించే దేవుణ్ణి ఆరాధించడమే తీజ్ పండుగ అని ఎ.జోసఫ్ గారన్నారు.

లంబాడా కన్యలు 'తీజ్' పండుగ సందర్భంగా సేవాభాయ, మెరామ (దండియాడి)లను తొమ్మిది రోజుల పాటు అడుగడుగున భక్తితో ఆరాధించడం కన్పిస్తుంది. పరిణయ విషయంలో పార్వతీదేవి విజయం సాధిస్తే సేవాభయను భర్తగా పొందాలనే కోరిక మెరామ విషయంలో విఫలమవుతుంది. దీనికి సంబంధించిన సేవల్ మెరామాల గురించి ఐతిహ్యం ఒకటి లంబాడాల ప్రచారంలో ఉంది. తనను పెళ్లాడమని మెరామ సేవాభాయను కోరగా దానికి అతడు నిరాకరిస్తాడు. వారి మధ్య సాగిన సంభాషణాత్మక గేయం వాళ్ల మాటల్లోనే..

మెరామ : మ్యది మ్యండల్ హలదే పీసాలె
వాయ కర్లేర్ సేవల్ వాయ కరెలెరే

సేవల్ : కోని కరూంయే మెరామ మాయి
మె గ్వార్, క్వారేరో భాయ లాగు
వాయ కోని కరూంయే మెరామ వయి

**భావం :**

ఓ సేవల్ నన్ను పెళ్లి చేసుకోవడానికి పెళ్లికి కావలసిన గోరింటాకు, మంగకాయలు, పసుపు మొదలైన సామాగ్రిని సిద్ధం చేసుకో అని మెరామ చెప్పగా ఆ ప్రతిపాదనను సేవల్ సున్నితంగా తిరస్కరిస్తు నేను లంబాడ, సుదర సమాజ స్త్రీలకు మరిదినవుతాను. కావున నేను నిన్ను పెళ్లి చేసుకోలేను నీవు నాకు తల్లి సమానురాలవు.

సేవల్ సమాధానానికి ఆగ్రహించిన మెరామ తన తపశ్శక్తితో సేవల్ గోవుల మందను మాయం చేస్తుంది. అతనికి మతిస్తిమితం కోల్పోయేటట్లు చేసి నానా ఇబ్బందులు పెడుతుంది. చేసేది లేక పెళ్లి, పిల్లలు, సంసారం, కామాకాంక్ష లేకుండా మెరామతో కలిసి జీవించడానికి సేవలుం సమ్మతిస్తాడు.

"సేవాభాయ ఆధ్యాత్మికంగా గొప్ప ఋషి అతను బ్రహ్మచారిగా ఉండిపోవాలనుకొని పెళ్లికి దూరంగా ఉంటాడు. అలా ఉన్న సేవాభాయను మెరామ బల వంతంగా పెళ్లి అనే భావనలోకి దింపి అతనికి ఉన్న ఆధ్యాత్మికతను భంగం కల్గించిందని బంజారా సమాజం భావించింది. మెరామ, సేవాభాయల ఆలోచనలు వేరైనప్పటికీ వీరు ఇరువురే బంజారాలకు ప్రధాన దేవతలయ్యారు. కాబట్టి పెళ్లి చేసుకోవాలనే కోరిక కలిగిన మెరామను 'గణ్'రూపంగాను, పెళ్లి చేసుకోకూడదనే ఆలోచన కలిగిన సేవాభాయను 'గోర్' రూపంగాను 'తీజుం' సందర్భంగా పూజించే ఆచారాన్ని బంజారాలు పాటిస్తున్నారు.

అందుకే అమ్మాయిలు 'తీజ్' పండుగలో మెరామను 'గణ్'గా సేవాభాయను 'గోర్'గా భావించి వారి రూపాలను మట్టితో చేసి వాళ్లిద్దరి నూతన వధూవరులుగా చూడా లనుకుంటారు. మెరామ పెళ్లి సేవాభాయతో చేసి ఆమె కోరికను తీర్చాలనే ఉద్దేశంతో అమ్మాయిలు వారి బొమ్మలను తయారు చేయాలని ప్రయత్నిస్తారు. పెళ్లి చేసుకోకూడదనే సేవాభాయ ఆలోచనను సఫలీకృతం చేయడానికి అమ్మాయిల ప్రయత్నాన్ని అబ్బాయిలు అడ్డుకుంటారు. ఈ క్రమంలో అమ్మాయిలు మెరామ

తరపున అబ్బాయిలు సేవాభాయ తరపున ఉండి కన్యలు చేసే పనులకు అడ్డుపడుతుంటారు.

బిడారు కాలంలో మెరామ సేవాభాయను తనకు తోడుగా ఉండే విధంగా ఒప్పించి విజయాన్ని సాధిస్తే నేడు 'తీజ్' పండుగలో అబ్బాయిలు ఎంతగా అడ్డుపడినా మెరామ సేవాభాయ వివాహం జరిపించి అమ్మాయిలు తమ పట్టును సాధిస్తారు. అంతేగాక మెరామ సేవా భాయల పెళ్లి జరిపించడం ద్వారా బ్రహ్మచారులు గానే ఉండిపోతే జీవితం సంపూర్ణం కాజాలదని వివాహం చేసుకోవడం ద్వారా మాత్రమే జీవితాన్ని సంపూర్ణంగా చేసుకోవచ్చనే సందేశాన్ని అమ్మాయిలు ఈ సందర్భంగా చాటి చెబుతారు."

సేవల్ లంబాడాల ఆరాధ్యదైవమైన విషయాలే కాకుండా పశువుల కాపరిగా, పశుపతిగా గొప్ప ఋషి అయిన అనేక విషయాలు లంబాడాల మౌఖిక గేయ సాహిత్యంలో దర్శనమిస్తాయి. పై కథనాలను బట్టి సేవాభాయ కఠోరమైన నియమనిష్టలతో బ్రహ్మచర్య వ్రతాన్ని పాటిస్తూ బంజారా సమాజంలోని స్త్రీలందరిని తల్లిగా, చెల్లిగా, వదినలుగా భావించి వారి హితాన్ని కోరేవాడుగా, సర్వ ప్రాణులందు దయగల వాడుగా, పశు వుల పరిరక్షకుడుగా, కోరిన కోర్కెలు తీర్చే దేవుడుగా ఉండే సందర్భంలో లంబాడాలు తమ ఆరాధ్యదైవమైన సేవల్ను కొలిచే ఆచారం మొదలైందని స్పష్టమవుతుంది.

ఇక శక్తి రూపాలైన మెరామ (దండియాడి)లు లంబాడాల ఆరాధ్యదైవాలైన భవానీ రూపాలు కావున కన్యలు తమకు మంచి జరగాలని తీజ్ సందర్భంగా వీరిని పూజించడంలో ఆశ్చర్యం లేదు. అంతేకాకుండా అసంపూర్తిగా మిగిలిన మెరామ, సేవాభాయల పెళ్లిని తీజ్ పండుగ సందర్భంగా సంపూర్ణం చేసి తండాలో అందరి జీవితాలు సుఖమయం కావాలని, మంచి వర్షాలు కురవాలని అన్నిటికి మించి లంబాడ కన్యలు తమకు రూపవంతులు, గుణవంతులైన భర్తలను పొందడాని తీజ్ వేదికగా మెరామ, సేవాభాయలకు భక్తితో పూజలు చేసి ఆరాధించే సంప్రదాయం లంబాడాలలో తరతరాలుగా కొనసాగుతూ వస్తుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

**ముగింపు :**

లంబాడాల తీజ్ పండుగ పూర్వపరాలు పరిశీలించడం ద్వారా వారి జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు వారు ప్రకృతితో పాటు జగన్మాత గౌరిదేవిని కొలిచే విధానం ఈ పండుగకు సంబంధించిన చారిత్రక విషయాలు బహిర్గతమయ్యాయి.

**ఉపయుక్త గ్రంథ సూచికలు :**

1) ఈనాడు దినపత్రిక, ఆదివారం స్పెషల్ 17-05-1998
2) డా॥. జనపాల శంకరయ్య, తెలుగు లంబాడాల గేయ సాహిత్యం.
3) బి. చీనియానాయక్, బంజారా చరిత్ర, సంస్కృతి, ప్రగతి.
4) డా॥. డి.ఆర్. ప్రతాప్, ఫెస్టివల్స్ ఆఫ్ బంజారాస్.
5) ఎ. జోసఫ్, బంజారాలు వారి పండుగలు.

❖❖❖

# రామాయణ కావ్యాల విశిష్టత-హనుమంతుని పాత్ర చిత్రణ

- డా॥. ఆర్. రమాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్. తెలుగు విభాగం, డా. బూర్గుల రామకృష్ణారావు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్చర్ల, మహబూబ్ నగర్.

వాల్మీకీ రామాయణంతో పాటు తెలుగు రామాయణాల్లో రంగనాథరామాయణం, భాస్కరరామాయణం, మొల్లరామాయణం, రామాయణ కల్పవృక్షం మొదలైన కావ్యాల్లో హనుమంతుని పాత్రాచిత్రణ చక్కగా వర్ణించబడింది. ముందుగా భారతీయ రామాయణ కావ్యాల వికాసాన్ని వివరిస్తూ అందులో హనుమంతుని యొక్క పాత్రాచిత్రణను వివరించడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశ్యం.

అధ్యాత్మ రామాయణం ఆధ్యాత్మిక దృష్టితో రామగాథను వర్ణించింది. కాళిదాసాది కవులు రసదృష్టితో రామాయణాన్ని రచించారు. దాదాపుగా సంస్కృత సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లో రామకథ ఉంది. శవ్యకావ్యాల్లో ముందుగా చెప్పుకోవలసింది కాళిదాసు రచించిన రఘువంశం. ఈ కావ్యంలో 19 సర్గలున్నాయి. దీనిలోని వస్తువు రఘువంశ రాజుల చరిత్ర. రఘువంశంలో 9 నుంచి 15 సర్గల్లో శ్రీరాముని చరిత్ర ఉంది. తరువాత క్రీ.శ.5,6 శతాబ్దాలకు చెందిన కుమారదాసు జానకీ హరణం అనే కావ్యాన్ని రచించాడు. దీంట్లో 20 సర్గలున్నాయి. భట్టి మహాకవి రావణకథ అనే కావ్యాన్ని రాసాడు. ఈ కావ్యం అనేక వ్యాకరణ సూత్రాలకి, అలంకారాలకి లక్ష్యంగా చెప్పబడింది. అభినందనుడు 9వ శతాబ్దానికి చెందిన కాశ్మీరకవి. ఇతడు 36 సర్గల రామచరిత కావ్యాన్ని అసంపూర్ణంగా రచించాడు. తరువాతి కాలంలో ఇద్దరు కవులు దాన్ని పూరించారు. రామకథను వర్ణించిన శ్రవ్యకావ్యాల్లో ముయమైనవి - మాధవ విద్యారణ్యులు వ్రాసిన రామోల్లాసం. వామన భట్ట భాణుడు వ్రాసిన రఘునాథ చరిత్ర. అభిరామ కామాక్షి వ్రాసిన అభినవ రామాభ్యుదయం. శరభోజి వ్రాసిన రాఘవ చరిత్ర.

సంస్కృత చంపూకావ్యాల్లో ప్రసిద్ధ మైంది భోజుడు రచించిన రామాయణ చంపవు. ఇది బాలకాండ నుండి సుందరకాండ వరకే ఉంది. తరువాత లక్ష్మణసూరి యుద్ధకాండని రచించి దీన్ని పూరించాడు. వెంకటా ధ్వరి ఉత్తర రామాయణ చంపువును వ్రాసాడు.

సంస్కృత సాహిత్యంలో రూపకాలకొక ప్రత్యేక స్థానముంది. భాసుడు, భవభూతి, జయదేవుడు, యశోవర్మ మొదలైన ప్రసిద్ద రూపక కర్తలు రామకథ ఆధారంగా రచించారు. ఇవన్నీ విశ్వవిఖ్యాతిని పొందినవే. భాసుడు సంస్కృత రూపక కర్తల్లో మొదటివాడు. ఇతడు 13 రూపకాలు రచించాడు. వీటిలో ప్రతిమ, అభిషేకం రామకథను ఆశ్రయించుకొన్నవి. ప్రతి నాటకంలో 7 అంకాలున్నాయి. దశరథుని మరణం మొదలుకొని రాముని పట్టాభిషేకం వరకున్న రామకథ ఈ 7 అంకాల్లో విస్తరించి ఉంది.

భవభూతి కరుణరసానికి పట్టం గట్టిన నాటకకర్త. అతడు వ్రాసిన మూడు నాటకాల్లో రెండింటికి రామాయణమే ఇతివృత్తం. ఒక మహావీర చరిత. రెండవది ఉత్తర రామచరిత. మహా వీర చరితలో భవభూతి పూర్వ రామాయణ కథనే గ్రహించాడు. ఉత్తర రామచరితలో ఉత్తర రామాయణం ఇతివృత్తం. ఈ విధంగా రెండు నాటకాల్లో సంపూర్ణ రామాయణ వర్ణన జరిగింది. ఏకోరసః కరుణ ఏవ' అని సిద్ధాంతం చేసి, అందుకు తిరుగులేని నిదర్శనంగా 'ఉత్తర రామచరిత' ను వ్రాసాడు భవభూతి. వాల్మీకి రామాయణం విషాదాంతం. భవభూతి ఉత్తర రామచరిత సుఖాంతం. చివరలో సీతారాములను కలపటంతో పాటు ఎన్నో అవాల్మీక కల్పన ఇందులో ఉన్నాయి.

ఆంజనేయుడు శ్రీరామ భక్తులలో ప్రథమగణ్యుడు

రుద్ర వాయు అంశ సంభూతుడు అంజనీ తనయుడు. ఆకృతి మేరు నగ సమానం. వేగం మనోవేగం, మహోన్నతం. శౌర్య, పరాక్రమాలలో, వాక్పటిమలో సాటి మేటి మారుతి. అంతే కాదు అతి బలశాలి, మహా ధీశాలి సంభాషణా చతురుడు. విద్వాంసుడు, నవ వ్యాకరణ వేత్త, శక్తి సంపన్నుడు, భగవంతుని తత్వగుణ రహస్యా లను ఎరిగిన సంపన్నుడు, ఇచ్ఛారూపం ధరించగల సమర్థుడు కేసరీనందనుడు సుగ్రీవుని మిత్రుడు సచివుడు పవనకుమారుడు.

చిన్నతనంలోనే పండు తినాలనే కాంక్షతో సూర్య బింబాన్ని పండుగా భ్రమించి మింగివేసిన సాహసి. ఆ తర్వాత కాలంలో సూర్య భగవానుని వద్దనే వేదాలు, శాస్త్రాలు అభ్యసించిన వేత్త.

పరస్పర కలహాలలో అన్నవాలి (వానర రాజు) చేతిలో ఓడి. రాజ్యాన్ని కోల్పోయిన సుగ్రీవుడు ఋష్యమూక పర్వతంపై తలదాచుకున్నప్పుడు, తన రాజును వెంట నంటి ఉన్న మిత్రుడు, సచివుడు సమీర కుమారుడు అడవులలో సంచరిస్తున్న రామలక్ష్మణులను చూసి భయపడిన సుగ్రీవుడు పంపగా వెళ్లి, శ్రీరామునితో నేర్పుగా మాట్లాడి ఒకరి నొకరికి ఎరుక పరచి, వారిరువురికి అగ్ని సాక్షిగా మైత్రి గావించి వాలి వధానంతరం సుగ్రీవుని కిష్కింధ రాజ్యానికి రాజును చేయించడం హనుమ ప్రభు భక్తికి తార్కాణం.

రావణుడు అపహరించిన సీత జాడ కనుగొనడంలో హనుమంతునిదే ప్రముఖ పాత్ర సుగ్రీవాజ్ఞను శిరసావహించి, సీతాన్వేషణకు బయలుదేరుతున్న వానరు లలో, హనుమంతుని కార్యదీక్ష తనెరిగిన శ్రీరాముడు తన గుర్తుగా చూపించుటకు అంగుళీయకం అంజనేయుని చేతికే ఇవ్వడం విశేషం. నా తరమా ఈ సాగరం దాటడం అని ఉదాసీనంగా కూర్చున్న

హనుమకు నిగూఢంగా ఉన్న తన శక్తి సామర్థ్యాలు గుర్తు చెయ్యగానే ఒక్క ఉదుటున లేచి, సముద్రాన్ని దాటి లంకను భస్మీ పటలం చేయనా'' రావుణుని వంపి సీతమ్మను తీసుకురానా? రావణుని మెడకు తాడుకట్టి లాక్కురానా? సీతమ్మను చూసి మాత్రమే రానా ! అంటాడు విజృంభిస్తాడు. ఈ పనులన్నీ చేయగల సమర్థుడిని నేనేనని చెప్పకనే చెబుతాడు. ఇలా. అనడంలో హనుమంతుని ఆత్మబలం, ఆత్మ విశ్వాసం ద్యోతక మవుతాయి.

లంకా నగరంలో సీతమ్మను వెదుకుతున్న సమయంలో అస్తవ్యస్తంగా, అర్ధనగ్నంగా పడి నిద్రపోతున్న రాక్షస స్త్రీలను చూడడం తటస్థించినా, మనసు చలించని నిర్వికారుడు. అతని ధ్యాసంతా సీతాన్వేషణ పైనే కర్తవ్యోన్ముఖులైన వారు ఎట్టి పరిస్థితులలోనూ మనో వికారాలు పొందతండదు అన్న పాఠం. మనకు చెబు తున్నాడు అనిల కుమారుడు.

లంకలోని అశోక వనంలో అవనిజ సీతను చూశాడు. ఆయన రామదూతనన్న నమ్మకం ఆమెకు కలిగించాలి. అసలే రాక్షసమూకల మాయలతో సతమతమవుతున్నది సీతమ్మతల్లి, లేని అనుమానం ఎందుకని హనుమ చిన్న కోతిగా మారి, పెద్ద చెట్టు ఎక్కి కూర్చొని. అనేక గుర్తుల ద్వారా ఆమెను సీతగా గుర్తించి, శ్రీరామనామ నిగూఢ సంకీర్తన ద్వారా ఆమె దృష్టిని ఆకర్షించి, పరిచయా నంతరం. గుణరాముడి ఆనవాలుగా ఇచ్చిన ఉంగరం సీతమ్మకిచ్చి కుశలములడిగి, కుశలములు తెలిపి (రామ లక్ష్మణులవి) సీతమ్మకు ఊరట కలిగించి ఆమె కృపకు పాత్రుడయ్యాడు ఆ పావని.

విజయోత్సాహంతో తిరిగి వచ్చి, శ్రీరామునికి శుభవార్త అందించడంలోనూ ఎంతో నేర్పు చూపించాడు. రాముడు ఎదురు చూస్తున్నది సీతమ్మ క్షేమవార్త వినడానికే అందుకని శ్రీ రాముడిని చూడగానే చూశాను సీతను అంటూ సంభాషణ మొదలుపెట్టి, సీతమ్మ ఇచ్చిన ఆనవాలు చూడామణిని అందించి, అక్కడ జరిగిన విషయాలు, విశేషాలు సవివరంగా నివేదించాడు. బుద్ధి కుశ వ్యక్తం చేస్తూ లంకలోని వారికి తన బలం చూపించా లని అక్కడి వనాలను ధ్వంసం చేసి, ఎదుర్కొన్న

రాక్షసులను హతమార్చి, రావణుని ఎదుటపడి, రాముని బలమెరిగింది. హితవులు పలికాడు. రావణుడు ఆగ్రహంతో హనుమంతుని తోకకు నిప్పు అంటించమంటే, ఆ నిప్పుతోనే లంకను కాల్చి, చూసి రమ్మంటే కాల్చి వచ్చాడు అనే నానుడికి మూలమయ్యాడు.

శ్రీరాముడు సముద్రుని సూచనమేరకు సముద్రంపై వారధి నిర్మించి, లంకలో ప్రవేశించి, రావణునితో యుద్ధంలో హనుమంతుడు ప్రముఖపాత్ర పోషించాడు. మేఘనాథుడు వానర సైన్యాన్ని నిస్తేజం చేసినప్పుడు, లక్ష్మణుని మూర్ఛాగతుని చేసినప్పుడు సంజీవని మూలిక కోసం పర్వతమే తరలించి తెచ్చి ప్రాణదానం. చేశాడు. అందుకే ఒక్క హనుమంతుడు సజీవంగా ఉంటే వానర సైన్యమంతా సజీవంగా ఉన్నట్లే అంటాడు జాంబవంతుడు. సంజీవని తెచ్చిన సందర్భంలో రాముడు కృతజ్ఞతలో హనుమంతుని హత్తుకున్నాడు. అటువంటి కౌగిలింత ఎన్నడైనా, ఎక్కడైనా, ఎవరికైనా లభించిందా? హనుమంతుని జన్మ ధన్యం. జన్మ సాఫల్యానికింతకంటే ఏం కావాలి.

యోగ యోగాంగ సంయుక్త! యోగప్రియా !
యోగముద్రాన్వితా! యోగనిద్రాంచితా !
యోగలక్ష్యావనా! యోగ సిద్ధిప్రదా !
యోగమాయాశ్రయా! యోగ యోగీశ్వరా !
సీతారామాంజనేయ సంవాదం, లింగమూర్తి కవి.3-10

యోగాలు, యోగాంగాలు నీలోనే ఉన్నాయి. యోగాలను నీవే ఆసక్తిగా ఆచరిస్తావు. యోగముద్రతో జీవుడు బ్రహ్మతో ఐక్యమయినట్టు చూపిస్తావు. నిర్వికల్ప సమాధి వలన పరిపూర్ణుడివైన నీలాగా వేరే ఎవ్వరూ లేరు. యోగంతో జీవించేవారిని రక్షిస్తావు. యోగసిద్ధిని ఇచ్చేవాడివి నీవే. యోగమాయకు ఆధారం నీవే. సకల యోగాలలో నీవే ఉత్తముడవు.

ఆంజనేయుడు శ్రీరామబోధిత తారక- సాంఖ్య సమాధినుండి మేల్కొని శ్రీరామగురునికి ఈ క్రింది పద్యంలో ఎన్నో యోగవిశేషాలు చెప్పారు. ఆ యోగ విశేషణములలో ఎన్నో యోగప్రక్రియలు ఉన్నాయి. అవి 1) యోగముద్ర, 2) యోగనిద్ర వగైరా. ఈ విధంగా ఆంజనేయుడు చేసిన రామస్తుతిని సీతారామంజనేయ సంవాం కావ్యంలో లింగమూర్తి కవి వివరించారు.

శా. దత్తాత్రేయగురుస్వరూప! నిజభక్తాంత స్తమోదీప! స
చ్చిత్తానందకరానులాప! ఖమరుచ్చిత్రాంశువార్భూప! ధీ
వృత్తిత్యాగకలాప! నిత్యసుఖసంవిద్వ్యాప! శుద్ధాత్మ శ
శ్వత్తేజోభిహతాదిపాపా! సుజనేష్టప్రాపకా! వ్యాపకా!
సీతారామాంజనేయ సంవాదం,
లింగమూర్తి కవి. 3-204

అత్రిముని పుత్రుడయిన దత్తాత్రేయుని స్వరూపం గలవాడా! భక్తుల మనసులలోని అజ్ఞానమనే చీకటిని తొలగించినవాడా. సచ్చిదానంద రూపుడైన బ్రహ్మంను తలపించే సంభాషణలు కలవాడా. ఆకాశం, గాలి. అగ్ని, నీరు, భూమి అనే పంచభూతాలను రక్షించువాడా! రాగ ద్వేషాలు వదులటే అలంకారంగా ఉన్నవాడా. శాశ్వత బ్రహ్మానంద రూపమైన జ్ఞానంచే వ్యాపించినవాడా! నిత్యమైన ప్రకాశం చేత వెలుగొందువాడా! ఓ సర్వాంతర్యామి.

క. ప్రణవాత్మక! సదసత్కారణ! సంపూర్ణప్రభాభిరామ
! సుగుణ ! ని
ర్గుణ! నిర్వికార! నారాయణ! సీతారామగురు
మహాదేవ ! శివా !

తృ.యా 205

తా. ఓంకార స్వరూప, సకల జగానికి కారణభూతుడా! శాంతితో నిండిన మనోహరమైనవాడా! కల్యాణ గుణాత్మకా! ప్రకృతిగుణ రహితుడా! వికారం లేని నారాయణ స్వరూపా! మంగళస్వరూప. సీతారామ స్వరూపమైన మమదేవ. ఘనతరసువివేకా! కల్పితాశేషలోకా ! ఘనతరసువివేకా! కల్పితాశేషలోకా ! వినమితబుధలోలా! విశ్వవిఖ్యాతలీలా ! తీర్థయాత్రలు చేస్తూ పావనమైన గంగా మొదలగు పుణ్య నదులలో స్నానంచే ఆ పవిత్రాలను గంగా మొదలైన పుణ్యలోకాలను కూడా పవిత్రం చేసే ప్రభావం కలవాడగును.

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

జనసుతగుణతంత్రా! సర్వతంత్రస్వతంత్ర!
మునిసరసిజమిత్రా! మోక్షలక్ష్మీకళత్రా!

తృ.యా 206

తా. మంచి జ్ఞానం కలవాడా, సకల లోకాలను నిర్మించినవాడా, పండితులతో పొగడబడినవాడా, మంచి నడవడిక గలవాడా, జనుల పొగడ్తలకు దీనుడవు. సర్వశాస్త్రాలలో అధికారం ఉన్నవాడా! రుషులకు ఆప్తుడవు. ముక్తికాంత భార్యగాగలవాడా !

నానా విధ కర్మ, వాస, నామయమగు మనస్సు నశింప నిచో బ్రహ్మానంద అనుభవము అసంభవము మనో నాశనమే బ్రహ్మానంద ప్రాప్తికి హేతువు పరమానంద రూపమగు అట్టి స్థితియే జీవన్ముక్తి అని శ్రీరామచంద్రుని ఉపదేశము. శాంత రసాత్మకములగు సీతారామాంజనేయ సంవాద కావ్యము సత్త్వగుణ బంధురమై చివర బ్రహ్మా కారమును పొంది, బ్రహ్మమును లయించు చున్నది. జీవిత పరమార్ధమగు పరమేశ్వర భావనము సాధింప దలచిన వివేకవంతులకు శాంత రసాత్మక కావ్యములే ఉపదేశములు అని ఈ కావ్య కర్త వివరించెను. అని హనుమంతుడు శ్రీరాముని స్తుతించాడు.

రావణ వధానంతరం లంకకు విభీషణుని రాజును చెయ్యడం. సీతను విడిపించి రామునకందించడం. భరతునికి శ్రీరాముని ఆగమన వార్త అందించడం, అయోధ్యలో శ్రీరామ పట్టాభిషేకం జరగడం. అన్నింటిలో హనుమంతుడు కీలకపాత్ర పోషించాడు. అనంతరం శ్రీరామ పాదసేవలోనే ఉండిపోయి, తరించి, చిరంజీవి అయ్యాడు. శ్రీరాముడు అవతార సమాప్తి చేస్తూ హను మంతుని జగత్కల్యాణార్థం భూమి మీద ఉండమని ఆదేశించాడు. శ్రీరామాజ్ఞను శిరసావహించి శ్రీరాముని పవిత్రగాథ ప్రచారంలో ఉన్నంతవరకు అతని ఆదేశాను సారం భూమండలంలో ఉంటానన్నాడు ఆ చిరంజీవి, అస్వామి భక్తుడు, ఆరామదూత. రామభక్త హనుమ, రామనామ తారకమంత్ర జపానురక్తుడు. భగవద్భక్తి, వీరత్వం, ధీరత్వం, బలం, యశస్సు, పౌరుషం, విద్య, సాహసం, చాతుర్యం, కార్యదీక్ష, పాండిత్యం ఆదిగాగల గుణసంపన్నుడు హనుమ. ఆ గుణాలను, అందులో కొన్నైనా ప్రసాదించమని హనుమామము దయ గనుమా అని వేడుకుందాం. భగవంతునితో సమంగా పూజలందు కుంటున్న ప్రత్యేకత శ్రీరామభక్త హనుమానుడే.

**ఆధార గ్రంథాలు :**

1. వాల్మీకి రామాయణం, బాలకాండం, 48వ సర్గము
2. రామాయణం- వాల్మీకి విరచితం, గోరక్‌పూర్ ప్రెస్, 2002
3. గోనబుద్ధారెడ్డి- రంగనాథ రామాయణం,
4. భాస్కరుడు- భాస్కర రామాయణం
5. వావిల కొలను సుబ్బరావు-ఆంధ్రవాల్మీకి రామాయణం

❖❖❖

# తెలుగు సాహిత్యంలో వచన ప్రక్రియ వికాసం

- రెబ్బ మల్లికార్జున్, పరిశోధక విద్యార్థి

పద్యం, గద్యం, గేయం వచనకవిత తెలుగు కవిత్వా రూపంలో పరిణామక్రమం. ప్రాఙ్నన్నయ యుగంలో ఆశు సంప్రదాయానికి చెందిన కవితారూపం గేయం. కాలాను గుణమైన మార్పులకు లోనవుతూ ఆధునిక యుగంలో కూడా ఇంకా జీవించివున్న ప్రక్రియ గేయం. నన్నయ ప్రధానంగా కొన్ని సంస్కృత ఛందస్సులను తెలుగు కవిత్వంలో స్థిరపరిచాడు. వీటితోపాటుగా మరికొన్ని గేయ ఛందస్సులు పద్యాలుగా స్థిరపడిపోయాయి. మనకు పదకొండవ శతాబ్దం నుంచి ఇరవయ్యో శతాబ్దం ప్రారంభం దాకా ప్రధానంగా వున్నది పద్య కవిత్వమే. ఆ తర్వాత 1930 దశకంలో 'వచన కవిత' అన్న ఆధునిక కవితా ప్రక్రియ ఆవిర్భవించింది. ఈ ప్రక్రియ ఆవిర్భావ వికాసాలకు పాశ్చాత్య కవిత్వా ధోరణులూ, అభ్యుదయ సాహిత్యోద్యమము ప్రభావితం చేశాయి. దీన్ని ఫ్రెంచిలో VerseLibre అనీ, ఇంగ్లీషులో FreeVerse అనీ అంటారు. ఈ ప్రక్రియను ఫ్రెంచి సాహిత్యంలో జూలిస్ లా ఫోర్జ (Julesla forgue) ప్రారంభించాడు. 1.తర్వాత ఇది ఆంగ్ల సాహిత్యంలోకి పాకింది. క్రమంగా తెలుగులోకి విస్తరించింది.

ఆంగ్ల సాహిత్యంలో ఖీతీవవఎవతీంవ ఒక ఆధునిక ప్రక్రియగా రూపాన్ని ధరించక ముందు షేక్స్పియర్, మిల్టన్ మొదలైన ప్రాచీన కవుల రచనల్లో ఆ ప్రక్రియ లక్షణాలు కొన్ని అక్కడక్కడా లేకపోలేదు.

వచన కవిత తెలుగు సాహిత్యంలో ప్రధానస్రవంతి ప్రక్రియ. దాని మూలాలు ప్రాచీన తెలుగు సాహిత్యం లోనూ, ఆధునిక పాశ్చాత్య సాహిత్యంలోనూ వున్నాయి. వచన కవిత, ముక్తచ్ఛందం, వచనపద్యం వంటి పేర్లతో మాత్రమే కాక మినీకవిత, ప్రపంచపది, హైకూ, నానీ, వామీ వంటి వివిధ రూపాల్లో కూడా వికసించిన కవితా ప్రక్రియ ఇది. ప్రపంచ సాహిత్యంలో తెలుగు పద్యాని కుండేటంత సంక్లిష్టమైన, సువ్యవస్థితమైన ఛందస్సు సంస్కృతంతో సహా మరే భాషా సాహిత్యాల్లోనూ కని పించదు. ఆ నేపథ్యంలో చూస్తే తెలుగు వచన కవిత కూడా అంత బలంగా, తక్కిన ప్రపంచ సాహిత్యాలకు ధీటుగా వికసించిందని చెప్పవలసి ఉంటుంది. కేవలం సాహిత్యప్రక్రియగా మాత్రమేకాక, వ్యక్తిని సాధికరికం చేయడానికీ, సమాజాన్ని చైతన్యవంతం చేయడానికీ, వివిధ సమూహాలు తమ ఉనికిని చాటిచెప్పుకోడానికీ ఊతమిస్తూ, అత్యంత ప్రజాస్వామిక లక్షణంతో తెలుగు సాహిత్యంలో విశిష్టమైన రాజకీయపాత్రను కూడా పోషిస్తూ వుంది. ఆధునిక తెలుగు వచన కవిత ఆధునిక పాశ్చాత్య సాహిత్యం వల్ల పుట్టి పెరిగిందనడం పరిపాటి.

యూరోప్‌లో తలెత్తిన మతసంస్కరణోద్యమాన్ని (1517-1648)కీ, ఫ్రీవెర్స్‌కీ దగ్గర సంబంధముంది. మత సంస్కరణోద్యమం తోటే యూరోప్‌లో బూర్జువాజి, వ్యక్తి వాదమూ బలపడ్డాయి. ఫ్రీ వెర్స్ కూడా వ్యక్తినిష్టమేనన్నది మనం మరోసారి గుర్తు చేసుకోవాలి. ఫ్రీ వెర్స్ మూలాలు పాశ్చాత్య క్రైస్తవమత పరిణామాల్లో చూడటం ఇటీవలి పరిణామం. బైబిల్ నుంచి, హీబ్రూ కవిత్వం నుంచి నేరుగా ప్రభావితుడైన వాల్ట్ విట్మన్ (1819-1892)ని నేడు వచనకవితా పితామహుడిగా ప్రపంచం భావించడంలో ఆశ్చర్యం లేదు. ప్రాచీన తెలుగు సాహిత్యంలోనూ, ప్రాచీన పాశ్చాత్య సాహిత్యాల్లోనూ వచన కవితా మూలాలు చూసినప్పుడు మనకి మూడు విషయాలు బోధపడతాయి: ఒకటి, రాజకీయంగా, మతపరంగా అవ్యవస్థ, అనిశ్చితి నెలకొన్నప్పుడు పాతవ్యవస్థలు కూలి పోతున్నప్పుడు వచన కవిత వికసించిందని, రెండు, పాతవ్యవస్థల సంప్రదాయాల నుంచీ, నియమ నిబంధనల నుంచీ వ్యక్తి విడివడటానికి చేసే ప్రయత్నంగా అది వికసించిందని, మూడు, అటువంటి ప్రయత్నం

అన్నిటికన్నా ముందు ఛందోనియమల్ని తిరస్కరించడంగా బయటపడిందని.

ఛందోనియమాల నుండి వచన కవిత విడివడటంలో వివిధ రూపాలు తీసుకున్నప్పటికీ, సంస్కృత, తెలుగు లాక్షణికులూ, పాశ్చాత్యలాక్షణికులూ చెప్తున్నదాన్ని బట్టి స్థూలంగా మూడు రూపాలు గుర్తుపట్టవచ్చు. మొదటి రూపంలో సాంప్రదాయిక ఛందస్సుని వదులు చెయ్యడం ద్వారా ఏర్పడే కవిత. దీన్ని వృత్తగంధి / బిరుదుగద్య/ బ్లాంక్ వెర్స్ అనవచ్చు.. ఎక్కడెక్కడైతే వ్యక్తి సామాజిక చట్రం నుంచి పూర్తిగా విడివడాలని కోరుకోకుండా, కొద్దిపాటి వెసులు బాటును కోరుకుంటున్నాడో, అక్కడక్కడల్లా ఇటువంటి వచన కవిత వికసించింది. రెండవరూపం పూర్తిగా ఛందస్సు నుంచి విడివడ్డ రూపం. దీన్ని చూర్ణం / చూర్ణిక / ఫ్రీవెర్స్‌గా చెప్పవచ్చు. ఎక్కడెక్కడైతే వ్యక్తి తన సమకాలీన సామాజిక నియమాల నుండి విడివడి సామాజిక చట్రం మీద పూర్తిగా తిరుగుబాటు చేస్తాడో అక్కడక్కడల్లా ఇటువంటి కవిత వికసిస్తూ వచ్చింది. ఇక మూడవరూపంలో అది పాద విభజనని పూర్తిగా తిరస్కరించి వచన రూపంలో ఉండే కవిత. దీన్ని వచనం /విన్నపం / ప్రోజ్ పొయెమ్‌గా గుర్తించ వచ్చు. ఇది వైయక్తిక ధోరణికి పూర్తి పరాకాష్ఠ.

ఆధునిక వచన కవిత అమెరికాలో, ఫ్రాన్సులో 19వ శతాబ్దంలోనే పుట్టినా తెలుగులో మొదటి ప్రపంచ యుద్ధానంతరం దాకా పుట్టలేదు. ఇందుకు కారణం గురజాడ. ఆయన వ్యావహారిక భాషనీ, మాత్రాఛందస్సుల్నీ వాడటం ద్వారా సంప్రదాయం మీద చెయ్యవలసిన తిరుగుబాటును చాలా వరకు సాధ్యం చేసేశాడు. దానికి తోడు భావకవులు కూడా ఇంగ్లీషు రొమాంటిసిస్టుల బాటలో దేశిఛందస్సుల్నీ, పాటనీ స్వీకరించడంతో ఆధునిక తెలుగు సాహిత్యానికి వచన కవిత అవసరం వెంటనే కనబడలేదు.

తొలిరోజుల్లో కృష్ణశాస్త్రి వల్ల తీవ్రంగా ప్రభావితుడైన శ్రీశ్రీ రాసిన 'కేళి' (1931) అనే ఈ కవితను మనం మొదటి ఆధునిక వచనకవితగా భావించవచ్చు.

నిదురవలె, నిదురలో
నొదవు స్వప్నము వలె
అడుగు సడిలేక నన్నావరించెదవు
గాలివలె, గాలిలో
తేలు సౌరభము వలె
చూచాయకొలుపకే
సురిగిపోయెదవు
ఎపుడొ నీ ఆగమన
మెపుడొ నీ నిష్క్రమణ

ఆ తరువాత 'విద్యున్మాలికలు' (1933), 'బాల్యం' (33), 'ఆకాశదీపం' 1934 వంటి కవితల్లో శ్రీశ్రీ స్పష్టంగా ఛందస్సును తెంచుకున్న వైనం కనిపిస్తుంది. 1937లో రాసిన 'వ్యత్యాసం', 'వాడు' కవితలు పూర్తిగా వికసించిన వచన కవితలు. అందుకనే ఇప్పటికీ చాలామంది తెలుగులో వచన కవిత 1937లోనే పుట్టిందని చెప్తుంటారు. అయితే, శ్రీశ్రీ వచన కవిత ఛందస్సును వదులు చేసు కోవడంలోంచి పుట్టిన ప్రక్రియ కాబట్టి దీన్ని బ్లాంక్‌వెర్స్ అనవచ్చు. ఇటువంటి వృత్తగంధి వచన కవిత్వాన్ని మరింత స్పష్టంగా ముందుకు తీసుకువచ్చిన కవి శిష్ట్లా ఉమామహేశ్వరరావు. అతడి నవమిచిలుక (1939) నుంచి ఒక ఉదాహరణ. పూర్తిగా ఛందస్సును కూల దొయ్యాలని పుట్టిన వచన కవిత పఠాభిది. 'ఫిడేలురాగాల డజన్' (1939)ని మనం తెలుగులో మొదటి ఫ్రీవర్స్ సంపుటంగా చెప్పవచ్చు.

ఎవర్నని యనుకొంటిరో మీరునన్ను
ఏను పఠాభిని...
కాంగ్రెసు రాష్ట్రపతి స్థానానికోసం
బాబూసుభాసు బోసుతో పోటీజేసి
ఓడిపోయిన డాక్టర్ పట్టాభిని
గాన్నేను, మరో పఠాభిని

అని సాగే ఆత్మకథ కవిత సంస్కృత అలంకారికుల

మాటల్లో చెప్పాలంటే నిజమైన చూర్ణం. అది ఛందస్సునే కాదు, అన్ని సాంప్రదాయిక విలువల్నీ, విశ్వాసాల్నీ ధ్వంసంచేసి పొడిపొడిగా మార్చేసినకవిత. అసలు ఆధునికత ముఖ్యలక్షణం డిస్టార్ట్ చెయ్యడమే ననుకుంటే పరిపూర్ణ ఆధునికతా లక్షణాన్ని పొదివి పుచ్చుకున్న కవిత ఇది. 'నాకు విచిత్రంబగు భావాలు కలవు/ నా కన్ను లందున టెలిస్కోపులు/ మయిక్రోస్కోపులున్నవి' అనే మాటలు చెప్తున్నది ఆ డిస్టార్టింగ్ లక్షణాన్నే. 'ఈ వచన పద్యాలనే దుడ్డుకర్రల్తో/ పద్యాలనడుముల్ విరుగ దంతాను/ చిన్నయ్ సూరి బాలవ్యాకరణాన్ని/ చాలా దండిస్తాను' అనడంతో వచనకవిత కేవలం ఛందస్సు మీద మాత్రమే కాక వ్యాకరణం మీద కూడా ధిక్కారం ప్రకటించింది.

40లకు వచ్చేటప్పటికి వచన కవిత పెద్ద పెద్ద అంగలు వేయడం మొదలు పెట్టింది. ఈసారి కూడా ముందు నడిచినవాడు శ్రీశ్రీనే. 'డీ కంపోజిషన్స్' (40) పేరిట రాసిన కవితలో కొంత పద్యగంధం ఉన్నప్పటికీ, ఇంగ్లీషు, తెలుగు కలిపి ఉపయోగించడంతో పాటు అధివాస్తవిక భావాలను మొదటిసారిగా ప్రకటించిన కవిత అది.

కాకికేమి తెలుసు
ఆటవెలది ద్విపద కత్తగారు
5,3,2 ఆముక్తమాల్యద
విశ్వదాభిరామ వినురవేమ

ఇది ఒకరకంగా ఆటవెలది పద్యమేగాని, దీన్ని వచన కవితా ప్రయోగంగానే మనం భావించవలసి ఉంటుంది. 40ల్లో శ్రీశ్రీ జేమ్స్ జాయిస్, ఆంద్రే బ్రెటన్, గిలాం అపొలినర్, సాల్వడార్ డాలి, పాల్ ఎలార్డ్ వంటి ఆధునిక కవుల, కళాకారుల కవితల్ని కూడా విరివిగా అనువాదం చేశాడు. కవితా నిర్మాణ రీత్యా ఈ మొత్తం దశకంలో శ్రీశ్రీ రాసిన పరిపూర్ణ వచనకవితగా 'ఎన్నాళ్ళు ఇంకా' (1944) చెప్పవచ్చు.

1940ల్లో శ్రీశ్రీ వచన కవితని ప్రధానంగా ప్రయోగాలకూ, కొత్తపోకడలకూ అనువుగా వాడుకున్నందువల్ల, ఆయన బాటలోనే ఆరుద్ర వచనకవితను ప్రయోగాత్మక కవితగానే భావించాడు. ఆరుద్ర 'త్వమేవాహమ్' (1949) తెలుగులో తొలి వచన కావ్యమే కాక, ఆద్యంతం ప్రయోగాత్మకంగానే సాగింది. కాని అదే దశకంలో గళం విప్పిన వరద రాజేశ్వరరావు (1948), కుందుర్తి (1944), బాలగంగాధర తిలక్ వచన కవితను ప్రయోగాత్మక కవితగాకాక, స్పష్టమైన సామాజిక ప్రయోజనానికి అనువుగా వాడుకోడానికి ప్రయత్నించారు. కాని వారి గళాలు ఇంకా రానున్న దశకంలోగాని రాటుతేలలేదు. వారితో పాటే 'రోజూ చూస్తూనే ఉన్నాను' (1948) అంటున్న అజంతా, 'చీకటినీడలు' చిత్రిస్తున్న బైరాగి కూడా. ఈ దశాబ్దంలో చెప్పుకోదగ్గ మరో గళం దాశరథి కృష్ణమాచార్య, ఆయన 'అగ్నిధార' (1949)లో అద్భుతమైన పద్యాలతో పాటు కొన్ని మేలిమివచన కవితలు కూడా లేకపోలేదు. కాని వాటి నిర్మాణం గేయపద్ధతినే తల పిస్తుంది. వచన కవితలో ప్రయోగాత్మకతతో పాటు, సామాజిక ప్రయోజనాన్ని కూడా సాధించాలనుకుని బలంగా కవితలు చెప్పిన కవి శ్రీరంగం నారాయణబాబు. మొత్తం నలభైల వచన కవులందరిలోనూ అత్యంత శిల్పపరిణతి సాధించిన గొంతు నారాయణ బాబుదేనని చెప్పవలసి వుంటుంది.

ఈ దశకంలో స్పష్టమైన సొంతగొంతు సాధించుకున్న బాలగంగాధర తిలక్ ప్రధానంగా వృత్తగంధి వచనమే రాసాడు. 'అద్వితీయం' (1958) అనే కవితలో తిలక్ విశ్వనాథ తరహా సాంప్రదాయిక చేతననీ, వచన కవితనీ మేళవించే ప్రయత్నం చేసాడు. ఈ దశకంలోనే అజంతా 'సుషుప్తి' (1954), 'చెట్లు కూలుతున్న దృశ్యం' (1954), 'పరిత్యాగి పరివేదన' (1951) అనే అద్భుతమైన వచన కవితలు రాసాడు. ఈ కవితల్లో పద్య ఛందలక్షణమైన పునరావృత్తి ప్రధానంగా కనబడుతున్నప్పటికీ, మొదటి సారిగా భీతావహ మానవుడి

ప్రపంచం వచన కవితలో ఆవిష్కారానికి నోచుకుంది. 'నయాగరా' కావ్యంతో 40ల్లో ముందుకొచ్చిన కుందుర్తి

ఆకాశమంత ఎత్తు ఎదిగాడు. 'తెలంగాణ' (1957) తెలుగులో వచన కవితలో వచ్చిన మొదటి దీర్ఘకావ్యమని చెప్పవచ్చు. ఇది కాక 'ఆశ' (1957) అనే వచన కవితా రూపకం, 'యుగేయుగే' (1959) సంకలనంతో కుందుర్తి తననీ, వచన కవితా ప్రక్రియనీ కూడా సాహిత్యక్షేత్రంలో సుస్థిరం చేసుకోగలిగాడు.

చలం నేరుగా వచనకవితను పరిపుష్టం చేస్తూ మరికొన్ని రచనలు ఈ దశాబ్దంలో వెలువరించాడు. అందులో చెప్పుకోదగ్గది ఠాగోర్ గీతాంజలికి చేసిన అనువాదం (1958). ఇది పూర్తిగా కవిత్వమయ వచనం. అయితే, వచనకవితకు నిజమైన తాత్త్వికబలాన్ని సమకూర్చిన ఖ్యాతి ఈ దశాబ్దంలో ఆలూరి బైరాగి 'నూతిలో గొంతుకలు' (1955) కావ్యానికి చెందుతుంది. ఈ కావ్యంలో వచనకవిత శిల్పరీత్యా వృత్తగంధి వచనం, వృషభగతిరగడల వంటి దేశిఛందస్సుల్ని ఆధారం చేసుకున్న వచనం. ఒకరకంగా దాన్ని సంస్కృతాలంకారికుల పరిభాషలో ఉత్కళిక అనవచ్చు. కాని వస్తురీత్యా అది సమకాలీన వచన కవలుందరికన్నా ఎన్నో మెట్లు ఉన్నతమైన కవిత.

అరవైల్లో బలంగా వినిపిస్తున్న కంఠల్లో బాలగంగాధర తిలక్, అజంతా, దాశరథిలతో పాటు వజీర్ రహ్మాన్. నారాయణరెడ్డి కూడా ఉన్నారు. కాని అరవైల్లో సమకాలీన సమాజాన్ని మాత్రమే కాక వచన కవితా ప్రక్రియను కూడా చీల్చి చెండాడుతూ దిగంబరకవుల కవిత్వం వచ్చింది. 'దిగంబరకవులు' (1965) సంకలనం ముందుమాటలో ఇలా రాసారు: ఇటీవలి కవితా ప్రక్రియ గూర్చి. వర్స్ లిబర్, బ్లాంక్ వెర్స్, ప్రోజ్ పోఎట్రీ, ఫ్రీ వెర్స్ అన్నారు ఆంగ్ల సాహిత్యంలో. పేర్లకు వాటికి వారు ఇచ్చిన నిర్వచనాలకు దగ్గరగా ఉన్నా, దూరంగా ఉన్నా ముక్తచ్ఛందం అనీ, స్వేచ్ఛాకవిత అనీ, అనిబద్ధ కవిత అనీ, వచన గేయం అనీ, ఇంకా ఇంకా ఎవరికిష్టమైనట్లు వాళ్ళు పిలుచుకుంటున్నారు తెలుగులో. ఇందులో ఇప్పుడు ఎక్కువ చలామణిలో వున్న పేరు 'వచన కవిత'.

వచన కవిత పుట్టడం వ్యక్తి ప్రధానంగా పుట్టినప్పటికీ దాన్నొక ప్రజాస్వామిక ప్రక్రియగా చూపించడానికి ప్రయత్నించడం ద్వారా కుందుర్తి దానికొక చారిత్రక ప్రాముఖ్యాన్నీ, ప్రాసంగికతనూ ఇవ్వడానికి ప్రయత్నించాడు. వచన కవిత కేవలం వైయక్తిక ధోరణులకు పరిమితం కాకుండా ఉండటం కోసం సామాజిక స్పృహ అనే కొత్త భావన కూడా అరవైల్లో ముందుకొచ్చింది. అది నిజమైన ప్రజాస్వామిక కవిత అనీ, సామాన్యుడికి పెద్దపీట వేసే ప్రక్రియ అనీ ప్రతిపాదించడం జరిగింది. ఇటువంటి అభిప్రాయాలతో కుందుర్తి, గోపాలచక్రవర్తి వెలువరించిన 'వచనకవిత'. వివిధ కవుల పతాలూ, దృక్పథాలు' (1967) తెలుగులో వచన కవితకు మొదటి లక్షణగ్రంథంగా చెప్పవచ్చు.

సాహిత్యంలో 1970 తరువాత ఉదయించబోతున్న నవయుగానికి సంకేతంగా గుంటూరుకు చెందిన యువతీ యువకులు దేవీప్రియ, సుగమ్‌బాబు, కిరణ్ బాబు, కమలాకాంత్, ఓల్గాలు పైగంబరకవులు పేరిట 'యుగ సంగీతం' (1969), 'యుగసంకేతం' (1970) అనే రెండు కవితా సంపుటాలు తీసుకువచ్చారు. జీవితం లోనూ, సాహిత్యంలోనూ కూడా కొత్తమార్పును సంకేతించిన పైగంబరకవుల్ని సార్థక నామధేయులనవచ్చు. భారతదేశ చరిత్రలోనూ, తెలుగు సాహిత్యంలోనూ కూడా 70లు 'కల్లోల, దందహ్యమాన దశాబ్దం'గా గుర్తింపు పొందాయి. వచన కవిత 70ల మొదట్లో చాలా పెద్ద సంక్షోభ మే ఎదుర్కొనవలసి వచ్చింది. ఇప్పుడు వచన కవితకన్నా పాట ఎక్కువ క్రియాశీలకంగా, ఎక్కువ ప్రజాస్వామికంగా, ఎక్కువ సామాజిక చైతన్యాన్ని కనబరచ గలిగేదిగా ముందుకొచ్చింది. వచన కవిత కేవలం పట్టణ, మధ్య తరగతి పరిమితుల్లోనే పనిచేస్తుందనీ, దాని విప్లవాత్మకత కేవలం పూర్వఛందస్సుల నిరాకరణలో మాత్రమే ఉందనీ, అది సరాసరి ప్రజలకు చేరువగా పోలేదనీ కొత్త విమర్శ తలెత్తింది.

70ల్లో వచన కవిత ఎదుర్కొన్న ఇటువంటి సంక్షోభం నుంచి వేగుంట మోహన ప్రసాద్, ఇస్మాయిల్, గుంటూరు శేషేంద్ర శర్మ, కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ, ఇంద్ర గంటి శ్రీకాంతశర్మ. మాదిరాజు రంగారావు, బోయి భీమన్న మొదలైన కవులు దాన్ని పైకి లేవనెత్తే ప్రయత్నం చేసారు. వీరిలో ఎక్కువమంది కవులు తిలక్, కుందుర్తి తరహాలో వృత్తగంధి వచనాన్నే రాస్తూండగా, వచన కవితను నిర్మాణ రీత్యా పునర్నిర్వచించడానికి శేషేంద్ర, ఇస్మాయిల్ విశేష కృసి చేసారు. శేషేంద్ర మొదట్లో పద్యం, ఆ తరువాత సాంప్రదాయిక పద్ధతిలో ఫ్రీవెర్స్ రాసినప్పటికీ, వాటిని వదలిపెట్టి చలం తరహా ప్రోజ్‌పొయెమ్‌ను స్వీకరించి 'నా దేశం-నా ప్రజలు' (1975), 'నీరై పారిపోయింది' (1976), 'గొరిల్లా' (1976) కావ్యాలు రచించాడు. అయితే ఈ ప్రోజ్‌పొయెమ్‌కి నమూనాలు వాల్ట్ విట్మన్‌లోనూ, సెంట్ జాన్ పెర్స్ లోనూ కూడా లేకపోలేదు. ఇందులో ప్రబోధాత్మకత, గంభీరోక్తీ ఉన్నాయి. కాగా లయాత్మకత, సంగీతాత్మకత, నాదాత్మకత, గంభీరోక్తులతో నిర్మించేది వచన కవిత కానేరదనే నమ్మకంతో ఇస్మాయిల్ 'చెట్టు నా ఆదర్శం' (1972), 'మృత్యువృక్షం' (1976) కవితా సంకలనాలు వెలువరించడంతో వచన కవితలో కొత్త అధ్యాయం మొదలైంది.

దిగంబరకవుల్లో ఒకడిగా ప్రస్థానం ప్రారంభించిన నగ్నముని 'కొయ్యగుర్రం' (1977) వచనాకవితా ప్రస్థానంలో మరొక మైలురాయి. 60ల్లో కుందుర్తి వచన కవితను కథాకావ్య నిర్మాణానికి వినియోగించుకోవచ్చని చెప్పినప్పుడు శీలావీర్రాజువంటి కవులు కథాకావ్యన నిర్మాణానికి పూనుకున్నారు. 70ల్లో విరసం పాటను ప్రధాన ప్రక్రియగా స్వీకరించినప్పటికీ వరవరరావు 'జీవనాడి' (1971), 'ఊరేగింపు' (1974) చెరబండ రాజు వంటి విప్లవకవులూ, కె.శివారెడ్డి 'రక్తంసూర్యుడు' (1973), 'చర్య' (1978), అద్దేపల్లి రామమోహన రావు 'అంతర్జ్వాల' (1970) వంటి విప్లవ సానుభూతికవులూ కూడా వచన కవితా సాధన కొనసాగిస్తూనే వచ్చారు.

**ఆధార గ్రంథాలు :**

1. ఆచార్య జి.నాగయ్య, తెలుగు సాహిత్య సమీక్ష, నవ్య పబ్లికేషన్స్, తిరుపతి 2002
2. డా॥ ద్వానా శాస్త్రి, తెలుగు సాహిత్య చరిత్ర, విశాలాంధ్ర పబ్లికేషన్స్, హైదరాబాద్ 2005,

❖❖❖

# తెలంగాణ నవలా సాహిత్యంలో స్త్రీ సామాజిక జీవన చిత్రణ

- అంబటి సరిత, పరిశోధక విద్యార్థిని.

తెలంగాణ నవలా సాహిత్యం ఈనాడు అనంతమైన వస్తు వైవిధ్యంతో జీవితాన్ని కళామయం చేస్తున్నది ఒక్కమాటలో చెప్పాలంటే తెలంగాణ నవలకు వస్తువు కానిదేది లేదు. ఇంత వస్తు వైవిధ్యం నవలల్లో తప్ప సాహిత్యంలోని మరే ప్రక్రియలోనూ కానరాదు. కథ, నాటకం, కవిత, ఆత్మకథ, జీవిత చరిత్ర, విమర్శ, పరిశోధన వంటి ప్రక్రియలతో పోల్చితే రాశిలో కథల కన్న తక్కువగా ఉన్నా వాసిలో ఉన్నతంగా ఉంటూ సమకాలీన రుగ్మతలను అన్ని పార్శ్వాలను సృశించింది నవలా ప్రక్రియ. ఇతివృత్తానికి అనుగుణంగా పాత్రలను మలచడంలో, సన్నివేశాలను చిత్రీకరించడంలో చేయి తిరిగిన రచయిత్రుల ప్రతిభ శ్లాఘనీయం. సామాజిక సమస్యలను కథా వస్తువుగా స్వీకరించి, సాంఘిక ప్రయోజనం కల నవలలు రాస్తున్న వారిలో తెలంగాణ రచయిత్రులు మొదటి వరుసలో ఉంటారు. తెలుగులో దళిత రచయిత్రి జాజులగౌరి రాసిన తొలి నవల వొయినం. దళిత రచయిత్రులు అయివుండి, దళిత స్పృహతో, దళిత మహిళా చైతన్యవంతంగా ఉన్న దళిత నవలలు ఇంత వరకు రాలేదు అని చెప్పవచ్చు.

తెలంగాణ మాండలికంలో దళిత రచయిత్రి రాసిన తొలి నవల అని కూడా వొయినం నవలను చెప్పుకోవచ్చు. దళితుల సామాజిక స్థితిగతులనూ, దళిత స్త్రీ జీవితాలలో ఉన్న అనేక అంశాలను వొయినం నవల అధ్యయనం చేసిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. జాజులగౌరి మహిళ కాబట్టి మహిళా దృక్పథంతో నీలమ్మ పాత్రను తీర్చిదిద్దింది. ఈ నవలలో మానవ సంబంధాల విధ్వంసం, మహిళా చైతన్యం, దళితుల సమగ్ర జీవితం ముప్పేటగా అల్లుకొని ఉన్నాయి. ఈ నవలలో తెలంగాణ మాండలికం, మరి ముఖ్యంగా హైదరాబాదు రంగారెడ్డి జిల్లాల దళిత వర్గ మాండలిక పదాలు, సామెతలు, పాటు మొదలైనవి కనిపిస్తాయి. వొయినం ఆమె అడవిని జయించింది, జోగిని నవలల్లో రచయిత్రులు గ్రామీణ జీవితాన్ని వాస్తవికంగా చిత్రించారు. మానవ సంబంధాలను సహజంగా వివరించారు.

వొయినం నవలలో నీలమ్మ, ఆమె అడవిని జయించింది సంధ్య. జోగిని నవలలో పోశవ్వ, బతుకమ్మ మునిగింది నవలలో లక్ష్మీ మొదలైన మహిళల జీవన చిత్రణను వివరించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

## వొయినం - నీలమ్మ :

వొయినం నవలలో రచయిత్రి జాజులగౌరి సందర్భానుగుణంగా పాత్రలను తీర్చిదిద్దారు. ఇందులో నీలమ్మది చైతన్యవంతమైన పాత్ర. పనిపిల్ల స్థాయి నుండి తన భర్త సాధించలేని భూమిని సాధించేవరకు పోరాడిన పోరాటశీలి నీలమ్మ. సాలయ్య, ఎల్లమ్మల మూడవ సంతానం నీలమ్మ. తల్లిదండ్రులు నీలమ్మను మొగులయ్యకు ఇచ్చి పెళ్లి చేశారు. భర్త చనిపోయిన తరువాత తమ భూమిని దక్కించుకోవడం కోసం మొత్తం అందరూ ఒకవైపు నిలబడితే తాను ఒక్కతే ఒకవైపు నిలబడి సత్తయ్యతో వీరోచితంగా పోరాడుతుంది. అనేక అవమానాలు, ఛీదరింపులు ఎదుర్కొంటూ తనకు ధర్మబద్దంగా న్యాయబద్దంగా చెందాల్సిన భూమిని దక్కించుకుంటుంది. పిల్లల భవిష్యత్తు నిర్మాణం కోసం నీలమ్మ ధైర్యం కోల్పోకుండా గుండె నిబ్బరంతో జీవితాన్ని ముందుకు తీసుకువెళుతుంది. బాల్యంలో తండ్రిపైన యవ్వనంలో భర్తపైన, ముసలితనంలో కొడుకుపై ఆధారపడకుండా ఎన్ని సంక్లిష్ట పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొని తన లక్ష్యాన్ని చేరుకొని నిరంతరం పోరాడే చైతన్యశీలమైన పాత్రగా రచయిత్రి నీలమ్మను చిత్రించారు. నీలమ్మ తన భర్త సొంత పొలాన్ని పండించుకున్నా సరే అతనికి దానిమీద హక్కులేనట్లు సత్తెయ్య మోసం

చేస్తూ మొగులయ్య కుటుంబాన్ని ఇబ్బంది పెట్టేవాడు. ఇద్దరు కొడుకులు భార్యను చూసుకొని సంతోషపడుతున్న సమయంలో మోసం ఉందని తెలియక పెద్దలపట్ల గౌరవంతో ఏమి చేయలేక తాగుడుకు బానిస అవుతాడు. తరువాత ప్రాణాలను పోగొట్టుకుంటాడు. ఈ విషాద సమయంలో నీలమ్మ ధైర్యంగా నిలబడి భర్త ఆశయాలను సాధించింది.

**ఆమె అడవిని జయించింది - సంధ్య :**

ఆమె అడవిని జయించింది నవలలో ప్రధాన పాత్ర సంధ్య కొత్తలో తనమీద అత్త చేసే పెత్తనం సంధ్యకు నచ్చేదికాదు. స్త్రీలకు స్వేచ్ఛ ఇవ్వక బానిస బతుకు బతుకుతూ పిల్లల్ని కనే యంత్రంలా చూసే పురుషాధిక్యతను ప్రశ్నిస్తుంది. అత్త చెప్పిన పూజలు, వ్రతాలు, చంద్రంకోసం చేస్తుండేది. సంధ్యకు పురిటి నొప్పుల సమయంలో కుటుంబ నియంత్రణ పద్ధతిని పాటించలేదని చంద్రాన్ని తిట్టుకుంటుంది. ఈ బాధలన్నీ దేవుడు మగవాళ్ళకు పెట్టాలనుకునేది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ మగవాళ్ళకు ఎందుకు చేయించ కూడదు అని అత్తనే ప్రశ్నించేది. బాలింతరాలుగా ఉన్న సమయంలో పిల్లలకు సంబంధించిన పనులన్నీ తానే స్వయంగా చేసుకునేది. తనకు అత్త సేవలు చేసినప్పుడు నా తల్లికంటే నా అత్త మంచిదని తలచుకొనేది.

ఏ కారణం లేకుండా వనజను భర్త, అత్త పెట్టే బాధలను విని సంధ్య వనజలో ధైర్యాన్ని నింపేది. వారిని ఎదురించి తన కాళ్ళపై నిలవాలని హితబోధ చేస్తుంది. కులాంతర వివాహాలు జరగాలని, అది సమాజానికి మంచిదని, నిరంతరం తలచేది. స్త్రీలకోసం ఇంటి దగ్గర సైక్రియాట్రి - క్లినిక్ ఉచిత సలహాలు ఇచ్చేది. చివరకు స్త్రీకి విముక్తి కావాలని మహిళా విమోచన సంస్థలో చేరి స్త్రీలను చైతన్యవంతం చేసేది. వర్గం పోరాటం ద్వారా మాత్రమే స్త్రీలకు న్యాయం జరుగుతుందని, స్త్రీల సమస్యలు పరిష్కారం అవుతాయని రచయిత్రి తన భావనను సంధ్య పాత్ర ద్వారా చెప్పించారు. ఇంటా బయట స్త్రీల లైంగికతపై కొనసాగే దాడులను వ్యతిరేకించడంతో పాటు వాటిని ఎదురించడలో సంధ్య ముందుండేది. స్త్రీల అనేక సమస్యలకు పరిష్కారాలు పోరాటాల ద్వారా సాధ్యమవుతాయని సంధ్య పాత్ర ద్వారా రచయిత్రి చెప్పించారు.

**జోగిని - పోశవ్వ :**

శాంతి ప్రబోధ జోగిని నవలలో అతి ప్రధాన పాత్ర పోశవ్వ. జోగు సాయవ్వ కూతురు పోశవ్వ. అగ్రకులాల అక్రమాల్ని ఎదురించగలిగే గుండెనిబ్బరం ఈమెలో ఉన్నాయి. స్వభావ రీత్యా ధైర్యశాలి. అనుకున్న పనిని పట్టువిడవకుండా చేసి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. ధైర్యంగా ఉంటూ సమాజంలో ఎదురైన సమస్యలను ఎదురించినపుడు అట్టడుగు వర్గాల వారు కూడా గౌరవం పొంది ఉన్నత పదువులు పొందవచ్చని పోశవ్వ పాత్ర ద్వారా రచయిత్రి నిరూపించారు. ఇక ఆమె పాత్రను పరిశీలిస్తే జోగు సాయవ్వ తన లాగ జీవితం నాశనం కాకూడదని తన కూతురు జీవితం బాగుపడాలని రాంపూర్‌కు చెందిన మల్లయ్యతో సంసారి లగ్గం జరిపిస్తుంది. సరిగ్గా అదే రోజున పోశవ్వ చిన్నక్క కొడుకు ఎద్దులబండి నుండి కిందకు పడిపోయి చనిపోతాడు. దీని కారణంగా తీసుకొని అగ్రకులాల వారు ఆచారాలు, సంప్రదాయాలు విరుద్ధంగా జోగు సాయవ్వ తన కూతురికి సంసారి లగ్గం చేయించింది. దీని ఫలితమే ఆ మరణం సంభవించింది. అందుకు మల్లయ్య కుటుంబానికి జరిమాన విధించి పోశవ్వను పదిరోజుల్లోగా జోగుపట్టం కట్టాలని రెండు ఊర్లకు సంబంధించిన పెద్దలు పంచాయితీ పెట్టి తీర్మానించారు.

కుటుంబ విషయంలో పంచాయితీ పెద్దల జోక్యాన్ని ఎదురించిన మల్లయ్యను చెట్టుకు కట్టివేసి కొట్టి అన్నపానీయాలు లేకుండా చేయడంతో మల్లయ్య మరణిస్తాడు. పంచాయితీ పెద్దల నిర్ణయం ప్రకారం పోశవ్వకు జోగుపట్టం కట్టడం జరుగుతుంది. ఆ తరువాత రాజాగౌడ్ దౌర్జన్యానికి, కుట్ర, కామానికి పోశవ్వ జీవితం

నాశనం అయ్యింది. ఆమెకు ఇష్టం లేకపోయినా అగ్రకులాల భూస్వాముల అహంకారానికి జోగిని వ్యవస్థ పేరుతో పోశవ్వలాంటి ఎన్నో జీవితాలు బలి అవుతున్నా యని తెలుస్తుంది. ఆ రోజు నుండి సమాజంపై రాజాగౌడ్ పైన పెద్ద కులాల వారిపై విపరీతమైన కోపాన్ని పెంచు కుంది. ఉన్నత వ్యక్తిత్వం గల పోశవ్వ అవకాశం కోసం పట్టుదలతో ఎదురుచూస్తుంది. ఆ అవకావం రానే వచ్చింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళలకు 33 శాతం ప్రకారం సిరిపురం గ్రామ పంచాయితీ జనరల్ మహిళలకు రిజర్వు చేయబడింది. ఈ ఎన్నికల్లో పోశవ్వ గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా ఎన్నికైంది. ఆ తరువాత మండల ప్రెసిడెంట్‌గా ఎన్నికై అభివృద్ధి కార్యక్రమాల్లో జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకమైన నీరజా భానోత్ అవార్డుకు ఎంపికై రాష్ట్రపతి చేతులమీదగా అవార్డు అందుకొని జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రసంశలు పొందింది. మహిళలకు చేయూతనిస్తే స్వయంశక్తితో అన్ని రంగాల్లో రాణిస్తారని పోశవ్వ పాత్ర ద్వారా రచయిత్రిని నిరూపించారు. ఏ స్త్రీ అయినా పట్టుదల ఆత్మవిశ్వాసంతో సమాజంలో ఎదురైన సమస్యలను ఎదురించి నిలదీసి ప్రశ్నించే హక్కు ప్రతి దళిత మహిళకు ఉందని పోశవ్వ పాత్ర ద్వారా రచయిత్రి తెలియజేశారు.

### బతుకమ్మ మునిగింది - లక్ష్మి :

బతుకమ్మ మునిగింది నవలలో ప్రసిద్ధ పాత్ర లక్ష్మి. లక్ష్మి తండ్రి బ్రహ్మయ్య సవతి తల్లి పోరునుండి తప్పించా లని లక్ష్మయ్యతో పెళ్ళి చేస్తాడు. ఆ ఊరి దొర చంద్రారెడ్డి లక్ష్మిని తన దగ్గర వదలిపొమ్మని లక్ష్మయ్యను నగలపని చెప్పి వేరే ఊరికి పంపిస్తాడు. వారం రోఉలు దాటిపోయిన లక్ష్మయ్య తిరిగిరాడు. చంద్రారెడ్డి పువ్వులాంటి లక్ష్మి శరీరాన్ని నలిపివేస్తాడు. లక్ష్మి పడుతున్న మానసిక వేదనను చూడలేక చుక్కమ్మ, మల్లమ్మ మౌనంగా ఉండిపోయారు. లక్ష్మి కొన్ని రోజులు ప్రతిఘటించిన తరువాత మనస్సు చంపుకొని అణకువగా ఉండేది. రానురాను చంద్రారెడ్డికి లక్ష్మి దేవతగా కనిపిస్తుంది. మల్లమ్మ లక్ష్మికి జీవితాన్ని నేర్పింది.

లక్ష్మి అందాన్ని చూసి కోరిక చంపుకోలేక చంద్రారెడ్డి బావమరిది నాగిరెడ్డి ఆమెను కాటు వేయాలని ఆరాట పడ్డాడు. తన బావ ఉండగా అది జరగనిపని అని తలచి చంద్రారెడ్డిని చంపివేస్తాడు. బావ పోయిన నీకు నేను ఉన్నానని ఆమె భుజంమీద చెయ్యివేసి ఆమెను దువ్వాడు. లక్ష్మీ కోపంతో 'నా దొరని సంపినవు' అంటూ నాగిరెడ్డి చేసిన అనేక ప్రయత్నాలు వృధా అవుతాయి. చంద్రారెడ్డితో తన జీవితాన్ని పంచుకొన్న రోజులు తలచుకొంటూ ఇంకొక వ్యక్తికి ఈ శరీరం అంటకూడదని ఆత్మహత్య చేసుకుంటుంది. శరీరానికి బండరాయి కట్టుకొని పాలెం చెరువులో తన జీవితాన్ని బలవంతంగా ముగించేసుకుంది. స్త్రీలు ఈ విధంగా ఆత్మహత్యలు మాని ఆత్మస్థయిర్యంతో నిలబడి సంఘటిత శక్తిద్వారా సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని పరిష్కరించుకోవాలి. సాహిత్యానికీ, సమాజానికీ సంబంధం ఉందని నమ్మే తెలంగాణ రచయిత్రులు సమాజాన్ని శాసిస్తున్న సూత్రా లను వెతికి పట్టుకొని ఆ సూత్రాల ఆధారంగా ప్రజల జీవితాలను పరిశీలించి చిక్కుముళ్ళతో చిక్కగా అల్లుకు పోయిన సంక్లిష్టమైపోయిన జీవితాలను తానర్థం చేసుకొని, అందరికీ అర్థం చేయించాలనే తపన వున్న రచయిత్రులు సమాజాన్ని రంగుటద్దాలతో కాకుండా, వాస్తవికతా దృష్టితో చూడటం ద్వారా తెలుసుకోవచ్చు చైతన్యవంతులైన పాఠకులు సమాజానిన ప్రతిబింబించే నవలల నుంచి సమాజ గమనాన్ని ఒక పద్ధతి ప్రకారం అర్థం చేసు కుంటారు. దానివల్ల తాము సమస్యల గురించి గందరగోళపడకుండా వాటి మూలాలను పట్టుకో గలుగుతారు. తమ వ్యక్తిగత జీవితాలను మార్చుకో గలగుతారు. ఇంకా ఒక్కమాటలో చెప్పాలంటే పరిస్థితు లకు రాజీపడటం లేదా ఘర్షణ పడటం ఈ పాత్రలకు తెలియదు. పాఠకుడికి కూడా పాత్రల గురించి సులువుగా అర్థం అవుతుంది.

సమాజంలో తాము చూసిన విషయాలను ఆకళింపు చేసుకొని, సాహిత్యాన్ని అభివృద్ధి చేసుకొంటూ, ఆ

అనుభవాన్ని నవలల రూపంలో ఆవిష్కరించారు. మధ్య తరగతి జీవితాల్లోని ఎత్తుపల్లాలను, వారి సాధక బాధలను సహజ సిద్ధంగా ప్రతిబింబించారు. వీరు తమకు అనుభవ మైన సమస్యలనే నవలలుగా మలిచారు. ఏ ఒక్క ప్రాంతానికో ప్రాముఖ్యత ఇవ్వక, అన్ని ప్రాంతాల గ్రామీణ, పట్టణ జీవిత చిత్రణను చేశారు. మధ్యతరగతి జీవితాల లోతైన అవగాహనతో చూపించడంలో వీరి ప్రతిభ స్పష్టమౌతోంది. మన చుట్టూ ఉన్న ప్రపంచం నుంచి అనుభవాలు పంచి, అనుభూతులతో అలరించి, చక్కనైన ఇతివృత్తాలతో దర్శనీయం చేయించగల నైపుణ్యం, చైతన్యం ఉన్న వీరి రచనలను సహజంగా, సరళంగా, సూటిగా, భావవ్యక్తీకర చేయడంలో దిట్ట. వీరి నవలలు ప్రజల పట్ల, సమాజం పట్ల నిర్ధిష్ట వైఖరిని ప్రతిబింబించి, సమాజ క్రమాన్ని సూటిగా స్పష్టంగా చెప్పడంలో సఫలమైనాయి.

మారుతున్న సమాజానికి అనుకూలంగా తాను మారడం కాదు చేయాల్సిన పని. మారుతున్న సమాజాన్ని తమ రచనల్లో చిత్రించడంతోపాటు, మంచి మార్పుకు దోహదపడే అంశాలతో వీరి నవలలు రచించారని గ్రహించ వచ్చు. సాకేతపురి కస్తూరి రచించిన బతుకమ్మ మునిగింది అనే నవలలో నిజాం పాలనలోని తెలంగాణ రాజ్యంలో ఊరిపెద్దల దౌర్జన్యం, పెత్తందారి దొరల కర్కశ కఠోర కృత్యాలను సజీవంగా చిత్రించారు. బతుకమ్మ పండుగను ప్రధానంగా తీసుకొని రాయడంలో ఒక ఔచిత్యం ఉంది. పూలతో పేర్చిన బతుకమ్మకి పువ్వులాంటి స్త్రీ బతుకుకీ సామ్యం చూపారు.

మానవ జీవితంలోని విషాదాన్ని, స్త్రీ పురుష సంబంధంలోని విషాదాన్ని రచయిత్రుల నవలలు అద్భుతంగా చిత్రించాయి. కొద్దిమంది రచనల్లో స్త్రీ పాత్రలు ఎక్కువ శాతం విషాదంలోనే పర్యవసించాయి. యౌవనంలో నీలమ్మ, జోగినిలో పోశవ్వ, బతుకమ్మ మునిగిందిలో లక్ష్మి మొదలైన పాత్రలను ఈ కోవకు చెందినవి అని చెప్పవచ్చు. ఆమె అడవిని జయించింది నవలలోని సంధ్య వంటి పాత్రల్లో కనిపించే చైతన్యం కేవలం వారి జీవితాలకే పరిమితమైన వ్యక్తిగత చైతన్యం కాదు. అది స్త్రీ జాతికి ప్రాతినిధ్యం వహించే సామాజిక చైతన్యం వంటిది. స్త్రీల సమస్యలకు ఒక అత్త, ఒక పురుషుడే కారణం కాదు. సంపూర్తి వ్యవస్థ స్వరూపమే కారణం అంటారు ఈ రచయిత్రులు. సామాజిక సమస్య లనూ, జీవితాలనూ, వ్యధలను, గాథలనూ, ఆశలన, నిరాశలనూ, నిజాయితీతో, సృజనాత్మకంగా, కళాత్మకంగా, చిత్రీకరిస్తే, పాఠకులు తప్పక అలాంటి మంచి సాహిత్యం పట్ల సాలోచనాత్మకమైన ఆలోచనా దృక్పథాన్ని ఏరపరచు కుంటారని, తద్వారా సామాజిక మార్పు సాధ్యమేనని తెలంగాణ రచయిత్రులు భావించారు. స్త్రీల సమస్యలు పరిష్కృతం కావాలంటే స్త్రీలు కృషి చేయాలి. మూఢా చారాలపై తిరుగుబాటు చేసి, సమాజాన్ని సమాజంలో ఇటువంటి ప్రతిఘటన తప్పదు. అసలు ప్రతి స్త్రీలోనూ సహజమైన బలం పుట్టుకురావాలి. ఆ ధైర్యంతో తమకు జరిగే అన్యాయాలపై పోరాటం సాగించేందుకు సిద్ధపడా లని ఈ నవలలు ప్రబోధిస్తున్నాయి. స్త్రీ పురుష సంబంధాలు సమానత్వంపై ఆధారపడినపుడే శాంతి సౌఖ్యాలు సమకూరుతాయి. స్త్రీలంతా సంఘటిత శక్తి ద్వారా తమ వ్యక్తిత్వాన్ని, హక్కులు నిలుపుకొన్నవాడే సామాజిక ప్రగతి ఉంటుందని జోగినీ నవల వివరిస్తోంది.

సమకాలీన సమాజాన్ని తీర్చిదిద్దే సామాజిక ఆర్థికాంశా లను తమ రచనలకు వస్తువుగా తీసుకొని గ్రామీణ, మహిళ జీవితాలను నిశితంగా పరిశీలిస్తూ, స్త్రీలు ఆయా పరిస్థితులలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ, తమ రచనల ద్వారా వాటికి పరిష్కార మార్గాలను సూచించారని గ్రహించవచ్చు.

చుట్టూ వున్నవాళ్ళు ఏమనుకుంటారో అనే భయాన్ని వదిలి స్త్రీలు ఆత్మవిశ్వాసంతో ఎదురించి బయటకు రావాలి. అందుకు స్త్రీలలో భావ విప్లవం రావాలని జోగిని నవల చెపుతుంది. స్త్రీ పైన అవకాశం దొరికినపుడల్లా మగవాడి ఆత్యాచారాలు అడుగడుగునా జరుగుతూను

ఉన్నాయి. ఈ వ్యవస్థను సమూలంగా మార్చేయ్యాలంటే స్త్రీలు ఆత్మస్థయిర్యంతో నిలబడి, సంఘటిత శక్తితో సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని, పరిష్కరించుకోవాలి. దుర్మార్గానికి ఎదురు నిలిచిపోరాడాలే తప్ప పారి పోకూడదు. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవటం వల్ల పురుషుడు ఆమెపై అధికారం సాగిస్తున్నాడు. చాలామంది స్త్రీలు నిరక్షరాస్యులు కావటం వల్ల తమ గురించి తాము ఆలోచించుకునే పరిజ్ఞానం కూడా వారికి లేదు. అందుకే ఈ రచయిత్రులు స్త్రీ విద్యావంతురాయితే గాని విమోచనం దొరకదు అని తమ నవలల్లో ప్రకటించారు. ఆమె అడవిని జయించింది వంటి నవలల్లో రేఖా మాత్రంగా సైకోఎనాలసిస్ ఉంది. దానిని కచ్చితంగా మనో విజ్ఞాన శాస్త్రానికి సంబంధించినదిగా పేర్కొనలేము. ఒకవేళ ఆ పాత్రలను తీసుకొని మనస్తత్వ విశ్లేషణ చేస్తే ఫ్రాయిడ్, ఆడ్లర్, యుంగ్ వంటి సైద్ధాంతికుల సిద్ధాంతాల మూలాలను ముందుగా పరిశీలించాలి. ప్రస్తుత పరిశోధన పరిధిని దృష్టిలో ఉంచుకొని అటువంటి వాటి జోలికి పోలేదు.

స్త్రీవాదాన్ని కూడా ఒకటి రెండు నవలల్లో వివరించడం జరిగినది. మొత్తం పరిశోధనను అంతిమంగా పరిశీలిస్తే తెలంగాణ రచయిత్రుల నవలల్లో తెలంగాణ సామాజిక చిత్రణను, అందులోనూ స్త్రీలకు జరుగుతున్న అవమానా లను, స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలను, కుటుంబ జీవన సంబంధితమైన అనేక విభిన్న పార్శ్వాలను, తెలంగాణ ప్రజల నిత్యజీవన వ్యవహారాలను మాత్రమే విశ్లేషించు కోవడం జరిగింది. ఈ రచయిత్రులు చిత్రించిన స్త్రీ పాత్రలను గమనిస్తే, వారు స్త్రీ పాత్రలకు ప్రాధాన్యం ఇచ్చారని, ఆయా పాత్రల స్వభావ చిత్రణకు ప్రాముఖ్యత ఇచ్చారన్నది వాస్తవం. వీరు స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను తమ రచనల్లో ఎత్తిచూపడమే కాదు, స్త్రీలకు చదువు అందుబాటులో లేనందువల్ల సంకుచిత భావాలతో తాము సతమత మవుతూ, ఎదుటివారికి సైతం సమస్యలు తెచ్చి పెడుతున్నారని వీరు గుర్తించారు. వొయినం నవలలో నీలమ్మ, జోగిని నవలలో పోశవ్వ, బతుకమ్మ మునిగిందిలో లక్ష్మి వంటి పాత్రలు ఇందుకు ఉదా హరణలు. స్త్రీకి సాంఘికభద్రతను, న్యాయాన్ని నేటి సమాజం అందించలేకపోతున్నదని, స్త్రీ పెక్కు మోసాలకు గురౌతుందనీ ఈ రచయిత్రులు ఈ రచనలో ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆధార గ్రంథాలు :**

1. జాజుల గౌరి - వొయినం విశాల సాహితీ అకాడమీ, హైదరాబాద్, 1999.
2. గీతాంజలి - ఆమె అడవిని జయించింది, గోదావరి ప్రచురణలు, హైదరాబాద్ - 1999.
3. శాంతి ప్రబోధ - జోగిని
4. బతుకమ్మ మునిగింది - శాకేతపురి కస్తూరి, ప్రేమాలయ కమ్యూనికేషన్స్, హైదరాబాద్.
5. కె.వి. అశోక్ కుమార్ - తెలుగు నవలా ప్రయోగ వైవిధ్యం, సామ్రాట్ పబ్లికేషన్స్, సికిందరాబాద్.

❖❖❖

# తెలంగాణ సమాజాన్ని ప్రభావితం చేసిన ఆధునిక కవులు

- కూరెకుల రాజశేఖర్, పరిశోధక విద్యార్థి.

తెలంగాణ సాహిత్యాన్ని ప్రభావితం చేసిన వారిలో భాగ్యరెడ్డి వర్మ, కొమర్రాజు లక్ష్మణరావు, సురవరం, సామల సదాశివ, దాశరథి, కాళోజి, సినారె, సుద్దాల హనుమంతు మొదలైనవారు ప్రసిద్ధులు. వీరి రచనలు నుండి తెలంగాణ సమాజంలో వారు అనుభవించిన సామాజిక పరిస్థితులు సాంస్కృతిక స్థితిగతుల ద్వారా వీరిని తెలంగాణ వైతాళికులుగా పేర్కొనడం జరిగింది. తెలంగాణ తెలుగు సాహిత్యం మరింత దీప్తిమంతంగా కావడానికి వీరి రచనలు దోహదం చేస్తాయనడంలో సందేహం లేదు. తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసిన వీరి సాహిత్యాన్ని విశ్లేషించడం ఈ వ్యాసంలో జరిగింది.

**భాగ్యరెడ్డి వర్మ :**

దళితులు విద్యలో వెనుకబడి ఉండటం గమనించిన ఆయన 1906 -1933 మధ్యకాలం హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాల బాలికల పాఠశాలలు స్థాపించారు. బాల్య వివాహాలు, అంటరానితనం వంటి దురాచారాలపై ఉద్యమించారు. జగన్మిత్రమండలి, మన్యసంఘం, సంఘ సంస్కార నాటక మండలి, అహింసా సమాజం వంటి సంఘాలను స్థాపించి సంఘ సంస్కరణకు కృషి చేశారాయన. మద్యపాన నిషేధం, గ్రంథాలయాల ఏర్పాటు వంటి వాటిని నెలకొల్పి తనదైన ముద్రతో ముందుకుసాగారు భాగ్యరెడ్డి వర్మ. 1913లో 'ఆర్యసమాజ్ వార్షిక సదస్సులో ఆయన సమాజానికి చేసిన సేవలకు గుర్తుంపుగా వర్మ అన్న బిరుదును ప్రధానం చేశారు. దాంతో ఆయన భాగ్యరెడ్డి వర్మగా గుర్తింపు పొందారు. ఆధిపత్య కులాల వారు నిర్వహించే కార్యక్రమాలకు మాల, మాదిగలను ఆ కాలంలో రానిచ్చేవారు కాదు. అందుకే భాగ్యరెడ్డివర్మ సభలు, సమావేశాల సందర్భంగా హరికథలను నిర్వహించే వారు. అస్పృశ్యతను పాటించే వైదిక ధర్మానికి, వర్ణవ్యవస్థకు వ్యతిరేకంగా ఆయన బౌద్ధ ధర్మాన్ని పాటించేవారు. భాగ్యరెడ్డి వర్మ స్థాపించిన భాగ్యనగర్ అనే పత్రికలో తాను రాసిన నవల వెట్టి మాదిగను తానే ప్రచారించాడు. దళితుల ఉన్నతినే నిరంతర పనిగా భావించిన భాగ్యరెడ్డి వర్మ ఫిబ్రవరి 18, 1939న క్షయవ్యాధితో హైదరాబాదులో కన్ను మూశాడు.

**కొమర్రాజు లక్ష్మణరావు :**

సృజనాత్మక రంగంలోనే కాక పరిశోధన రంగంలో తెలంగాణ ప్రాంతం విశిష్టతను సాధించింది. ఆదిరాజు వీరభద్రరావు, సురవరం బూర్గుల రామకృష్ణరావు, బిరుదు రాజు రామరాజు, గడియారం రామకృష్ణశర్మ మొదలైన వారు సంస్కృతి సాహిత్యాల పరిశోధనలో వాసికెక్కారు. వీరితోపాటు మరొక ప్రసిద్ధ పరిశోధకుడు కొమర్రాజు లక్ష్మణరావు.

సమాజం ముందడుగు వేయాలంటే విజ్ఞానంలో అభివృద్ధి అత్యవసరమని గుర్తించిన కొమర్రాజు లక్ష్మణ రావు ఆ దిశగా జీవితమంతా కృషి సల్పి స్ఫూర్తి ప్రదాతగా వెలుగొందారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా లక్ష్యం దిశగా అడుగులు వేసినవారు లక్ష్మణరావు. తెలుగులో మొట్ట మొదటి విజ్ఞాన సర్వస్వ నిర్మాత ఆయన. విజ్ఞాన చంద్రికా మండలి స్థాపకుడు. తెలుగువారికి చరిత్ర పరిశోధనలను పరిచయం చేసి, ఉన్నత ప్రమాణాలతో చరిత్ర, విజ్ఞాన రచనలను తెలుగులో అందించడానికి శ్రీకారం చుట్టిన ఉత్తమ విజ్ఞానవేత్త కొమర్రాజు లక్ష్మణరావు. తెలుగు సాహిత్యంలో ఎందరో సాహితీమూర్తులకు అండగా నిలిచి ప్రోత్సాహం అందించారు లక్ష్మణరావు. లక్ష్మణరావు సాహితీ జీవితంలో మిగిలినవన్నీ ఒక ఎత్తయితే, విజ్ఞాన సర్వస్వం ఒక్కటే ఒక ఎత్తు అని చెప్పవచ్చు. ప్రపంచ విజ్ఞానాన్ని తెలుగు వారికి పంచి పెట్టాలని తపించిపోయారు. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని వెలువరించాలనేది ఆయన ప్రబల వాంఛ. 1912-13 సంవత్సరాల కాలంలో ఈ బృహత్కా

ర్యానికి పూనుకున్నారు. తాను ప్రధాన సంపాదకునిగానే గాక, ప్రధాన రచయితగా కూడా పనిచేశారు లక్ష్మణరావు. ఇందులో ఆయన రాసినవన్ని వ్యాసాలు మరెవరూ రాయలేదు ఇది ఆయన నిబద్ధతకు నిదర్శనం. ఆ నిత్య విజ్ఞాన, సాహిత్య కృషివలుడు.

## సురవరం :

నిజాం నిరంకుశత్వాన్ని తుడిచి తెలంగాణ ప్రజల అభ్యున్నతికి తన జీవితాన్ని కొవ్వొత్తిలా వెలిగించుకున్న వైతాళికుడు శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారు. గోలకొండ పత్రిక నెలకొల్పి పాలకుల ఆగడాలకు అడ్డుకట్ట వేశాడు. తెలంగాణ ప్రగతిని కాంక్షించాడు. సాహిత్యంలో ఎన్నో ప్రక్రియలు వెలువరించి అశేష జన సౌందర్యాన్ని ఆకాంక్షించారు. "ధనమా వ్యయమైపోవును / మనమా చురుకుం దనమును మానును / యశమా దినదినమును క్షీణించును / తనువా తెడిపోవు కల్లు ద్రావుట చేతన్ అంటూ మద్యపానం వల్ల కలిగే చెడును మనకు వివరిస్తారు సురవరం ప్రతాపరెడ్డి. మద్యపానం వ్యతి రేకంగా ఒక ఉద్యమమే చేశారాయన. కవిగా, చరిత్ర నిర్మాతగా, కథకుడిగా, వ్యాసకర్తగా, పత్రికా సంపాద కుడిగా నిజాం వ్యతిరేకోద్యమ యోధుడిగా, బహుముఖ ప్రజ్ఞాశీలిగా కీర్తి పొందారాయన. ప్రథమాంధ్ర సాంఘిక చరిత్రను తెలుగుజాతికి అందించి మహోపకారం చేశారాయన.

బహుముఖీనమైన ప్రతిభను చాటిన సురవరం ప్రతాపరెడ్డి 28-5-1896న మహబూబ్‌గనర్ జిల్లా ఆలంపూర్ తాలూకాలోని ఇటికాలపాడు గ్రామంలో రంగమ్మ, నారాయణరెడ్డి దంపతులకు జన్మించారు. కర్నూలులో హైస్కూల్ విద్యను, హైదరాబాద్ నిజాం కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. అటు పిమ్మట మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజిలో బి.ఏ. చదివారు. తిరువనంతపురంలో లా డిగ్రీ పూర్తి చేశారు. హైదరాబాద్‌లో కొంతకాలం న్యాయవాద వృత్తిని నెరిపారు. ఆయనకు పత్రికా రచనల పట్ల, సాహిత్యం పట్ల, పరిశోధనల పట్ల మక్కువ. నెలకు ఆ రోజుల్లోనే న్యాయవాదిగా దాదాపు 800 రూపాయలు సంపాదించేవారు. అయినా ఆ ఆదాయాన్ని వదులుకొని పత్రికా సంపాదకుడిగా స్థిరపడ్డారు. 1926 నుండి 1947 వరకు దాదాపు 22 సంవత్సరాలు గోలకొండ పత్రికకు సంపాదకుడిగా ఉన్నారు. గోలకొండ పత్రిక పేరు చెపితే సురవరం వారి పేరే గుర్తుకువస్తుంది. ఇక ఆయన వెలువరించిన గోలకొండ కవుల సంచిక గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఇది ఆయనకు అపారకీర్తిని సాధించిపెట్టింది. గోలకొండ కవుల సంచిక 1934లో ప్రచురించారు. ఆయ రాసిన కథలు 'మొగలాయీ కథలు' పేరుతో రెండు భాగాలుగా వెలువడ్డాయి.

ఆయన కొందరి ప్రోత్సాహంతో 1952లో జరిగిన ఎన్నికల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. అయితే ఆయన రాజకీయాల్లో ఇమడ లేకపోయారు. "ఈ రాజకీయ చీకటి బజరులో నేను, నా వంటి వారు ఏమియును పనికి రారు" అని చెప్పుకున్నారు. "భాషా సేవయే రాష్ట్ర సేవ, భాషా విజృంభణమే ప్రజాభ్యుదయ హితవు, సారస్వతాభివృద్ధియే సంస్కృతి అంటూ తనకు భాషా, సంస్కృతి, సాహిత్యాల పట్ల గల అపార అభిమానాన్ని చాటుకున్నారు. "హలికుడగాని పట్టలేదు హలమునెపుడు/సీత తల్లికి సేవలు చేయలేదు / కలము గిరగిర త్రిప్పితి తెలివి కొలది / వాణి కొలువుననే గడచె ప్రాయమెల్ల! అంటూ నిరంతరం సాహిత్య సహవాసం చేసిన తీరును వివరించిన మహావ్యక్తి సురవరం ప్రతాపరెడ్డి 1953 ఆగష్టు 25న కన్నుమూశారు. ఆయన రచనల్లో తెలంగాణా పలుకుబడి ప్రత్యేక రూపంలో అభివ్యక్తమయింది. రెడ్డి గారు రాసి "ఆంధ్రుల సాంఘిక చరిత్ర" పరిశోధకులకు మార్గాన్ని సుగమం చేసిన గ్రంథం. ఈ గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ తొలి బహుమతి లభించింది. రామాయణ విశేషములు, హిందువుల పండుగలు, కథలు, నవలలో, వ్యాసాలు జీవిత చరిత్ర లను రచించారు. ఆయన "గోలకొండ కవుల సంచిక"

ఆనాటి తెలంగాణలో కవులు లేరన్న దుష్టబుద్ధల కళ్లు తెరిపించింది. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి తెలియజేశారు.

నిజాం నిరంకుశ పాలనను ప్రతిఘటించడానికి కలం ద్వారా ప్రయత్నించిన పండితుడు, సాహిత్య పరిశోధకుడు సురవరం ప్రతాపరెడ్డి. ఆయన 'గోలకొండ' కవుల సంచిక సాహిత్యలోకంలో ప్రాంతీయ చిహ్నాన్ని నిలిపిన సంకలనం. సాహిత్యానికి ప్రాంతీయ స్పృహ కలిగించిన సంకలనం. ఒక రకంగా మనకు తెలియని మన చరిత్రను కావ్యాల ద్వారా నిర్మించే పనికి బాటలు వేసిన వ్యక్తి సురవరం ప్రతాపరెడ్డి. ప్రాచీనాధునిక సాహిత్యాలను సాంఘిక దృష్టితో అధ్యయనం చేసేవారికి ప్రతాపరెడ్డి గారి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' ఒక నమూనాగా నిలుస్తుంది. అందులోని వివిధాంశాల తర్వాతి రోజుల్లో పిహెచ్.డి సిద్ధాంత గ్రంథాలుగా వెలువడ్డాయి. ఆంధ్రుల సాంఘిక చరిత్ర ప్రభావం తర్వాతి పరిశధనపై ఏ విధమైన ప్రభావం చూపిందన్నది ఒక పరిశోధనాంశమే అవుతుంది. ఈ దృష్టితో ఆంధ్రుల సాంగిక చరిత్ర ప్రభావాన్ని అంచనా వేయవలసే ఉంది. 'రామాయణ విశేషాలు'లో రామాయణ కాలం నాటి సామాజిక జీవితాన్ని చెప్పడంతో బాటు బౌద్ధ, జైన రామాయణాలను జాతక కథలను తమ పరిశీలన కొరకు తీసుకున్నారు. ఆరుద్ర వంటి పరిశోధకలు దీన్ని అనుసరించారు.

**సామల సదాశివ :**

"కమ్మని ఉర్దూ భాషయను కాచిన తీయని పాలలో వనం / తమ్ముగ దాగియున్న పరతత్వ మహత్తర నూత్న ప్రేమత / త్వముగా దీపి తెల్గు కవితా నవనీతము జేసి ఆంధ్రలో / కమ్మని బంచిపెట్టిన / యఖండ యశో విభవా! సదాశివా!" అంటూ సామల సదాశివ గురించి తెలుపుతారు ఖమ్మం జిల్లా భద్రాచలానికి చెందిన కవయిత్రి చక్రవర్తుల లక్ష్మీనరసయ్య. నా జీవితమంతా సాహిత్య, సంగీతాలతోనే గడిపిన సామల సదాశివ మే 11, 1928న ఆదిలాబాద్ జిల్లా తెనుగుపల్లె గ్రామంలో జన్మించారు. చిన్నమ్మ, నాగయ్యలు వీరి తల్లిదండ్రులు. 'కథలు, కవిత్వం రాయడం మాత్రమే సాహిత్యం కాదు. సాహిత్యాన్ని రచించడం కూడా సాహిత్యమే' అన్న సురవరం వారి మాటలు సామల సదాశివకు ప్రేరణగా నిలిచాయి. తెలంగాణలో తొలితరం విమర్శకులు శొంఠి కృష్ణమూర్తి, కాళోజి సోదరులు వంటివారితోనూ ఇంకా మరెందరో సాహిత్యకారులతో సన్నిహితంగా మెలిగారు. సదాశివ పద్యరచన అందెవేసిన చేయిగా నిరూపించు కున్నారు. నిరీక్షణ లఘుకావ్య సంపుటిలోని పద్యాలు ఎందరో ప్రశంసలందుకున్నాయి. 2011 సంగీత నాటక అకాడమి పురస్కారం, కేంద్ర సాహిత్యం అకాడమి పురస్కారం పొందారు. ఆయన పొందిన పురస్కారాలలో ఇవి కొన్ని మాత్రమే. నిత్య సాహిత్య కృషీవలుడైన సామల తన సాహిత్య చరిత్రను ముగించుకొని ఆగష్టు 7, 2012న కన్నుమూశారు.

**దాశరథి :**

అభ్యుదయ కవిత్వ భాగమైన తెలంగాణ విముక్తి పోరాట కవిత్వంలో ప్రసిద్ధి వ్యక్తిగా పేరు పొందిన వారు దాశరథి. రుద్రవీణ, అగ్నిధార మొదలైన కావ్యాలు నిజాంరాజు నిరంకుశ పాలనను ఎదురించి స్వాతంత్ర్య సమరంలో ప్రత్యక్షంగా పాల్గొన్న కవి దాశరథి.

"నా తెలంగాణ కోటి రత్నాల వీణ" "ముసలి నక్కకు రాచరికంబు దక్కునే" అని ఆనాటి పాశవిక ప్రభుత్వం దమన నీతి మీద అగ్నిధారలు కురిపించి, అనాథుని చైతన్యం కోసం రుద్రవీణ మీటి తిమిరంలో సమరం సాగించిన కవి యోధుడు దాశరథి గారు. తిమిరంతో సమరం కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందించి. ఈయన సాగించి ధ్వజమెత్తిన ప్రజల లక్ష్యాన్ని గళమెత్తి జగత్తుకు మినిపించారు. "మూగవోయిన కోటి తమ్ముల గళాల / పాట పలికింది కవితా జవమ్ము కూర్చి నా కలా నికి బలమునిచ్చి నట్టి / నా తెలంగాణ కోటి రత్నాల వీణ అంటూ తెలంగాణ యొక్క గొప్పతనాన్ని వెలుగెత్తి చాటిన మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు. ఉద్యమ

కవిగా, ప్రణయకవిగా, సినీ కవిగా కవితా ధారలు కురి పించిన దాశరథి ఆధునిక తెలుగు సాహిత్యంలో మొదటగా పేర్కొనదగినవారు. దాశరథి ఒక్క తెలంగాణ ఉద్యమమనే కాదు ప్రపంచంలో ఎక్కడ న్యాయమైన పోరాటం జరిగినా దాన్ని పూర్తిగా సమర్థించారు. ఆయన్ను విశ్వకవిగానే భావించాలి." దాశరథి అగ్నిధార, రుద్రవీణ, మహేంద్రోదయం, పునర్నవం, అమృతాభిషేకం, కవితా పుష్పకం, తిమిరంలో సమరం, ఆలోచనాలోచనాలు, గాలీబ్ గీతాలు, దాశరథి శతకం వంటి గొప్ప రచనలు చేశారు. సినీరంగంలో ప్రవేశించి దాదాపు రెండు వేలకు పైగా పాటలు రాశారు. ఆయన రాసిన పాటల్లోని సాహిత్యం కూడా గొప్పగా ఉంటుంది. ఒక్కోపాట ఒక్కో ఆణిముత్యం. 1962లో వాగ్దానం సినిమాలో రాసిన పాటతో ఆయన సినీ గీతాల ప్రస్థానం మొదలైంది.

రుద్రవీణ, అగ్నిధార ఈ రెండు దాశరథి గారి తొలి రచనలు. తెలంగాణ పోరాటకాలంలో ఉద్యమస్ఫూర్తితో ఆయన గుండె నుంచి దూసుకొచ్చిన అనలాస్త్రాలు. అయితే ప్రకృతి వర్ణన కూడా లేకపోలేదు. తెలంగాణా విమోచనోద్యమ కాలంలో ఈ కావ్య సంపుటిల నుంచి పద్యాలను పాడుతూ సమరయోధులు వీరోచిత కార్య క్రమాలను ప్రజ్వలింపజేశారు. అందుకే నియోగి వీటి ప్రాధాన్యతను ఉగ్గడించారు. ఇంకా అనేక సందర్భాలలో రాసిన కవితలు ఎన్నో ఉన్నాయి. ఈయన రచనలు అభ్యుదయ కవులకు ఎంతో స్ఫూర్తినిచ్చాయి.

**కాళోజి :**

కాళోజి తెలంగాణ సాహిత్యంలో కాళోజి ప్రజల బాధని తన గొడువుగా చేసుకొని ప్రజాపోరాటానికి నిలి చాడు. ఆయన ఉద్యమ కవితలు నేడు తెలంగాణ రాష్ట్రం సాధించడానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఆయన ధిక్కార స్వరాన్ని విన్పించి తెలంగాణ ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చారు.

"అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి / అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి / అన్యాయాన్నెదించేవాడే నాకారాధ్యుడు" అంటూ అన్యాయానికి గురవుతున్న ప్రజల పక్షాన నిలిచి ఉద్యమ కేతనమై నిలిచిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు. ఆయన తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమం లోను మమేకమై నడిచారు. ఆయన రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారం. ప్రజల గొడవే కాళోజీ గొడవ. నిజాం దమననీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేశారాయన. ప్రతి గ్రామంలోను గ్రంథాలయం ఉండాలనే తలంపుతో 1930 నుంచి గ్రంథాలయోద్యమంలో చురుకుగా పాల్గొన్నా రాయన. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని 25 సంవత్సరాల వయసులో జైలుశిక్ష అనుభవించారాయన. నిజామాంధ్ర మహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌తో కాళోజీ అను బంధం విడదీయరానిది.

"జనగాం దగ్గరి బైరాన్‌పల్లి సంఘటనకి కాళోజీ తీవ్రంగా కలత చెందారు. "మనకొంపలార్పిన మన స్త్రీలు చెరిచిన / మన పిల్లలను చంపి మనలను బంధించిన మాన వాధములను మండలాధీశులను / మరిచిపోకుండా గుర్తుంచుకోవాలి / కసి ఆరిపోకుండా బుసకొట్టుచుండాలి / కాలంబు కాటేసి తీరాలని పిలుపునిచ్చారాయన. "చెమ్మగిలని కనులు - బ్రతుకు - కమ్మదనము చూడలేవు / చెమ్మగిలని కనులు - బ్రతుకు / కమ్మదనము చాటలేవు అంటూ తెలిపిన పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు 2002, నవంబరు 13న కన్నుమూశారు." కాళోజీ అనే మూడక్షరాల్లో సమాజ సృష్టి స్థితి లయకారాలు ఒదిగి ఉన్నాయి. ఆయన రచనలన్నీ సమాజాన్ని ఉద్దేశించినవే. రకరకాల ఉద్యమాలతో మమేకమై నిజాం నిరంకుశ విధానం మీద దాడిచేసి ప్రజలకవిగా, స్వాతంత్ర్య సమర యోధుడుగా కాళోజీ కీర్తిమూర్తి అయ్యాడు. ఎక్కడ నిరుపేద ఆకలితో అలమటిస్తారో, ఎక్కువ అనాధలు దిక్కు తోచక విలపిస్తారో, ఎక్కడ అరాచకం విలయ తాండవం చేస్తుందో, ఎక్కడ అంతరాలు, ఆర్భాటాలు, అహంకారాలు విజృంభిస్తాయో, ఎక్కడ మానవత

అణచబడుతుందో అక్కడ కాళోజీ ప్రత్యక్షమవుతారు. ఆయన రాసిన 'నా గొడవ' సంపుటిని అల్లంపూర్‌లో శ్రీశ్రీ ఆవిష్కరించారు. ఈయనను బహుముఖ ప్రజ్ఞాశాలిగా తెలంగాణ వైతాళికుడిగా నియోగి కీర్తించారు. వివక్ష ఎక్కడున్నా వ్యతిరేకించాడు. మంచి ఎక్కడున్నా స్వాగతించాడు.

## సినారె :

సమకాలీన ఉద్యమాల చైతన్యాన్ని జీర్ణించుకొని మానవతావాద మంత్రాన్ని విన్పించిన కవి డా॥. సి.నారాయణరెడ్డి. ఆయన నిరంతర కవితా ప్రస్థానంలో నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, విశ్వంభర, రామప్ప మొదలైన ఆ సంఖ్యాక మైళ్ళురాళ్ళు గోచరిస్తాయి. విత్తనాన్ని మట్టిలోకి విసిరికొడితే / వృక్షమై పేలుతుంది / ఒక్క నీటిని నొక్కాలని చూస్తే / లక్ష కంఠాలై మోగుతుంది'' అంటారు అభ్యుదయ భావజాలంలో డా॥. సింగిరెడ్డి నారాయణరెడ్డి. వివిధ ప్రక్రియలో దాదాపు దశాబ్దాలపాటు సాహిత్య సృజన గావించిన విశ్వంభరుడు సి. నారాయణరెడ్డి 1953 నవ్వనిపువ్వు సంగీత నృత్య నాటిక ప్రచురితమైంది. అదే సినారె తొలి ప్రచురణ. తదుపరి జలపాతం, విశ్వగీతి, అజంతా సుందరి వంటివి వెలువడ్డాయి. ఆయన రాసిన రామప్ప సంగీత నృత్య రూపకం అన్ని భారతీయ భాషల్లోకి అనువాదమైంది. ఆయన పరిశధన గ్రంథం ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు, ప్రయోగములు అత్యంత ప్రామాణిక గ్రంథంగా పేరుపొందింది.

సినారె 1962లో వచ్చిన "గులేబకావలి'' కథ చిత్రం ద్వారా సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. దాదాపు మూడువేల సినీగీతాలు రాశారు. సినారె ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులుగా ఎనలేని సేవలందించారు. ఇక రాష్ట్రస్థాయి, దేశస్థాయిలో ఆయన పొందినవన్ని పురస్కారాలు మరెవరూ పొంది ఉండరు. ఆధునిక తెలుగు సాహిత్యంలో సరికొత్త ప్రక్రియలను సృష్టించిన మహాకవి. నవ్వని పువ్వ నుంచి 80 గ్రంథాలను ముద్రించారు. ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయం ప్రయోగం వంటి నవ్య పరిశోధనా గ్రంథాల్ని ముద్రించారు. పాఠాలతో విద్యార్థి మనసులను ఊగించారు. సినీ గీతాలలో రసికజనుల గుండెల్ని పొంగించారు. ఆచార్యుడుగా బి.ఆర్. అంబేడ్కర్, తెలుగు విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సులర్‌గా విప్లవాత్మక విధానాలను ప్రవేశపెట్టి ఆ సంస్థలు విద్యార్థుల జీవితాల్లో వనాలుగా పరిమళించేట్టు కృషి చేశారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడుగా, రాష్ట్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా విశేష కృషి చేశారు. 'విశ్వంభర' అనే సుదీర్ఘ కావ్యాన్ని రచించి జ్ఞానపీఠ పురస్కారం పొందారు. తెలుగునాట విస్తృతంగా పర్యటించి తన మధురవాక్కులతో పులకరింపజేశారు. డా॥. సి.నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం పేరుతో తన సాహిత్యాన్ని 18 సంపుటాలుగా ముద్రించారని సి.నా.రె పాహితీ యాత్రను వివరించారు.

## సుద్దాల హనుమంతు :

"ఈ భూమి నీదిరా ఈ నిజాం ఎవడురా? ఈ జులుం - ఈ జబర్దస్తీ నెగురదన్ని వేయరా'' అంటూ ప్రజా చైతన్యానిన రగుల్గొపిన ఉద్యమకారుడు సుద్దాల హనుమంతు. ఆయన కవిగా, కళాకారుడిగా, తన జీవితాన్ని కష్టజీవుల కోసం అంకితం చేశారు. వీధిబడిలో ఉర్దూ, తెలుగు భాషల్లో కొంతవరకు చదువుకున్నారు. శతకాలు, కీర్తనలు, సీస పద్యాలు, కంద పద్యాలు కంఠస్థం చేశారాయన. కళారూపాల పట్ల ఆయనకు చిన్నతనం నుండి మక్కువ. ఈ మక్కువతో అంజనదాసు అనే వారి వద్ద హరికథలు నేర్చుకున్నారు సుద్దాల హనుమంతు. బుర్రకథ, యక్షగానం, పాటలు పాడడం వంటివి సాధన చేశారాయన. ముఖ్యంగా తెలంగాణ సాయుధ పోరాటంలో ఈ కళారూపాల పాత్ర ప్రముఖమైనది.

కమ్యూనిస్టు పార్టీ దళ సభ్యుడిగా చేరి తన పాటల ద్వారా ఉద్యమస్ఫూర్తిని రగిలించారు హనుమంతు. 11వ

ఆంధ్రమహాసభకు వాలంటీర్‌గా పనిచేశారు. భువనగిరిలో జరిగిన ఆ మహాసభ ప్రభావంతో సుద్దాల గ్రామంలో 'సంఘం' స్థాపించారాయన. ఆ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు, తిరుగుబాటు పోరాటాలు చేశారు. సంఘం పెట్టి, పాటలు కట్టి ప్రజల్ని ఉద్రేకపరుస్తున్నారని హనుమంతపై నిజాం ప్రభుత్వం అరెస్టు వారెంట్ జారీ చేసింది. దీంతో హనుమంతు అజ్ఞాతవాసంలోకి వెళ్లి పోరాటం కొనసాగించారు. ఒక సందర్భంలో రాజంపేట మండలం రేణుకుంట గ్రామంలో కమ్యూనిస్టుల గ్రామసభలో మాభూమి నాటకం, గొల్లసుద్దులు ప్రదర్శిస్తున్నారు. అక్కడ సుద్దాల హనుమంతతోపాటు ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, కురారం రాంరెడ్డి, రేణుకుంట రాంరెడ్డి, ఎలుకపల్లి యాదగిరి వంటి పోరాట యోధులున్నారు. గ్రామసభను చెదరగొట్టడానికి నిజాం మూకీలు వస్తున్నాయని బాల కళాకారులు సమాచారాన్ని చేరవేశారు. ఆయన రాసిన "పల్లెటూరి పిల్లగాడ ! పశువులు గాసే మొనగాడా! పాలు మరచి ఎన్నాళ్ళందో.. కాలువై కన్నీరు గార - కండ్లపై రెండు చేతులాడ / వెక్కి వెక్కి ఏడ్చుకున్నావా ? ఓ పాలబుగ్గల జీతగాడా" అనే పాట నేటికీ వినబడుతునే ఉంది ఇదొక కరుణ రసాత్మక గీతం. ఆయన రాసిన "పల్లెటూరి పిల్లగాడ" పాటను మా భూమి సినిమాలో పెట్టారు. సుద్దాల అశోకతేజ, సుద్దాల హనుమంతు కుమారుడే. వారసత్వంగా వచ్చిన పాటలు అశోకతేజ కొనసాగిస్తున్నారు. విరామ మెరుగని పోరాట యోధుడైన సుద్దాల హనుమంతు 10 అక్టోబరు, 1982న కన్నుమూశారు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సాహిత్యం - డా॥. పడాల జగన్నాథరావు, నవతెలంగాణ ప్రచురణలు, హైదరాబాద్, 2015.
2. తెలంగాణ ఆధునిక కవులు, దేవి పబ్లిషర్స్, సికింద్రాబాద్, 2002.
3. ద్వానా శాస్త్రి, విశాలాంధ్ర పబ్లిషర్స్, హైదరాబాద్, 1998.

❖❖❖

# జాతశ్రీ కథలు -తెలంగాణాలో వృత్తి జీవన చిత్రణ

- కె. నాగేశ్వరి, పరిశోధక విద్యార్థి

తెలుగు కథాసాహిత్యం ప్రారంభమైన తర్వాత మొదటి దశలో చింతాదీక్షితులు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆచార్య కొలకూరి ఇనాక్, కరుణకుమార్, సి.యస్.రావు, భాస్కరభట్ల కృష్ణారావు, మధురాంతకం రాజారాం, రావూరి వెంకట సత్యనారాయణ, దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి, కొడవటి కుటుంబరావు, మా గోఖలే లాంటి రచయితలు వృత్తికి సంబంధించిన కథలు రాశారు. 19వ శతాబ్దపు ఆరంభంలో రాసిన సుగాలీ కుటుంబం, కథలో చింతా దీక్షితులు గిరిజనుల వృత్తిని నమ్ముకొని జీవించే గిరిజనుల బతుకుల గురించి చిత్రించారు. అదేవిధంగా 1925 వ సంవత్సరంలో రాసిన పుల్లం రాజు కథలో శ్రీపాద మాల, మాదిగలు అస్పృశ్యతకు ఎలా గురవుతున్నారో, వారు వృత్తిని నమ్ముకొని ఎలా జీవించారో చిత్రీకరించారు. కొలకలూరి ఇనాక్ రాసిన తలలేనోడు కథలో మంగలి వృత్తిని నమ్ముకొని జీవనం సాగించే వృత్తిదారులపై పెత్తందార్లు ఎలా పేట్రేగిపోతారో, వారి మీద ఎలా రాజకీయం చెలాయిస్తారో పేర్కొన్నాడు. వృత్తి కథలను బలంగా రాసిన ఆధునిక రచయిత జాతశ్రీ. ఈయన వండ్రంగం, దొమ్మలాటలు, కుమ్మరం, కమ్మరం, పంబల, బైండ్ల, సాలె తదితర వృత్తుల గురించి రాశాడు.

## వడ్రంగి :

ఇప్పటికీ భారతదేశం వ్యవసాయం మీద ఆధారపడి ఉంది. కానీ ఒక్క తేడా గమనించాలి. పూర్వం యంత్రాల వినియోగం తక్కువగా ఉండేది. నేడు యంత్రాలు గ్రామాల్లోకి ప్రవేశించి వడ్రంగి వృత్తిని నమ్ముకున్న వృత్తి దారులను నాశనం చేసింది. జాతశ్రీ కుట్ర కథలో ఇదే రాశాడు. ఈ కథపై ప్రముఖ కథా రచయిత ఆచార్య తుమ్మల రామకృష్ణ రాసిన విమర్శనావ్యాసంలో " పనితనముండి తమ బతుకులు ఎలా కొరగాకుండా పోవటానికి గల కారణాలేమిటో అతని ఆలోచనలకు అందటం లేదు. ఈ మాయల మర్మం తెలుసుకోగల తెలివితేటలు అతనికి లేవు అన్న వాక్యంతో కథ ముగుస్తుంది. మారుతున్న కాలంతోపాటు మారలేక నమ్ముకున్న కులవృత్తి కూడబెట్టక కూలిపోతున్న ఎన్నో కుటుంబాల గాథ ఈ కుట్ర కథ వెనుక దాగి ఉన్న అసలు కథ అని చెప్పాడు. మరో సందర్భంలో అంతా సజావుగా, హాయిగా జరిగిపోతుందనుకునే సమయంలో కోమటి ముత్యాలు బ్యాంకు అప్పుతో ట్రాక్టరుకొని తెస్తాడు. రైతులు నాగళ్ళను పక్కన బెట్టి ట్రాక్టరు వెంటపడ్డారు. వండ్రగులు బతుకులు తారుమారు అవుతాయి ' అని స్పష్టంగా వృత్తిదారులపై ట్రాక్టర్ పెత్తనాన్ని వర్ణిం చాడన్నారు. కుట్ర కథలో వండ్రంగం అనే వృత్తి రోజు రోజుకి ఎలా నాశనమవుతుందో అద్భుతంగా చిత్రించిన వారు జాతశ్రీ. గొప్ప సాంకేతిక ప్రతిభ గల వృత్తి విద్యగా వండ్రంగి వృత్తి అత్యంత ప్రాధాన్యం పొందింది. కానీ రాను రాను ఇది క్షీణ దశకు ఎలా చేరుకుందో అనేక కారణాల్ని చూపించిన కథ..

వీరాచారి వడ్రంగి వృత్తిని నమ్ముకొని జీవనం సాగి స్తుంటాడు. ఇతనికి ముగ్గురు కొడుకులు. ముగ్గురిలో చిన్నవాడు నాగముని. బ్రతుకుదెరువు కోసం రెండు వందల ఇళ్ళున్నఊరికి వీరాచారి కుటుంబం వలస పోతుంది. ఆ ఊర్లో వండ్రంగి పని చేసే కుటుంబం ఒకటి కూడా ఉండకపోవటంతో పుష్కలంగా పని దొరుకు తుందని మనసులో సంబరపడుతూ వీరాచారి ఇంటిల్లి పాది ఆ ఊళ్ళోకి అడుగుపెడుతారు. వండ్రంగి చేయ వలసిన పనుల్ని ఆ ఊరికి కోసెడు దూరంలో ఉన్న తమ్మర వండ్రగులు చేసి పెట్టేవారు. వ్యవసాయ పనిముట్లతో ఏ చిన్న చెక్క పని పడినా వ్యవసాయదారులు తమ్మర వండ్రంగులను సంప్రందించాల్సిందే. నాగముని వయసు పదిహేను సంవత్సరాలు. చెక్క దూగోడ

పట్టడంలో మెళకువా, రంపం ఆడించటంలో వొడుపు ఉతి ఆడించటంలో నేర్పు అలవడలేదు.

కానీ మొద్దుబారిన పనిముట్లను సాన బెట్టడం బాగా తెలుసు. పొడవాటి తునికి చెక్క మీద అదుముతూ వెనకకి ముందుకి ఆడిస్తూ మధ్య మధ్య పదును చూస్తూ తృప్తి కలిగాక పక్కకు ఉంచుతాడు. తర్వాత పదేళ్ళకి కలప నగిషీ పనులకు నెలవై పోతాడు. ఆ పని తండ్రికి ఇద్దరన్న లకు ఇతనికే సొంతమవుతుంది. ఇలా వండ్రింగి వృత్తిని నమ్ముకుని నాగముని కుటుంబం సాఫీగా సాగుతుంది. అయితే అదే ఊర్లో కోమటి ముత్యాలు సెంటు పొలం కొనడానికి బదులు ట్రాక్టర్ కొనటంతో యాంత్రీకరణకు వ్యాపారస్తులు ఆకర్షితులవుతారు.

నాగలి, గుంటుకు, గొర్రు ద్వారా పనులు తొందరగా పూర్తికావని జనాలంతా ట్రాక్టర్ రాకముందు బోలెడంత పని దొరికిన వీరాచారి కుటుంబం అతలాకుతల మవుతుంది. మాయదారి ట్రాక్టర్ ప్రవేశంతో ఒకానొక సందర్భంలో కూతురుకి పెళ్ళి చెద్దామంటే డబ్బులుండవు. ఇలాంటి విచారకమైన కథను జాతశ్రీ అద్భుతంగా చిత్రీకరించాడు. గోరటి వెంకన్న రాసిన పల్లెకన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల పాటలో టాటా ట్రాక్టర్ టక్కరించినాదో నా డొంకదారిలో, ఎద్దు బండి గిల్లెగిరి పడ్డదమ్మో నా పల్లెల్లోనా పాటలోలాగే జాతశ్రీ ట్రాక్టరు ఎలా వండ్రంగి వృత్తిని భూస్థాపితం చేసిందో కథలో చెప్పాడు. వండ్రంగులకు పుట్లకొద్దీ ధాన్యం కొలిచి, వాళ్ళ ఇళ్ల చుట్టూ దినాల తరబడి తిరిగి, ఆపై నెలా, రెన్నెళ్ళు ఎండకీం వానకి తల్లడిల్లే బదులు అదే ధాన్యం కొలిచి, ట్రాక్టర్ని బాడుగకు తీసుకుంటే, అటు సమయం, ఇటు కష్టము తగ్గిపోతుందని రైతులు లెక్కలు తీస్తారు. దుక్కిటెద్దు ల్లేక పొలాలు కౌలుకిచ్చుకున్న వాళ్ళు చంక లెగరేశారు. జీతగాళ్ళు చికాకులు పడలేని వాళ్ళు తేలిగ్గా నిట్టూర్చారు. ట్రాక్టరుతో దున్నిస్తే సాలూ, ఇరసాలూ బాగుందనీ, విత్తనం త్వరలో ఎదిగొస్తుందనీ రైతులు చాలా వరకు నాగళ్ళను పక్కన బెట్టారు. నాగళ్ళనే కాదు రైతులు నాగమునిని కూడా పక్కన బెట్టారు అని జాతశ్రీ స్పష్టంగా కులవృత్తుల్ని నమ్ముకున్నవారి జీవితం బజారున ఎలా పడుతుందో ఆవిష్కరించారు.

**పంబల :**

పట్టణాల్లో రద్దీగా ఉండే ప్రాంతాల్లో పంబళ్ళు అడుక్కుతినడం కోసం ఎన్ని అవస్థలు పడతారో చిత్రించిన గొప్పకథ ఇది. భర్త, మామల కడుపు నింపడం కోసం పుల్మణి ఎంత ఆవేదనకు గురౌతుందో రచయిత జాతశ్రీ కళ్లకు కట్టినట్లుగా వర్ణించాడు. లేబర్ రూంలో పని చేసే మునెవ్వను సంప్రదించి తన గోడునంతా వెళబోసి పసిపాప కోసం పడే ఆరాటాన్ని బలంగా చిత్రీకరించాడు జాతశ్రీ. తనకు సంతానం కలగక మునెవ్వ దగ్గరకెళ్ళి కుటుంబ పరిస్థితులను వివరించి కోడిపెట్టకు బదులుగా శిశువు తెచ్చుకోవాలని తాపత్రయం పడుతూ పుల్మణీ బేరం కుదుర్చుకుంటుంది. మునెవ్వ కొప్పడి పుల్మణినీ బెదిరించినా పట్టించుకోకుండా బుక్కెడు తిండి కోసం ఉన్నది ఉన్నట్లుగా చెప్తుంది. పూరి గుడిసెలో జీవించే పుల్మణీ, భర్త పిట్టల ఉండేలు, మామ పంబజోళ్ళ గురప్ప ఒక్క పూట కోసం నానా కష్టాలు పడతారు. సంకలో డోలు తగిలించుకోని వాయిస్తూ జనాల నుండి డబ్బులు ఆడుక్కునేది వీరి వృత్తి. గడిచినా కాలాన్ని మునెవ్వతో పుల్మణీ వివరిస్తూ కంటతడి పెట్టిన సందర్భాన్ని రచయిత చక్కగా చిత్రీకరించాడు.

ఈ కథ ద్వారా అడుక్కునే తినేవారి పరిస్థితులు ప్రస్తుతం ఎలా ఉన్నాయో తెలుసుకోవచ్చు. చంకలో బిడ్డ ఉంటే మామ, భర్తకు బుక్కెడు ఆహారం పెట్టాలని తాపత్రయడే పుల్మణీ శిశువు మరణం కళ్ళముందే జరిగిందని కుమిలిపోయి ఆడవాళ్ళ ప్రాధాన్యాన్ని తిట్లతో చిత్రీకరించాడు జాతశ్రీ. ఈ కథ ద్వారా పంబజోళ్ళు కూటి కోసం ఎన్ని అవస్థలు, అవమానాలు పడతారో చెప్పాడు. అందుకే అన్నారేమో కూటి కోసం కోటి విద్యలని. ఈ సామెత విషాదం కథకి అన్వయించవచ్చు.

'విషాదం' కథ ద్వారా రచయిత చెప్పదలచుకున్న దేమిటంటే సమాజంలో ఇప్పటికీ భిక్షాటన వృత్తి ఉన్నదని, వారి మనుగడ కోసం ప్రభుత్వం స్పందించాలని పేర్కొన్నాడు. డబ్బు కోసం ఆశపడి మునెవ్వ పసి పిల్లల్ని కన్ను తెరవకముందే కాలువలో తోసేస్తుంది. ఈ పాత్ర ద్వారా ఆస్పత్రుల్లో పని చేసే ఆయాలు, నర్సులు ఎలా డబ్బుకి కక్కుర్తిపడి ఎంతటి పనికైన వెనకాడరని చెప్పాడు. మునెవ్వకు మరో ఆదాయం కూడా ఉంది. ప్రసూతి కోసం వచ్చే వాళ్ళల్లో రకరకాలుంటారు. కుటుంబపరంగా పెద్దలతో పాటు వచ్చే వాళ్ళుగాక, చాటు మాటుగా ప్రసవించేవాళ్ళు, అత్తమామల భర్తల పోరుపడలేక ఆడ పిల్లలు వద్దనుకునేవాళ్ళు, మగవాళ్ళ మాయల్లోనో, ఆర్థిక అవసరాలతోనో చిక్కొని గర్భిణీలైన అవివాహితలు, పురుషాహంకారంలో, బలత్కారంతో మానం అవమానం పాలయిన వాళ్ళు ఆధునిక పోకడలతో భవిష్యత్తుని అగమ్యంగా చేసుకున్న వాళ్ళు చాటుచాటుగా మునెవ్వతో మంతనాలాడి అంతో ఇంతో ఆమె చేతిలో పెట్టి పురిటి పిండాన్ని వదిలేసి పోతారు.

**కుమ్మరి :**

కుమ్మరి వృత్తిలోని మంచి చెడుల్ని చిత్రించిన గొప్ప కథ చలివేంద్రం, నలుగురు పిల్లలతో కుమ్మరెంకన్న, తన భార్య ముత్తమ్మతో కుండలను తయారుచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. పిల్లల్లో ఇద్దరూ బడికి వెళతారు. చిన్నప్పటి నుండి వృత్తిని నమ్ముకొని బతికే వెంకన్నకు వేరే పని రాదు. కేవలం కుండలే తన జీవితమని, కుమ్మరివృత్తే తనకు శరణమని కుటుంబాన్ని నెట్టుకు వస్తుంటాడు. పొద్దస్తమానం మట్టి పిసికి ప్రాణమంతా నీరసించి కుమ్మరి కులస్థులు మంచాన పడిన సంఘటనలు నేటికి పునరావృతమవుతున్నాయి. మట్టి కోసం పాదయాత్ర చేసి చేసి అలసిపోతారు. మట్టి దొరకకపోతే ఖాళీ చేతులూపుకుంటూ ఇంటికి తిరుగు ముఖం పడతారు. కూడు లేక ఎండలో తిరిగి తిరిగి నీరసించిపోతారు. వీటినంతా కేవలం కుమ్మరి కులస్తులు మాత్రమే చేస్తారు.

వృత్తిని కొనసాగించాలనే ఉద్దేశ్యంతో తమ పిల్లల్ని సైతం కుమ్మరి వృత్తిలోకి దింపిన సంఘటనలు నేటికి గ్రామాల్లో సజీవంగానే ఉన్నాయని చెప్పాలి. జాతశ్రీ చలివేంద్రం కథ ద్వారా మంచి సందేశాన్ని ఇచ్చాడు. కుల వృత్తిని నమ్ముకొని జీవించేవారి జీవితాలు రోజురోజుకి దీనస్థితికి ఎలా చేరుతాయో ఈ కథలో చూపెట్టాడు. అదేవిధంగా వృత్తుల్ని నమ్ముకొని బతికే అమాయక జనాలపై పోలీసులు దౌర్జన్యం ఎలా చేస్తారో కళ్ళే ముందుంచాడు. కష్టపడి కుండలను తయారుచేసుకొని సంతలో అమ్ముదామని కుమ్మరెంకన్న బయలు దేరుతాడు. అతడు బయలుదేరుతుంటే రకరకాల ఆలోచనలు తడుతాయి. జీవితమంటే ఇదేనా ? ఇంకెన్నాళ్ళు? ఈపాడు బతుకు ? అని తనకు తాను ప్రశ్నించుకుంటాడు. సంతలో స్థలం దొరుకుతుందో లేదో అని బయలుదేరుతాడు. మధ్యలో చిన్న బజారు వీధి దాటి ప్రధాన రోడ్డు దగ్గర కొచ్చే సరికి ఒక పోలీసు స్టేషన్ ఎదురవుతుంది. అక్కడ ఇద్దరు పోలీసుల కళ్ళల్లో కుమ్మరెంకన్న పడతాడు. ఇక్కడే కథ ప్రారంభవుతుంది.

ఎండకాలం కావటం చేత ఫ్రిజ్ లేనోల్లు, ఫ్రిజ్ ఉన్నా కరెంటు లేనోల్లు కుండలు కొనాల్సిందే. ఒకతడు కుండకు రేటెంత అని అడిగితే ముప్పయి రూపాయలని ఎంకన్న బదులిస్తాడు. '' మట్టి కుండరా మైనంతో చేసింది కాదు, ఏందా రేటు ? అని కష్టమర్ అంటాడు. ఇక్కడ రచయిత వృత్తిజీవితాన్ని చిత్రించిన తీరు అద్భుతం. పొద్దస్తమానం మట్టిలో తడిసి ముద్దితే కష్టమర్లు ముప్పై, ఇరవై, ఇరవైదు రూపాయలు అని బేరమాడుతూ కుమ్మరి వృత్తి దీనావస్థను చిత్రీకపట్టడంలో జాతశ్రీ సఫలీకృతుడయ్యాడు. ముప్పై రూపాయలు చెప్పిన ఎంకన్న షాక్ కి గురవుతాడు ఎప్పుడైతే కష్టమర్ పదిహేను రూపాయలంటాడో ఎంకన్న మళ్ళీ కల్పించుకొని ఇంకో అయిదు కలిపి ఇరవైయన్నా ఇయ్యండి 'మట్టిరేటు మండిపోతాంది. బాంచెన్ అని బ్రతిమాలుతాడు. అప్పటికీ కూడా కష్టమర్ షరతు విధిస్తూ ''నీళ్ళు కారితే వాపస్ ఇస్తా '' అని ఇరవై రూపాయలు

చేతిలో పెడతాడు. కుండలమ్మి పోలీసు స్టేషను వైపు నడుస్తూ కుమిలిపోయే బాధతో శ్రమకు ఇరవై రూపాయలు బేరం కడతారా ? అని అవేదన చెందుతాడు. ఆలోచనల్లో నడుస్తుంటే పోలీసుస్టేషనుకి చేరుతాడు.

**గౌడ :**

గౌడ వృత్తికి సంబంధించిన కథ 'అంతర్ముఖం' గౌడ వృత్తిని నమ్ముకుని మల్లేశం అతని భార్య భూదేవమ్మ జీవనం సాగిస్తుంటారు. వారి కుమారుడు డిగ్రీ చదివిన ఉద్యోగం రాదు. కువైట్ పోతానని పట్టుబడి యాభై వేలు తల్లిదండ్రులను అడుగుతాడు. చిన్నప్పటి నుండి రెక్కాడితే కానీ డొక్కనిండదనే చందంగా కష్టపడి బ్రతికే కుటుంబం మల్లేశంది. కోకాకోలా, పెప్సీ, బీరులు, లిక్కర్లు గ్రామాల్లోకి ప్రవేశించటంతో కల్లును చాలా మంది త్రాగటం తగ్గించారు. అదేవిధంగా మందులతో కల్తీ కల్లు తయారుచేసిన వారి వ్యాపారం సజావుగానే సాగుతుంది. కానీ ఉదయం నుండి రెక్కల కష్టంతో, ఆరోగ్యం సహకరించకపోయినప్పటికీ, ఒళ్ళంతా కమిలిన లెక్క చేయకుండా తాటి చెట్లు, ఈత చెట్లు ఎక్కి కల్లును తీసి స్వచ్ఛంగా కుండల్లో పెడితే ఎవరు కొనని రోజులు ప్రస్తుతం గ్రామాల్లో సహజం. ఇలాంటి సంఘటననే ఇతివృత్తంగా తీసుకుని జాతశ్రీ రాసిన 'అంతర్ముఖం'. ఇన్ని సమస్యల వలయంలో జాతశ్రీ కథను అద్భుతంగా చిత్రీకరించాడు. గౌడ వృత్తి పనివారు చేసే కష్టాలు మాములువి కావు. చెట్లపై నుండి కిందపడి చనిపోయిన వారు ఉన్నారు. ఈ కథలో మల్లేశం వృత్తిని నమ్ముకుని తన కుటుంబ బండిని ముందుకు లాక్కు వెళతాడు. ఒకరోజు బండి ఎంకన్న కల్లు తీసే సమయంలో చెట్లపై ఉండే మండ్రగబ్బ కాటేయడంతో చనిపోతాడు. ఆ విషయం గుర్తుకు వచ్చి మల్లేశం హృదయంలో ఎంతో వేదనకు గురవుతాడు. ఒక తాటిచెట్టు ఎక్కి కల్లు గీసే సమయంలో కొడుకు గురించి, బండి ఎంకన్న గురించి, కూల్ డ్రింక్స్ ల ప్రవేశం గురించి ఆలోచిస్తూ తన మనసు అతని దగ్గర ఉండదు. రకరకాలు పాడు ఆలోచనలు అతని మీద దాడిచేస్తాయి. వీటికి తోడు రాత్రి కురిసిన వాన కారణంగా మల్లేశం తల మీద నీటి బిందువులు పడి ఎటు తోచని పరిస్థితి. చివరికి అతడు చెట్టుపై నుండి పడి చనిపోతాడు.

ఈ కథలో ఏం ఇవానోవోఏవో ముందు నన్ను పాడెక్కేంచాలా ఉన్నాడు అని భార్య భూదేవమ్మతో తన కొడుకు గురించి మల్లేశం వేదన చెందుతాడు. కులవృత్తికి తోడు కాస్త వ్యవసాయం, ఉన్నవాళ్ళ పరిస్థితి పర్వాలేదు కానీ అచ్చంగా కల్లు మీదనే ఖర్చులన్నీ తీరాలంటే కష్టంగానే ఉంటుంది. ఎంతకాదు అనుకున్న మూడు నాలుగు వేలు అప్పు పడటం తప్పదు. సీజను వచ్చేదాకా వడ్డీ కట్టడం తప్పదు అని కులవృత్తిని నమ్ముకున్న వారు ఎట్లా అప్పులపాలు అవుతారో చక్కగా చిత్రీకరించాడు.

కులవృత్తే జీవితంగా భావించిన మల్లేశం 'చదివితే కులవృత్తి చేయకూడదా ..... ? నాగలి పట్టకూడదా' అని మనసులో అనుకోవటం వెనుక ఒక విషాద ఘటన ఉంది. చదివిన వారు కూడా చివరికి కులవృత్తి చేపట్టక తప్పదని హెచ్చరించినట్లు ఈ కథలో కనిపిస్తుంది. మనిషికి పూట గడవాలంటే ఏదో ఒకపని చేసుకొని పొట్టనింపు కోవాల్సిందే. అట్లా మల్లేశం తన ఇంటిల్లిపాదిని రెక్కల కష్టం మీద పోషిస్తాడు. ఎంకన్న నాలుగు నెలల క్రితం పరుపుతాళ్ళు అడుగు పెట్టి తాటి మట్టల్లోంచి గెలని బయటకు తీస్తుంటే మట్టల సందుల్లో చేరిన మంత్రగబ్బ కాటేసింది. ఎంకన్న గోసపెడుతూ తాడి మీద నుంచి దొర్లి పడ్డాడు. అదిగో ఇదిగో అంటుంటేనే ప్రాణం పోయింది. ప్రభుత్వం నుంచి నష్టపరిహారంగా లక్ష రూపాయలు వస్తే రావచ్చుగానీ, తాటివనానికి గౌడ్ ఇంటికి చేరే నమ్మకం లేకుంటే ఇంకెందుకు ఆబ్రతుకు? నష్ట పరిహారాల కోసమేనా ఈ వృత్తులు ? ఈ వాక్యాలు చదువుతుంటే వెంట్రుకలు లేచి నిలబడతాయి. వృత్తిని నమ్ముకుని జీవించేవారికి ఏమన్నా జరిగితే ప్రభుత్వాలు స్పందిచి, నష్టపరిహారం ఇస్తారు. కానీ తిరిగి ప్రాణాలు వస్తాయా ? అని రచయిత గౌడ వృత్తి జీవితాన్ని చక్కగా చిత్రీకరించాడు.

**బెస్త :**

బెస్త వృత్తి అంటే చేపలు పట్టడం. దీనికి సంబంధించిన కథ 'అగ్ని తుఫాను '. జాతశ్రీ వండ్రంగి, కుమ్మరి, గుర్జా తదితర వృత్తులతో పాటు కళాసీల గురించి కూడా అద్భుతంగా చిత్రీకరించాడు. ఇంట్లో పడుకున్న ఊరగల్లును లేవమని తన భార్య నల్లమ్మ లేపడంతో కథ ప్రారంభమవుతుంది. పొద్దంతా కష్టం చేసి పడు కోవటంతో ఊరగల్లు ఒళ్ళు పచ్చి పుండవుతుంది. ఊరగల్లు సారా తాగటం అలవాటు. నల్లమ్మ బయట కెళ్ళటం చూసిన ఊరగల్లు నిద్రలేచి పిల్లలను చూస్తూ తల్లి పిల్లలను చల్లంగా చూడు, ఏ కష్టం రాకుండా మంచి భవిష్యత్తు చూపించు అని గంగమ్మ తల్లికి నమస్క రిస్తాడు. ఇదంతా ఎందుకు చేస్తున్నాడంటే తాను చేసే వృత్తి చాలా కష్టమైంది. ఎట్టి పరిస్థితిలో ఈ పనిని పిల్లలకు నేర్పించొద్దు, పిల్లలను దీని జోలికి రానివ్వద్దని నిర్ణయించు కుంటాడు ఊరగల్లు.

సముద్రంలో వేటే జీవితంగా చావు బ్రతుకుల నడుమ జీవితం గడిపేవారి జీవితాన్ని అద్భుతంగా చిత్రీకరించాడు రచయిత. బెస్తవాళ్ళు, చేపలు పట్టేవారు, జాలర్లు, కళాసీలు తదితరులు పేర్లతో వ్యవహరించినా వారిది ఒకే వృత్తి అదే బెస్త వృత్తి. వీరిని రచయిత కళాసీలుగా కథ మొత్తం సంభోదించాడు. నాలుగు రోజులు కొనసాగింపుగా నీటి మీదే జీవితం గడపాల్సిన వారు కళాసీలు. వారి జీవితా లకు భద్రత ఉండదు. కంటినిండ నిద్ర దొరకటం కష్టం. చేపలు ఎక్కువ పట్టినా, తక్కువ పట్టిన వారికి ఏం లాభముండదు. వేటకు కావాల్సిన ఖర్చులన్నీ యజమాని భరిస్తాడు. పట్టిన చేపలన్నింటిని యజమానికి అప్పజెప్పాలి. బయటకి తీసిన చేపలను వేరు చేస్తారు. కారణం చేపలు రకరకాలుగా ఉంటాయి. అలా వేరు చేసిన తర్వాత కంపెనీలకు వేలం పాట వేస్తారు. వీటిని కంపెనీ దగ్గరకు మొయ్యడానికి ఆడవాళ్ళు అవమానాలు భరిస్తూ పని చేస్తుంటారు. ఈ రకంగా బెస్తవారి జీవితం గురించి చక్కగా నొక్కి చెప్పాడు.

ఈ కథలో ప్రధానంగా కష్టపడి చేపలు పట్టిన కళాసీలపై యజమాని హన్మంత్ దౌర్జన్యం కనిపిస్తుంది. అదేవిధంగా శ్రమను, ఒంటి నొప్పులను మరచిపోవటానికి తాగుడుకు ఏ విధంగా బానిసవుతారో ఊరగల్లు పాత్ర ద్వారా చెప్పాడు, ఏ గత్యంతరం లేక వృత్తిని నమ్మే కులస్థులు తమ పిల్లల్ని తమ వెంటే పనులకు తీసుకెళ్ళే సంఘటనల గురించి జాతశ్రీ ప్రస్తావించాడు. పిల్లల కోసం ఒక చేప ఇంటికి తీసుకెళ్లాదమని ఊరగల్లు నీళ్లలోకి దిగి చేప పట్టుకుంటాడు. దానిని గమనించిన యజమాని హన్మంత్ అగ్రహంతో ఊగిపోయి చెంప మీద చెల్లు మనిపిస్తాడు. ఈ సంఘటన ద్వారా రచయిత ఏం చెప్పదలచుకున్నాడంటే శ్రమను కూడా గుర్తించని ఓనర్లు లెక్కకు మించి సమాజంలో పేరుకుపోయారని నిర్మొహ మాటంగా యజమాని హన్మంత్ పాత్రను సృష్టించాడు. ఈ కథలో వృత్తిజీవితాన్ని చక్కగా చిత్రీకరించటంలో జాతశ్రీ సఫలీకృతుడయ్యాడు.

**దొమ్మరి :**

పిడికెడు అన్నం కోసం మనుషులు తాపత్రయపడటం సహజం. ఆ పిడికెడు కూడా దొరుకుతుందో లేదో అని బాధపడేవారున్నారు. కానీ తిండి కోసం బజారులో ఆటలద్వారా, గంగిరెద్దుల కాలికింద కడుపును ఉం చుతూ జీవించేవారున్నారు. కోతులతో విన్యాసం చేస్తూ, భూమి లోపలే కొన్ని గంటల పాటు ఉంటూ, రింగులతో విన్యాసం చేసే వాళ్ళు కూడా లేకపోలేదు. వయస్సుతో పనిలేకుండా పెద్ద వాళ్ళతో పోటిపడి పిడికెడు అన్నం కోసం పాకులాడే చిన్నపిల్లలు కూడా ఉన్నారు. ఇలాంటి వస్తువును ఇతివృత్తంగా తీసుకొని రాసిన కథ 'విధ్వంసం'.

దొమ్మరాటలను నమ్ముకొని జీవనం గడిపే వృత్తి దారుల గురించి రాసి సర్కస్ ద్వారా ఎంత కష్టపడి అన్నం అడుక్కుంటారో జాతశ్రీ 'విధ్వంసం' కథని అద్భుతంగా చిత్రీకరించారు. ఈ కథలో దొమ్మరిపోశం మరియు గురవ్వ భార్య భర్తలు. వీరికి పోలి అనే కుమారి ఉం టుంది. అలాగే కొండాలు అనే కుమారుడు కూడా ఉం

టాడు. సంకలో పాము బుట్టను, తలపై తట్టెడు బరువుతో ఊరురా తిరుగుతూ సంచార జీవితం గడుపుతాడని జాతశ్రీ దొమ్మరిపోశం ద్వారా కథని చక్కగా చిత్రీకరించాడు. పాముతో అద్భుతాలు, మ్యాజిక్లు చేయించి ధాన్యం గింజలను ఎలా అడుక్కొని కడుపునింపుకుంటారో ఈ కథలో చూపించాడు. ఎర్రటి ఎండలో దారిలో నడుస్తూ, భుజాల మీద తమ వస్తువులను మోసుకుంటూ, మరికొన్ని బరువైన సామాగ్రిని గాడిద మీద ఎక్కించి ఆకలిని లెక్కచేయకుండా కాలినడకన ఛలో పాదయాత్ర అన్నట్లు దొమ్మరోళ్లు ఊరూరా తిరిగి ప్రదర్శనలు ఇస్తుంటారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఈ వృత్తిని నమ్ముకున్నవారు సజీవంగానే ఉన్నారని చెప్పొచ్చు. కానీ దొమ్మరోలు స్థితి ప్రస్తుతం ఏ విధంగా తయారిందో వాటికి గల కారణాలేవో 'విధ్వంసం' కథ ద్వారా ప్రస్తావించాడు.

**చేనేతవృత్తి :**

చేనేత వృత్తిని నమ్ముకొని జీవించేవారు ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటున్నారో, వారి కష్టాలను, కన్నీటి కడగండ్ల వెనక దాగిన కారణాలను 'చిరునామా' కథలో జాతశ్రీ ప్రస్తావించిన తీరు మహాద్భుతం. ఉదయం నుంచి పనిలో నిమగ్నమై బతుకులను నెట్టుకొస్తున్న నేతన్నల గురించి ఈ కథ రాశాడు. మాటలకందని వారి బాధలకు, వారి అభద్రతా భావనలకు మసిపూసే వైఖరిని ఈకథలో ప్రస్తావించాడు. ఆత్మహత్యలు చేసుకొన్న చేనేత వృత్తిదారులకు ప్రభుత్వాల నుండి ఎలాంటి నష్టపరిహార మందకుండా రోడ్డున పడ్డ కుటుంబాలు అనేకం. వృత్తిని నమ్ముకున్న వ్యక్తులలో యజమానులు ఎలా చిచ్చు పెడతారో కూడా ప్రస్తుతం అక్కడక్కడా కనిపిస్తుంది. ఇలాంటి ఆసక్తికర, భాధకరమైన అంశాలను కేంద్రంగా తీసుకొని జాతశ్రీ 'చిరునామా' కథని రాశాడు. ఈ కథలో ప్రధాన ఇతివృత్తం చేనేత వృత్తిదారుల ఆకలికేకలు. వలసలు పోవటానికి ప్రేరేపించే కారణాలను ఈ కథలో పొందుపరిచాడు. చేనేత వృత్తిదారుల బతుకులు బుగ్గి పాలవటంతో బొంబాయి, చీరాల, భీవండి తదితర ప్రదేశాలకు వలసలు వెళుతున్నారని చెప్పారు. చేనేత కార్మికుడు సుఖంగా, సంతోషంగా ఉండడని ఊర్లల్లో కష్టాలు లేకుండా బతకరని అంతా సగం ఆకలితోనే రోజులు వెల్లదీస్తున్నారని రచయిత వృత్తివారి జీవితాన్ని అద్భుతంగా చిత్రీకరించాడు. 'పత్తే కరువైనాక, నేతగాడికి పనేముంటుంది ? నేతగాళ్ళంతా జీతగాళ్ళయి పోతాన్రు గాదూ ... ఆటోలు దోలుకుంటూ, సుతారి పనులు జేసుకుంట... ఓపికున్నోళ్ళు దేశాలు తిరుగుతున్నారు' అని జాతశ్రీ చేనేత కార్మికుల పరిస్థితి మగ్గాల అవస్థని ఈ కథల్లో చిత్రీకరించారు. కథ మొత్తం నేతన్నలను కేంద్రంగా చేసుకొని సాగుతూ రకరకాల విషయాలను ప్రస్తావిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. జాతశ్రీ. ఆర్తారావం, సృజనాలయం, కొత్తగూడెం, 2009.
2. జాతశ్రీ. చలివేంద్రం, కాత్యాయనీ ఎంటర్ ప్రైజెస్, సికింద్రాబాదు 2004.
3. పైరగాలి (కథా సంపుటి) జాతశ్రీ సృజనాలయ ప్రచురణలు, విద్యానగర్, కొత్తగూడెం
4. తెలుగు కథకులు కథనరీతులు- సం. సింగమనేని నారాయణ విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 2001.
5. తెలుగు కథకులు కథనరీతులు- సం. సింగమనేని నారాయణ విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 2001.

❖❖❖

# తెలంగాణ ధూంధాం ప్రదర్శనలో కవులు, గాయకుల పాత్ర

- అంతడుపుల నాగరాజు, పరిశోధక విద్యార్థి

తెలంగాణ ప్రాంతంలో ఉప్పొంగిన సృజన మరెక్కడా మచ్చుకైనా కనపించదు. సృజనాత్మక విషయంలో తెలుగు సాహిత్యంలో నూతన ప్రక్రియలు ఆవిష్కరణలో తెలంగాణదే ప్రథమ స్థానం తెలుగు గడ్డపై తొలిసారి అక్షరాలను కూర్చిన గుణాఢ్యుడు తనబృహత్కథ రాసింది, బసవపురాణం, రంగనాథ రామాయణం, మార్కండేయ పురాణం మొదలైన ప్రక్రియలకు పుట్టి నిల్లు తెలంగాణాయే. అప్పటి నుండి ఇక్కడ అజరామరమైన సాహిత్య సంపద ఉద్భవిస్తునే ఉంది.

తెలంగాణలో విస్తృతమైన సాహిత్యం వెలువడి ఎంతో మంది కవులు వెలుగు లోనికి వచ్చారు. తెలంగాణ ఘనమైన ప్రాచీన వారసత్వ సంపదను కలిగి వుంది. తెలంగాణ వైభవానికి ఆవారసత్వ చరిత్రను చాటిచెప్పే నిదర్శనాలెన్నో ఇక్కడ కనిపిస్తున్నాయి. శాతవాహనులు రాష్ట్ర కూటులు కాకతీయులు, కుతుబ్షాలు మొదలగు అనేక రాజవంశాలవారు పరిపాలించారు.

భారతదేశానికి వన్నె తెచ్చిన పుణ్యభూమి తెలంగాణ రాష్ట్రం. ఈ ప్రాంతం భౌగోళికంగా సుసంపన్నమైనప్రాంతం. సహజ సంపద, వనరులు ఉన్న ప్రదేశం కావటం వల్ల స్థానికంగా ఎంతో గొప్ప చరిత్ర నాగరికత, సంస్కృతి వికసించాయి. తెలంగాణ 'పలుకు తేనె చినుకులా ఉంటుంది. పదము పదమలో ఒక అందం, మాట మాటల చిక్కని బంధం అడుగడుగునా కనిపిస్తాయి. పాల్కురికి సోమనాథుని నుండి ప్రారంభమైన సాహితీ స్రవంతి తరువాత కాలంలో ద్విపద, పురాణ వాఙ్మయం, శతకం, స్రవంతి, పదకవిత్వం, యక్ష గానం వంటి ప్రక్రియల్లో తెలంగాణ నేలలో సిరులు పండించారు. తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో భాగంగా ఈ ప్రాంతంలోని కళాకారులు, కవులు, గాయకులు, రచయితలు, మేథావులు, తెలంగాణ రాష్ట్ర సమితి, తెలంగాణ ధూం ధాం నిర్వాహకులు, ప్రజాగాయకులు గద్దర్, విమలక్క గోరటి వెంకన్న, అందెశ్రీ, రసమయి బాలకిషన్, సుద్దాల అశోక్ తేజ, జయరాజ్, వరంగల్ శ్రీనివాస్, అంతడుపుల నాగరాజు మొదలైన వారంతా తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవ ఉద్యమాన్ని నడిపించారు. వందల యేళ్ళ నుండి ఈ ప్రాంతంలోని అణగారిన కులాలలోని అనేక ఉప కులాలకు (ఉదా : బాలసంతోళ్ళు, బుడిగజంగాలు మందహెచ్చులోళ్ళు, ఒగ్గువారు) చెందిన జానపద కళారూపాలు ఇప్పటిదాకా కాపాడుతూ వచ్చిన తెలంగాణ ఉద్యమ అవసరాలకు తగినట్లుగా మలచుకొని ప్రజల వద్దకు ఆట-పాట ద్వారా తీసికెళ్ళారు.

ఈ కళాకారుల ధూం ధాం వంటి ప్రదర్శనలు, పాటలు ఈ తరం తెలంగాణ యువకులకు, విద్యార్థులకు వెనుకటి తెలంగాణ పల్లెలు, జనజీవనం, కట్టుబాట్లు, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఏ విధంగా ఉండేవో తెలిపాయి. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవ ఉద్యమంలో భాగంగా రసమయి బాలకిషన్, అంతడుపుల నాగరాజుల ఆధ్వర్యంలో తెలంగాణ ధూం ధాం 2002లో ప్రారంభమైంది.

తెలంగాణ రాష్ట్ర సమితి సాంస్కృతిక విభాగం బాధ్యతలను పర్యవేక్షిస్తున్న జానపద గాయకుడు, ప్రజా కళాకారుడు రసమయి బాలకిషన్ 2001లో ఒకరోజు అంతడుపుల నాగరాజు ఆహ్వానంపై శ్రీరాంపూర్లో ఆయన నిర్వహిస్తున్న 'జానపద జాతర' సాంస్కృతిక ప్రదర్శనను చూసారు. బొడ్రాయి, బతుకమ్మ, పేరీలు, హరిదాసులు, పాములోళ్ళు మొదలైన తెలంగాణ కళారూపాలన్నీ ఒకటెనుక ఒకటి వేదిక మీదికి వచ్చి తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతాయి. పల్లెకు దూరమైన పట్టణ జనానికి పల్లె జీవితాన్ని కళ్ళెదుట నిలిపి, ఈ ప్రాంత సంస్కృతిపై ఒక అవగాహనను కల్పించే విధంగా

ఈ కళారూపాలను అంతడుపుల నాగరాజు రూపొందించి, ఇతర కళాకారులతో కలిసి స్వయంగా అనేక ప్రదర్శన లిచ్చారు. మందమర్రి (ఆదిలాబాద్)లో మొదలై తెలంగాణ వ్యాప్తంగా అనేక ప్రదర్శనలిచ్చారు ఈ కళాకారులు.

రసమయి బాలకిషన్ దృష్టిని 'జానపద జాతర' ఆకర్షించడంతో తన ''నేలమ్మ'' పాటల క్యాసెట్ ఆవిష్కరణ సభ (రవీంద్రభారతిలో జరిగిన)కు అంతడుపుల నాగరాజు బృందాన్ని ఆహ్వానించి 'జానపద జాతర' ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్యం అతిథిగా టిఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ను ఆహ్వానించడంతో 'జానపద జాతర' ఆయన దృష్టిలో పడింది. ఆ తర్వాత ఒకరోజు కేసీఆర్ రసమయిని, నాగరాజును పిలిచి తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం ఉపయోగ పడగల కళారూపాల గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఈ ముగ్గురి ఆలోచనల పర్యావసానంగా 'తెలంగాణ ధూం ధాం' రూపుదిద్దుకున్నది. అంతడుపుల నాగరాజు రూపొందించిన 'జానపద జాతర'లో అంతా సహజమైన జానపదమే ఉండేది. అయితే రసమయి బాలకిషన్ దాన్ని వివిధ ఉధ్యమ పాటలతో, పాటగాళ్ళతో, కవులతో మిళితం చేసి జానపద జాతరను ఉద్యమ అవసరాలకు తగినట్లు అద్భుతమైన కార్యక్రమంగా రూపొందించి తెలంగాణ వ్యాప్తంగా అనేక ప్రదర్శనలు నిర్వహించారు. రసమయి బాలకిషన్ వ్యాఖ్యానం, పాటలతో నాగరాజు బృందం, ఇతర కళాకారుల ఆటలతో తెలంగాణలో లక్షలాది ప్రజలను 'ధూం ధాం' ఎంతో ఉత్తేజితులను చేసింది.

తెలంగాణ ధూం ధాం తొలి ప్రదర్శన 2002 సెప్టెంబర్ 30న కామారెడ్డిలో ప్రదర్శించడం జరిగింది. ఈ సభకు సుమారు 50వేల మందికి పైగా జనం హాజరైనారు. తెలంగాణ ధూం ధాం సభను ఆ తర్వాత హైదరాబాద్లోని 'తెలుగు లలిత కళాతోరణం' ఓపెనర్ ఆడిటోరియం (పబ్లిక్ గార్డెన్)లో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో గద్దర్ సహ తెలంగాణ కళాకారులు, గాయకులంతా పాల్గొన్నారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులంతా వేదిక పైన కాకుండా సభలో కూర్చోవడం 'తెలంగాణ ధూం ధాం' ప్రారంభంలో రసమయి బాలకిషన్, అంతడుపుల నాగరాజుల కృషి, కేసీఆర్ మార్గదర్శకత్వంలోనే 'తెలంగాణ ధూం ధాం' ప్రారంభమైనా ఆ తర్వాత కాలంలో ఇదొక కళాకారుల ఉద్యమకారుల సమిష్టి కృషిగా కొనసాగింది. ప్రఖ్యాత తెలంగాణ కవి గూడ అంజయ్య ధూం ధాం గురించి ఇలా వ్యాఖ్యానించారు. ''తెలంగాణ ధూం ధాం' రూపకల్పనతో పాటు సభా నిర్వహణను భుజాలపై వేసుకున్న రసమయి బాలకిషన్ ఒక కొత్త కెరటం. ఒక కొత్త నాయకత్వం. తెలంగాణ కళాకారులందరిని ఒకే వేదికమీదికి తెచ్చిన రసమయి బాలకిషన్ కృషి చారిత్రక ప్రాధాన్యత సంతరించుకుంది. 'తెలంగాణ ధూం ధాం' అనేది ఒక సమిష్టి కృషి. ప్రజా యుద్ధనౌక, వాగ్గేయకారుడు గద్దర్ మొదలుకుని ఎందరో కళాకారుల చెమటచుక్కల, ఆలోచనల ఫలితమిది. ఊరు మనదిరా గూడ అంజన్న, పల్లె కన్నీరు గోరటి వెంకన్న, చూడచక్కని తల్లి అందెశ్రీ, వందనాలమ్మ జయరాజు, నీ ఆరు గుర్రాలు- వరంగల్ శంకరన్న, తయందతై - వరంగల్ శ్రీను, నేలమ్మ - రచ్చభారతి, ఏవీ మన పల్లెల్లోన - రసమయి బాలకిషన్, శాంతికవిత - నిర్మాల కిషోర్, రమాదేవి, చీకోటి కృష్ణ, ఎ.నాగరాజు బృందం, ఆకునూరి దేవన్న, గర్జన, దయా నర్సింగ్, బిక్షపతి, అశ్విని, అంతడుపులు జంగిరెడ్డి, స్వర్ణరెడ్డి, ఆడదాం డప్పుల దరువెయ్యిరా అన్న ఉద్యమాల గాయని - విమలక్క, సంతోష్, అరుణోదయ ప్రజా కళామండలి, గుస్సాడి, గోండు నృత్యాలు, లంబాడి ఆట పాటలు, పీర్ల పండుగ, దూల ఆటలు, కోలాటలు ఒకటేమిటి ఎన్నో కళారూపాలతో, ఎందరో కళాకారులు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరంతరం తెలంగాణ ప్రజలను చైతన్యం పరుస్తున్నారు''.

''తెలంగాణ రాష్ట్రం నడుస్తున్న చరిత్ర'' తెలంగాణతల్లి విగ్రహ రూపకర్త బి.ఎస్.రాములు రాసిన పుస్తకంలో

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

తెలంగాణ సాంస్కృతిక ఉద్యమంలో తెలంగాణ ధూం... ధాం.. పాత్ర అని గూడ అంజయ్య రాసిన వ్యాసం నుండి తీసుకోబడింది. కరీంనగర్ ఉప ఎన్నిక సందర్భంగా కరీంనగర్ 'ధూం ధాం'లో గద్దర్ ఆటా-పాటా. 2006 అక్టోబర్ 14న సాయంత్రం కరీంనగర్ పట్టణంలో తెలంగాణ 'ధూం ధాం' కార్యక్రమాన్ని నిర్వహించారు.

కరీంనగర్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఎం.పిగా పోటీచేస్తున్న సందర్భంగా ఈ ధూం ధాం కార్యక్రమం తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఉప ఎన్నిక నేపథ్యంలో తెలంగాణను సాధించుకోవడానికి పోరాడాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ప్రజా గాయకుడు గద్దర్, రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాస్, గూడ అంజయ్య, గోరటి వెంకన్న, జయరాజ్, బి.ఎస్. రాములు, అందెశ్రీ, ఒగ్గుకథ కళాకారుడు మిద్దె రాములు, తెలంగాణ మార్గదర్శి ప్రొ.జయశంకర్, హరీష్ రావు, ఈటెల రాజేందర్‌తో సహ పలువురు టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈ సభలో పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమం సందర్భంలో ఇలాంటి తెలంగాణ 'ధూం ధాం' ప్రదర్శనలు, తెలంగాణ కళాకారులు, కవులు, గాయకులు, రచయితలు నిర్వహించిన పాత్ర చరిత్రలో ఎప్పటికీ నిలిచివుంటుంది.

తెలంగాణ ఉద్యమంలో భాగంగా తెలంగాణ సంస్కృతిని, పరిరక్షించుకునే ప్రయత్నంలో భాగంగా తెలంగాణ జాగృతిని 2008లో కల్వకుంట్ల కవిత ప్రారంభించారు. తెలంగాణ అస్థిత్వ చిహ్నమైన 'బతుకమ్మ' పండుగకు పట్టణాలలో, నగరాలలో పూర్వ వైభవం తీసుకు రావాలని, తెలంగాణ సోయిని ఈ ప్రాంత మహిళల్లో కలిగించాలని, ఉద్యమవ్యాప్తికి బతుకమ్మ ప్రేరణ కావాలని తెలంగాణ జాగృతి నాయకురాళ్ళు, కార్యకర్తలు భావించారు.

2008 నుండి ప్రతి సంవత్సరం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో, మీడియా సంస్థలు, తెలంగాణ రాష్ట్ర సమితి సహకారంతో బతుకమ్మ పండుగను తెలంగాణ ప్రజలు ఎంతో గొప్పగా జరుపుకుంటున్నారు. బతుకమ్మ పండుగ జరిగే తొమ్మిది రోజులు (6వ రోజు అర్రెం నాడు బతుకమ్మ ఆడకపోయినా తొమ్మిదో రోజు జరిగే సద్దుల బతుకమ్మకు సత్తుపిండి తదితర ఫలహారాలు సిద్ధం చేసుకుంటారు) తెలంగాణ అంతా ఎంతో సందడిగా ఉంటుంది.

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత బతుకమ్మ పండుగ జరిగే తొమ్మిది రోజులు జిల్లాల్లో పర్యటిస్తూ, బతుకమ్మలు పేరుస్తూ, స్త్రీలతో కలిసి ఆటా-పాటలో పాల్గొని వారిని ఉత్సాహపరుస్తారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో విద్యార్థులు, యువకులు, మహిళలకు సంబంధించిన విభాగాలు పనిచేస్తున్నవి. ఆరోగ్య విభాగం, సాంస్కృతిక విభాగము, బుక్ క్లబ్ ప్రారంభించబడినవి. స్కిల్ డెవెలప్మెంట్ సెంటర్లు కూడా ప్రారంభించారు. తెలంగాణ జాగృతి విభాగాలను అమెరికాలోని వివిధ రాష్ట్రాలలో, లండన్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో కూడా ప్రారంభించారు. తెలంగాణ జాగృతి ప్రేరణతో 2008-09 నుండి వివిధ దేశాల్లోని తెలంగాణ ప్రజలు ఎంతో ఉత్సాహంతో బతుకమ్మ పండుగను జరుపుకుంటున్నారు. మహిళలను తెలంగాణవాదం వైపు కదలించడంలో కవిత కృషి ఫలించింది. తెలంగాణ అస్థిత్వ చిహ్నంగా, బతుకమ్మను సమున్నతంగా నిలపడంలో తెలంగాణ జాగృతి విజయవంతమైంది.

పట్టణం నుండి అమాంతం కళ్ళకు గంతలు కట్టి తీసుకెళ్ళిన పచ్చని పంటపొలాలలో అలలారే పల్లెటూరిలో వదిలేసి కళ్లకు గంతలు విప్పితే ఎలాంటి ఆహ్లాదకరమైన అనుభూతికి కలుగుతుందో అచ్చం అలాగే ధూంధాం వేదికను చూస్తే కళ్ళు చెమ్మగిల్లుతాయి.

స్వతగా ఆర్టిస్ట్ అయిన చింతస్వామి వేదికపై చక్కని లైటింగ్స్‌తో పాటు ఆర్ట్‌వర్క్‌చేసి ఒక గుడిసెను, నులక మంచం, బొడ్డురాయి, మంచెన ఇసురేతు, రోలు, రోకలి, నాగలి, ఎడ్లబండి చక్రం, ఇలా పల్లె జీవితం ఉట్టిపడేలా

వేదికను అలంకరించేవారు. తొలుత కార్యక్రమ నిర్వహణకు సహకరించిన వ్యక్తిని లేదా విశిష్టమైన వ్యక్తిచే బొడ్డురాయికి కొబ్బరికాయ కొట్టి, భోనం వెలిగించి, కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

మొదటగా అందెశ్రీ రచించిన జయజయహే తెలంగాణ జననీ జయకేతనం అనేపాటను, అలాగే గద్దర్ రచించిన 'అమ్మ తెలంగాణమా ఆకలి కేకల గానమా' అనే గీతాల్ని ప్రారంభ గీతాలుగా సమన్మయి కర్త అయిన రసమయి బాలకిషన్ నృత్య దర్శకులు అంతడువుల నాగరాజు బృందం విచ్చేసిన కవిగాయకులు అందరూ సమూహ గీతంగా పాడిన అనంతరం స్థానికంగా ఉన్న కళాకారులచే (ఏ జిల్లా అయితే అ జిల్లా) ప్రదర్శన అనంతరం మిద్దెరాములు గారిచ్చె బోనం ప్రదర్శన తర్వాత ఓగ్గుకథ ప్రదర్శన. అనంతరం శారియిపేటకు చెందిన ఐలయ్య బృందం 20మందితో డప్పు విన్యాసం ప్రదర్శన అలాగే భువనగిరికి చెందిన రమేష్ బృందంచే ఓగ్గుడీలు(20 మంది) విన్యాసాలు అలాగే సిద్ధిపేటకు చెందిన చిరంజీవి బృందం 10మందిచే సింధు యక్షగానం ప్రదర్శన. ఈ ప్రదర్శన మధ్యమధ్యలో స్థానిక గాయకులు పాటల ప్రదర్శనతో ధూంధాం వేదికకునిండుదనం వచ్చేది. అప్పుడు సిద్ధిపేటకు చెందిన దేశపతి శ్రీనివాస్. నందిని సిధారెడ్డి రచించిన నాగేటి సాలల్ల నా తెలంగాణ నా తెలంగాణ అనే పాటతో మొదలు అనేక పాటలను వాటి యొక్క అర్థాన్ని చెబుతూ మాటలను జోడిస్తూ తెలంగాణ పరిస్థితిని వివరించే వారు.

అదే క్రమంలో అందెశ్రీ రాసిన రమణ అలపించిన ఆర్.నారాయణమూర్తి దర్శకత్వంలో రూపొందిన ఊరు మనదిరా ! చిత్రంలోని "సుడసక్కనితల్లి సుక్కల్లో జాబిల్లి" అనే పాటను అంతడువుల నాగరాజు బృందం సుమారు 40మంది కళాకారులతో సబ్బండ వర్గాలను వీరియొక్క కులవృత్తులను తెలియజేస్తూ తెలంగాణ పల్లె జీవితాన్ని ప్రతిబింబిస్తూ ప్రదర్శించే నృత్యంతో ఒక్కసారిగా వేదిక సభ ప్రాంగణమంతా నిశబ్ధంగా అలుముకుని ఆలోచన లోకి తీసుకెళ్ళింది. ఐదునిముషాల వ్యవది కలిగిన ఆ నృత్య ప్రదర్శన ముగింపుగా అందరూ కులవృత్తుల వేషధారణ కలిగిన వారందరూ శిల్పంలా వేదికపై నిలువ బోగా వారి యొక్క కులవృత్తుల జీవన విధాన్ని చాటి చెబుతూ అప్పటి పరిస్థితి. సమాఖ్య రాష్ట్రంలోని ఇప్పటి పరిస్థితిని వివరిస్తె వక్తలు ఉపన్యాసించి కొనసాగింపుగా ఆయా కులవృత్తులు పరిస్థితిని చెబుతూ గోరెటి వెంకటన్న రాసిన పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రలు అనే పాటతో ఆయా కులవృత్తులు ప్రస్తుత జీవన పరిస్థితి జరుగుతున్న విధ్వాంసాన్ని కళ్ళకు కట్టినట్టు వివరిస్తూ తెలంగాణ కాంక్షను చాటి చెప్పేది ధూంధాం వేదిక. అనంతరం గూడా అంజయ్య గారిని పరిచయం చేస్తూ ఆయన రాసిన అనేక పాటలను ఆయనచే పాడిస్తూ కరీంనగర్ తేలు విజయచే చివరగా అయ్యోనివా నువు అవ్వోని. తెలంగాణనికే తోట పాలలోనివా ? అనే పాటతో స్వరాష్ట్ర ఆవస్యకతను వివరించే వేదిక ధూంధాం కామ్రేడ్. అమర్, మిత్రా రచనలో అరుణోదయ విమలక్క పాటను, కవితే నిర్మల తదితర బృందం 'అడుదాం- దప్పుల దరువేయరా- పల్లె తెలంగాణ పాటల పాడరా ! అనే నృత్యంతో తెలంగాణ కాంక్షను, వెలుగెత్తారు. అనంతరం కొత్తగూడెంకు చెందిన ప్రజాకవి జయరాజ్ వానలలు లేక, నీరులేక వలస బతుకులు తీరుపై వానమ్మ వానమ్మా సేతాన మేడుదిరా తెలంగాణ సేలాలనీ బీళ్ళయోరా అనే పాట "తలపున పారుతుంది. గోదావరి మన సేను మన సెలుక ఏడాది" అనే పాట రచన గోదావరిఖనికి చెందిన సమల సదాశివ మాస్టారు, మిత్ర రచనలో 'పల్లె పల్లేన పల్లేరు మొలిసే తెలంగాణలోనా' అనే పాట, తదితర పాటల్ని పాలమూరు జంగారెడ్డి తదితరులు ఆలపించగా, తెలంగాణ విధ్వంసం కళ్ళకు కట్టినట్లు స్పష్టమయేది.

అనంతరం ఈ విధ్వంసం వలన ఉన్న ఊరిని కన్న వారిని వదిలి బొంబాయి భీవండీ వలస వెళ్ళిన బతుకు లను కళ్ళకు కట్టినట్లు పయిలం సంతోష్, పుష్ప, స్నేహలు అభినయిస్తూ కోదారి శ్రీను రచించిన "ఉండు పదిలం

గుండు అమ్మా మా యమ్మా" అనే పాటతో కన్నీళ్ళు పెట్టించేవారు. వరంగల్ శ్రీనివాస్ రాసిన, కులవృత్తుల పాట రసమయి బాలకిషన్ వాక్కులతో మళ్ళీ పల్లెను యాదిచేసేది. అలాంటి పల్లెలోట్ల పండుగలు, పబ్బాలు తెలంగాణ, ఆంధ్రలో విలీనం కాకముందు ఎలా ఉండేదో "తానడిలా తల్లడిల్లే ఏలో మన తెలంగాణ అంటూ 30 నిముషాల నృత్య రూపకాన్ని అద్భుతంగా ఆవిష్కరించారేవారు. 60మంది కళాకారులు.

నాంచర్ల గోపి, గోరేటివెంకన్న, నిస్సార్, సుద్దాల అశోక్ తేజల రచనలతో అనేక సేకరణ పాల్లెపాటలతో రూపొం దించిన ఈ పాటను రసమయి బాలకిషన్ పాడుతూ నర్తిస్తూ వివరిస్తుంటే 60 మంది అంతడువుల నాగరాజు బృందం కళ్ళమందు, నిద్రలేచిన పల్లెలో బాలసంతులను, కోడికత్తులను, అలుకు పూతలను, భోనాల పండుగ, శివసత్తులు, కోలాటం ఆటలు, భొంగరాలట, గోలిలాట, సిగ్రగోనే, ఫకిరుసాబు, తుపాకీ రాముడు- గంగిరెద్దులు, సింధు బాగోతాలు, ఓగ్గుకథ, బతుకమ్మ పండుగ, సంక్రాంతి పండుగ పీరిల పండుగ, హోళి పండుగ గంగిరెద్దులాట ఇలా ఒక్కటేమిటి. దాదాపు తెలంగాణలో అన్ని పండుగ పబ్బాలు, సాంస్కృతిక సంప్రదాయాలు, చిన్ననాటి ఆటలు పాటలు ఇలా ఏదీ మిస్సవ్వకుండా కళ్ళముందు కలర్‌ఫుల్‌గా ఆవిష్కరించుకుంటూ ఆలాంటి నిండైన పల్లె మళ్ళీ పువై నవ్వలంటే మనరాష్ట్రం మనకు కావాలి అంటూ సందేశాన్ని ఇచ్చే పాటతో చైతన్యం రగిలించినారు. 60 ఏండ్ల ఆకాంక్షను, తెలియజేబుతూ ప్రజాకళా మండలి కోరిబృందం, నందిని సిధారెడ్డి రాసిన "జోకర్లు జోహర్లు అనేపాటతో దరువు ఎల్లన్న రాసిన- వీరులార వందనం అనే పాటతో అమరుల త్యాగాన్ని అభివర్ణిస్తూ పలువురు కళాకారులు, ధూంధాం వేదికపై గొంతెత్తే వారు.

అలాగే మిత్ర రాసిన "ఛలో ధూంధాం" అనే పాటతో అసైధుల హారతి కాళ్ళ గజ్జెల గమ్మతి అనే పాట, కోదారి శ్రీను రచించిన పాటను, సుధ రాసిన జంగు సైరాగ్ ఊరుదే అనే పాటలో ప్రజల్లో నూతన ఉత్తేజాన్ని ఇస్తూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కావాలంటే చిన్న చితక అందరూ ఉద్యమానికి అండగా ఉండాలంటూ నేర్నాల కిషోర్, రచన గానంతో 'పొడిసేటి పొద్దేలే ఏలామందా" అంటూ చిన్న పిల్లగాళ్ళ కూడా. ఉద్యమానికి ఎలా ఊతమివ్వలో పాటలో ప్రేరేపించారు. "నావ సాగుతుంది కొడుకా" అంటే ఊ అభినయిస్తూ తాను రచించిన గీతాన్ని ఏ పూరి సోమన్న ఆలపించారు. మలి దశ ఉద్యంలో చనిపోయిన విద్యార్ధులను స్మరిస్తూ మిట్టపల్లి సురేందర్ రచించార. "రాతిబొమ్మల్లోన కొలువైన శివుడా- రక్షబంధం విలువ నీకు తెలియదురా ! అనే పాటతో సాయిచందు కొమ్మా మీద కోయిలమ్మ పాటపాడుతున్నది అంటూ తన రచన గానంతో గిద్దెరాం నర్సయ్య. ధూంధాం వేదికపై గొంతెత్తి పాడేవారు.

తెలంగాణ కవి గాయకుల ప్రశస్తిని గుర్తుచేస్తూ పాటమ్మా నీకు ప్రాణమైతు అంటూ బిక్షపతి గిరిజనుల కదిలిరావాలనీ లంబాడీ బాషలో భిక్షునాయక్ ఇలా అనేక ఉత్తేజమైన గీతాలతో జంగ్ ప్రహ్లాద్ గర్జన, స్వర్ణ దయా నర్సింగ్ కొప్పుల రాజనర్సు, బాబ్జీ, వోల్గలవాణి, స్నేయ, దరువు అంజన్న, తీన్మార్ రవి రేలారేగంగా, మారంపల్లి రవీందర్ తదితరులు గలమెత్తి గర్జించే వారు. వీరి పాటలకూ మాట కలుపుతూ తెలంగాణ కాంక్షను జర్నిలిస్ట్ నాయకులు, మేధావులు, ప్రొ.జయశంకర్, ప్రొ.కోదండ రామ్, అల్లం నారాయణ, జాలురి గౌరిశంకర్, పానం యాదగిరి, ఘంటా చక్రపాని పల్లె రవికుమార్, ప్రొ.కాశీం. తదితరులు తెలంగాణ వాదాన్ని నరనరన్న ధూంధాం వేదికపై నుండి ప్రజలకు ఉద్యమ స్ఫూర్తిని నింపారు.

హైదరాబాద్ ధూంధాంపై నేను జిల్లాలోకి ప్రజలోకి రాజకీయాలకు అతీతంగా వస్తాను ధూంధాం చేస్తాను అని వేదికపై గద్దర్ ప్రకటించడంతో గడ్డం అరవింద్‌రెడ్డి అనే టీఆర్ఎస్ నాయకుడు తమ సింగరేణి ప్రాంతంలో ధూంధాం చెయ్యమని కోరగా అందుకు ధూంధాం టీం అంగీకరించింది. కారణం ధూంధాంలో నృత్యరీతులు

ప్రదర్శించే వారందరూ సింగరేణి బిడ్డలే కావడిం కూడా కారణం. అప్పుడు శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో ధూంధాం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గద్దర్, వంగపండు ప్రసాద్ జయరాజ్ శ్రీను లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోలీస్ డెగా కళ్ళమధ్య బహిర్గపరచలేని నిర్భంధం మధ్య సింగరేణి గని కార్మికుల్లో తెలంగాణ ఉద్యమ చైతన్యాన్ని రగల్చింది. తెలంగాణ ధూంధాం.

క్రమక్రమంగా తెలంగాణ ఉద్యమ అకాంక్ష ప్రజల్లో పెరుగుతుంది. అన్ని పార్టీలు మెల్లమెల్లగా తెలంగాణ నినాధాన్ని అనుసరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యమని ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు పదువులను అలంకరించి ప్రజాపోరును తగ్గించారనే భావనతో ప్రజలు టీఆర్ఎస్‌పై విశ్వాసన్న గిల్లుతుందనే విమర్శను తిప్పికొట్టి బలమైన తెలంగాణ నినాధాన్ని మరింత పెంపోందించే దిశగా ఎన్నికల్లో తెలంగాణ అకాంక్ష యొక్క బలం అమాంతంగా ఆవిష్కృతమైంది. ముఖ్యవిషయం ఏమిటంటే రాష్ట్ర ఇంటలిజెన్స్ ఇచ్చిన నివేదిక యొక్క ముఖ్య సమాచారం ధూంధాం వల్లే భారీ మెజారిటీతో టీఆర్ఎస్ ఘన విజం సాధించింది అనే రిపోర్టు సమర్పించడం గొప్ప విషయం. ఈ విషయాన్ని ఈనాడు దినపత్రిలో ధూంధాం జరిగిన మండలాల వారీగా వచ్చిన ఓట్లను, జరగని చోట వచ్చిన ఓట్ల విరిగా ప్రచురించి ఆటాపాటనూ అభినందిస్తూ ఆర్టికల్ అచ్చువేయడం అభినందనీయం. ఇలా ధూంధాం... ఇటు రాజకీయంగా ప్రజా ఉద్యమంగా ఏవరైన, ఏ పార్టీ అయిన ఎవరి సిద్ధాంతం వారికున్న తెలంగాణ ఆకాంక్షను తెలియజేయలంటే కళాకారులు మారినా, కళారూపం మాత్రం అదే, సాహిత్యం అదే ఇలా ధూంధాం ప్రస్థానం కొనసాగింది. ధూంధాం అనే కళా రూపాల ద్వారా అనేక అంశాలు ఈ పరిశోధన ద్వారా వెలుగు లోనికి వచ్చాయి. తెలంగాణలో ధూంధాం ప్రదర్శనలు ప్రజలను చైతన్యవంతం చేశాయి. తెలంగాణ ఉద్యమ పోరాటానికి ఒక ఒరవడిని ఏర్పరచినాయని చెప్పడంలో అతిశయోక్తిలేదు.

**ఆధార గ్రంథాలు :**

1. ప్రజా కళా మండలి పాటలు 2014, ప్రజా కళామండలి ప్రచురణ, గుంటూరు
2. దరువు ఎల్లన్న, వీరులారా... వందనం, తెలంగాణ ఉద్యమగీతాలు దరువు ప్రచురణలు, 2009, హైదరాబాద్
3. ప్రజా యుద్ధ పాటకు చావులేదు- కూర్పు-సత్యం గద్దర్‌పై దాడిని ఖండిస్తూ వచ్చిన స్పందన - ప్రతి స్పందనలు, జనం పాట ప్రచురణలు 1999, సికింద్రబాద్.
4. శబ్దం ప్రజా సాంస్కృతికోద్యమ ప్రతిధ్వని త్రైమాసిక పత్రిక, ఏప్రిల్, జూన్ 2015, ప్రజా కళామండలి ప్రచురణ.

❖❖❖

# లంబాడీల సంస్కృతి సాంప్రదాయాలు జీవన విధానం

–డా॥. భూక్య వీరన్న, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు శాఖ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, రామగిరి, నల్లగొండ.

ప్రముఖ చరిత్రకారుడు, తత్వవేత్త అరిస్టాటిల్ చెప్పినట్లు “మానవుడు సంఘజీవి”. మానవుడు తన చుట్టూ నివసిస్తున్న సమాజంతో కలిసిమెలసి జీవించాలని కోరుకుంటాడు. అందుకోసం క్రమశిక్షణతో కూడిన హద్దులు, ఆచారాలను విధించవలసి వచ్చింది. ప్రతి మానవ సముదాయానికి, జాతికి, తెగకు, వారి వారి సామాజిక కట్టుబాట్లు ఏర్పడ్డాయి. సాంస్కృతిక వికాసానికి పునాది ఏర్పడింది. వారి ఆచార వ్యవహారాలు ఒక తరం నుండి మరో తరానికి సంక్రమించాయి. భారతదేశంలోని ప్రధానమైన జాతుల్లో “లంబాడాలు” లేదా “సుగాలీలు” ముఖ్యమైన వారు. రెండు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వారి సంఖ్య చెప్పుకోదగ్గ స్థాయిలో ఉంది. లంబాడాలు దాదాపు రెండు తెలుగు రాష్ట్రాలలో విస్తరించి ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలలో మాత్రం వీరు కనిపించరు. వీరిని తెలంగాణ రాష్ట్రంలో “లంబాడీలు” అని పిలుస్తున్నారు.

లంబాడీలనే పేరు బంజారాలకు “లబాన్” అనే పదము నుండి వచ్చిందని చరిత్రకారుల అభిప్రాయం. “లబాన్” అనే పదం “లవణ్” అనే హిందీ పదం నుండి పరిణామం చెందింది. “లవణ్” అనగా ఉప్పు అని అర్థం. చారిత్రక ఆధారాలు ప్రస్ఫుటంగా లేనప్పటికీ బంజారాలను వివిధ ప్రదేశాలలో వివిధ నామాలతో పిలవడం వెనక మాత్రం అనేక అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బంజారాలను ఒక సంచార జాతిగా గుర్తించవచ్చు. బంజారా అనే పదంలో మనకు స్మరణకు వచ్చే “బన్” శబ్దాన్ని “వన్” తెలుగు అనే హిందీ పద రూపాంతరంగా పేర్కొనవచ్చు. “వన్” అనగా వనము. “జర” శబ్దం “చర” శబ్ద రూపాంతరం. ఇది “చరించు” అనే అర్థాన్నిస్తూ “వనచరులు” లేదా “వనాలలో సంచరించువారు”అనే సంపూర్ణ అర్థాన్నిస్తుంది. స్థిర నివాసం ఏర్పరచుకొనకుండా నిరంతరం ప్రయాణాన్ని సాగిస్తూ సంచార జీవనాన్ని గడుపుతూ వచ్చిన బంజారాలు, కాలానుగుణంగా ఒక స్థిర నివాసం గురించి ఆలోచించక సంచరిస్తూ వచ్చారు. కొన్ని వందల సంవత్సరాల తర్వాత ఆధునీకరణలో భాగంగా అడవులు, కొండల సమీపంలో సమూహాలుగా స్థిర నివాసం ఏర్పరచుకుని జీవిస్తున్నారు. లంబాడీలు నివసించే సమూహాలను ‘‘తండాలు’’అంటారు. లంబాడీల సంస్కృతి, సాంప్రదాయాలు, వారి ఆహారపు అలవాట్లు, వస్త్రధారణ, వృత్తి, చేతి పనులు, ఆచరించే పండుగలు మొదలైన అంశాల సమ్మిళితమే వారి జీవన విధానం అని పేర్కొనవచ్చు.

**ఉద్దేశం :**

లంబాడీల జీవన విధానంలో వారి ఆహారపు అలవాట్లు, వస్త్రధారణ, వీరు నిర్వహించే పండుగలు, సంస్కృతి సాంప్రదాయాలు ప్రధాన భాగమై ప్రతిబింబిస్తాయి. ఆధునిక భారతదేశ చరిత్ర, తెలుగు సాహిత్యాలతో లంబాడీల జీవన విధానం, వారి చరిత్ర ఏర్పరచుకున్న చారిత్రాత్మక సంబంధాన్ని తెలియజేయడం. ప్రధానంగా లంబాడీల యొక్క జీవన విధానం, ఆహారపు అలవాట్లు, నాటు వైద్యం అడవి తల్లితో పెనవేసుకొని గొప్ప అనుబంధాన్ని ఏర్పరచుకున్న తీరును, వారి జీవన విధానం, సంస్కృతి సాంప్రదాయాలను, వస్త్రాలు- అలంకరణ, సామాజిక, రాజకీయ సంబంధాలను వెలికి తీసి సాహితీ ప్రపంచానికి, పాటక లోకానికి అందజేయడమే ఈ పత్రం యొక్క ముఖ్య ఉద్దేశం.

**లంబాడీల తండా జీవన విధానాలు :**

లంబాడీలు సాధారణంగా గుంపులు గుంపులుగా ఊరికి దూరంగా కొండకోనల, అడవుల సమీపమున జీవిస్తుంటారు. వీరి నివాసాలను తండా అని పిలుస్తుం

టారు. 'తండా' అంటే లంబాడీల సమూహం, సరుకు నింపిన గోనెసంచుల సమూహమనే అర్థాలను నిఘంటువులు పేర్కొన్నాయి. పదకొండవ శతాబ్దానికి చెందిన 'దండి' దశకుమార చరిత్రలో కూడా లంబాడీల ప్రస్తావన కనిపిస్తుంది. అంతే కాక వివిధ కథనాల, చారిత్రక ఆధారాల ప్రకారం 11వ, 12వ శతాబ్దాల నుండి ముస్లిం దండయాత్రలకు ముందు కూడా లంబాడీల ప్రస్తావన కనిపిస్తుంది. వీరికి వ్యాపారమే ముఖ్య వృత్తిగా ఉన్నట్లు తెలుస్తుంది. మహమ్మదీయ సేనకు భయపడి అడవుల్లో కొంతకాలం తలదాచుకొని తండాలు ఏర్పాటు చేసుకుని జీవించారని అర్థమవుతుంది. వీరు నివసించే అడవి ప్రదేశంలో తేనె ఎక్కువగా లభిస్తుంది. ఇది గొప్ప ఔషధం. బలము ఇస్తుంది. ఈ తేనె సేవించినపుడు శరీరములో ఎటువంటి రోగాలు ఉన్నా నయమవుతుంది. వయస్సు పెరిగినా ముసలి లక్షణాలు కానరావు. కనుచూపు కూడ తగ్గదు, వారు రోజుకు లీటరున్నర తేనె సేవిస్తారు. అన్ని రకాల తేనెలను తీస్తారు. అడవిలో వారికి స్నానాలకు, బట్టలు ఉతుకుటకు కుంకుడు కాయలు, కొన్ని చెట్ల పసరులు మరియు సౌడు మట్టినుపయోగించి శుభ్రపరుచు కొనేవారు. అడవిలో మంచి టేకు కట్టెలు దొరికేవి.

లంబాడీల తండాలో నాయకునికి ప్రముఖ పాత్ర ఉంటుంది. తమ నాయకుని ఆజ్ఞలను భయభక్తులతో పాటిస్తారు. తండా ప్రజలు ఎక్కువగా ఒకరి కష్టసుఖాలలో మరొకరు పాలుపంచుకుంటారు. ఐకమత్యమే మహాబలం అన్న సూక్తికి అనుకూలంగా ప్రవర్తిస్తారు. ప్రస్తుతం కొన్ని తండాలలో మేరామభవాని, సీత్లాభాయి మొదలయిన వాటి దేవాలయాలను నిర్మించుకుంటారు. ఈ ఆలయాలలో 'భగత్' (పూజారి)లను నియమించుకుంటారు. తండాలలో భగత్‌కి మిక్కిలి గౌరవం ఉంటుంది.

లంబాడీలు మద్యాన్ని సాధారణ పానీయంగా భావిస్తారు. లంబాడీలు తాము జరుపుకొనే ప్రతి పండుగలలో దారూ (సారా), సింది (తాటికల్లు), ఈతకల్లు సేవిస్తారు. లంబాడీలు తమ జీవనంలో ధూమపానం కూడా ఒక అలవాటుగా వాడడం పరిపాటి. చుట్ట, పొగాకు తమాకూర్పాన్ (పొగాకుపొడి), బీడీలు. తాటి ఆకులను చుట్టలుగా చుట్టి వాటిని అర్ధ రూపాయికి గాని రూపాయికి గాని అమ్ముకుని జీవనం గడిపేవారు. ఏవైనా దెబ్బలు తగిలినపుడు, కాళ్ళు చేతులు విరిగినప్పుడు, చర్మ వ్యాధులు వచ్చినప్పుడు, పాములు, తేళ్ళు, కుక్కలు, నక్కలు, తోడేళ్ళు, పులి కరిచిన, కొరికిన, గాయపరిచిన సందర్భాల్లో చెట్ల పసరు పోసి గాయాన్ని వెచ్చపరిచి నయము చేసుకుంటారు. ఇంతేకాక కూరకు చెట్ల ఆకులు వండుకుని తినేవారు. శ్రీరాముని దైవంగా నమ్మే లంబాడీలు బాణానికి, మాటకు ఎంత విలువ ఉంటుందో పెద్దల మాటకు అంత విలువ ఉన్నదని గర్వంగా చెప్పుకుంటారు.

తెలుగు జానపదాలకు దగ్గరగా ఉన్న తండాలలో తెలుగు జానపద సంస్కృతి కొంత కనిపిస్తుంది. ఇప్పుడిప్పుడే ప్రభుత్వం ఏర్పరిచిన విద్య, వైద్య మొదలయిన సౌకర్యాల వలన నగర ప్రభావం లంబాడీలపై ప్రసరిస్తుంది. అయినా రావలసినంత మార్పు రాలేదని చెప్పాలి. ఒక్కొక్క తండాలలో సుమారు 50 నుంచి 60 కుటుంబాలు ఉంటాయి. కుటుంబాలు ఎక్కువై వారి మధ్య తగాదాలు ఏర్పడినపుడు విడిపోయి కొత్త తండాలను ఏర్పాటు చేసుకుంటారు. తండాలను నాయకుని పేర్లతోనే కాక చేపట్టే వృత్తులు, పరిసరాలను ఆధారంగా చేసుకుని పేర్లు పెట్టుకుంటారు. ఉదా:- తండా ప్రజలు చెరుకును ఎక్కువగా పండించడం వలన చెరుకు తండా అనీ, గూడెంకు దగ్గరగా ఉండటం వలన గూడెప్పకుంటతండా అనీ, ఒకే గోత్రపు వారు తండాలలో ఎక్కువగా ఉండటం వల్ల ఆ తండాకి ఆ గోత్రం పేరు పెట్టుకుంటారు. దారావతు, నునావతు, భుక్యాతండా అనీ, నీరు ఎక్కువగా ఉండే చోట నివసించటం వలన జల్మాలకుంట తండా అని మొదలయిన పేర్లను పెట్టుకోవడం జరిగింది.

తండాలల్లో సాధారణంగా వారు నివసించే ఇండ్లు ఎక్కువగా పూరిళ్ళు. వారికి ఈ మధ్య ప్రభుత్వ పథకాల ద్వారా ఇళ్ళను కట్టిస్తున్నారు. ధాన్యాలను కర్ర పారకలతో చేసిన గుడిసెల్లో దాచుకుంటారు. వంటకు ఎక్కువగా మట్టి పాత్రలను ఉపయోగిస్తారు. కంచుగిన్నెకు వీరిలో విలువ ఎక్కువ. లంబాడీ తెగలో ఇతరులను కలుపుకొనే సమయంలో కంచు పళ్ళెంలో కలిసి భోజనం చేయడం వాళ్ళ ఆచారం, వండిన పదార్ధాలను ఉట్లపైన భద్ర పరుచుకుంటారు. పడుకోవడానికి, కూర్చోవడానికి చాపలు, గోనెసంచులు, మంచాలను, మంచెలను ఉపయోగిస్తుంటారు. పరుచుకోవడానికి, కప్పుకోవడానికి దుప్పట్లు, బొంతలు, కంబళ్ళు ఇంకా మందంగా ఉండే ప్రత్యేకమయిన బొంతలను తయారు చేసుకొని వాడుతారు. గొర్రెలు, మేకలు, కుక్కలు మొదలైన వాటిని పెంపుడు జంతువులుగా ప్రేమగా చూసుకుంటారు.

## లంబాడీల తండా స్వరూపం, ఆహారపు అలవాట్లు:

ఈ తండాలల్లో లంబాడీలు వంటకు ఎక్కువగా మట్టి పాత్రలనే ఉపయోగించేవారు. లంబాడీలు అధికంగా మాంసాహారులే. మాంసాహారంతో పాటు ఆకుకూరలు (భాజీ) ఎక్కువగా తింటారు. వీరి శాఖాహార, మాంసాహార పట్టికలను ఈక్రింది విధంగా పేర్కొనవచ్చు.

**శాఖాహారం :**

లంబాడీలు ముఖ్యంగా జొన్నగటిక, జొన్నరొట్టెలు, సజ్జగటిక, సజ్జరొట్టెలు, మొక్కజొన్నతో అన్నం వీటిపై నంజుకొని తింటారు. వారు అధికంగా సాగునీరు లభించని మారుమూల ప్రాంతాలలో, మైదాన ప్రాంతాలలో నివసించడం వలన సాధారణంగా మెట్ట పంటలైన సజ్జలు, జొన్నలు, వరిగెలు, తైదలు మొదలైన పంటలు పండిస్తూంటారు. కాబట్టి వీరు సజ్జ, జొన్న రొట్టెలను తమ దైనందిన ఆహర పదార్థంగా వాడుతారు.

లంబాడీలకు అత్యంత ఇష్టమైన మరో వంటకం జారెరళ్యా లేదా బాద్రిఝాడో (జొన్న అన్నం, సజ్జ అన్నం). జొన్నలను సజ్జలను కడిగి, దంచి వండిన వంటకం వీరికి ఎంతో ఇష్టం. బాజ్జి(గోంగూర) చెరువులలో సరస్సులలో దొరికే ఆకు కూరలు మరియు దయి (పెరుగు) పచ్చి మిరపకాయలను నంజుకు తింటారు. అందుకే వారు దేహదారుఢ్యం కలిగి ఉంటారు. వండిన పదార్థాలను ఎక్కువగా ఉట్లపై భద్రపరిచేవారు.

**మాంసాహారం :**

లంబాడీలు సాధారణంగా మాంసాహార వంటకాలలో జారెర్బాట్టి (రొట్టె), కుకోడోర్ (కోడిపుంజు), లోంగావణ్, గోర్లార్ బొట్టి లొంగావణ్ (మాంసంకూర) సళోయి రక్తంతో మాంసాన్ని కలిపి వండిన గుడ్లార్‌హడ్కార్, కోల్టో, అంతర్క్యాలు, బొమికలతో, ప్రేగుతో వండిన ప్రత్యేకమైన వంటకం మొదలైనవి.

## లంబాడీల వస్త్రాలు – అలంకరణ :

సమాజంలోని సాధారణ స్త్రీలకు లంబాడీ తండాలలో నివసించే స్త్రీ వేష వస్త్రధారణలో వైయుక్తికమైన భేదము ఉంటుంది. లంబాడీ పురుషుల వేషధారణలో ప్రత్యేకత ఏమిలేదు. వారు ఇతర పురుషులు మాదిరి ధోవతి, చొక్కా ధరిస్తారు. స్త్రీల దుస్తులు మాత్రం అందమైన కుట్టు పనులతో ఉంటాయి. అద్దాలు పొదిగించిన రవిక (కాంవళి), కుచ్చుల లంగా (పేటువా) అద్దాలు, రూపాయి బిళ్ళలతో తయారు చేసిన "గుమ్లో" (ముసుగు) ధరిస్తారు. లంబాడీ స్త్రీల ఆభరణాలు, జడలకు గుగిరీలను, టోపీలను, చేతులకు బళియా(గాజు)లను, బాజుబంద్ (కడియాలు) కాళ్ళకు కడియాల్లాంటి వంకీలు, కసెలను వేసుకుంటారు. అద్దాల అద్దకముతో రంగు రంగుల దారాల అల్లికలు ప్రత్యేకతను కలిగి ఉంటాయి. కేశాలంకరణకు ప్రత్యేకంగా వెండితో తయారుచేసిన వైవిధ్యమైన ఆభరణాలు ధరిస్తారు. పెద్ద ముక్కెర, మెడలో వెండి కంటే మరియు పూర్వ కాలపు నాణెల గొలుసుల హారం ధరిస్తారు. అలాగే కాళ్ళకు ప్రత్యేకమైన కడియాలు, వ్రేళ్ళనిండా మెట్టెలు ధరిస్తారు. చేతినిండా తెల్లని గాజులు (బలియా) ఉంటాయి. చాలా కుచ్చులు, మడతలు కలిగిన లంగాకు అద్దాల అల్లికలు కలిగినవి తయారు చేసుకుని ధరిస్తారు.

నేటికీ తెలుగు జానపదుల్లో కొన్ని అనారోగ్య కారణాలకు ముక్కు, చెవులకు పోగులను కుట్టించడం, యంత్రాలు చెక్కించిన దండ కడియాలను ధరించడం జరుగుతుంది. అందు వలన ఆభరణాలు అందానికే కాక ఆరోగ్య అంశాలపై ఆవిర్భవించాయని తెలుస్తుంది. ఆభరణాలు అంద చందాలకే కాక అవసరమైన సమయాల్లో ఆర్థిక సమస్యలను తొలగించి కుటుంబాన్ని ఆదుకుంటాయి. అయితే లంబాడీలలోని సాంప్రదాయక ఆభరణాలు ఈనాడు ఎన్నో మార్పులకు లోనవుతున్నాయి. ఆధునిక కాలంలోని నాగరికతా ప్రభావంతో ఈ నగలన్నీ అంతరించి పోతున్నాయి. వీటిని సంరక్షించుకొనే బాధ్యత ఈనాటి యువతరం మీద ఎంతగానో ఉందనే చెప్పాలి.

బంజారాలు సంచార జాతులు. వారి సంచార జీవనంలో ఎద్దు రవాణాకు ముఖ్య వాహనం. పశుపోషణ వారి జీవనంలో ఒక ముఖ్యమైన భాగం. ఒక్కొక్క కుటుంబానికి వందల సంఖ్యలో గోవులుంటాయి. తెలంగాణ రాష్ట్రంలో బంజారాలు అధిక సంఖ్యలో ఉన్నది వరంగల్ తరువాత నల్లగొండలోనే. బంజారాల వేషధారణ, ఆహారపు అలవాట్లు, రాజకీయ, సామాజిక సంబంధమైన కట్టుబాట్లు, భాషా సాంస్కృతిక పద్ధతులు విలక్షణమైనవి. తండాలల్లో వీరి జీవనం ఆశ్రమాలను పోలి ఉంటుంది. గడ్డి ఇండ్లల్లో వీరి నివాసం. మట్టితో కట్టిన గోడలు, కొట్టాలు ఎక్కడ చూసినా దర్శనమిస్తాయి. ఏమైనా వివాదాలు వస్తే తండా న్యాయ పంచాయతి ద్వారా పరిష్కారమౌతాయి. నాయక్, కార్బారి మొదలైన వారు న్యాయం చెపుతారు. పంచాయతికి నాయక్ అధ్యక్షుడైతే, కార్బారి సలహాదారుగా వ్యవహరిస్తాడు. బంజారాల న్యాయ పంచాయతి నాయక్ ఇంటి ఆవరణ లోనో లేదా ఒక విశాలమైన ప్రదేశంలోనో నిర్వహిస్తారు. ఆచారం ప్రకారం బంజారాలు కుల పంచాయితీల సందర్భంగా సారా సేవిస్తారు.

లంబాడీల వస్త్రధారణ ప్రత్యేకమైంది. స్త్రీలకు కాళి, ఫేట్యా, టుక్రీ, ఘుంక్టో మొదలైన దుస్తులు ఆకర్ష ణీయంగా ఉంటాయి. ధోవతి, ఎర్రని రుమాలు పురుషులకు ప్రత్యేకమైనవి. అలంకరణ విషయానికొస్తే తలపై వెండితో చేయబడిన టీకి, టోపీలు చెప్పుకోదగ్గవి. లంబాడీలు ప్రాచీన కాలం నుండి నేటి వరకు ఆశించిన రీతిలో సామాజికంగా, ఆర్థికంగా అభ్యుదయ పథంలో పయనించకపోవటం శోచనీయమే. ఇకముందైనా అన్ని రంగాలలో ముందుంటారని ఆశిద్దాం.

**ముగింపు :**

ఈ “లంబాడీల సంస్కృతి సాంప్రదాయాలు జీవన విధానం” అనే పత్రంలో లంబాడీల తండా జీవన విధానం, ఆధునిక భారతదేశ చరిత్ర, తెలుగు సాహిత్యా లతో లంబాడీల జీవన విధానానికి ఉన్నటువంటి చారిత్రాత్మక అనుబంధాన్ని వివరించడం జరిగింది. ప్రధానంగా లంబాడీల తండా జీవన విధానం, వారి తండా స్వరూపం, ఆహారపు అలవాట్లు, వస్త్రాలు - అలంకరణ, వేషధారణ, సామాజిక, రాజకీయ సంబంధాలను గురించి చిత్రీకరించడం జరిగింది.

లంబాడీల యొక్క తండా జీవన విధానాన్ని, సంస్కృతి సాంప్రదాయాలను సేకరించి పాఠ్యపుస్తకాలలో ముద్రించి ప్రస్తుత మరియు భవిష్యత్తు తరాలకు అందించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా తెలుగు సమాజం యొక్క జీవన విధానం, సంస్కృతి సాంప్రదాయాలతో పాటుగా లంబాడీల జీవన విధానం, సంస్కృతి సాంప్రదాయాలకు సంబంధించిన అంశాలను, లిపి, భాషలను పాఠ్యపుస్తకాల ద్వారా, సాహితీ ప్రపంచం ద్వారా, పాఠకుల ద్వారా ఒక సజీవ సంపదగా భవిష్యత్తు తరాలకు అందించి, లంబాడీ సమాజం యొక్క సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడవలసిన బాధ్యత మనందరిపై ఉంది.

❖❖❖

# షేక్ హుస్సేన్ (సత్యాగ్ని) కథలలో - స్త్రీ వివక్షత

- డా॥. యం. శారికృష్ణ
అసిస్టెంట్ ప్రొఫెసర్, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
- నగరి భిల్లీబాబు,
పరిశోధక విద్యార్థి, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ప్రాచీన భారతీయ సమాజంలో ఉన్న బాల్య వివాహం, వరకట్నం, సతీసహగమనం, విగ్రహారాధన, నరబలులు, జంతు బలులు, అంటరానితనం మొదలగు సాంఘిక దురాచారాలను రూపుమాపటానికి ఎందరో సంఘ సంస్కర్తలు తీవ్ర ప్రయత్నం చేశారు. వారిలో రాజరామమోహన్‌రాయ్ అగ్రగణ్యుడు. వీరు బ్రహ్మ సమాజం అనే సంస్థను స్థాపించి మన సమాజాన్ని కొంత వరకు సంస్కరించి ''నవయుగ వైతాళికుడు'' అను బిరుదును పొందారు. తరువాత స్వామి వివేకానంద (రామకృష్ణ మిషన్) స్వామిదయానంద సరస్వతి (ఆర్యసమాజం) మహాదేవ్ గోవిందరేనడే (ప్రార్థనా సమాజం) ఈశ్వరచంద్రా విద్యాసాగర్ మొదలగు సంస్కర్తలు ఆయన బాటలో నడిచి వారి వంతు కృషి చేశారు. అదేవిధంగా ముస్లిం సమాజంలోవున్న పరధా పద్ధఇ, స్త్రీ విద్యకు వ్యతిరేకం, తలాఖ్, బహుభార్యత్వం మొదలగు సమస్యలను పరిష్కరించటానికి ప్రయత్నించారు. సర్ సయ్యద్ మహ్మద్ ఖాన్. అన్ని సమస్యలకు పరిష్కారం స్త్రీ విద్యే ముఖ్యమని భావించి ఆలీఘర్ ఉద్యమాన్ని ప్రారంభించారు. వారి బాటలోనే ఎందరో ఉద్యమించారు. వారిలో బేగం రుఖేయ సఖవాత్ హుస్సేన్ స్త్రీ విద్య కోసం పాట్నా, కలకత్తాలో స్కూల్స్‌ను స్థాపించి ఉచిత విద్య అందించి తన వంతు ప్రయత్నం చేసింది.

ముస్లిం సమాజాన్ని సంస్కరించడానికి ప్రయత్నించిన నేటి కథా రచయిత షేక్ హుస్సేన్ ఒకరు. వీరు కథా రచయిత గారు మరియు తెలుగు సాహితీవేత్తగా ఎన్నో అద్భుతమైన కథలను 'సత్యాగ్ని' అదే కలం పేరుతో రచించారు. షేక్ హుస్సేన్ (సత్యాగ్ని) గారు 1943 జూన్ 6వ తేదీన శ్రీ షేక్ ఇమాం సాహెబ్, షేక్ బషీర్ బి దంపతులకు రాయల షరతుల పల్లె గ్రామం, సి.కె. దిన్నె మండలం కడప జిల్లాలో జన్మించారు. షేక్ హుస్సేన్ 1949 సంవత్సరంలో ఆలంఖాన్ పల్లెలో ప్రాథమిక అభ్యాసం పూర్తి చేశారు. ఉన్నత విద్యను కడప రామకృష్ణ ఉన్నత పాఠశాలలో 1955-62 మధ్యకాలంలో పూర్తిచేశారరు. ఆ సమయంలోనే పుట్టపర్తి నారాయణా చార్యులు శిష్యుడయ్యాడు. వీరి శిష్యరికంలోనే సత్యాగ్ని తెలుగు సాహిత్యంపై ఆసక్తి పెరిగి వీరు గొప్ప రచయిత కాగలిగినారు. సత్యాగ్ని తన గురువు సలహాతో కడప ఆర్ట్స్ కళాశాలలో బి.ఏ తెలుగు కోర్సులో చేరారు. డిగ్రీ చదువుతున్న రోజులలోనే సాహితీ రచనలు చేయడం ప్రారంభించారు. వారి గురువు గారి వద్దే తెలుగు పంచ కావ్యాలైన మనుచరిత్ర, వసుచరిత్ర, పాండురంగ మహాత్యం, పారిజాతాపహరణం, ఆముక్త మాల్యదలను అవపోసనం పట్టారు. ఈ స్ఫూర్తితోనే సత్యాగ్ని ఎన్నో అద్భుతమైన కథలను రచించారు. వీరు 1985-86 ఓ రచయితగా కథా రచనకు శ్రీకారం చుట్టారు. తరువాత నాటకం మరియు ఇతర సాహితీ ప్రక్రియలో ఎన్నో వైవిధ్యభరితమైన రచనలు చేసి ఎందరో పాఠకుల అభిమానాన్ని సంపాదించుకున్నారు.

షేక్ హుస్సేన్ (సత్యాగ్ని) విద్యార్థి దశ నుండి సమాజంలో జరిగే అన్యాయం, అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడారు. ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగాను, ఆంధ్రప్రదేశ్ మైనింగ్ కార్పోరేషన్ వర్కర్స్ యూనియన్‌లో చాలా కీలకంగా వ్యవహరించి కార్మికుల సంక్షేమం కోసం పోరాడినారు. తరువాత సినిమారంగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి సినిమా కళామతల్లికి తన వంతు సేవ చేశారు. అంతేకాకుండా వీరు రాజకీయం రంగంలో కూడా ప్రవేశించారు. 1980లో కడప జిల్లా కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి 2015 మార్చి వరకు ఎం.ఎల్.సిగా సమాజానికి ఎంతో సేవ చేశారు. సత్యాగ్ని రాజకీయ నాయకుడిగా, కవితా, సాహితీవేత్తగా వీరు ఎన్నో విశిష్ట సేవలు

అందించారు.

షేక్ హుస్సేన్ (సత్యాగ్ని) ఇస్లాం మతంలో సంప్రదాయం పేరుతో స్త్రీల పట్ల జరుగుతున్న వివక్షతలనే ప్రధాన ఇతివృత్తాలుగా ఎంపిక చేసుకుని ఎన్నో అద్భుత మైన రచనలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా వీరి రచనలలో మతం పేరుతో స్త్రీలపై జరిగే వివక్షతలైన ముతా (ముతా అనగా పురుషుడు స్త్రీకి కొంత కొంత డబ్బులు చెల్లించి కొంతకాలం వరకు భార్యగా స్వీకరించి గడువు తీరిన తరువాత విడాకులు ఇవ్వడం), తలాక్ (భర్త బార్యకు విడాకులు ఇవ్వడం), ఇద్దత్ డబ్బు (భార్యను వదిలిన భర్త భరణం), బెహజు (పెళ్ళి సమయంలో ఇచ్చే వస్తు సామగ్రి), ఖదమ్ పోష్ (కాళ్ళకు మొక్కడం), హరామ్ (నిషిద్ధం), హలాలా (పెళ్లయిన అమ్మాయికి నిఖా చేసి, తలాక్ చెప్పి మరొకరిని పెళ్ళి చేసుకోవడం) మొదలగు సంప్రదాయాలతో ఇస్లాం ఆడపిల్లల జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నారని సత్యాగ్ని తన కథా ఇతివృత్తాల ద్వారా చెలియపరచి వాటికి పరిష్కార మార్గాలను తెలియపరిచారు. ముఖ్యంగా వీరి కథల్లో పాత్ర చిత్రణ, పాత్ర మధ్య జరిగిన సన్నివేశ కల్పనలు, వర్ణనలతో పాటు సంప్రదాయం పేరుతో ముస్లిం స్త్రీలను అంగటిలో సరకులా వారి శీలాన్ని వేలం వేసే పురుషాంహకారం తలదించుకునేటట్లు చేసింది. హజీనీమా (హలాలా) సనావుల్లా ఉపాధ్యాయుడు. చదువు సంస్కారం ఉన్న వ్యక్తి. పేదింటి అమ్మాయి అయితే బానిసలా పడి వుంటుందని భావించి షాజహనాని పెళ్ళి చేసుకున్నాడు. కాని ఆమె జీవితం ఎండమావులైంది. అత్త మామతోపాటు ఆడపడుచులు పెట్టే చిత్రహింసలు తట్టు కోలేక పుట్టింటికి వెళ్ళింది. ఆవేశంతో తలాక్ ఇచ్చాడు. మళ్ళీ ఆమెనే భార్యగా తెచ్చుకోవాలని ఆలోచించాడు. హలాలా (తలాక్ ఇచ్చిన అమ్మాయిని వేరొకరితో పెళ్ళి చేసి మళ్ళీ తలాక్ ఇచ్చి తిరిగి పెళ్ళి చేయడం) ద్వారా మళ్ళీ పెళ్లి చేసుకోవాలని తన స్నేహితుడు కమీముల్లాకి ఇచ్చి నిఖా చేసి హలాలా ద్వారా తిరిగి పొందాలన్న తన నీచమైన పథకాన్ని నిజం చేసింది కరిముల్లా తల్లి హజనీమా. కరిముల్లాను నిఖా అయిన తరువాత తలాక్ ఇవ్వకుండా షాజహనాను తన కోడలిగా అంగీకరించి ఆదరించింది. చివరకు సనావుల్లా చెడు ఆలోచనలు విఫలమయి అంతేకాకుండా నిరుపేదరాలైన జెహరాబి కూతుర్ని పెళ్ళి చేసుకుని ఆమెను మోసం చేసి కూతురిని దుబాయ్ షేక్‌లకు అల్లుడు అమ్మేశాడని తెలుసుకుని ఏమి చేయలేని ఒక అభాగ్యురాలు ''వినిపించని ఏడ్పులు'' కథలో జెహరాబి.

ఉన్నత చదువులు, అందం, అణకువ, సంస్కృతి సంప్రదాయాలు గల మంచి అమ్మాయి రజియా సుల్తానా. చదువు పెద్దగా లేకపోయినా మంచి వ్యక్తి అని రాజాఖాన్‌కి ఇచ్చి నిఖా చేశారు. వారి అన్యోన్య దాంపత్యానికి గుర్తుగా ముగ్గురు ఆడపిల్లలు, మగ పిల్లవాడు పుట్టలేదనే కారణంగా రజియాకి తలాక్ చెప్పి మళ్ళీ పెళ్లి చేసు కున్నాడు రాజాఖాన్. ఇలాంటి మూర్ఖులలో మార్పు తీసుకురావాలని రజియా లా చదివి లాయర్ అయ్యింది. తన స్వార్ధ ప్రయోజనాల కోసం తలాక్ ఉపయోగించ కూడదని స్త్రీలను యంత్రంలా ఉపయోగించుకోరాదని ''యంత్రం'' కథలో రజియా సుల్తానా ఉద్యమం బాట పట్టింది.

ఆధునిక యుగంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన విద్యా వైద్య సదుపాయాలు ఎంతగానో అభివృద్ధి చెంది ప్రపంచం ముందుకు దూసుకువెళుతుంది. ఇలాంటి ఆధునిక యుగంలో కూడా సనాతన సంప్రదాయాల పేరుతో స్త్రీను వివక్షతకు గురిచేయడం అంటే అభివృద్ధి అడ్డుకోవడమే. స్త్రీ స్వేచ్ఛాయుతంగా ఉన్నప్పుడే కుటుంబం తద్వారా సమాజం అభివృద్ధి చెంది భావితరా లకు ఆదర్శం అవుతుంది స్త్రీ.

**ఆధార గ్రంథాలు :**

1. కథానిక స్వరూప స్వభావాలు - పోరంకి దక్షిణామూర్తి.
2. తెలుగు సాహిత్య చరిత్రి - ద్వా.నా. శాస్త్రి.
3. తెలుగు సాహిత్య చరిత్ర - వెలమల సిమ్మన్న.
4. ఖులా, యంత్రం, మూతా - షేక్ హుస్సేన్ (సత్యాగ్ని).
5. హలాలా, పాచికలు - షేక్ హుస్సేన్ (సత్యాగ్ని).

❖

# "శైవ కవిత్రయం"లో 'మన పాల్కురికి'

**-మోరె రాజు,** పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం, హన్మకొండ.

**పరిచయం :**

రాజరాజనరేంద్రుడు కోరిక మేరకు భారతం రచించి వైదిక మతాన్ని పునరుద్ధరింప చేశాడు. అనంతరం 12 వ శతాబ్దంలో నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, పండితారాధ్యుడు శైవ కవిత్రయం గా పేరు గాంచి శివ భక్తుల కథలు ప్రబంధాలుగా కావ్యాలు గా రచించారు. శివ భక్తులను సాక్షాత్తు శివునిగా భావించారు. సోమన వీరశైవ మతాన్ని ఒక ఉద్యమంగా తీసుకొని రావడమే కాకుండా ప్రథమాంధ్ర విప్లవ కవిగా ఆనాడే పేరొందాడు.

శివమత ప్రభోదంగా శైవ మతోద్యమంగా శివలీల , శివ భక్తిని సమాజంలో నెలకొల్పడమే ముఖ్య ఉద్దేశంగా ఈ శైవ కవిత్రయం ముందుకు సాగింది. శైవ కవిత్రియాలు అనగా నన్నె చోడుడు, పండితారాధ్యుడు, పాలకురికి సోమనాథుడు. ముగ్గురు కూడా శివుని మహిమలు తెలిపే రచనలు ఎక్కువగా చేశారు. శివుడు ఒక్కడే దేవుడిగా నమ్మి రచనలు చేయడమే కాదు శైవమత ప్రచారంతో పాటు ప్రజలకు శివుని పై భక్తిని కలిగింపజేసేలా ఎందరో శివ భక్తుల కథలు ఉదా హరణలుగా చూపించారు. "నన్నయ్య , తిక్కనల మధ్య కాలమును శైవ కవిత్రియ యుగం అని వ్యవ హరిస్తారు" (తెలుగు సాహిత్య సమీక్ష, డాక్టర్ .జి .నాగయ్య పుట: 157) క్రీస్తు శకం 12 వ శతాబ్దం కాలాన్ని శివకవియుగంగా పిలవడమే కాదు ఆనాడు రాజులు కూడా శైవ మతాన్ని ఎక్కువగా అవలంబించారు.

శివ కవులలో మొదటివారిగా నన్నె చోడుడు తర్వాత పండితారాధ్యుడు, చివరిగా మూడవ వారైనా మన తెలంగాణ ప్రాంతానికి చెందిన పాల్కురికి సోమనాథుడు పిలవబడుతున్నారు. ప్రాంతాలు వేరైనా భక్తితత్వం మాత్రం వీరిలో ఒకటే అందుకే శైవ ఆరాధనకు సంబంధించిన రచనలే వీరు ముగ్గురిని శైవ కవిత్రయంగా మార్చిందని చెప్పవచ్చు. శైవ మత ప్రచార సాధకులుగా వీరి రచనలు కొనసాగినట్లు ఉంటాయి. కష్టమైన సంస్కృత ,ప్రాకృత భాషలను ఉపయోగించకుండా వీరి రచనల్లో ప్రజలకు అర్థమయ్యే వ్యవహారిక భాషను ఉపయోగించడం ప్రత్యేకతగా చెప్పవచ్చు. శివ భక్తులకు లింగ వివక్షత , కులభేదం ,ఉన్నత వర్గం, పేద వర్గం మొదలైన తార తమ్యాలు ఏవి కూడా ఉండవని అందరూ శివుని భక్తులేనని అందరిదీ శివ కులమేనని తమదైన రీతిలో రచనలు సాగించారు.

"శివ కవుల్లో శైవ మతాభిమానం, దేశీయ కవిత అభిమానం , శైలి, స్వేచ్ఛ ముఖ్య లక్షణాలు. ఒక మతానికి కవిత సాధనంగా వాడుకోవడం ఈ శివ కవుల ప్రత్యేకత" (తెలుగు సాహిత్య చరిత్ర, డాక్టర్. ద్వా.నా శాస్త్రి, పుట :21). మార్గ దేశీ కవిత విధానానికి పూర్తిగా స్వస్తి చెప్పి అందుకు భిన్నంగా దేశీయ కవిత్వ సంప్రదాయాలను పాటించిన కవులు శివ కవులు.

**నన్ను చోడుడు :**

శైవ కవిత్వంలో మొదటివాడు . వీరి కాలానికి సంబం ధించి వివిధ వేద అభిప్రాయాలు ఉన్నప్పటికీ 12వ శతాబ్దానికి చెందిన వాడిగా చారిత్రకారులు భావిస్తున్నారు. నన్ను చోడుని గురించి మొదటగా పరిశోధన చేసిన వారు మానవపల్లి రామకృష్ణ. వీరి అభిప్రాయం ప్రకారం నన్నెచోడుడు నన్నయ్య కంటే పూర్వుడని, శ్రీ సతి, చౌడపల్లి దంపతులకు జన్మించి ఒరయూరు పురాదీశ్వ రుడిగా పాలకుడిగా కొనసాగాడు.

కవిరాజు శికామణిగా, టెంకనాదిత్య, వివేక బ్రహ్మ విధులు పొంది గురువైన జంగమ మల్లికార్జునుని మన్ననలు పొందాడు. ప్రథమరచన కుమార సంభవం ప్రథమాంధ్ర ప్రౌఢ ప్రబంధం. మార్గకు- మార్గం అంటూ మార్గ కవిత్వం మంచిది కాదని కొత్తదైన దేశీ కవిత్వానికి

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

దారి వేశాడు. కాళిదాసు రాసిన కుమార సంభవం నుండి ఇతివృత్తం స్వీకరించినప్పటికీ స్వతంత్రంగా 12 అశ్వాసాల ప్రౌఢ ప్రబంధంగా తీర్చిదిద్ది, గురువుకు అంకితమిచ్చాడు.

జానతెనుగు, వస్తు కవిత అనే పదాలను పేర్కొని దేశీయమైన చందస్సు దేశీ కవిత్వాన్ని నడిపించి శైవ మత ప్రచారానికి తన రచనలు కొనసాగించాడు. జాన తెనుగు అంటే అందమైన, స్పష్టమైన, ఇంపైన భావం గల తెలుగు అంటే అచ్చ తెనుగు. ప్రజల మనసులో సూటిగా ,అర్థవంతంగా తన రచన ముద్రను వేయాలంటే వారికి అర్థమయ్యే జాన తెనుగులో రచించాలని నిర్ణయించుకొని ఆ వైపుగా తన రచనలు చేశారు.

**కుమార సంభవం :**

పార్వతి దేవి జననం, శివుని కొరకు తపస్సు, బ్రాహ్మణుని వేషంలో శివుడు రావడం, పార్వతిని పరీక్షించడం, శివపార్వతుల వివాహం, రాసక్రీడలు, కుమారస్వామి జననం మొదలైనవి ఈ కావ్యంలో ఉన్నాయి. ఈ కావ్యంలో నాయకుడు శివుడైతే నాయక పార్వతి. దేవతల కోరిక మేరకు మన్మథుడు శివునిపై తన బాణాన్ని ప్రయోగించగా శివుడు పార్వతి పై తన దృష్టిని నిలుపుతాడు. విరహతాపంతో ఉన్న పార్వతీదేవికి శివుని చిత్రపటాన్ని తెచ్చి చెలికత్తెలు ఎదురుగా ఉంచుతారు. తర్వాత శివపార్వతులకి కుమారస్వామి జననం జరుగుతుంది. తాను వెళ్ళినప్పుడు అల్లుడైన శివుడు తనకు మర్యాద చెయ్యలేదు అని కోపంతో దక్షుడు భార్యతో చెప్పుకుంటాడు. దక్షుని భార్య తల్లిదండ్రులు ఉంటే అత్తమామల్ని ఎలా చూసుకోవాలో తెలిసేది కానీ శివునికి తల్లిదండ్రులు లేరు కాబట్టి అత్తమామల్ని చూసుకునే విధానం తెలియలేదు అనడం నేటి కాలపు అల్లుళ్ల తీరుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ చక్కటి విషయాన్ని నన్నెచోడుడు కుమార సంభవం కావ్యం లో ప్రజలకి అర్థమయ్యే విధంగా తనదైన శైలిలో వివరించారు.

నన్నెచోడుడు రచనలు శైవ కవిత్వానికి పునాది. తెలుగు సాహిత్య చరిత్రలో కుమార సంభవం కావ్యంతో శైవ మత ప్రచారం వ్యాప్తిలోకి వచ్చాయి.

**పండితారాధ్యుడు :**

1160 కాలం గోదావరి మండలం, ద్రాక్షారామ ప్రాంతానికి చెందిన వాడే పండితారాధ్యుడు. కోటిపల్లి ఆరాధ్య దేవుడు వీరి గురువు. వీరి శివ తత్వ సారం తొలి తెలుగు శతకం కానీ దీనిని చరిత్రకారులు పరిగణంలోకి తీసుకోలేదు. బసవన వీరశైవమత స్థాపకుడిగా చెప్తారు. వీరశైవం అంటే దేవుని కోసం తమను తాము ఆత్మ బలిదానం చేసుకోవడంలో వెనుకాడరు. అంతేకాదు శరీరాన్ని కోసుకోవడం, చేతులు కాళ్ళను నరుక్కోవడం, భక్తకన్నప్ప వలె తమ కనులను తీసి శివునికి నైవేద్యంగా పెట్టడం మొదలైన భయానక సన్నివేశాలు వీరశైవ మతంలో కనిపిస్తాయి దీనికి కారణం భక్తి పరవశ్యమే కానీ మరొకటి కాదని చెప్పవచ్చు.

“మల్లికార్జున పండితారాధ్యుడు ‘బసవన ‘ సమకాలికుడు. వీరశైవ మత స్థాపకుడు బసవన “నందీశ్వరుని” అవతారం అని వీరశైవుల నమ్మకం”(తెలుగు సాహిత్య దీపిక, డాక్టర్ ఎన్.కే. మద్దిలేటి, పుట: 29 - 30). పండితారాధ్యుడు ప్రమదుల అవతార ఘనమని శివునితో సమానమైన శక్తి కలవాడని వీరశైవులు నమ్మకం.

**సోమనాథుడు :**

శైవ కవిత్రయంలో చివరివాడు అనేక రచనలు చేసి ప్రథమాంధ్ర విప్లవ కవిగా పేరు పొందినవాడు పాలకురికి సోమనాథుడు. 12వ శతాబ్దంలో తెలుగు సాహిత్య వైభవాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లిన ప్రజా కవి. తెలంగాణ ప్రాంతంలోని జనగామ జిల్లా, పాలకుర్తి గ్రామంలో జన్మించాడు. విష్ణు రామి, దేవుడు శ్రియా దేవికి పుట్టిన శైవ భక్తు తత్పరుడు. వీరి రచనలన్నీ శివ భక్తి పరమైనవే కాదు సామాన్య జనాన్ని కూడా శైవభక్తిలో మునిగేలా చేశాయి. నన్నెచోడుడు చూపించిన దేశీయ మార్గంలో రచనలు కొనసాగించాడు. ఈయన తన శైవ మత ప్రచారానికి మిగతా వారి లాగానే తన కవిత్వాన్ని ఎంచుకున్నాడు సాహిత్య ప్రక్రియల్లో వివిధ నూతన ప్రక్రియను సృష్టించి రచించిన కవి. సంస్కృతం పురాణంలోనూ

బసవన్న మీద ఉన్న మమకారంతో బసవ పురాణాన్ని రచించాడు. కన్నడంలో ప్రాకృతంలో సంస్కృతంలో లఘు కృతులను కూడా రచించారు.

సోమనశైలి మణి ప్రవాలశైలి, మార్గ కవితకు భిన్నంగా జాన తెనుగులో ద్విపదలు కూడా రచించాడు. అల్ప అక్షరాలలో అనల్ప అర్థాన్ని చెప్పే కవిత్వం వీరి ప్రత్యేకత. కవిత్వం అంటే వడ్లు పెరుగు కలుపుకొని తిన్నట్టుగా ఉండకూడదని అన్నంతో పెరుగు కలుపుకొని తిన్నట్లుగా ఉండాలని చెప్పాడు. వీరి కావ్య ఇతివృత్తాలన్నీ జాన పదులు కన్నవి, విన్నవి మాత్రమే. ద్విపద ప్రక్రియకు ఆధునిక సోమనాథుడిని చెప్పుకుంటారు.''కూర్చెద ద్విపదలు కోర్కె దైవారగా"(తెలుగు సాహిత్య చరిత్ర, డాక్టర్ . ద్వా.నా శాస్త్రి పుట: 26). అని దీపగల గురించి గొప్పగా చెప్పాడు.

మొదటి రచన అనుభవ సారం మిత్రుడైన గోడగి త్రిపురానికి అంకితం ఇచ్చి స్నేహితునికి కావ్యాన్ని అంకితం ఇచ్చిన తొలి వ్యక్తిగా నిలిచిపోయాడు. శతక ప్రక్రియకి కూడా ఆద్యుడిగా చెప్తారు. వృషాదిపా ...! అనే మకుటంతో వృషాదిప శతకాన్ని రచించిన సోమన తెలుగు వారి గుండెల్లో నిలిచిపోయాడు. ఉదాహరణ ప్రక్రియను సోమనాథుడు మొదటగా పేర్కొన్నాడు అంతేకాదు చెన్నమల్లు, సీసాలు చతుర్వేద సారం లాంటి లఘు క్రృతులు రచించి తన రచన నైపుణ్యంతో పాటు శైవభక్తి చాటుకున్నాడు. నమస్కార గద్య, పంచప్రాకార గద్య, శరణు బసవగద్య, బసవష్టకం మొదలైన రచనలు వీరివే.

సామాన్యులకు కూడా అర్థం కావడానికి తేలికగా చదవడానికి ఉపయోగపడే విధంగా దేశీయమైన చందస్సులో ద్విపదలో బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర, మల్లమ్మ దేవి పురాణం రచించారు కానీ ఇవి అలభ్యాలు.

తెలుగులోనే కాదు సంస్కృత, కన్నడంలో కూడా రచించారు. సోమనాథ భాష్యం, రుద్ర భాష్యం, సద్గురు రగడ మొదలైనవి.

వీరశైవ మతంలో శివుని మాత్రమే దైవంగా తరచి ఇతర దేవతలని నిందించేవారు అంతేకాదు విష్ణు భక్తు లను హేళన చేసేవారు. సోమన రచనలు శైవేతరులు కూడా ప్రభావితం చేసే విధంగా ఉండేవి. ఇతను కూడా శివుని పై భక్తిని పెంచుకొని శైవ మతాన్ని స్వీకరించే వారు. వీరి రచనలు లోని శివ భక్తుల కథలు చదివి ముగ్దులయ్యే వారు.

బసవేశ్వరుడు నందీశ్వరుని అవతారం అని నమ్మి నట్లుగానే పండితారాధ్యున్ని ప్రమథుల అవతారంగా వీరశైవులు నమ్మేవారు జంగాలను దైవంతో సమానంగా భావించి పూజించి మర్యాదలు చేసేవారు. శైవ మతం లోని జంగమ వేషదారులను నయనారులు అని అంటారు. ద్విపద ప్రక్రియలైన పండితారాధ్య చరిత్రను గురువుగారి పేరు మీదుగా రచించాడు. రచనల్లో కేవలం ద్విపదలు రగడలే కాదు శైవ మతావేశం ఎక్కువగా కనిపిస్తుంది. అంతేకాదు శివ కవుల దృష్టిలో శివ భక్తులు అంటే శివుడే.

సోమన పండితారాధ్య చరిత్రలో శివ వ భక్తికి సంబంధించిన ఎన్నో పాత్రలను సామాన్య జన సమూహం నుండి తీసుకొని వీరశైవత్వాన్ని ఆపాదించి కొత్తగా తీర్చిదిద్దాడు. కలియంబ కథ, పిల్లనైనారుకథ, వెలమడి వృత్తాంతం, వాగీశా నెనారు కథ, దసరయ్య కథ, గురు భక్తయ్య కథ, గురు భక్తాండరి కథ, శ్వేతుడికథ, కుమారపాల ఘూర్జరుడి కథ, షో ఓహీనుడి కథ మొదలైన వాటిని జన సమూహం నుండే గ్రహించి భక్తి మార్గాన్ని కల్పిస్తూ శైవభక్తిని శైవేతరులలో కూడా కలిగింపజేసిన కవి సోమన. తన గురువైన పండితారాధ్యునిపై పండితా రాధ్య చరిత్రను, గురువుగారికి గురువు అయిన బసవేశ్వ రునిపై బసవ పురాణం రచించి శైవభక్తిని లోకంలో ఉత్తమమైన మార్గంగా చాటి చెప్పాడు.

కర్ణాటక దేశమైన మైసూర్ ప్రాంతంలోని 'కల్య'లో శివైక్యం చెందాడు. ఇతని సమాధిపై అనేక శివాలయా లను నిర్మించారు. అలాగే సోమన పుట్టిన గ్రామంలో కూడా సోమనాధేశ్వర స్వామి దేవాలయానికి కొద్ది దూరంలో

సమాధి నిర్మించారు. నేడు మన గ్రామాల్లో శైవ మతస్తులు మరణిస్తే వారి సమాధుల పైన శివలింగాలను మధ్యలో పెట్టి, నాలుగు వైపులా నంది విగ్రహాలను నిర్మించడం కనిపిస్తాయి, ఈ సంప్రదాయం సోమన కాలంనాటిదేనని చెప్పవచ్చు.

ఆనాటి సోమనాథుని మహిమాన్వితమైన శైవభక్తి సాహిత్య రూపాలలో వెలువడి అందరూ క్షేమభక్తిని నింపింది. మన ప్రాంతీయత ఎక్కువగా శైవ దేవాలయాలే కనిపిస్తాయి.

**ముగింపు :**

సాహిత్యంలోని వివిధ ప్రక్రియలు ఆనాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విశేషాలను తెలుపుతుంది. 11 వ శతాబ్దం నుండి నేటి వరకు సాహిత్యంలో అనేక ఉద్యమాలు వచ్చాయి. శైవ కవితోద్యమం తనదైన శైలిలో ముద్ర వేసింది. శైవ మత ప్రచారం కోసం సాహిత్యాన్ని వారధిగా ఎంచుకున్న వారే శైవ కవిత్రయం. నన్నయ మొదలు పెట్టిన మార్గ కవిత మార్గాన్ని పక్కకు దేశీయ చందస్సు పరిచయం చేసి సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో రచనలు చేశారు.

ద్విపదలను సృషించి శైవ మత ప్రచారం చేయడమే కాకుండా శివేతరులలో కూడా శైవ భక్తిని కల్గింపచేశారు. గ్రామాల్లో జంగముల సమాధులు నిర్మాణం 12వ శతాబ్దం సంప్రదాయం కొనసాగుతోంది అనడానికి సమాధులపై పెట్టే శివ, నందుల విగ్రహాలు నిదర్శనంగా చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1. తెలుగు సాహితీ మంజీర, తెలుగు అకాడమీ, కనకదుర్గ ప్రింటర్స్, హైదరాబాద్, 2017.
2. తెలుగు సాహిత్య చరిత్ర, ఆచార్య వెలమల సిమ్మన్న, దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం, విశాలాంధ్ర బుక్ హౌస్, హైదరాబాద్, 2012.
3. తెలుగు సాహితీ వ్యాస మందారదామం, మండగొండి నరేష్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 2003.
4. తెలుగు సాహిత్య సమీక్ష, డా. జి. నాగయ్య, నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, ద్వితీయ ముద్రణ, 2019.

❖❖❖

# భాష - వారసత్వం

# తెలుగు భాష పుట్టుక - దాని పరిణితి - అధికార భాషగా తెలుగు

**- తుమ్మనపల్లి కేదారి,** పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

ఈ సృష్టియందుగల సమస్త జీవజాలంలో సర్వోన్నత మైన మేధస్సు కలిగిన ప్రాణి మనిషి. ఈ ఉన్నతికి కారణం తన జ్ఞానేంద్రియములతో కర్మేంద్రియములతో గ్రహించిన విషయములను నివేదన (వ్యక్తం) చేయగలిగిన బుద్ధిశక్తిని కలిగి ఉండడం. మనస్సులోని భావపరంపరను కంఠ ధ్వనులతో స్పష్టముగా వ్యక్తీకరిచడం, భాషించడం మానవునికే సాద్యం. వివిధ శబ్దాలకు అర్థవంతమైన ద్వనుల, పదాల, వాక్యాల రూపమిచ్చి తన దైనందిన సామాజిక జీవనశైలిని సుగమం చేసుకున్నాడు మానవుడు.

భాష నియమతమైన వాగ్వ్యవహారం సంఘంలోని మనుషులు పరస్పరం చేసుకునే భాషణపు అలవాటు భాష. ఇది పదములు వాక్యాల్లో కూడి యాదృచ్చిక నిర్మాణ సౌష్టవంతో వ్యక్తుల వివిధ చింతనలకు వ్యక్తీకరణలకు సహకరించే సాధనం. శిశువు నేర్చుకునే మొదటి భాషను మాతృభాషగ వ్యవహరిస్తారు.

సమాజం - భాష పరస్పర ప్రాణాదార వ్యవస్థలు, భాషలేని సమాజాన్ని ఊహించలేము. భాష లేకుండా సమాజం నిర్మితం కాలేదు. ప్రపంచంలో అనేక భాషలున్నాయి. సమాజాలు బహుళ భాషల మధ్య సమన్వయం ఉన్నది. సమాజం - భాష నిబద్ధమైన బాధ్యతలను నెరవేర్చే ఆదర్శ వ్యవస్థలు. భాషలో సంస్కృతి నిబిడీకృతమై ఉంటుంది. భాష ద్వారానే సంస్కృతి వివిధ పార్శ్వాల్లో వెల్లడవుతుంది. అదే విధంగా భాష, సాహిత్యం అవిబాజ్యమైన అంశాలు. సాహిత్యం ద్వారానే భాష విశిష్టమైన అభివ్యక్తి సామార్ధ్యాలను అందుకున్నది. సంస్కృతిలో వచ్చిన మార్పులు భాషలో ప్రతిబింబిస్తుంటాయి. రేపటి తరానికి అందించే సాంస్కృతిక సంపదల మీద ఆ జాతి మనుగడ సార్ధకమవుతుంది.

ప్రజల సామాజిక జీవనానికి సంస్కృతికి, భాష ఆధారం, వారి జీవితంలో భాష మమేకమవుతుంది. మనిషి ఒంటరిగా మనలేడు, అతడు వినియోగించే భాష కూడా ఒంటరిగా నిలువలేదు. భావ ప్రసరణను ప్రభావవంతంగా నిర్వహించేందుకు ఉపకరించే సాధనం. భాష, దేశ ప్రయోజనాలు సాధించడానికి, విద్యాభివృద్ధికి భాష సాయ పడుతుంది.

పుట్టిన వెంటనే తల్లిపాలు త్రాగనేర్వకపోతే శిశువు జీవింప జాలడు. అట్లే భాష కూడా నేర్వకపోతే భావం, జ్ఞానం పెరగదు. ఇది నేర్పరితనం ఒకరినుంచి ఒకరికి సంక్రమిస్తుంది. శిక్షణ లేనిది శిక్షితుడు కాలేడు. నేర్పేది చేతనం. నేర్పరి కావలె. సృష్టి నేర్పదు. అది జడం. జడం జడాన్ని తెలుపుతుంది. చేతన, జడ చేతనాలను తెలుపుతుంది. మానవుడు స్వయంగా విశ్వాన్ని ఆవిష్క రించ లేడు

బుద్ధిమంతుడైతే సృష్టి ఉపయోగానికి చేరువౌతాడు. తద్భిన్నుడైనవాడు దురుపయోగానికి పోతాడు. పురుష ప్రయత్నంతో వారు పునీతులైనారు. పునః ప్రకాశింప జేసినారు. ప్రకాశ సంకేతమే భాష.

**భాష-భాషోత్పత్తి :**

భగవంతుని సృష్టి పరిపూర్ణమైనది. ఈ పరిపూర్ణత బీజమునందే పాదివించబడి వికాసవెుంది విరాడ్రూపంతో సాక్షాత్కరిస్తున్నది. అంటే భాషా విషయం లోను ఇంతే.

ధ్వని స్పోటనాలు అవినాభావాలు. స్పోటనం శబ్దమైతే ధ్వని దాని అర్థం. ఆకాశం విస్పోటం. ధ్వని దాని గుణం. దార్శనికంగా అయితే స్పోటమే బ్రహ్మ. ధ్వని బ్రహ్మ యొక్క మాయ. ఒకటి ఆత్మ, ఇంకొకటి శరీరం. ఒకటి

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

